

వికృతి
ఆశ్వయుజము

భారతి

సంపుటము 27
సంచిక 10

దేవీప్రశస్తి

●

'శిల్పి'

నాసాగ్రమ్ముల వహ్నికీలలు దిగంతమ్ముల్ దహింపన్, విషా
ణాసిం గ్రుమ్మిన చంద్రవంక దివి నల్లల్లాడ, రక్తాక్షు లు
ద్భాసింపన్ మహిషాసురుం దవసి యుద్ధజ్వాల ధూమాకృతిన్
గాసింబెట్టెడు! తల్లి! రమ్మిక జనాకాశస్ఫురచ్చంద్రికా!

నీ నిశిత త్రిశూల సరణిన్ రుధిరారుణ రూపవై మృడా
నీ! నిదురించి సోలు ధరణీహృదయమ్మున బ్రజ్వలించి, పా
షాణ ఘనాంధ తామసి మృషానటనమ్ము హరించి, యయ్యుషో
భాను తళత్తళద్ద్యుతి విభాసిలజేయు మొహో! కృపామయీ!

సునిశిత హేతువాద మతిశోధిత భౌతిక తత్త్వముం బ్రజా
ఘన బధిరాధికార మహితమ్ములు తంత్రము లెన్నియో ధరా
జనముల రంగుబొమ్మలు విషాదములై నశియించెడిన్! జగ
జ్జనని! కనుంగవల్ చలువజల్లులఁ దేల నిలం జ్వలింపుమా!

అణుభేద మ్మొనరింపనేర్చెదము! రవ్వంతైన ధూళీలస
న్మణిహారమ్ములు గడ్డిపూల చిరు విన్నాణమ్ములుం గాంచ; మో

భా ర తి - వికృతి ఆశ్వయుజము

ప్రణతేంద్రాది సురావళీ మకుట దీపా! పాద మంజీర కిం
కిణి విజ్ఞాన కణ మ్మొకేని జన ధీక్షేత్రాళి వర్షించునో!

శైశవ కేళిలోల వివశ ప్రియసూనుని ముద్దువెట్టి, యూ
యూసను వోవ జన్గడిపి, యల్లన జోలలువాడు ధాత్రి తీ
రై శివరూపిణీ! బహు పథాంతముల న్నడయాడి తూలి, యా
శాశల శూన్యదృష్టి గలయం గను పాంథులకై స్ఫురింపుమీ!

ఓ కవి భావనోజ్జ్వల మయూరమయూఖా! భవదీయ రమ్య హా
సాకలనాన సమ్ముదితు లయ్యెద రెందరో! తత్త్వవేత్త, లే
నీ కరవాల భీకర వినీలిమ కాటుకవెట్టి, వేదనా
వ్యాకృత మీ జగన్నిధి రహస్య మనంత మెరుంగనేర్చెదర్

కోరిక తీరునం, దరుణ కోరకిత ప్రియతాగతిం, దివాం
తారుణ శోక నీరవ నిరంతర పూరములీల, భావనా
తోరణ తారకాంచిత మృదు శ్లథ నీల నిశావగుంఠన
స్మేరముఖాన మెల్ల వికసింపుము! లోక హృదబ్జ కర్ణికన్

రంగు వెలుంగు లెన్నియొ! కరంగుచు, నీడలు నీడలై దివా
రంగమున న్నటించి తిమిరమ్మున రూపఱినం జగమ్ము క
న్నుంగవ నొక్కమారుగ వినూతన గోఘృత దీప సౌమ్య మూ
ర్తిం గనిపించి, హార్తికగతిన్ మెరయింపగదే! తదశ్రువుల్!

ఆకలిగొన్న వారల దయాభరితా! మహితాన్నపూర్ణ! ము
క్కాకల వేగు జీవతతికై నవకైరవిణీ వికాస భ
వ్యాకృతి నీ శుచిస్మిత మహా మ్మొరుకం గురియించి, శాంతిరా
కా కమనీయమై మెరయుగావుత! శారద సాంధ్యవేళలన్

కమ్యూనిజం - డెమోక్రసీల సంఘర్షణ

శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు

యుద్ధాన్ని పరిసమాప్తం చేయడానికి మిత్రరాజ్యాలు ప్రథమ ప్రపంచసంగ్రామాన్ని నిర్వహించినవి. యుద్ధాన్ని శాశ్వతంగా నివారించాలనే సంకల్పంతో, అప్పటి అమెరికా అధ్యక్షుడు వుడ్రోవిల్సన్ ప్రోద్బలంతో, మిత్రరాజ్యాలు నానాజాతిసమితిని ఏర్పాటు చేసినవి. ఫలితం ద్వితీయ ప్రపంచసంగ్రామం.

చతుస్స్వాతంత్ర్యాలను సాధించేందుకు మిత్రరాజ్యాలు మళ్లీ యుద్ధం చేసినవి. నాజీజం, ఫాసిజం- ద్వితీయ ప్రపంచసంగ్రామానికి కారణభూతమైన రెండు సిద్ధాంతాలు- సమూలంగా నాశనమైనవని ప్రపంచ రాజకీయవేత్తలు సంతోషించారు.

మహోన్నత ఆశయాలతో ఐక్యరాజ్యసమితిని స్థాపించారు. ప్రజలకు యుద్ధభయం లేకుండా చేయకలిగామని సంతృప్తి చెందారు. కొరత అనేది లేకుండా చేయాలని బ్రహ్మాండమైన ఆర్థిక, సాంఘిక అభివృద్ధిపథకాలను తయారుచేశారు. వాటిని అమలు పరిచేందుకు సమస్త ప్రకృతిసంపదను, యావత్తు అంగబలాన్ని సంఘటితపరుస్తున్నారు.

ఇవన్నీ ప్రారంభదశలో ఉండగానే తృతీయ సంగ్రామచ్ఛాయలు యావత్ప్రపంచాన్నీ కప్పివేసినవి. ఎప్పుడు, ఎక్కడ ఈసారి యుద్ధం? అనే ప్రతివారూ ప్రశ్నిస్తూ వచ్చారు. ద్వితీయ సంగ్రామం పరిసమాప్తం గాకపూర్వమే తృతీయ ప్రపంచ సంగ్రామం మధ్యప్రాచ్యంలో ప్రారంభమౌతుందని అమెరికన్ రాజకీయవేత్తలు జోస్యం చెప్పారు.

౧౯౪౫ లో జర్మనీ, జపాన్ మిత్రరాజ్యాలకు లొంగిపోయినా, ప్రపంచవ్యాప్త సంగ్రామం పరిసమాప్తమైనట్లు కన్పించినా, ఈనాటివరకూ అటు యూరప్‌లోనూ, ఇటు ఆసియాలోనూ, సైనికచర్యలు సాగుతూనే ఉన్నవి.

గ్రీస్ అంతర్యుద్ధంతో ప్రారంభమైనవి ఈ స్థానికయుద్ధాలు. ఇది క్రమంగా పాలస్తీనాకు వ్యాపించింది. పాలస్తీనాలో యూదులకూ అరబ్ రాజ్యాలకూ జరిగిన యుద్ధం ప్రపంచయుద్ధంగా పరిణమిస్తుందనే అంతా భయపడ్డారు. పాలస్తీనా విభజన జరిగి యూదురాజ్యం స్థిరపడిపోవడంవల్ల, అరబ్ పాలస్తీనా పంపకంవిషయంలో అరబ్ రాజ్యాల్లోనే అంతఃకలహాలు ఏర్పడ్డంవల్ల, మధ్యప్రాచ్యం యావత్తూ, రణరంగం కాకుండా పోయింది.

కాని అరబ్ రాజ్యాలమధ్య తగాదాలుమాత్రం స్థిరపడిపోయినవి. అమెరికా, బ్రిటన్ రాజ్యాంగతంత్రం అఖండవిజయాన్ని పొందింది. ట్రాన్స్‌జోర్డాన్‌కూ ఈజిప్టుకూ అరబ్ రాజ్యాల నాయకత్వం విషయంలో వచ్చిన తగాదాలు తీవ్రమైనవి. ౧౯౪౫ లో ఏర్పడి, అమెరికా, బ్రిటన్‌ల ఆశీర్వాదాలతో వృద్ధిపొందిన అరబ్‌లీగ్ విచ్ఛిన్నమైపోయే పరిస్థితులు ఏర్పడ్డవి. ట్రాన్స్‌జోర్డాన్, అరబ్‌లీగ్ నిర్ణయాలను అలక్ష్యం చేసి అరబ్‌పాలస్తీనా నుంచికూడా, ట్రాన్స్‌జోర్డాన్ శాసనసభకు ప్రతినిధుల ఎన్నిక జరిపింది. తత్ఫలితంగా అరబ్‌లీగ్ ట్రాన్స్‌జోర్డాన్‌ను బహిష్కరించడం గురించి తీవ్రంగా ఆలోచనలు చేసింది.

ప్రస్తుతం అరబ్‌లీగ్‌కు నాయకత్వం వహిస్తున్న ఈజిప్టు ట్రాన్స్‌జోర్డాన్‌పై అంత సులభంగా చర్యలు తీసుకోలేదు. అబ్దుల్లారాజుకు అటు అమెరికా ఆర్థిక సహాయం, ఇటు బ్రిటన్ సైనిక సహాయంకూడా ఉంది. ఈజిప్టుకూ ఈ రెండు దేశాల సహాయమూ అవసరమే. అందుచేతనే సుడాన్ విషయంలోనూ, సూయజ్ కాలవ విషయంలోనూ కూడా బ్రిటన్‌తో తెగతెంపులు చేసుకునేవరకూ వ్యవహారం చేయడం లేదు.

వాస్తవానికి సూయజ్ కాలవ సమస్య, సుడాన్ సమస్య పరస్పరాశ్రిత సమస్యలు. మధ్యప్రాచ్యంలో బ్రిటిష్‌సామ్రాజ్య మార్గాల సంరక్షణకు సూయజ్ కాలవ ప్రాంతంలో బ్రిటిష్‌సేనలు ఉండటం తప్పనిసరి. ఈజిప్టు ఇందుకు సమ్మతించేటట్లు చేయడానికి సుడాన్‌పై బ్రిటిష్‌ప్రభుత్వానికి అధికారం ఉండక తప్పదు. ఇందులో ఏ ఒకసమస్య పరిష్కారమైనా రెండో సమస్య దానికి అదే పరిష్కారమవుతుంది.

సుడాన్ విషయంలో బ్రిటన్‌కూ తమదేశానికీ ఉన్న విభేదాలు త్వరలోనే పరిష్కారం కాగలవని ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఈజిప్టు ప్రతినిధి ప్రకటించాడు. ఆ తరువాతనే సూయజ్ కాలవ రక్షణబాధ్యతను అమెరికా పశ్చిమరాజ్యాలు వహించడం విషయంలో బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా, ఈజిప్టు ప్రభుత్వాలకు సమాధానం కుదిరిందని ఈజిప్టు ప్రభుత్వపత్రిక ప్రకటించింది. అధికారులు దీన్ని ఖండించారు. కాని వార్త కేవలం కల్పితం అని త్రోసివేయడానికి వీల్లేదు.

రష్యాతో పశ్చిమరాజ్యాలకు యుద్ధం వచ్చే ప్రమాదం అధికమవుతున్న కొద్దీ ఇలాంటి చిల్లర సమస్యలను-యుద్ధనిర్వహణదృష్ట్యా ఇవి చాలా ముఖ్యమైనవి అవుతవి-శీఘ్రంగా పరిష్కరించివేయడానికి అమెరికా బ్రిటన్‌లు తీవ్రంగా కృషిచేయడం సహజం.

యూరప్‌లోనూ, ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలోనూ రష్యాఆట కట్టించడానికి పశ్చిమయూరప్ రాజ్యాల సమాఖ్యనూ, ఉత్తరఅట్లాంటిక్ రక్షణ ఒడంబడికను బ్రిటన్ అమెరికాలు కలసి తయారుచేశాయి. పశ్చిమయూరపుసమాఖ్యలో పశ్చిమజర్మనీని కూడా చేర్చడానికీ, పశ్చిమ జర్మనీ సైనికబలాన్ని వృద్ధిచేయడానికి ప్రయత్నాలు కూడా జరుగుతూఉన్నాయి. ఈ ప్రయత్నాలన్నీ రష్యాతో యుద్ధం సాగించడానికి కాకపోయినా యుద్ధం అనివార్యమైతే, ఆ యుద్ధంలో రష్యాను గెలవడానికి జరుగుతున్నవే.

బ్రిటిష్‌సామ్రాజ్యం అస్తమించినప్పటికీ రష్యాతో యుద్ధం చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డప్పుడు, మధ్యధరాసముద్రం, సూయజ్ కాలవ, డార్డనెల్స్ జలసంధి, పసిఫిక్ సముద్రప్రాంతమూ, ఉత్తరఅట్లాంటిక్ ప్రాంతమూ, రష్యాప్రతికూల కూటమిఅధీనంలో ఉండాలి. బ్రిటన్,అమెరికాలు కలిసి ఇప్పుడు చేస్తున్న పనే అది. ఇటలీ, యుగస్లావియాలను తమలో చేర్చుకుంటేపశ్చిమరాజ్యాలకు మధ్యధరాసముద్రంపై సర్వాధికారం లభిస్తుంది. అలాగే గ్రీస్, టర్కీలను కలుపుకుంటే అతిప్రధానమైన డార్డినెల్స్ జలసంధి రష్యాపై చక్రబంధం ప్రయోగించేందుకు ఉపయోగపడుతుంది. అలాగే ఇరాన్‌ను బలపరచి అక్కడ అమెరికన్ సైనికస్థావరాలను ఏర్పాటు చేసుకుంటే రష్యాదక్షిణప్రాంతంపై దండయాత్ర ప్రారంభించడానికి వీలవుతుంది.

ఇప్పుడు గ్రీస్, టర్కీలను ఉత్తర అట్లాంటిక్ రాజ్యాలకూటమిలో చేర్చుకోకపోయినా, ఆ ఒడంబడికప్రకారం జరిపే రక్షణయేర్పాట్లలో, అని పాల్గొనవచ్చునని ఉత్తర అట్లాంటిక్ రాజ్యాల ప్రతినిధులు తీర్మానించారు. ఆ ప్రకారంగానే మధ్యధరాసముద్ర ప్రాంతరక్షణ ఏర్పాట్లలో పాల్గొనేందుకు గ్రీస్, టర్కీలు సమ్మతించాయి. యుగస్లావియా ప్రస్తుతం రష్యా ప్రతికూలవర్గంలో చేరకపోయినా, క్రెమ్లిన్ నాయకులు ఆ దేశంపై బల్గేరియా, అల్బేనియా, రుమేనియాలను యుద్ధానికి ప్రోత్సహిస్తూఉండటంవల్ల, టిటో యుగస్లావియా తృతీయసంగ్రామంలో రష్యా ప్రతికూలపక్షంలో చేరే అవకాశమే ఎక్కువగా ఉంది.

అసలు ద్వితీయ ప్రపంచసంగ్రామం పూర్తి కాకపూర్వమే మరోయుద్ధం ప్రారంభం కానున్నదనే భయం ఏర్పడ్డానికి, అందుకు అన్నివర్గాలూ సన్నద్ధం కావడానికి కారణాలు ఏమిటి?

కమ్యూనిజం-ప్రజాస్వామికం, ఇరుగు పొరుగున వర్ధిల్లగలవని సోవియట్ నాయకులు ఎన్ని పర్యాయములు హామీ ఇచ్చినా ఈ రెండు సిద్ధాంతాల సంఘర్షణ అనివార్యమనే భావం ప్రబలడానికి కారణం ఏమిటి?

యుద్ధాన్ని పరిసమాప్తం చేయడానికి జరిగిన, యుద్ధం ప్రథమప్రపంచసంగ్రామం అన్నారు. తరవాత యుద్ధాన్ని నివారించేందుకు నానాజాతిసమితిని ఏర్పాటు చేశారు. ప్రథమ ప్రపంచసంగ్రామం యుద్ధాన్ని పరిసమాప్తం చేయలేకపోయినట్లే, నానాజాతిసమితి యుద్ధాన్ని నివారింపలేకపోయింది.

౧౯౩౦ నుంచీ ౧౯౩౯ వరకూ ఎప్పుడు, ఎక్కడ, యుద్ధప్రమాదం వచ్చినా నానాజాతిసమితి ఆ ప్రమాదాన్ని ఎదుర్కొని నివారణచర్యలు తీసుకొనడానికి బదులు తప్పుకుంటూ వచ్చింది. జపాన్, చైనాభూభాగమైన మంచూరియాపై దురాక్రమణ జరిపితే, జపాన్‌పై చైనా చేసిన ఫిర్యాదును విచారణకు తీసుకునేటప్పటికే, మంచూరియాపై, జపాన్ అధికారం స్థిరపడిపోయింది.

అలాగే ఇటలీ, అబిసీనియాపై దండెత్తితే, ఆర్థిక ఆంక్షలను ప్రయోగించేందుకు అయినా సాహసింప లేకపోయింది, నానాజాతిసమితి. హిట్లర్ సమితి శక్తిని గ్రహించాడు. సమితిని నడిపిస్తున్న బ్రిటన్, ఫ్రాన్సుల సంగతి తెలుసుకున్నాడు. వెంటనే రైన్‌లాండ్ ప్రాంతాన్ని, నాజీసేనలను పంపి ఆక్రమించుకున్నాడు. ఫ్రాన్సు ఏమీ చేయలేకపోయింది. ఆస్ట్రియాపైకి సేనలను నడిపించి తన జన్మభూమిని తన రాజ్యంలో కలుపుకున్నాడు. సమితి చూచీ చూడనట్టు ఊరుకున్నది.

తన దురాక్రమణను ప్రతిఘటించగల శక్తి సమితికి లేదని, ప్రతిఘటించాలనే వాంఛ బ్రిటన్, ఫ్రాన్సులకు లేదనీ తెలుసుకొని, హిట్లర్ సుడేటన్ లాండ్ రక్షణ అంటూ, చకస్లవేకియాను స్వాధీనం చేసుకున్నాడు. మ్యూనిచ్ ఒడంబడిక ఫలితంగా యావత్తు యూరప్‌కు ఆదర్శప్రాయంగా ఉన్న ప్రజాస్వామిక రాజ్యం చకస్లవేకియా బలిఅయినా యుద్ధం నివార్యమైందని నెవిల్లీ ఛేంబర్లేన్ ప్రభృతులు నిట్టూర్పు విడిచారు. ఈలోపున అటు స్పెయిన్‌లో ఇటలీ, జర్మనీలు, ఇటు చైనాలో జపాన్, తమ నవీన ఆయుధాల శక్తిని, తమ యుద్ధనిర్వహణ సామర్థ్యాన్ని పరీక్ష చేసుకున్నాయి. ముఖ్యంగా స్పెయిన్‌లో అటు కమ్యూనిస్టురష్యా, ఇటు నాజీ, ఫాసిస్టు జర్మనీ ఇటలీలు తమ కొత్త ఆయుధాలన్నింటినీ ప్రయోగించి వేటి శక్తి ఎంతెంత ఉందో తెలుసుకున్నాయి.

తత్ఫలితమే ౧౯౩౯ వ సంవత్సరంలో—మాలటాఫ్, రిబ్బన్‌ట్రాఫ్‌ల కృషితో—ఏర్పడిన "మాస్కో-బెర్లిన్ ఒడంబడిక." రష్యాతో యుద్ధం తప్పదని జర్మనీకి తెలుసును. జర్మనీతో యుద్ధం అనివార్యం కాదని రష్యాకు తెలుసును. అయితే ఉభయులకు ఆ అంతిమ యుద్ధానికి తయారుకావడానికి వ్యవధి కావాల్సి వచ్చింది. నెవిల్లి ఛేంబర్లేన్ మ్యూనిక్ ఒడంబడికవల్ల ఏర్పడిన విరామాన్ని బ్రిటన్ యుద్ధనిర్వహణశక్తిని వృద్ధిచేయడానికి వినియోగించుకొనిఉంటే ౧౯౩౯ లో జర్మనీ అసలు యుద్ధాన్ని ఠించి యుండకపోను.

నానాజాతిసమితి నిర్జీవం కావడానికి, ఇటు ఆసియాలో జపాన్ మిలిటరిజం, అటు యూరప్‌లో జర్మనీ నాజిజం, ఇటలీఫాసిజం. ఉద్భవించి యావత్తు ప్రపంచాన్ని మహాయుద్ధానికి గురి చేయడానికి ౧౯౩౦–౩౯ సంవత్సరముల మధ్య కాలపు బ్రిటిష్ రాజ్యాంగతంత్రమే కారణం. ఆ రాజనీతిఫలితాలనే ఇప్పటికీ, ప్రపంచం ఇటు ఆసియాలోనూ, అటు మధ్యప్రాచ్యంలోనూ అనుభవిస్తూ ఉన్నది. పాలస్తీనా విభజనకు, అరబ్ లీగ్ స్థాపనకు, ఆ కాలంలోనే ప్రాతిపటికలు ఏర్పడ్డవి.

ద్వితీయ ప్రపంచ సంగ్రామంవల్ల నాజిజం, ఫాసిజం, జపాన్ మిలిటరిజం నిర్మూలమైనా మరొక యుద్ధప్రమాదం ప్రత్యక్షమౌతూ నేవుంది. ప్రథమ ప్రపంచసంగ్రామానంతరం పాశ్చాత్య రాజ్యాలు అనుసరించిన 'రాజనీతి' హిట్లర్ ముసోలినీల ఫాసిజంను సృష్టిస్తే, ద్వితీయ ప్రపంచసంగ్రామానంతరం బ్రిటన్, అమెరికాలు అనుసరించిన ఈనాటికీ అనుసరిస్తున్న, రాజనీతి స్టాలిన్ కమ్యూనిజంను సృష్టించింది. ప్రథమ ప్రపంచ సంగ్రామ మప్పుడే కమ్యూనిస్టు రష్యా అవతరించింది. నిజమే. కాని హిట్లర్ జర్మనీ, ముసోలినీ, ఇటలీ మాదిరిగా, లెనిన్ రష్యా దారుణయుద్ధాలకు గురిచేయగల స్థితిని పొందలేదు.

జర్మనీ విషయంలో, వర్సైల్సు సంధి హిట్లర్ అధికారంలోకి రావడానికి ఏవిధంగా ఉపయోగపడిందో, ౧౯౧౮-౨౦ ల మధ్య రష్యాలో పాశ్చాత్యరాజ్యాల సైనికచర్యలు తదాద రష్యాప్రభుత్వాన్ని పరిగణింపక, రష్యారాయబార్లను నిర్బంధించి ప్రజాస్వామిక రాజ్యాలు ప్రదర్శించిన హ్రస్వదృష్టి క్రెమ్లిన్‌లో స్టాలిన్ అధికారం బలపడేందుకు తోడ్పడ్డవి.

౧౯౪౫ వ సంవత్సరంలో ద్వితీయప్రపంచ సంగ్రామం పరిసమాప్తమైనప్పట్నుంచి బ్రిటన్,

అమెరికాలు, జాయింటుగా అనుసరించుతూవున్న రాజకీయార్థిక విధానాలు, స్టాలిన్ కమ్యూనిజం, ఒక మహాప్రమాదంగా వృద్ధిపొంది రూపొందడానికి దోహదం ఇచ్చినవి.

వెనుకటి నానాజాతిసమితిలాగానే ఇప్పటి ఐక్యరాజ్యసమితి, ఈ అగ్రరాజ్యాల రాజకీయవిధానాలనే ప్రతిబింబిస్తూ, తృతీయప్రపంచ సంగ్రామానికి సోపానం వేస్తున్నది.

నేడు కొరియాలో జరుగుతున్న యుద్ధం ఒక చెదురుమాటు సంఘటన గాదు. ౧౯౩౬-౩౯ సంవత్సరాల్లో జరిగిన స్పెయిన్ అంతర్యుద్ధానికి పూర్వం ఎన్ని సంఘటనలు జరిగాయో, ఇప్పుడు జూన్‌లో కొరియాయుద్ధం ప్రారంభం కావడానికి ముందు కూడా అన్ని సంఘటనలు జరిగాయి. అందులో వేటినీ, బ్రిటన్, అమెరికాలుగాని ఐక్యరాజ్యసమితిగాని నివారింపలేకపోయింది. తత్ఫలితమే కొరియాయుద్ధం.

౧౯౪౫ లో ద్వితీయప్రపంచసంగ్రామం పరిసమాప్తమైనప్పటినుండీ గ్రీస్‌లో అంతర్యుద్ధం చెలరేగుతూనే ఉంది. గ్రీస్‌లో ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలదోసి కమ్యూనిస్టుప్రభుత్వాన్ని స్థాపించడానికి జరుగుతున్న గెరిల్లాయుద్ధంలో రష్యాకు ప్రత్యక్షసంబంధం లేకపోయినా, రష్యాఉపగ్రహ బాల్కన్‌రాజ్యాలన్నీ ప్రత్యక్షంగా ఈ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నవి. ఐక్యరాజ్యసమితి బాల్కన్ కమిషన్, గ్రీస్ గెరిల్లాలకు బల్గేరియా, రుమేనియా, హంగరీ, ఆల్బేనియా ప్రభుత్వాలు ప్రత్యక్షంగా సహాయం చేస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. ఈ దేశాలు, అసలు, సమితి బాల్కన్‌కమిషన్‌ను, గుర్తింపనైనా గుర్తింపలేదు. పరిస్థితులను విచారించేందుకు ఆ దేశములలో ప్రవేశించుటకైనా సమితికమిషన్‌కు అవకాశము లేకపోయింది.

అయినా ఐక్యరాజ్యసమితి ఈ దేశములపై ఎట్టి చర్య తీసుకొనలేకపోయింది. సమితిసభ్యత్వమున్న ప్రజాస్వామిక రాజ్యములే అనేకము ఈ దేశములతో రాజకీయ, వాణిజ్యసంబంధములను పెట్టుకొన్నాయి. ఈ పరిస్థితులలో కమ్యూనిస్టురాజ్యములు ఏమి చేయునో కొరియా, చైనా, వియట్నామ్ సంఘటనలు ఋజువుచేసినవి. వియట్నామ్‌లో బావ్‌దాయ్‌ప్రభుత్వము ఉండగా, ఆ ప్రభుత్వమును ఇతరరాజ్యాలు గుర్తించియుండగా, రష్యా, రష్యాఉపగ్రహరాజ్యములూ హోచిమిన్ ప్రభుత్వమును గుర్తించాయి. అట్లే ఉత్తరకొరియాలోని కింసుంగ్ ప్రభుత్వము యావత్తు కొరియాకు ప్రాతినిధ్యము వహిస్తూన్నట్లు కమ్యూనిస్టు రాజ్యములన్నియు గుర్తించెను.

ప్రజాస్వామిక రాజ్యములు ఇట్లా చేయగలవా? చేయకుండా ఉండగలవా? కమ్యూనిస్టురాజ్యముల మధ్య నున్న సఖ్యత, ఐక్యత, ప్రజాస్వామిక రాజ్యములందు తృతీయ సంగ్రామ మేర్పడితేనే తప్ప, సాధ్యం కాదు. ఈ విషయము గ్రీస్ విషయములోనే గాదు, తూర్పు యూరప్ దేశములన్నింటి సందర్భమునా స్పష్టమైంది.

చెకోస్లొవేకియాలో ఎన్నికలద్వారా ఏర్పడిన సక్రమప్రభుత్వమును రష్యా ప్రోత్సాహ సహాయాలతో గోట్వాల్డ్ కూలదోశాడు. అన్ని విధముల ఆదర్శప్రాయముగా నున్న ప్రజాస్వామికము, మరొకసారి నియంతృత్వానికి బలి కాగా, ప్రజాస్వామిక ప్రపంచము నిట్టూర్పు విడచుటకంటె చేసిందేమీ లేదు. ఆ దేశమునందు ఏమీ జరుగనట్లే వ్యవహరించాయి. డాక్టర్ మేజరిక్ మరణమునకు కారణము హత్య, ఆత్మహత్య అన్నది ఇంతవరకు నిర్ధారణ కాలేదు. ప్రజాస్వామిక రాజ్యములన్నీ ఈ సంఘటనలు ఒక దేశ అంతరంగికవ్యవహారములకు సంబంధించినవని అలక్ష్యము చేస్తున్నాయి. కాని ఇట్టివే కమ్యూనిస్టులనే రాజ్యములందు జరిగి, కమ్యూనిస్టుప్రభుత్వము, పతనమందు ప్రమాద మేర్పడితే, ఇతర కమ్యూనిస్టు రాజ్యములు ఇట్టి నిర్లక్ష్యవైఖరినే అవలంబించునా? అవలంబింపదని రుమేనియా, హంగరీలందు జరిగిన మార్పులే సమాధాన మొసగుతున్నయి. ఈ దేశములకు ప్రజాప్రతినిధులచే ఎన్నికైన ప్రధానమంత్రులు దేశము వదలి వెళ్ళిపోవలసిన దుస్థితి ఎందుకు ఏర్పడినది?

ప్రస్తుతము కొరియాలో జరుగుచున్న యుద్ధము యెడల ప్రజాస్వామిక రాజ్యములు, ఐక్యరాజ్యసమితీ ఎట్టి విధానమును అవలంబింపవలెను అను ప్రశ్నకు సరియైన సమాధానము పొందవలెనంటే గత అయిదు సంవత్సరముల అంతర్జాతీయ రాజకీయాలూ, స్మరించు

టవసరము. ఏయే పరిస్థితుల్లో సమితి తన కర్తవ్యాన్ని సక్రమముగ, ధర్మముగ నిర్వహింపలేకపోయిందో, అందువల్ల ఎట్టి ఫలితములు ప్రాప్తించాయో గుర్తించితే గాని ఇప్పుడు సముచితనిర్ణయమునకు వచ్చుట సాధ్యం గాదు.

పశ్చిమాన చెకొస్లవేకియా, గ్రీస్, తూర్పు యూరపు దేశాలు, మధ్యప్రాచ్యంలో పాలస్తీనా, ఇటు ప్రాచ్యఖండంలో చైనా, కొరియా, ఇండొనీషియా, మలయా, ఇండో—చైనా, కాశ్మీరు వ్యవహారాల్లో బ్రిటన్, అమెరికాలు ఐక్యరాజ్యసమితి అనుసరించిన విధానాలను మాచే రష్యా తన 'కమ్యూనిస్టు' సామ్రాజ్యవిస్తరణకు చేస్తూవచ్చిన కృషిని, తీవ్రతరం చేసింది.

చైనాలో, అమెరికా, చాంగ్ కైషేక్ ప్రభుత్వమును నిలబెట్టేందుకు ఎన్నికోట్ల డాలరులను దుబారాచేసిందో, సమగ్రంముగాని వెల్లడి కాదు. కమ్యూనిస్టులను ప్రతిఘటించేందుకు క్యుమింటాంగ్ సైన్యాలకు కావాలిసిన ఆయుధాలన్నింటినీ సప్లయి చేసింది. చాంగ్ కైషేక్ మనుష్యులకు సైనిక శిక్షణ నిచ్చింది. యుద్ధనిర్వహణలో సలహా నిచ్చుటకు అమెరికా తన సైనికప్రవీణులను చాంగ్ కైషేక్ దర్బారులో ఉంచింది. జనరల్ వెడ్మెయరు, జార్జి మార్షల్, ప్రభృతులద్వారా, క్యుమింటాంగ్ కమ్యూనిస్టు పక్షములకు రాజీ కుదిర్చి చాంగ్ కైషేక్ అధ్వర్యాన సంకీర్ణప్రభుత్వాన్ని నెలకొల్పడానికి ప్రయత్నించింది. అమెరికా ఇంత చేస్తున్నప్పటికీ రష్యా మావ్ సీటుంగ్ పక్షంతరఫున చైనాలో ప్రత్యక్షంగా జోక్యం కల్గించుకున్నదని ఋజువు చేయడానికి దాఖలాలే లేవు. చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడేందుకు రష్యా ఏమీ చేయలేదని అంగీకరించడానికి వీల్లేదు.

కాని చైనాచరిత్ర పరిశీలించితే, అమెరికా, అమెరికాను ఆశ్రయించుకున్న ప్రజాస్వామిక రాజ్యాలు, అనుసరించుతూ ఉన్న తటపటాయింపు విధానమే, కమ్యూనిజం విస్తరణకు ఎక్కువ దోహదం ఇచ్చింది. కమ్యూనిస్టువిధానానికి, పద్ధతికీ, ప్రజాస్వామిక విధానానికి, పద్ధతికీ ఉన్న వ్యత్యాసమే ఇది. కనుక యుద్ధం లేకుండా, మామూలు పరిస్థితుల్లో ప్రజాస్వామికవిధానం కమ్యూనిజంను ఎన్నటికీ జయింపలేదని స్పష్టమైపోయింది. ఇందుకు కారణం కూడా ఒక్కటే. కమ్యూనిస్టు రాజ్యాలన్నింటి లక్ష్యమూ, యుద్ధకాలంలోనూ శాంతికాలంలోనూ కూడా, ఒక్కటే. రాజకీయ, ఆర్థిక, సాంఘిక ఆదర్శాలు ఎప్పుడూ ఒక్కటే. కనుకనే కమ్యూనిస్టు రాజ్యాలన్నీ ప్రతి ఒక్క సమస్యమీదా ఒకే విధమైన విధానాన్ని అనుసరించి నిర్ణయానికి రాగలుగుతున్నవి.

ప్రజాస్వామిక రాజ్యాల విషయం అలా కాదు. వాటి అపేక్షలు భిన్నమైనవి. ప్రతి సమస్యను ఈ ప్రజాస్వామికరాజ్యాలు తమ అపేక్షలదృష్ట్యానే విచారించి నిర్ణయాలకు రావడం జరుగుతున్నది. భిన్న అపేక్షల దృష్ట్యా జరిగిన నిర్ణయాలు భిన్నంగా ఉండి, సమన్వయం చేయడానికి వీల్లేకుండా పోతున్నది. ఫలితం ప్రజాస్వామికరాజ్యాల మధ్య అనైక్యత.

భారత ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ప్రజాస్వామిక రాజ్యాలలో ప్రబలుతున్న ఈ అనైక్యతకు ప్రధాన కారణం ఏమిటో ఈ మాసారంభంలో లక్నోలో జరిగిన పసిఫిక్ ప్రాంత వ్యవహారాల సభకు ప్రారంభోత్సవం చేసిన సందర్భంలో స్పష్టంగా వివరించారు. ఇండొనీషియా స్వాతంత్ర్యంకొరకు పోరాడుతూవుంటే, ఆ పోరాటాన్ని ప్రతిఘటించిన హాలెండ్‌కు, అమెరికా ఆయుధాలు సప్లయి చేసింది. బ్రిటన్ తటస్థంగా ఉండిపోయింది. ఫ్రాన్సు ఇండో-చైనాలోని తన సామ్రాజ్యాన్ని సంరక్షించుకోవాలి గనుక, ఇండొనీషియాలో డచ్ సామ్రాజ్యవాదులను సమర్థించింది.

భారతదేశం, అలాగే స్వాతంత్ర్యాన్ని పొందిన ఇతర ఆసియాదేశాలు ఇండొనీషియాను బలపరచినవి. ఈ రాజ్యాలన్నీ చేరి ఒకే విధానాన్ని అనుసరించి కమ్యూనిజంను ప్రతిఘటించడం అనేది ఎన్నటికైనా సాధ్యపడేదేనా? ఎన్నటికైనా సంభవించేదేనా?

కమ్యూనిస్టు చైనాను గుర్తించే విషయంలో కమ్యూనిస్టేతర రాజ్యాలు అనుసరించిన విధానాన్ని పరిశీలించినా ఇవే ప్రశ్నలు ఏర్పడతవి. బ్రిటన్ కమ్యూనిస్టుచైనాను గుర్తించింది; కాని రాజకీయ సంబంధాలను పెట్టుకొని రాయబారులను నియమించుకొనడానికి ఇంతవరకూ ఒక నిర్ణయానికి రాలేకుండా ఉంది. ఈజిప్టు అసలు కమ్యూనిస్టుచైనాను గుర్తించడానికే నిరాకరించింది. భారతదేశం కమ్యూనిస్టు

చైనాతో రాయబారసంబంధాలనుకూడా పెట్టుకున్నది.

అమెరికామాత్రం ఇప్పటికీ, చాంగ్ కైషేక్ ప్రభుత్వాన్నే ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ బలపరుస్తూ సమర్థిస్తూ ఉన్నది.

అలాగే కొరియావిషయంలోనూ ప్రజాస్వామిక రాజ్యాలు, పరస్పర విరుద్ధములుగా ఉన్న విధానాలను అనుసరించుతూ ఉన్నవి. కొరియాలో ఐక్యరాజ్య సమితి, దురాక్రమణను ప్రతిఘటించి తృతీయప్రపంచ సంగ్రామాన్ని నివారింపగల్గిందని యావత్ప్రపంచమూ హర్షిస్తుంటే, క్రిందటి రెండు వారాలుగా లేక్ సక్సెస్‌లో జరుగుతున్న తర్జనభర్జనలను, నిర్ణయాలను గమనిస్తే నానాజాతిసమితి దురాక్రమణను నివారింపలేక తృతీయ ప్రపంచ సంగ్రామానికి దారితీస్తే, ఐక్యరాజ్య సమితి దురాక్రమణను నివారించి, తృతీయసంగ్రామానికి ప్రాతిపదిక వేస్తున్నదని చెప్పుకోవలసి వస్తున్నది. కొరియాభవిష్యత్తు, ఐక్యరాజ్యసమితి భవిష్యత్తు, ఒకేసమయమున నిర్ధారణ కానున్నట్లు కన్పిస్తున్నది.

కొరియాలో యుద్ధాన్ని ప్రారంభించింది ఉత్తరకొరియా, అని అందరూ అంగీకరించారు. భద్రతామండలి తీర్మానించక పూర్వమే, అమెరికా అధ్యక్షుడు ట్రూమన్, తన సేనలను సింగ్మన్‌రీ ప్రభుత్వ రక్షణకు దక్షిణకొరియాకు పంపించాడు. భద్రతామండలి తరవాత సమావేశమై ఉత్తరకొరియా దురాక్రమణ జరిపిందనీ, ఆ దురాక్రమణను ప్రతిఘటించడానికి సమితిసభ్యులంతా దక్షిణకొరియాకు సహాయం చేయాలనీ, తీర్మానించింది.

దాదాపు మూడుమాసాలు మెక్ ఆర్థర్ సేనలు ఉత్తరకొరియన్ల చేతులలో గట్టి దెబ్బలు తిన్నవి. దక్షిణకొరియాలో అయిదింట నాలుగువంతులు కింసుంగ్ సేనల వశమైంది. ఈ స్థితిలో సమితిసేనలు ఇంఛాన్‌వద్ద రెండోరంగాన్ని ప్రారంభించి పది రోజుల్లో యుద్ధగమనాన్నే మార్చివేసినై. ఉత్తర కొరియను సేనలు ౩౮ వ అక్షాంశరేఖను దాటి వెళ్లిపోయినవి. మెక్ఆర్థర్ సేనలు ఉత్తర కొరియాసరిహద్దును చేరేసరికి కొరియా భవిష్యత్తుకే గాక యావత్తు ఆసియాభవిష్యత్తుకు సంబంధించిన అతి ముఖ్యమైన సమస్య ఒకటి ఏర్పడింది.

మెక్ఆర్థర్ కోరిన ప్రకారం ఉత్తర కొరియా లొంగిపోలేదు. కాబట్టి సమితిసేనలు ౩౮ వ అక్షాంశ రేఖను దాటి ఉత్తరకొరియాను పూర్తిగా ఆక్రమించాలా? ఆక్రమించవచ్చునా? అన్నప్రశ్నలు ఏర్పడ్డవి. భద్రతామండలిగాని, సమితి ఇతర సంఘాలుగాని ఈ సమస్యలపై ఒకనిర్ణయానికి రావడానికి ముందే మెక్,ఆర్థర్ సేనలు ఉత్తరకొరియాఆక్రమణను ప్రారంభించినవి. ఈ ఆక్రమణ ప్రారంభమైన వారంరోజులకు సమితిరాజకీయసంఘం కొరియా ఉత్తర దక్షిణ ప్రాంతాలను ఏకంచేసి సమైక్య కొరియాను స్థాపించి, స్వతంత్ర, ప్రజాస్వామిక, సమైక్య కొరియా ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలని తీర్మానించింది.

ఈవిధంగా జూన్ ౨౫ న. అక్టోబరు ౮ న సమితి సంఘాలు అతి క్లిష్టసమస్యల విషయంలో ఖచ్చితమైన నిర్ణయాలు చేయకలిగినవి. ఇందువల్ల ఐక్యరాజ్య సమితిపై చిన్నరాజ్యాలకు గౌరవం, దురాక్రమణపరులకు సమితి అంటే భీతి, ఏర్పడవచ్చు.

అయితే సమితిసేనలు ౩౮ వ అక్షాంశరేఖను రద్దుచేసి-ఇది రద్దుకాక తప్పదు, రద్దుకావటం ఎన్నటికైనా అవసరమే-సమైక్య కొరియాను స్థాపించ కలిగిననాడు ప్రపంచసంగ్రామం నివార్యమైనట్లు భావించవచ్చా? ఎవ్వరూ సమాధానం చెప్పలేరు. ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌ను, పాకిస్తాన్‌ను వేరుచేస్తున్న డ్యూరాండ్ రేఖ రద్దయితే, ఆప్రాంతంలో శాంతి ఏర్పడుతుందని ఎవరు చెప్పగలరు? ౩౮ వ అక్షాంశ రేఖకూ, డ్యూరాండ్ రేఖకు యథార్థంగా ఎక్కువ వ్యత్యాసం లేదనే చెప్పవచ్చు.

ప్రపంచ భవిష్యత్తుగాని, సమితిభవిష్యత్తుగాని కొరియా, ఫార్మోజాల విషయంలో కమ్యూనిస్టు చైనా ఎలాంటి విధానాన్ని అవలంబిస్తుందో, దాని మీద ఆధారపడి ఉంటుంది. కొరియా యుద్ధసందర్భంలో అమెరికన్ విమానాలు అనేకసార్లు చైనా భూభాగంపై దాడులు చేసినవి. సమితిలో ఈ దాడులు చర్చకు రానున్నవి. అలాగే ఫార్మోజా విషయం కూడా. సమితి ఇంతవరకూ కమ్యూనిస్టుచైనాకు సభ్యత్వం ఇవ్వలేదు. నవంబరు ౧౫ న, మొదటిసారిగా, కమ్యూనిస్టు చైనా ప్రతినిధులు, సమితికార్యక్రమంలో, కొన్ని చర్చల్లో పాల్గొనటం జరుగుతుంది. అంతవరకూ కమ్యూనిస్టుచైనా ఏ చర్యా తీసుకోకుండా ఉంటుందా?

విఖ్యాతాంగ్లకవి

టి. యస్. ఇలియట్

శ్రీ పి. గణపతిశాస్త్రి

టి. యస్. ఇలియట్ ౨౦ వ శతాబ్ది ప్రారంభంలో ఆంగ్లకవిత్వ పద్ధతులలో విప్లవం తీసుకువచ్చిన విఖ్యాత కవి. ఈయన మొట్టమొదటగా ౧౯౨౨ లో ప్రచురించిన Waste Land అనే కావ్యంమీద ఆంగ్ల వాఙ్మయ రంగంలో గొప్ప గాలిదుమారం బయలుదేరింది. అప్పుడు టైమ్ పత్రిక దీన్నిగురించి వ్రాస్తూ ఇది ఒక బూటకం అయిఉండవచ్చు ననే పుకారు న్నదని అన్నది. మొదట ప్రచురింపబడి నప్పుడు చాలామందికిది బోధపడలేదు. తరవాత ఇలియట్ దీన్ని చిన్న చిన్న వ్యాఖ్యలతో సహా ప్రచురించాడు. ఇప్పటికీ ఇది సామాన్యంగా మిగిలిన ఆంగ్ల కావ్యాలలాగ సులభంగా అర్థంకాదు.

ఆపిమ్మట క్రమంగా ఇలియట్ అనేక కావ్యాలు, రూపకాలు, విమర్శకగ్రంథాలు ప్రకటించాడు. మొట్టమొదట ఈయనకావ్యం తీవ్రంగా విమర్శించిన విమర్శకులే క్రమంగా ఈయనకవితాశక్తి గుర్తించారు. వేస్ట్‌లాండ్ ప్రకటించిన తరవాత యువకవులలో అత్యధిక సంఖ్యాకులకు ఈయన అగ్రేసరుడైనాడు. ౧౯౪౮ లో ఆంగ్లప్రభుత్వం ఈయనకు ఒ. యమ్. (Order of Merit) అనే బిరుదం ఇచ్చి గౌరవించింది. ఆసంవత్సరంలోనే ఈయనకు వాఙ్మయంలో నోబెల్ బహుమానం కూడా ఇచ్చి గౌరవించారు.

జీవిత చరిత్ర

ఇలియట్ పూర్వులు చాలాకాలంకిందటనే అమెరికాకు వలసవెళ్ళిన ఆంగ్లేయులు. వీరు అమెరికాలో అనేక ప్రజాహిత కార్యాల్లో పాల్గొన్నవారు. ఇలియట్ పితామహుడు వాషింగ్టన్ విశ్వవిద్యాలయం స్థాపించిన మహనీయుడు. టి. యస్. ఇలియట్ తండ్రిపేరు హెన్రీవేర్ ఇలియట్. ఈయనకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కలిగారు. వీరిలో కడగొట్టువాడు టి. యస్. ఇలియట్. ఈయన తల్లి ఒకనాటకమూ, ఒక జీవితచరిత్ర కూడా ప్రకటించిన రచయిత్రి. వీరి కుటుంబంలో అందరు సారస్వతాభిమానులే. ఇలియట్ తండ్రి పిల్లలకు డికెన్స్ నవలలు చదివి వినిపిస్తూ ఉండేవాడట.

టి. యస్. ఇలియట్ ౧౮౮౮ సెప్టెంబరులో జన్మించాడు. ఇతడు చిన్నతనంలో అంతగా ఆటపాటలతో కాలక్షేపం చెయ్యక ఎక్కువగా పుస్తకాలు చదువుతూండేవాడు. ఈయన ౧౮ వ ఏటనే హార్వర్డు విశ్వవిద్యాలయంలో ప్రవేశించాడు. సుప్రసిద్ధ తత్త్వశాస్త్రవేత్తయైన జార్జి శాంతాయన దగ్గర పాశ్చాత్య వేదాంతం అభ్యసించాడు. ఇర్వింగ్ బాబిట్ వద్ద ఫ్రెంచివాఙ్మయం అభ్యసించాడు. తరవాత ఈయన కొంతకాలం బెర్‌ట్రాండ్ రస్సెల్ వద్ద తర్కశాస్త్రం అభ్యసించాడు. చదువుకునే రోజులలోనే ఈయన అనేకమైన వాఙ్మయసంఘాలలో సభ్యుడుగా ఉండేవాడు. ఆ రోజులలోనే ఈయన ఒక సారస్వతపత్రికకు సంపాదకుడుగా కూడా పనిచేశాడని తెలుస్తున్నది. హార్వర్డ్‌లో చదివినతరవాత ఇలియట్ పారిస్‌లో కూడా విద్యాభ్యాసంచేశాడు. తరవాత మళ్లీ హార్వర్డువిశ్వవిద్యాలయానికి తిరిగివచ్చి మూడేళ్ళపాటు సంస్కృతము, భారతభాషాశాస్త్రము చదువుకున్నాడు. ౧౯౧౪ లో ఈయనను హార్వర్డు విశ్వవిద్యాలయంలో సహాయ తత్త్వ శాస్త్రి

చార్యుడుగా నియమించారు. ఈసంవత్సరాంతం లోనే ఈయన జర్మనీదేశాన్ని సందర్శించడానికి బయలుదేరాడు. అప్పుడే జర్మనీయుద్ధం ప్రారంభం కావడం చేత ఇలియట్ ఇంగ్లండు వెళ్లి క్రమంగా అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడే ఇలియట్ వివాహం కూడా జరిగింది. ఆసమయంలో కొంత కాలంపాటు ఈయన ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. పిమ్మట కొంతకాలం ఒక బాంకులో కూడా ఉద్యోగం చేశాడు గాని, ఆ ఉద్యోగం చాలాకాలం సాగలేదు. అనంతరం 'ఫేబర్ అండ్ ఫేబర్' అనే పుస్తక ప్రచురణ సంస్థకు దర్శకుడైనాడు. క్రమంగా ఆయన అమెరికా పౌరసత్వం త్యజించి ఆంగ్లదేశ పౌరసత్వం సంపాదించి ఆదేశంలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకొన్నాడు.

ఇలియట్ కావ్యాలు

ఇలియట్ వ్రాసిన కావ్యాలలో (Waste Land) వేస్ లాండ్, (Hollow Men) హోలో మెన్, (Ash - Wednesday) ఆష్ వడ్ నెస్ డే, (Four Quarters) ఫోర్ క్వార్టర్స్ అనే కావ్యాలు ప్రముఖమైనవి. ఇవిగాక ఈయన కొన్ని చిన్నఖండకావ్యాలు కూడా ప్రచురించాడు.

౧౯౨౨ లో ప్రచురించేముందు ఇలియట్ వేస్ట్ లాండ్‌ను (Ezra Pound) ఎజ్రాపౌండ్‌కు చూపించాడట. ఆయన దీనిలో సగానికి సగం తగ్గించి అచ్చువేయవచ్చునని సూచించాడట. ఆయన సలహా ప్రకారం కొన్ని సంస్కరణలు చేసిన తరవాతనే ఇలియట్ ఈ కావ్యం ప్రచురించాడు.

వేస్ట్‌లాండ్ సామాన్యపాఠకులకు దుర్గ్రాహ్యంగా ఉండడానికి అనేకమైన కారణాలున్నాయి. ఈ కావ్యం ప్రస్తుత పాశ్చాత్య నాగరికతలోని చైతన్య రాహిత్యము, ఆధ్యాత్మికతా దారిద్ర్యము, నాగరికతలో లోపల రగులుతున్న అగ్నిపర్వతజ్వాలలు, ప్రస్తుత జీవితనైరాశ్యము అతి తీవ్రంగా ప్రస్ఫురింపచేస్తుంది. వేస్ట్‌లాండ్ అనే పేరును బట్టే ఈ సూచన గ్రహింపవచ్చును. కవి తన అభిప్రాయాలు భావనలోనుంచి పైకుబికే కొన్ని తీవ్రచిత్రణాలద్వారా వ్యక్తీకరిస్తాడు. వీటిలో బాహిరమైన క్రమపద్ధతి ఉండదు. అతి ప్రాచీనమైన అనేకమైన గాథలస్ఫురణలు, ప్రస్తావనలు వస్తూంటాయి. సుప్రసిద్ధ కవుల రచనలలోని వాక్యాలనేకం నొక్కిపోతూంటాయి. ఫ్రెంచి, సంస్కృతము మొదలైన భాషలలోని పదాలుకూడా మధ్య మధ్యన తిరుగుతూంటాయి. ఈ కావ్యం మధ్యలో బృహదారణ్యకోపనిషత్తులోని దత్త, దయధ్వం, దమ్యత అనే మాటలు రెండు మూడు సారులు ఆవృత్తం అవుతాయి. ఇవేకాక అతిప్రాచీనములైన రమ్య పరిస్థితులు, సమకాలికములైన భీకరపరిస్థితులు ఒకే మూసలో కలిగి తిరుగుతూ పాఠకునిహృదయంలో భూత వర్తమాన కాలాల వైపరీత్యము, భావనా వాస్తవికతల భీషణ వైరుధ్యము ప్రదర్శిస్తూంటాయి.

వేస్ట్‌లాండ్‌లోని ఈ క్రింది భాగము ఇలియట్ రచనాపద్ధతిని కొంతవరకు స్ఫురింప జేస్తుంది.

''Sweet Thames, run softly till I end
my song,
Sweet Thames, run softly, for I speek
not loud or long.

But at my back in a cold blast I hear
The rattle of the bones and chuckle spread
from ear to ear.

A rat crept softly through the vegetation
Dragging its slimy belly on the bank
While I was fishing in the dull canal
On a winter evening round behind the
gashouse

Musing upon the king my brothor's wreck
And on the king my father's death
befor him."

ఈ వేస్ట్‌లాండ్‌లోని ఈ కావ్య భాగం థేమ్సునది ప్రాచీన మనోహర చారిత్రిక పరిస్థితులతోబాటు నేటి కాలపు దుర్భర నిరాశా జనక పరిస్థితులను కూడా వ్యక్తీకరింప జేస్తుంది.

వేస్ట్‌లాండ్‌లో కేవలం నైరాశ్యమే ప్రతిబింబించినదని అనేకుల్లు విమర్శించారు. కాని కేవలజీవన నైరాశ్యం స్ఫురింపజేయడం ఇలియట్ అభిప్రాయం కాదు. Ash-Wednesday లో చివర చివర ఇలియట్ ఆశావాదం కనిపిస్తుంది. దీనికి పూర్వం రచింపబడిన Hollow Men అనే కావ్యం కూడా

మానవ జీవిత వైయర్థ్యం ధ్వనింపజేస్తుంది. ఈ క్రింది పంక్తులు దీనికి తార్కాణాలు:

"We are the hollow men
We are the stuffed men
Leaning together
Headpiece filled with straw. Alas!
Our drie voices, when
We whisper together
Are quiet and meaningless
As wind in dry grass
Or rats feet over broken glass
In our dry celler--'

రాక్ (Rock) అనే నాటికలోని ఈ క్రింది బృందగీత భాగం నేటి పాశ్చాత్యనాగరికతా నైరాశ్యాన్ని, వైరుధ్యాన్ని నిశితాతినిశితంగా చిత్రిస్తుంది.

"The endless cycle of idea and action,
Endless invention, endless experiment,
Brings knowledge of motion but not of
stillness;
Knowledge of speech, but not of silence;
Knowledge of words, and ignorance of the
Word,
All our knowledge brings us nearer to our
ignorance
All our ignorance brings us nearer to death
But nearness to death no nearer to God,
Where is the life we have lost in living?
Where is the wisdom we have lost in
knowledge?
Where is the knowledge we have lost in
information?
The cycles of Heaven in twenty centuries
Bring us farther from God and nearer to
dust"

Ash Wednesday కావ్యమే ఎక్కువగా ఇలియట్ మానసిక భావాలకు ప్రతిబింబమని కొందరు విమర్శకులు చెబుతున్నారు. దీనిలో వేస్టులాండ్‌లో ఉన్నంత దుర్గ్రాహ్యత కనిపించదు. ఇది (Church) చర్చి ప్రార్థనల పూర్వరంగంతో ప్రారంభించిన కావ్యం. దీనిలో ఇలియట్ కవిత బాగా పరిణతి చెందినదని విఖ్యాత విమర్శకుల అభిప్రాయము.

Ash-Wednesday తరవాత ఇలియట్ ప్రకటించిన సుప్రసిద్ధ దీర్ఘకావ్యం Four Quarters. ఇది ౧౯౪౪ లో ప్రకటింపబడిన కావ్యం. ఇది ఆధ్యాత్మిక సమస్యలకు సంబంధించిన వేదాంత కావ్యం. వ్యక్తిగతానుభూతితో ప్రారంభించి, ఇది ఆధ్యాత్మిక ప్రేమ, విశ్వాసము మాత్రమే మానవ సమస్యా సాధకాలని సూచిస్తుంది.

ఇలియట్ ఫ్రెంచిభాషలో కూడా కొన్ని ఖండకావ్యాలు రచించాడు. కాని ఇవి చాలా తక్కువ. ముఖ్య కావ్యాలేవీ ఆయన ఫ్రెంచి భాషలో వ్రాయనేలేదు.

ఇలియట్ రూపకాలు

ఇలియట్ కావ్యాలే గాక రూపకాలు కూడా రచించాడు. ఇంతవరకు ఈయన నాలుగు రూపకాలు ప్రకటించాడు. వీటిలో రాక్ (Rock) అనే రూపకం ౧౯౩౪ లో ప్రకటింపబడినది. ఈ రాక్‌లోనివే కొన్ని పాటలు, కావ్యాలు ఇలియట్ కావ్యావళిలో ప్రచురింపబడ్డాయి. ఈ నాలుగు రూపకాలు సాంకేతిక (Symbolic) రూపకాలనే చెప్పవచ్చును. వీటిలో ఒక అభిప్రాయం ప్రధానంగా ఉంటుంది. కవి పాత్రలద్వారా, కథా పరిణతిద్వారా ఈ అభిప్రాయానికి ప్రాధాన్యం ఇచ్చి దాన్ని ధ్వనింపచేస్తాడు. ౧౯౩౫ లో ఇలియట్ 'Murder in the Cathedral' అనే పద్యరూపకం ప్రకటించాడు. ఇది ఒక క్రైస్తవ మతాచార్యుని హత్యావృత్తాంతానికి సంబంధించిన రూపకం. ఇది మతసంస్థలకు రాజ్యాధికారానికీ మధ్యకలిగిన సంఘర్షణ చిత్రిస్తుంది.

ఇటుపిమ్మట ఇలియట్ ౧౯౩౦ లో (Family Reunion) అన్నే రూపకము, ఆ తర్వాత 'Cocktail Party' అనే రూపకము రచించాడు. ఈ రెండు రూపకాలు వర్తమాన సంఘానికి సంబంధించినవే. వీటిలో మొదటిరూపకంలో పాపప్రాయశ్చిత్తం ప్రధానేతివృత్తము.

Cocktail Party ఇలియట్ వ్రాసిన రూపకాలన్నింటిలోను ఎక్కువగా జనాన్ని ఆకర్షించినదని తెలుస్తున్నది. దీన్ని న్యూయార్కు మొదలైన ప్రధాన నగరాలలో అనేకసారులు ప్రదర్శించారు. ఇది దైనందిన విషయాలలోను, కుటుంబవిషయాలలోను నిజమైన మతదృక్పథం అవలంబించవలెనని సూచించే రూపకం.

ఇలియట్ సాహిత్య విమర్శ

ఇలియట్ కవిగానే గాక గొప్ప విమర్శకుడుగా కూడా ప్రసిద్ధికెక్కాడు. ఇతడు విమర్శనలో కొత్త పద్ధతులే ప్రవేశపెట్టాడని చెప్పాలి. ఇలియట్ ౧౯౨౦ లో ప్రచురించిన Sacred Wood అనే విమర్శనోపన్యాస సంపుటి సాహిత్యంలో ఇలియట్ అనుసరించిన ప్రధాన సిద్ధాంతాలు వ్యక్తం చేస్తుంది. ఇలియట్ తన విమర్శనల ద్వారా ౧౭ వ శతాబ్దంలోని ఆధ్యాత్మిక కవుల (Metaphysical Poets) రచనలపై ఆదరం ఇనుమడింపజేశాడు. సుప్రసిద్ధ ఇటలీ కవి దాంతే (Dante) కవిపై ఇతనొక ప్రసిద్ధ విమర్శకగ్రంథం రచించాడు. ఆంగ్లసాహిత్యంలో ౧౭ వ శతాబ్దికి సంబధించిన ఆధ్యాత్మిక కవులు, దాంతే కవి, బోదిలేర్ (Baudelaire) మొదలైన ఫ్రెంచి కవులు ఇలియట్ భావ పరిణతికి ఎక్కువగా కారణభూతులైనారని చెప్పవచ్చును.

ఇలియట్ ఇంకా అనేకమైన విమర్శక గ్రంథాలలో నేటి సమాజ సమస్యలను గురించి చర్చించాడు. మానవులలోని ఆధ్యాత్మికతను, ప్రేమస్వభావాన్ని ఉద్బోధింప చెయ్యడంవల్లనే మానవసమస్యా పరిష్కారం కాగలదని ఇలియట్ దృఢ విశ్వాసము. ఈ అభిప్రాయమే అంతర్గర్భితంగా ఈయన రచనలన్నిటిలోను కనిపిస్తుంది. 'రాక్' రూపకంలోని బృందగీతికలోని ఈ క్రింది వాక్యం దీనికి తార్కాణము:

'They constantly try to escape
From the darkness outside and within
By dreaming of systems so perfect that
No one will need to be good.'

ఇలియట్ ఆధ్యాత్మికతను గురించీ 'చర్చి'ని గురించీ తన రచనలలో వ్యంగ్యంగా ధ్వనింపజేస్తున్నాడంటే అది సంకుచితమైన మతదృక్పథం అని గాని, కేవలం చర్చి ప్రార్థనలతో తృప్తి పడాలని చెప్పే శుష్కమత సంప్రదాయం అని కాని అర్థం చేసుకోకూడదు. మానవునిలోని మానవత్వము, ఆధ్యాత్మిక దృక్పథము నశించిపోతున్నాయనీ, ఇవి లేనప్పుడు కేవలం యాంత్రికమైన పారిశ్రామికాభ్యుదయం వల్లగాని, మానవత్వ నాశకాలయిన సామాజిక సంస్థలవల్లగాని ప్రయోజనం లేదని ఇలియట్ అభిప్రాయము.

ఇలియట్ కావ్యాలన్నీ ఒక చిన్న సంపుటంలో ముద్రింపవచ్చును. అయినా ఇవి నేటి పాశ్చాత్య నాగరికతలోని వైయర్థ్యాన్నీ, ఆధ్యాత్మిక భావావశ్యకను తీవ్రావేదనతో ధ్వనింపజేస్తాయి. అయితే ఇలియట్ ఈ అభిప్రాయం ఎక్కడా వాచ్యంగా చెప్పడు. నేటికాలపు నాగరికతలోను, మానవసంఘంలోను ఉన్న మాలిన్యపూరితములైన పరిస్థితులను చిత్రించడంద్వారానే ఇలియట్ ఈ నిగూఢ వ్యంగ్యం సాధిస్తాడు. ఈవిషయం గమనించని కొందరు వేస్ట్‌లాండ్‌లో శుష్క నైరాశ్యవాదం స్ఫురిస్తున్నదని అభిప్రాయపడ్డారు. కాని ఆతరవాత ప్రకటింపబడిన Ash Wednesday తో ఆ అభిప్రాయం మారింది. మొదట ఇలియట్ కవితలో కనబడిన దుర్గ్రాహ్యత కూడా క్రమంగా తగ్గిపోయింది. ఈయన వ్రాసిన సాంకేతిక రూపకాల కవితలో ఈదుర్గ్రాహ్యత కనబడనే కనబడదు.

ఈకాలంలో అనేకులు ప్రసిద్ధాంగ్లేయ కవులుండవచ్చును. వారందరు కొంత పూర్వసంప్రదాయ విధానాలలోనే కవితారచనలు చేసి ఉండవచ్చును. కాని ఈయుగానికి సార్థకమైన (Significant) కవిత రచించినవాడు ఇలియట్ కవే అని చెప్పాలి. కనకనే ఆయన తరవాత యువకవులు చాలామంది ఆయనకు అనుయాయులయ్యారు. క్రమంగా ఆంగ్లదేశము, ప్రపంచమూ కూడా ఈయన కవిత్వ మాహాత్మ్యం గుర్తించాయి.

ఇలియట్ కవితలోని దుర్గ్రాహ్యతను గురించి అనేకమైన వ్యాఖ్యానాలు బయలుదేరాయి. ఈ అర్థం కాకపోవడం నేటికాలంలో తెలుగు

కవిత్వంలో కూడా ఉన్న దని కొందరు అంటున్నారు. దీన్ని గురించి ఇలియట్‌ను ప్రశ్నించినప్పుడు ఆయన ఈవిధంగా సమాధానం చెప్పాడు. ఇది నేటి కాలపు తెలుగు కవిత్వ పాఠకులందరు చాలా జాగ్రత్తగా గమనింపవలసిన సమాధానము.

ప్రశ్న : నేటి కాలపు కవిత్వం బాగా అర్థం కాకపోవడానికి కారణం ఏమిటి? ఇది ఇల్లాగే ఉండడం అవసరమా?

సమాధానం : "ఈ అర్థం కాకపోవడం అనేక విధాలుగా ఉండవచ్చును. కేవలం నటనారూపమైన దుర్గ్రాహ్యత ఒకటి ఉన్నది. రచయిత ఒకప్పుడు తాను చెప్పిన దానికంటె ఏదో మహత్తరమైన విషయం ఉన్నదని ఆత్మవంచన చేసుకొని అలాగ భావిస్తూ ఉండవచ్చును.

ఒకప్పుడు సహజంగా అనుభూతమైన దానిని వ్యక్తీకరించడంలో కొంత క్లిష్టత కలిగి దానివల్ల దుర్గ్రాహ్యత ఏర్పడవచ్చును. యువక రచయితలలో ఇది కొంతవరకు కనిపిస్తుంది. ఈరకమైన దుర్గ్రాహ్యత కొంత నా వేస్ట్‌లాండ్ కావ్యంలో ఉన్నది. వేస్ట్‌లాండ్‌లో ఆ విధంగా చెప్పడం తప్ప మరి ఒక గత్యంతరం ఏమీ లేదు. కవి తనకళలో పరిణతుడైనప్పుడు క్రమంగా అతనిలోని దుర్గ్రాహ్యత తగ్గిపోతుంది. కావ్యవస్తువులోని క్లిష్టతను బట్టి కూడా ఈఅర్థం కాకపోవడం ఏర్పడుతుంది. నేను వ్రాసిన Four Quarters కావ్యంలో చివరి రెండు భాగాలలోను కొంత దుర్గ్రాహ్యత ఉన్నది. వస్తు స్వభావాన్ని బట్టే ఇక్కడ అర్థక్లిష్టత ఏర్పడింది.

ఇదీగాక ఇంకొక రకమైన అర్థక్లిష్టత ఉన్నది. సామాన్యంగా అందరు అలవాటు పడిన పంథాలో గాక ఒక కొత్త పంథాలో రచన జరిగే సరికి అనేకుల కది దుర్గ్రాహ్యం అయిపోతుంది. ఒక రకమయిన రచనాపద్ధతికి అలవాటుపడినవారు కొత్త పద్ధతిలో వచ్చిన రచన చూచి కంగారు పడిపోతారు. సాహిత్యంలోనే గాక చిత్రకళలో కూడా ఈక్లిష్టత ఏర్పడుతున్నది.

ఇంకా మరిఒక రకమైన క్లిష్టత ఉన్నది. ఉత్తమోత్తము లైన మహాకావ్యాలు మనం సంపూర్ణంగా అర్థం చేసుకున్నామని తృప్తిపడలేము. ముఖ్యంగా ఇది బైబిలువంటి గ్రంథాలకు బాగా అన్వయిస్తుంది. జీసస్ సూక్తులను మననం చేసిన కొద్దీ వాటిలోని గాంభీర్యం ఇంకా స్ఫురిస్తూనే ఉంటుంది."

"కవిత ఎప్పటికైనా బాగా ప్రజాసామాన్యానికి సన్నిహితం కాగలదా? అయితే ఎలాగ?" అనే ప్రశ్నకు సమాధానం చెబుతూ ఇలియట్ ఇల్లాగ చెప్పాడు. "ఇది ఎక్కువగా పాఠకులపై ఆధారపడిన విషయం. తక్కువమంది పాఠకు లుండాలా? ఎక్కువ మంది పాఠకు లుండాలా? అనేది కవికి సంబంధించిన సమస్య కాదు. మనం నివసించే సాంఘిక పరిస్థితులపై ఈవిషయం బాగా ఆధారపడిఉంటుంది. భావావేశంలో తాను చెప్పదలచిన దేదో చెప్పడమే కవి కర్తవ్యం!"

తన ఆధ్యాత్మిక మత దృక్పథాలను గూర్చి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఇలియట్ ఇల్లాగ అన్నాడు: "జీవితంలో మతదృక్పథం చాలా ముఖ్యమైనది. ఈ దృష్టితోనే మనం ఏవిషయాన్నైనా సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వీలు పడుతుంది. నాకీ దృక్పథం చాలా సహజంగా ఏర్పడింది."

ప్రపంచ సంస్కృతులపై ప్రసంగిస్తూ ఈయన ఇంకా ఇలాగ అన్నాడు: "నాకు పాశ్చాత్య సంస్కృతిని గురించి తెలిసినంత బాగా మిగిలిన సంస్కృతులను గురించి తెలియదు. ఒక్క భారతీయ సంస్కృతిని గురించి మాత్రం నేను తెలుసుకున్నాను. కొంచెం చదువుకొన్నవారికి చైనా సంస్కృతిని గురించి కూడా తెలిసేఉంటుంది. చైనీయుల సంస్కృతి కూడా చాలా మహత్తరమైనదే.

భారతదేశం ప్రపంచానికి మహోత్తమమైన సంస్కృతిని అందిచ్చింది. ఆధ్యాత్మిక విజ్ఞానం లేనిదే మానవుడు పరిపూర్ణవ్యక్తి కాజాలడనేదే ఈ సందేశంలోని పరమార్థం. ఉపనిషత్తులు, భగవద్గీత చదివి నేను ముగ్ధుడనైపోయాను."

ఈ రోజులలో భారతీయ యువకు లనేకులు పాశ్చాత్య సంస్కృతి అవగాహన చేసుకొని తద్ద్వారా మనసమస్యలను సాధించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇలియట్ మొదలైన గొప్ప మేధావు లనేకులు పాశ్చాత్య నాగరికతా సమస్యలకు భారతీయ సంస్కృతి దృక్పథం అవలంబించడం ఒకటే శరణ్య మని విశ్వసిస్తున్నారు. నేటి కాలపు రచయితలందరు ఇది బాగా గమనించవలసిన విషయం.

ఇలియట్ వేస్టులాండ్ ప్రచురించి అప్పుడే ౨౮ సంవత్సరాలు కావస్తూంది. ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం పాశ్చాత్య దేశాల్లో బయలుదేరిన నైరాశ్య వాతావరణం ప్రతిబింబిస్తూ ఇలియట్ ఈ కావ్యం రచించాడు. గత సెప్టెంబరు మాసాంతానికి ఇలియట్ కి ౬౨ సంవత్సరాలు నిండాయి. ఈ ౨౮ ఏళ్ళలోను ఇలియట్‌ను క్రమక్రమంగా ఆంగ్ల దేశంలోను ప్రపంచంలోను విఖ్యాత కవిగా పరిగణించి గౌరవించారు.

ఈనాడు మళ్లీ ప్రపంచంలో యుద్ధ మేఘాలు మిక్కుటంగా ఆవరిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఒకరు ప్రజాస్వామ్య మని, మరి ఒకరు కమ్యూనిజ మని, తమ పద్ధతులకు అనుకూలంగా ప్రచారాలు సాగిస్తున్నారు. యుద్ధం వచ్చినా రాకపోయినా ప్రపంచం అంతటా వేస్టులాండ్ వాతావరణం వ్యాపిస్తున్నది. ఆనాడు ఇలియట్ రచించిన వేస్టులాండ్ నేటికీ సార్థకంగా నే కనిపిస్తున్నది. నాటికంటె నేడే ఇలియట్ కవితా సందేశానికి ప్రాముఖ్యం ఉన్నట్లు తోస్తున్నది. ఇలియట్ వృద్ధుడైనా అతని సందేశానికీ, కవితకు వార్ధకం రాలేదు. ఇలియట్‌వంటి విఖ్యాత రచయితల కావ్యాలు తాత్కాలికంగానే గాక, భవిష్యత్కాలీనులకు కూడా నిత్యనూతనంగానే కనిపిస్తూంటాయి. ఉత్తమ కవిత ప్రధాన గుణాలలో ఇది చాలా ముఖ్యమైనది. ఆంధ్రదేశీయు లైన యువ కవు లందరికీ ఇలియట్ కవిత, విమర్శనలు, నాటికలు అవశ్యపఠనీయ మైనవి.



తేనెపట్టు

[కథానిక]

★

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

నేను ఎప్పుడూ యింతే. ఏదో మహా సరదాపడి చెయ్యడం, చివరికి ఫలితం చిన్నబుచ్చుకోవడంన్నూ. ఏనాటి మేనమామగారిల్లు! పదిహేనేళ్ళయినా అయిఉంటుంది, వెళ్ళి. మళ్ళీ సరదాగా ఆ తోటలూ దొడ్లూ తిరిగి, జామికాయలూ అవీ చెట్లెక్కి కోసుకుని తిని హాయిగా అనుభవిద్దాం అనిపించింది. ఇంకెందులోనూ లేకపోయినా, యీ విషయంలో మాత్రం భార్యామణి కూడా సహకరించింది: 'తొలిపురుడు యీ కొంపల్లో పోసుకు జుర్రుకున్నాను, చాల్ను; యీమాటైనా మా యింటికి పంపరుటండీ?' అనేసరికి, వెంటనే బండి యెక్కించేసేను, అందుకనేను! అవునా? అందాకా అన్నీ బాగానే నడిచేయి. అదుగో ఆ బారసాల చేసుకుని రావడంలో వొచ్చింది అల్లరి. అల్లరంటే అల్లరా? తలుచుకుంటే సిగ్గుతో ఒళ్ళు చచ్చిపోయి, యిహను యేనాడూ ఏ పల్లెటూరూ మరి వెళ్ళకూడదనిపించేస్తేను!!

౧

ఊః ఒకటే నవ్వు, అహ్హాహ్హా అని! మరదలూ, బావలూ అయితే మరీని; విరగబడి, ప్రక్కలు చేత్తో పట్టుకుని 'అమ్మయ్యా' అని మధ్యమధ్య ఆయాసపడి, మళ్ళీ ఒకరిని చూసి ఒకరు శక్తి తెచ్చుకుని ఒకరి మీద ఒకరు పడి కౌగలించుకుంటూ, చేతులు చాపి నా వంక చూపిస్తూ దొర్లి, దొర్లి మరీ నవ్వుతున్నారు. ముక్కు చీదుతున్న వాళ్ళూ, కళ్ళుతుడుచుకున్న వాళ్ళూ వాళ్ళూ వీళ్ళూయేమిటి? పల్లెటూరి సంత. పెయ్యని విప్పడానికి వచ్చిన పంకన్న, కరణంగారికి గెడ్డాం చెయ్యవచ్చిన మంగలిరావుడూ; చల్లముంత పట్టుకొచ్చిన శిష్టుకరణాల అనసూయా, పెండే నుంచి జీడిపళ్ళు పట్టుకొచ్చిన చెట్టిలచ్చన్నా— ఆ వూరి అయిదు వందల గడపా వాళ్ళ సుందర వాళ్ళోనే విరుచుకు పడిందంటే నమ్మండి, ఆ వేళ.

అందులో ఆదిలక్ష్మి అయితే బొత్తిగానే బరిదిగి పోయింది. చిన్నపిల్లా చితకపిల్లా? మా మావయ్య యీడు ఉంది. అతనిలాగే నలుగురు పిల్లలూను. అయినా అదేం బుద్ధి తక్కువ మనిషో! అది గంగ వెర్రు లెత్తిపోయింది. అంతేనా?—

పంతులూ, పంతులూ
పట్నంపు పంతులూ
పల్లెటూళ్ళో ఏంవిసాళ్ళు
పద్దాపోయ్ పంతులూ!—

ఆరి దీనింట పటాలం బోనూ, ఆశుకవిత్వం కూడాను. కాపరానికి రాగానే మొగుణ్ణి మొట్టికాయ మొట్టి, ముక్కు నులిపి తాళంచెవి బొడ్డున కట్టుకున్న మనిషి ఆదిలక్ష్మి. దాని వెంకితనానికి ఏమిటిలే అని సమాధానపడదాం అనుకుంటే— వాళ్ళున్నారే మా మరదళ్ళూ వాళ్ళూను! అది ఒక్కొక్క చరణం వే కల్పించి, పాడి, తన ప్రజ్ఞకి తానే పరవశం చెందిపోయి పరవళ్ళు తొక్కుతూ ఉంటే, కూడా ఎదర తాళం వేసినట్టూ, వీళ్ళు లక్క పిడతల్లాగ నోళ్ళు తెరుచుకుని, మల్లిదండల్లాంటి పళ్ళు పైకి కనబరుస్తూ, కందగడ్డల్లాగ చెక్కిళ్ళు కంద చేసుకుని, గుక్కపట్టి విడిచినప్పట్లా సముద్ర కెరటాల్లాగ పమిటలు ఎగురుతూ ఉంటే— పదుళ్ళు బద్దలగొట్టినట్టూ— అబ్బ, అది నవ్వు కాదు!

పోనీవయ్యా. ఆడవాళ్ళూ, చిన్నవాళ్ళూను; ఏవో చిలిపి చేష్టలు చేసేరే అనుకుందాం. ఇతనికేం వొచ్చిందని? మా మావయ్యకి? ఆయనా పిల్లలతో

సమం అయిపోయినాడు. గోడకి జేరబడి బల్లమంచం మీద ర్వేకం వేసుకూర్చుని, హేండిలుబారు మీసాలు సూదిగా మెలిపెడుతూ అన్నాడు—
"ఏవిట్రా చెట్టంత మనిషితో ఆ హాస్యాలూ?" కంఠంలో గాంభీర్యం, పలకడంలో పతివా ప్రభ వించేయి. గదిమాయించాడే, అందుకు సందేహం లేదు. కాని మీసాలు మాత్రం చిగురులంట పరిగెత్తునట్టయి, పెదిమల కొసలు తొణికిసలాడేయి. కళ్ళల్లో చిలిపితనం మెరిసింది. నిమిషం ఊపిరి ఆడిందో లేదో, సుందర వాక్ల్లోంచి నల్లువగా విరుచుకుపడింది అట్టహాసం. ఈ పెద్దవాళ్లకి అదే బుద్ధి! మహారాజే మాభాగంటే మరి మొర్ర లెవరితోను? అసలు కట్టుకున్న కాంతారత్నమే గాజులు గలగల లాడిస్తూ, చెయ్యి నోటికి అడ్డం పెట్టుకుంటూ, సైటుయాం గిల్గా వొంగి, అంతలో నిటావుగా నుంచుని, నడ్డిని చేతులు ఆనుకుని, మొహం ఆకాశం కేసి పెట్టి—

"అదికాదు నాన్నగారూ ...తిహీ అహ్హహ్హా... హ్హహ్హా... తమ్ముడు... ఉహ్హూ...హ్హూహ్హూ... చెబుతూనే...హ్హెహ్హెహ్హె..."

హామ్మోయ్ విరగబాటూ! తమ్ముడు చెప్పేడు, తను విన్నాడు. ఎటొచ్చీ వినక చెడినవాణ్ణి నేనే. ప్రారబ్దం. అసలు సంగతి ఏవిటని ఒక్కరూ మాటరు కదా! ఏందుకు చూస్తారూ? ఎన్ని తర్క వితర్కాలు చేసుకున్నా నాలో నేనే. పరిస్థితి తరిచి, ఆలోచించుకుని, ఆకళించుకుని, అలిసిపోయి, విసుగొచ్చి ఊరుకోవలిసింది నేనే. ఎవరికావాలి? ఆనందానికి పుట్టింట పట్టపగ్గా లుంటాయా? అందులోనూ పల్లెటూరూ, కరణం గారిల్లాను!

మొన్న పొద్దున్నే జెండా యెత్తేస్తాను మొర్రో అంటే పడనివ్వ లేదు తను. "తోటలో కాయలు దింపించి యిస్తాను ఉండండి" అని మావయ్య అంటే కాదనీ అనలేకపోయేను, మరి. ఎందుకో ఆ దుగ్ధ! చిన్నప్పట్నించీ తింటూనే వున్నాం, యిప్పటికీ యేటేటా కొంటూనే ఉన్నాం; అయినా, యేమిటో, ఏ యేటి కాయేడే ఆ సువర్ణరేఖ లంటే బుర్ర వెర్రి తలకాయ లేసుకు పోతుంది. తొలినాడు షికారుగా పెళ్ళి మాసికూడ వొచ్చిందేమో, పలకబారిన కాయలు కొవ్వు వేసినట్టూ, అప్పుడే సుగ్గిపోయి విందు లారగిస్తూన్నట్టూ కలగన్నాదిట కూడాను మాఆవిడ—

"తెల్లవారగట్టే వొచ్చిన కల, అమ్మా." దాంతో వాళ్లమ్మ ఊఃయిదయిపోయి. "మంచిదే తల్లీ. పసుపూ పళ్లూ యివన్నీ లక్ష్మీప్రదం. పండంటి పిల్లలు పుడతారు" అంది.

"ఉన్న యీ సంతానం చాలనట్టు" అన్నాను గ్లాసులో కాఫీ చుక్కాడు మింగి. అంతలో మా చిన్న బావా అందుకున్నాడు, "పండంటి పిల్లలు బావా. ఇప్పుడు ఉన్నవాడు కసురుగాయ మరి. ఎగుస్తే పొడుగుతే రాలుగాయ కొవమ్పు ననుకో—"

అసలు మా చిన్నబావకంటే గడుగ్గాయి యింకొకడు ఉంటాడంటే నేను నమ్మను.

"మేనమామల పోలిక గాబోలు నోయ్, బావా"

తమ్ముణ్ణి అనేసరికి తనకి పట్టరాని ఉక్రోషం వచ్చింది.

"చాల్లెస్తురూ. చిన్నవాళ్లని చేసి ఆడించడానికి మీ తరవాతే."

కొలనిలో హంస రెక్క లల్లాడించి నీట సాగిపోయినట్టు, కొత్తచీర కుచ్చెళ్లు రెపరెప లాడించుకుంటూ పెరట్లో నూతిదగ్గిరకి నిష్క్రమించిం దామె.

నేనూ లేచి అగ్గిబొర్దు కోసం గోడనున్న అద్దం వెనక తడిమేను. లేదు. వీధి చీడీ మీద, పడమటింటి వెనకనా కూడా వేళ్ళు అల్లల్లాడి మట్టి అయినాయి. ఇంక వెతకవలసిన చోట్లు లేవు. ఉహ్. మామయ్య మొలనే వుండి వుంటుంది. పల్లెటూరివాళ్ళకి యిదో అలవాటు. ప్రతీదీ యిట్టే మొలన దోపేస్తారు. పెరట్లో నీళ్ళపొయ్యిదగ్గిరకి పోయేను, మొదటి రెండు వేళ్ళతోనూ సిగరెట్టు బులబులాగ్గా పట్టుకుని.

తను నీళ్ళు తోడుతోంది. అత్తయ్య బియ్యం కడుగుతున్నది. పైమీది తుండుగుడ్డ పాగా చుట్టుకుని మోకాలిపైకి పంచె ఎగగట్టి, మునివేళ్ళతో చుట్టి నొక్కి పట్టుకుని, నూతికి చల్లంగా ఆ నీటి చాలమ్మటే ఒక్కొక్క నిమ్మ మొక్కకీ కొలువ చేస్తున్నాడు, మామయ్య. పడమటింటి పంచలో దండీలు తీస్తున్నాడు చిన్నబావ. ఎదరగా పాతిక గజాలలో

బుల్లావు నుంచుంది, ఆప్యాయంగా పెయ్యని నాకుతూను. దాని పక్కగా మునివేళ్ళమీద కూచుని పాలు పితుకుతున్నాడు వాళ్ళ అన్న. అంతలోకే___

"ఒరేయ్, పెద్ద బాబూ, పాలు తియ్యడం అయితే ఆ నాలుకొక్కాయలూ దింపించుకు వంపడ్రా, తీరిపోతుంది. మళ్ళీ నోట్లో మెతుకులు కొంతుక దిగకుండానే ప్రయాణం అంటాడు వాడు. కాఫీ పుచ్చుకున్నాడు గా వుంది. వాణ్ణి కూడా తీసుకెళ్ళు. గెడ్డమ్మటే వెళితే సరి, ఆచ్ఛాదనలూ తీర్చుకోవచ్చును."

మామయ్యమాటలు చెవిని పడడంతోనే గభుక్కున సిగరెట్టు విసిరేసేను. గడ్డిమేటిమీద పడింది గాబోలు, నిముషంలో మూల నుంచి పొగ జిమ్మింది. ఒక్క గెంతులో పెద్దబాబు నవ్వుకుంటూ వచ్చి బాల్చీడు నీళ్ళు దిమ్మరించేడు.

"వందేమాతరంలో అల్లుడు!"___సన్నంగా స్పష్టంగా వినిపించేయి మాటలు. వెనకనే నుంచుని మరదలు నవ్వలేక ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

"ఇదుగో, పార్వతీ, యిలాగ అల్లరి చేసే మాటుంటే నాతో తోటకి రావద్దు."

"లేదు, బావా," అంటూనే ఉపద్రంగా పొరమారింది.

"అదుగో, లేదంటూనే ఏవిటా విరగబాటు!"

ఎన్నిఅన్నా, పోటుగా ఉన్న సముద్రపు కెరటాల్లాగ పార్వతి అదే నవ్వు!

3

"బాబ్బాబు, దణ్ణం ఎడతాను."

"ఏవిరా, కాయలు ఏమయినా ఉన్నాయా, ఉడతలూ బుడిపక్షులూ కొట్టేసేయా?"

ధ్వని స్ఫుటంగా గోచరించేటట్టు తోటకాపులతో మాట్లాడుతూ, అక్కడక్కడ పడివున్న ముళ్లకంపలు చేపాటికర్రతో దూరంగా విసిరేస్తూ, కాలిబాట మ్మటే బాటాచెప్పులకన్నా తేలికగా గొడుగు పావుకోళ్ళతో సాగిపోతున్నాడు బావ. పలకబారిన మామిడికాయ ఒకటి ఉడతలాగ మునిపళ్ళతో కొరుకుతూ, మిట్ట పల్లాలు లెఖ్ఖ లేకుండా, గాలిలో తేలుతూ నడుస్తోంది పార్వతి. వాళ్ళ అడుగుల్లోనే అడుగులు వేసుకుంటూ, నాటుదారిని నడవలేక గిజగిజ లాడుతున్నాను నేను. తోట చేరుకునేసరికి అప్పుడే సగం చెట్లకాయలు దింపేసేరు. అంతలో___

"బాబుగోరు, అన్నట్టు సెప్పడం మరిచి పోయేను. ఆడ మా సిక్కని తేనెపట్టుంది బాబూ."

"ఎక్కడరా, చెప్పవేం? అక్కయ్య అన్నది కూడాను, పిల్లడికోసం ఓ చుక్క జాగర్త పెట్టమనీ."

"ఇప్పు డేటి పోయిందినే, బాబూ. గంజేలకి కొండదొర్లు రానేవత్తారు. అల్లసేత పంపిత్తాన్లె బాబూ."

"అయ్య వొచ్చేదాకా ఆవాస ఆగుతుందట్రా, మరి?"

"సిటంలో రార్ట, బాబూ, దొర్లూ. ఎంతసే పేటి పట్టియ్యడం?"

సరే నన్నట్టు తల పంకించేడు బావ. నాకు గుండెల్లో రాయి పడిపోయింది. సిటంలో వొత్తా నంటే శతాబ్దానికి కంటపడతా నని తాత్పర్యం, పల్లెటూరి కాలమాన ప్రకారంన్నూ. ఇంక ఆ పూటా ప్రయాణం జరగదు కాబోలు. నాటికి రెండు రోజులయి, ఏరోజు కారోజే ప్రయాణాలు అబద్ధం ప్రసాదాలు నిబద్ధి అయి ఊరుకుంటున్నాది.

"వాళ్ళేవొస్తారో, మరి యెవరిచేత నయినా పంపుతారో, పెందరాళే తెవుల్చు. దూశావా మా బావ అప్పుడే ఎలాగ బిక్కమొహం పెట్టేసే డోనూ." అన్నాడు బావ.

అమ్మయ్య! కొంత గుండెదడ తగ్గింది. మరి కాస్సేపటికి కాయలు గంపల్లోకి యెత్తింపించి పార్వతి యింటికి వెళ్ళింది. మేం నాలుగడుగులు అలా గెడ్డమ్మట నళ్ళేసరికి, ఆ పక్కడొంకల్లోంచి దిగబడ్డారు___చేతుల్లో నెమలి సెంద్రుకలూ, మెళ్లో గవ్వల పేర్లూ, నుదుటని యెర్రగా కాళీ నాలికల్లాగ కుంకం బొట్లూ వీళ్లూను!___కొండదొరలు పదిమంది మా కలిసి వళ్ళేం. పనస చెట్టున పట్టింది చేటంత పట్టు. కిందుగానే ఉంది కూడాను.

అంతకు ముందు ఎప్పుడూ పట్టు తియ్యగా చూళ్ళేదు, నేను. వట్టి లచ్చన్నా, మంగలి రావుడూ,

నాయుడు కురవన్నా అంతమందీ ప్రక్రియ చెప్పే వాళ్ళే, తేనెపట్టు కొట్టడానికి! ఒ గొల్ల గుంటడు పుట్టగోచీలోంచి అగ్గిబొద్దు తీసి కొబ్బరి పీచున నిప్పు రాజేస్తున్నాడు. అంతకన్నా మరి సమయం దొరక దనుకున్నాడు గాబోలు యింకో పసువుల గుంటడు—తలని చుట్టుకున్న గుడ్డలోంచి చుట్టపీక ఒకటి తీసి నవుల్తూ, "కాసింత అగ్గెట్టరయ్యా" అన్నాడు.

"ఉండొస్సి! పట్టుకి ముందు పొగెట్టాల. ఈకాడికే పంతులు ఊఁకూకలేస్తున్న, సూసినావా?" మొదటి వెధవ విసుక్కున్నాడు. పట్టుకి పొగ యెందుకు పెట్టాలో ఎంత ఆలోచించినా తెలిసింది కాదు నాకు. అంతలోకే "యిదండి, నూన" అన్నాడు ఓ నాయుడు, కొబ్బరి బురికతో నూనె కొండవాళ్ళకి అందిస్తూను. సరే, ఇహ తెలిసి పోయింది. ఆ దొరలు నూనెతో దీపం పెట్టి, పొగ ధూపం వేసి పూజలూ పునస్కారాలూ చేస్తారు. కొండవాళ్ళ ఆచారాలు మా తమాషాగా ఉంటాయి. అన్నారు గారూ, కొండజాతిఉపన్యాసకులు, ఓసారి ఉపన్యాసంలోనూ! అందుకు సందేహావా? అడుగో ఆ కొండవాడు కాశికోక ఎగగట్టి, మోచేతులకి పైగా చిక్కగా నూనె పట్టించుకుంటున్నాడు. ఏదో వుంది తంతు. పూజలూ, నైవేద్యాలూ, ఆ తరవాత కోడు నాట్యాలూ కాబోలు. సినీమాల్లో చూడ్డానికీ, ఉపన్యాసంగా వినడానికీ అయితే యీ తతంగం బాగానే వుంటుంది. కాని, పని అరు మూడు అయిపోతూ ఉంటే యెలాగా? రిస్టువాచీ చూసేను. ఎనిమిదిన్నర!

"ఓయ్ బావా, టయిము వేస్టయి పోతోందోయ్" అన్నాను.

"అన్నా, గట్టి తంటా వచ్చిందయ్యా నీతోనూ! నీ పనే చేస్తున్నారా, మరేం అనుకుంటున్నారం?"

"తేనెపట్టు తియ్యడానికి యింత బ్రహ్మాండం ఏవిటోయ్"

"ఏదీ నువ్వు తియ్యి, చూద్దాం."

"అహా. పులి సీవలకి జడిసి రెండు బాదవాకులు కొయ్య నేక పోనాడు గానీ, యిత్తరంటలకి గావాలంటేను!" కూర్మినాయుడు యీసడించేడు, నా చిన్నతనం పురస్కరించుకుని.

"నువ్వు తీసేవు లేరా, కురవన్నా" ఎగతాళిగానే అన్నాను వాడికేసి తిరిగి.

"పల్లకోవయ్యా. బండెక్కడానికి "టూలు బల్ల" కావాలి కాని, సెట్టెక్కి పట్టు గోసినావ్! సాల్లే."

కొండవాళ్ళు కళ్ళు మెరిపించి, పళ్ళు యిగిలించేరు. చుట్టూ మూగిన కాపనూక గొల్లు మంది ఒక్కసారి. నాకు పౌరుషం వచ్చింది. ఎదరనున్న గుంటడిదగ్గిర క్లాడవలి పుచ్చుకుని, దోనెకర్రకి కట్టేను.

"ఏటి సేత్తా వే టయ్యోయ్" కూర్మి నాయుడే ఆ ప్రశ్న.

"నెమ్మదిగా ఊరు చేరుకోవాలని లేదా యేవిటి బావా?"

"చూస్తూ ఉండండర్రా, అయిదు నిమషాలు. చేత్తో తీసినట్టు పట్టుకి పట్టూ, చిక్కాంలో పడిపోవలసిందే" అంటూ దోనెకర్ర ఎత్తేను.

"ఓలమ్మ, ఓలమ్మ" అంటూ మూగిన వాళ్లంతా చెల్లా చెదరయిపోయేరు. "బాబ్బాబు" అంటూ కొండవాళ్లు నా రెండు బుజాలూ పట్టుకున్నారు. అంతటితో నా పని విరమించుకుని, పాతిక గజాలు దూరంగా పోయి నిలుచున్నాను. మరో పది నిమషాలకి గాఢంగా పొగజిమ్మకుంది చెట్టుక్రింద. జుమ్మ్మంటూ యీగలు యెగిరి నాలుగు దిక్కులా పారిపోతున్నాయి.

"ఆ తువ్వాలు విప్పి కప్పు కోవోయ్ బావా" అన్నాడు బావ, బుజం మీది నాగుల గావంచా తను మొహం మీదినుంచీ కప్పేసు కుంటూను.

"ఇంత దూరం రావులే వోయ్; వొచ్చినా పైపైనే ఎగిరి పోతాయ్!"

"నిన్ను సూసి బెదిరి పోతాయ్నే, పంతులూ, పల్లిటిగొడ్లు!" కురవన్నరొయ్యి విదిల్చి చుట్ట అడ్డ పొగ పెట్టేడు.

"లేదురా, నిన్ను చూసి ముద్దెట్టుకుంటాయి" అని వాడితో పరాచకం ఆడుతూనే వున్నాను.

అంతలో అప్రయత్నంగా నాకుడిచెయ్యి నుదుటని "ఠప్" మని కొట్టుకుంది.

"అయిందేటి పెళ్లి, పంతులూ?" చప్పుడికి ఉలిక్కిపడి అడిగిన కురివి నాయుడి కింకా జవాబు చెప్పనే లేదు. నా యెడం చెయ్యి మెలిదిరిగి వీపు నిమిరింది.

"నా మాట విని, యిప్పుడైనా కప్పుకో బావా", బురఖా బీబీ లాగ నాగుల గావంచా ముసుగు లోంచే అన్నాడతను. అబ్బే. ఎన్ని చెప్పినా నేను ససేమిరా. మొండికెత్తి నిలుచున్నానే గాని, చూస్తూండగానే ఏడమకాలు చెప్పులోంచి పైకి లేచి కుడి పిక్కని పక్కమ్మటే రాసింది. ఇంకో రెండు నిమషాలకి అయిందంటే అయిందన్నారు. తాటాకులు దొప్పగా కటి, పట్టు అందులో పెడుతూ ఉంటే విస విస వచ్చేసేను.

"నుదుట నా దద్దుర్లేవిట్రా, యిలా రా"

"అబ్బే, యేవీ లేదు, మావయ్యా"

అప్పటి కింకా నాలుగు గజాల్లో వున్నారు, బావా వాళ్లూను.

"ఏవీ లేదంటూనే వీపు అలా బక్కురు కుంటా వేవిటి? మోచేతులు కూడా కంది నట్టున్నాయి, ఏదీ, యిలా చూడనీ?"

"అబ్బే, ఏదీ లేదంటూంటేనే." ఎంత ప్రయత్నించి నవ్వుతూ మాట్లాడినా, చిటపట లాడుతూన్న వీపు గోకుకో లేకుండా ఉండలేకపోయేను.

"ఏవీ లేదు, ఏవీ లేదంటూనే అలా దూర దూరంగా పోతా వేవిరా? తేనెటీగలు గానీ కుట్ట లేదు గద!"

ఆదుర్దాలో గట్టిగా అరిచేడు మామయ్య. అది కాస్తా కురవన్న చెవిని పడింది. ఇహ నేవుందీ? విప్పేడు భారతం. ఉన్న అభాగ్యులంతా తలో మాటా అన్నారు. పల్లెటూరివాళ్లకి కర్ణపిశాచి కాబోలు. నిమషంలో బెల్లంముక్కకి చీమలు పట్టి నట్టు మూగేసేరు జనం. పకపకలూ, వికవికలూను.

"ఇంత నూనయినా రాయండ్రా, పాపం" అంటూ అత్తయ్య వచ్చింది.

"ఆముదం యిడండమ్మా, రాత్తాను" మంగలి రావుడూ వైద్యుడే. వెధవ వూళ్లోను!

"యింత చింతపండుమగ్గరాసి నలిచెయ్యండ్రా, చల్తెం కాబోలు. అంత మకీ బ్రహ్మాండం చేస్తా రేవిటి" అంటూ అమ్మమ్మ దిగబడింది ముందర వాకిట్లోకి. దాంతో నవ్వులకి పడ్డారు నలుగురూను. కూర్మన్న అయితే మరీను. "గోశెట్టు పంతులూ, మగ్గు రాయాల. రాగి ముంతొట్టుకు రావమ్మ నువ్వూ, యీడ నిలుసుండి పోతావేటి బెకబెక లాడుకుంటూను" అన్నాడు, పార్వతిని గెచ్చగొడుతూను. ఎవరినైనా కొల్చుకుతినడం అంటే మహా సరదా కురివిగాడికి. అక్కణ్ణుంచీ "గోచీ" అంటే "గోచీ" అని మహోద్యానాలు మిన్నుముట్టి పోయినాయి.

"పోనీ, నా నారలాగు యిస్తాను కట్టుకో బావా." నలుసంత లేడు చిట్టి బావకీ అదేమాట. పది మందీ ఒకటే నవ్వు! శివాట్టహాసలే అయిపోయింది.

రెండు ఝాముల పొద్దు. గొంతుక పొడి ఆర్చుకుపోయింది. పొద్దుటి కాఫీనీళ్లు యిగిరి పోయి కడుపులో కార్చిర్చు, అన్నింటినీ మించిన ఉడుకుబోతుతనమూ, ఉదాసీనమున్నూ. ఇంక అక్కడ నిలబడ్డానికి మొహం చెల్లింది కాదు. గిరుక్కున తిరిగి పడమటింటిలోకి పోయేను. తాతయ్య మరిచం పక్కనే పేర్చి వున్నాయి ధాన్యపు బస్తాలు; గిరవాటేసిన గంపాను. దండెంమీద నుంచి పచ్చడం పలకరించింది, అంతలోకే. అక్కడ యిరుక్కుపోయేను. ఆ మూల జొచ్చిపోయినా, సముద్రపు హోరులాగ వీళ్ల నవ్వు విన పిస్తూనే ఉంది. నవ్వనీ, నవ్విన నాపచేనే పండుతుంది. తిళ్ల వేళ. వెతుక్కుని చావరూ? గది తలుపు చప్పుడయింది. ఢభుక్కున గంపలో దూరి పచ్చడం పైన పడేసుకున్నాను.

నాసిక్ కాంగ్రెస్

శ్రీ పురుషోత్తమదాస్ టాండన్

అధ్యక్షోపన్యాసం

[అఖిలభారత జాతీయకాంగ్రెస్ 56-వ సమావేశం, శ్రీ పురుషోత్తమదాసు టాండన్‌గారి అధ్యక్షతను నాసికత్ర్యంబకక్షేత్రంలో సెప్టెంబరు ౨౦ న జరిగినది. శ్రీ టాండన్‌గారు అధ్యక్షోపన్యాసం ప్రారంభిస్తూ గత సమావేశానంతరం దేశం కోల్పోయిన, శ్రీమతి సరోజినీ, శ్రీ కొండా వెంకటప్పయ్యపంతులు, స్వామి సహజానందసరస్వతి, యూసఫ్ మెహరల్లీ, గోపీనాథ బార్డోలాయ్ మొదలుగా భారతదేశసేవలో నిమగ్నులయిన సర్వపక్షాల వీరవరుల మృతికి సంతాపాలు తెలుపుతూ, వారల నుగ్గడించి వారి ఆత్మలకు శాంతిని కోరుతూ, సానుభూతి వచనాలు చెప్పారు. అస్సాంలో భూకంపం, వరదలు, మొదలైన ఈతిబాధల వల్ల పీడితులయిన దేశప్రజల పట్ల సానుభూతి తెల్పుతూ, వారికి సహాయం చేయడం యావద్భారత ప్రజల విధ్యుక్తధర్మమని ఆదేశించారు. కాంగ్రెస్ అధ్యక్షుని ఉపన్యాసంలో కొన్ని భాగాలను ఇక్కడ పొందుపరుస్తున్నాము. సం.]

ప్రస్తుతం దేశాన్ని అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. భారతదేశ వర్తమాన భవితవ్య స్వరూపాలను దిద్దితీర్చే రాజ్యాంగం మూడు సంవత్సరాల సుదీర్ఘ కృషి అనంతరం జనవరి ౨౬ వ తేది నాడు అమలులోకి వచ్చింది. ఈ రాజ్యాంగాన్ని తయారుచేయడానికి పరిషత్ సభ్యులు కష్టపడి పని చేశారు. వారికి దేశం కృతజ్ఞమై వుంటుంది. ఈ రాజ్యాంగం మన చరిత్రలో చిరస్మరణీయం అవుతుంది. దీనిద్వారా మనసెత్తినుంచి విదేశీపెత్తనాన్ని చట్టబద్ధంగా, తొలగించి మనం చట్టబద్ధంగా దేశపరిపాలనకు సంఘటితులమై దేశంలో అధికారాన్ని స్వీకరించాం.

రాజ్యాంగరచన విశేషాలు

ఈ రాజ్యాంగాన్ని రచించడంలో బ్రిటిష్ ప్రభుత్వం తయారుచేసిన ఒక చట్టం ఆధారంగా తీసుకోవడం జరిగిందని విమర్శిస్తున్నవాళ్ళు కొందరు వున్నారు. కాని అట్లా చేయడంలో దోషం ఏమీ లేదు. పరిపాలనా పద్ధతులకు, ప్రజల జీవితానికి సన్నిహిత సంబంధంవుంది. ఏ పద్ధతినీ ఒక్క దెబ్బతో మార్చడం యెప్పుడూ పడదు. అందుకు కొంతకాలం పడుతుంది. జీవితం విషయంలో ఇది ఎట్లా సత్యమో, పాలనా పద్ధతుల విషయంలోగూడా అంతే. అందువల్ల మనం ప్రస్తుత విధానాలతోనే ముందుకుపోతూ కాలక్రమంగా వాటిల్లో అవసరమైన మార్పులు చేసుకుంటూ పోవాలి. ఈ విధంగా ప్రజాస్వామ్య ధర్మాన్ని దేశంలో నిర్మించుకుంటూ రావాలి. అనుభవంతో కొత్త భావాలు తట్టుతూ వుంటాయి. ఆ భావాలకు అనుగుణంగా సమయం వచ్చినప్పుడు రాజ్యాంగంలో మార్పులు తీసుకురావడం యోగ్యమైన పద్ధతి.

ఈ రాజ్యాంగంతో మనం దేశంలో ఒక లౌకిక

రాజ్యాన్ని స్థాపించాం. మన పొరుగు రాజ్యం పాకిస్థాన్ ఇస్లాంమతంమీద రాజ్యాన్ని నిర్మిస్తున్నది కాబట్టి, మనం ఈ విషయాన్ని ఇంత స్పష్టంగా ప్రకటించవలసి వచ్చింది. పూర్వం మన దేశంలోవున్న భూభాగమే, ఇప్పుడు చీలి, పాకిస్థాన్ నామవాచ్యం అవుతున్నది. అది పూర్తిగా మతం ప్రాతిపదికగా ఏర్పడింది. దాని ప్రభుత్వం ఇస్లాం మతంమీద ఆధారపడి నడుస్తున్నది.

మన రాజ్యాంగంగాని, మన ప్రభుత్వంగాని, ఏ ఒక్క మతాన్నిగాని అంటిపెట్టుకువున్నవిగావు, నడిచేవిగాని కావు. ఒక మత గ్రంథం ఆధారంగా ఇవి ప్రవర్తించేవికావు. దేశంలో ప్రజలందరికీ మన రాజ్యాంగం సమాన ప్రతిపత్తిని, సమానహక్కులను సమకూరుస్తున్నది. ఇందులో మత ప్రసక్తిగాని, కుల ప్రసక్తిగాని, వర్గ ప్రసక్తిగాని లేదు.

ఈ రాజ్యాంగాన్ని ఇట్లా సంతరించడంలో మన దేశంయొక్క దూరదృష్టి, ఉదాత్త విజ్ఞానం నిరూపితమైనాయని నా అభిప్రాయం. దేశవిభజన అనంతరం మన దేశంలో హిందువులసంఖ్య ఇతర అన్నిమతాల ప్రజల సంఖ్యకన్నా చాలా ఎక్కువ అయిపోయింది. అందువల్ల కొంతమంది హిందువులు పాకిస్థాన్‌లో జరుగుతున్న సంగతులనుచూచి ఇండియాలో గూడా హిందూ రాజ్యాన్ని స్థాపించడం అవసరమని భావించినా భావించడం కద్దు. ఎన్నికల సమయంలో ఇట్టి నినాదాలు వినిపిస్తాయి. ఈ అవసరంలో నేను నాభావాలకు అనుగుణంగా కొన్ని మాటలు చెప్పదలచుకొన్నాను.

మధ్యయుగపురోజుల్లో భారతదేశంలో హిందూ రాజ్యాలలో అధికారం అంతా ఒకవ్యక్తిచేతుల్లో కేంద్రీకృతమై వుండేది. పరిపాలనావ్యవహారాన్ని ఆ వ్యక్తిగాని, ఆవ్యక్తిఎంచుకొన్న మంత్రులుగాని చూస్తూవుండేవారు. సామాన్యంగా ఈ పరిపాలన సంప్రదాయసిద్ధమైన మార్గాలలో జరుగుతూవుండేది. కాని అవసరం అంటూ సంప్రాప్తమైతే, ఆ సంప్రదాయాన్ని అతిక్రమించి పోవడం అంటూగూడా జరుగుతూవుండేది. శాస్త్రగ్రంథాల ప్రాభవం ఎక్కువగా వున్నమాట నిజమే. అయినా, ఏఒక్క పుస్తకం మీదో ఆధారపడి ఈ దేశంలో పరిపాలన అంటూ ఎప్పుడూ జరగలేదు. స్మృతులు, వాటిమీద వ్యాఖ్యానాలు ఆయాకాలాలకు అనుగుణంగా రచింపబడుతూ వచ్చాయి. అవి అంటే అందరికీ అపారమైన గౌరవం వుండేది. అయినా, ఈ గౌరవం పేరుతో ప్రజాభిమతాన్ని లేదని పోయినదాఖలు మనచరిత్రలో ఎక్కడా కనిపించవు. గణతంత్రరాజ్యాల్లో అయితే, ప్రజాభిమతం బాగా చెల్లుబడి అవుతూ వుండేది.

సంప్రదాయం అన్నది శక్తివంతంగానే వుంటుంది. కాని దానికి అతిక్రమించిన సమయాలు లేవని, అంతకంటె మార్గాంతరాన్ని చూడగల్గడం అసాధ్యమని అనుకోవడం పొరపాటు. చాలామంది పురాతన భారతీయులను, మధ్యయుగపు భారతీయులను, వారి మతాలను మితవాద ఫక్కీలలో నడిచినట్లు వర్ణిస్తూ వుంటారు. ఇది అంతా పూర్తిగా నిజంకాదు. ఇందులో కొంతనిజం, కొంత అబద్ధం. వుంది. ప్రపంచంలో సుస్థిరంగానూ, ఆనుపూర్వికంగాను వస్తున్న ఏపరిపాలనా యంత్రాంగంలోనైనా మీకు ఒక సంప్రదాయ విధానం, ఒక మితవాద పద్ధతి గోచరిస్తాయి. ఈదేశంలో అవి కొంచెం బలంగా వున్నాయి. అయినా భారతదేశం ఎప్పుడూ హేతువాదాన్నే అనుసరిస్తూ వచ్చింది. మేధస్సును గౌరవిస్తూ వచ్చింది. పురాతన గ్రంథాలపట్లవున్న గౌరవంవచ్చి తన మేధాజృంభణానికి అడ్డుతగలకుండా చూచుకుంటూనేవుంది. ఈ గ్రంథాల ప్రాచుర్యం. తీవ్రమనే అంగీకరిద్దాం. కాని ఆ తీవ్రత హేతువాదాన్ని కొట్టగలిగినంతటిదిగా ఎప్పుడూ ప్రవర్తిల్లింది లేదు. ఈ ప్రపంచ వ్యవహారంలో భగవంతుని తరువాత బుద్ధికే ప్రాముఖ్యం ఇవ్వబడింది. అన్ని శాస్త్రాలూ ఆ బుద్ధియొక్క పరిధిని మించి గాని, శిక్షణను మించిగాని పోయినజాడ కన్పించదు. ఈ విధంగా హేతువాదాన్ని ప్రాతిపదికగా మనం గ్రహించడంవల్లనే మతాన్ని ప్రాతిపదికగా అధఃకరించడం జరిగిపోతున్నది.

ఇంకొక సుగుణం

మన రాజ్యాంగంలో యింకోసుగుణం కూడా వుంది. దేశంలో అంతర్భాగాలుగా వున్న వివిధ రాష్ట్రాల పరిపాలనలోను వున్న మంచిలక్షణాలను అట్లాగేవుంచి, కేంద్రప్రభుత్వంద్వారా, ఈ రాష్ట్రా

లన్నింటిని ఒక దాని కొకటి దగ్గర దగ్గరగా వుంచే ట్లు చూడాలన్నదే ఈ సుగుణం. ఈ విధంగానే మనదేశం శక్తివంతమైన దౌతుంది. ప్రపంచరాజ్యాల గౌరవాన్ని పొందుతుంది.

పైగా హిందీభాషకు అధికారిక ప్రతిపత్తి కల్పించడంతో, యీ ఐక్యతావిధికి మరింతబలం చేకూర్చబడింది. మన రాజ్యాంగంలో ఈ భాగం ఇంద్రజాలంలాగ పనిచేసి, దేశంలో భాషైక్యానికి, వివిధ ప్రాంతాల మధ్య సాన్నిహిత్యానికి దారితీస్తుందని నాకు గట్టి నమ్మకం వుంది. పూర్వం సంస్కృతం ఎట్టి సాంస్కృతిక పరిణామాలకు దారితీసిందో, హిందీ ఇకముందు అట్టిపరిణామాలకే దారితీయబోతుంది. ఒకవిధంగా



"నాకు రాజ్యాంగము పవిత్రమైనది"

ఇది దాన్నిమించి పోతుందని గూడా అనాలి. సంస్కృతం ఎప్పుడూ శిష్టులను దాటిపోలేక పోయింది. హిందీ అట్లాకాదు. అనంతప్రజానీకంలోకి ఈ భాషచొచ్చుకపోయి. దేశభాషలపట్ల సోదరీ భావాన్ని పెరపుతూ, అన్నివర్గాల ప్రజలమధ్య సాన్నిహిత్యాన్ని, ఐక్యభావాన్ని సమకూరుస్తూ, అందువల్ల భావంలోను, భాషలోను కొత్త మార్పులను తెస్తూ, ఈ అందరిమధ్య ఒక విధమైన సౌందర్య భావం నెలకొనేటట్లుచేస్తుంది. ఇట్టి యీ భాషను అధికారిక భాషగా అన్నిరాష్ట్రాలూ స్వీకరించినట్లయితే, ఆయా ప్రాంతీయభాషలకు ఒక కొత్త గౌరవం, ఒక కొత్తసౌఖ్యం, ఒక కొత్తబలం చేకూర కలదనటంలో అనుమానమేలేదు.


నాకు రాజ్యాంగాలంటే అసలు ప్రేమవుంది. వాటిని ఎంతో పవిత్రమైన వాటినిగా నేను భావిస్తూ వుంటాను. రాజ్యాంగంతో చెరలాడటం ఉచితం కాదని నేను భావిస్తూవుంటాను. రాజ్యాంగాన్ని తిరస్కార భావముతో చూడటం ఆత్మహత్యను మించిన దోషం అని నా నమ్మకం. అసలు తిరస్కారభావం మూలంగా క్రమశిక్షణ లుప్తమైపోతుంది. క్రమశిక్షణలేని నాడు దేశం శక్తిహీనమైపోతుంది. ఇక అందువల్లకల్గే నష్టాలనుగూర్చి చెప్పన అక్కరలేదు. దేశం సర్వనాశనమై, తిరిగి దాస్యశృంఖలాలలో పడిపోతుంది.

అందువల్ల అందరు రాజ్యాంగాన్ని గౌరవ స్థానంలో వుంచి, మన అందరి ఇష్టాలకు, ఆశయాలకు అది ఒక చిహ్నం అని భావిస్తూ వుండాలి. ఇట్లా అని పరిణామమార్గంలో నాకు నమ్మకంలేదని భావించవచ్చు. మార్పు అనేది సహజమైంది. సంస్కృతంలో ఒక సామెతవుంది. సమయభేదంతో ధర్మంలో మార్పువస్తుంది అని ఆ సామెత చెబుతున్నది. అందులో నాకు గట్టి విశ్వాసం వుంది. కాని ఈ మార్పులు తీసుకురావడంలో మనం క్రమశిక్షణను అనుసరించి పోవాలిగాని, అరాచకాన్ని కాదు. ఇప్పుడు ఉన్నపళంగానే మన రాజ్యాంగం ఎన్నో కొత్తమార్గాలను, ఎన్నో కొత్త లక్ష్యాలను మనకు చూపుతున్నది. ఎప్పుడో ముందుకాలంలో ఇందులో మార్పు అవసరమని తట్టినప్పుడు, ఆ మార్పును మనం చట్టబద్ధమైన మార్గంలో తీసుకురావాలిగాని, అందుకు ఇంకో మార్గాన్ని అనుసరించడంకూడదు.

రెండు పెద్దకూటాల ప్రపంచం

ప్రపంచం ప్రస్తుతం 2 పెద్ద కూటాలక్రింద విభజింపబడిపోయింది. కాని ఇండియా 2 కూటాలలో దేనితోను చేతులు కలపడం మంచిదికాదని, 2 కూటాలతోను స్నేహం నెరపడం అవసరమని కాంగ్రెసు భావించింది. తన దృష్టికివచ్చిన ప్రతి విషయాన్ని ఇండియా దాని నుంచి చెడ్డలు ఆలోచించి తేల్చాలని కాంగ్రెసు నిశ్చయించింది. భారత ప్రభుత్వం యీ విధానాన్ని అనుసరిస్తున్నది. ఇందుకు రెండు ఉదాహరణలు చూపుతాను. ఒకటి కమ్యూనిస్టుచైనా సమస్య. ఈ విషయంలో ఇండియా రష్యాతో యేకీభవించింది. అమెరికాతో వ్యతిరేకించింది. రెండోది కొరియా సమస్య. ఇచ్చట ఉత్తరకొరియా, దక్షిణ కొరియా మీద దురాక్రమణకు దిగినది. ఈ విషయం చర్చకు వచ్చినప్పుడు ఇండియా ఆంగ్లో-అమెరికన్ వాదాన్ని సమర్థించింది. రష్యాను కాదన్నది.

ఇట్టివిధానం అనుసరించడంలో కొన్ని లాభాలు వున్నాయి. కొన్ని నష్టాలువున్నాయి. ఈ విధానాన్ని అనుసరించడంవల్ల ఇండియా ప్రపంచరాజ్యాల ముందు ఏ విషయం న్యాయమైనదో, ఏది కాదో తేల్చి చెప్పగల్గుతున్నది. ఇతరరాజ్యాలను మన మార్గాన్ని అనుసరించేటట్లు చేయగల్గుతున్నాం. ప్రపంచ ప్రభుత్వ నిర్మాణాశయానికి దోహదంకల్పించగల్గుతున్నాం. అందువల్ల ఈ ఆశయాన్ని అవలంబించిన దేశాలకు మనము గౌరవస్థానంలో వుండగల్గుతున్నాం. కాని శక్తివంతమైన రెండు అగ్ర రాజ్య కూటాలమధ్య ఇట్టివిధానాన్ని అనుసరించడంలో ఒక నష్టంగూడా వుంది. ఇందులో యెవరు గూడా మనల్ని తమకు కూర్చిన స్నేహితులని గ్రహించలేక పోతున్నారు. ఈ భావం మనకు సంబంధించిన అనేకసమస్యలపట్ల బహుళ పరిణామాలకు దారి తీస్తున్నది. ప్రపంచంలో అన్ని రాజ్యాలు నిస్వార్థంతో ప్రవర్తించలేవు. అందువల్ల అవి పాకిస్తాన్ తమఅండను జేరుతుందేమోనని, దాన్ని ఆదరిస్తున్నారు. పాకిస్తాన్ కాశ్మీర్ మీద దురాక్రమణ జరిపింది. కాశ్మీర్ మనదేశంలో భాగం. దీనిమీద పాకిస్తాన్ దురాక్రమణ జరిపిందని నిరూపించడానికి కావలసినంత సాక్ష్యం వుంది. అయినా ఐక్యరాజ్యసమితి పాకిస్తాన్‌ను దురాక్రమణ దారునిగా పేర్కొనలేక పోయింది.



నాసిక్ కాంగ్రెస్ నెహ్రూ ప్రభుత్వంలో విశ్వాసం తెల్పింది.

ప్రపంచ ప్రభుత్వ స్థాపనను గురించి ప్రపంచంలో చాలా రాజ్యాలు ఉవ్విళూరుతున్నాయన్న మాటేగాని, అట్టి ప్రభుత్వ స్థాపనకు కావలసిన నైతిక సంపత్తి ఇంకా ప్రపంచంలో కొరవగా నేవుంది. ఒకసమస్య వచ్చిందంటే, దాన్ని అహానక్తభావంతో పరిశీలించగలశక్తి ప్రపంచరాజ్యాలకు ఇంకా ఏర్పడినట్లు కనుపించదు. ఇట్టి దృష్టి లేకపోవడంవల్లనే కొరియా సమస్య విషయంలోనూ, కాశ్మీర్ సమస్య విషయంలోనూ, తేల్చవలసింది ఒకటే అంశమై నప్పటికి, సమితి రెండింటికి రెండు విధానాలను అనుసరించింది.

ఇట్టి కూటాలకు మనం దూరంగా వుండాలనుకుంటున్నాం. అసలు ఆ విధానం నైజంగా మనకు నచ్చుతుంది. కాని ఈ ప్రపంచంలో రజస్తమోగుణాలకు చెల్లుబడి ఎక్కువగా వుంది. రజోగుణంతమోగుణాన్ని జయిస్తుంది. అప్పుడు రజోగుణాన్ని సత్వగుణంగా మార్చవచ్చు. రజోగుణం సంఘటిత శక్తికి మరోరూపం. అందువల్ల భవిష్యత్తులో ఎప్పుడో ఒకప్పుడు, సర్వపరిస్థితులను సమాలోచించి, దేశరక్ష

ణార్థం ఏదో ఒక వర్గంతో సన్నిహిత సంబంధాలను ఏర్పాటు చేసుకోడాన్ని గూర్చి ఆలోచించవలసివస్తే అది అసహజం ఎంత మాత్రం కాదు.

కామన్వెల్తు — ఇండియా

ఇండియా బ్రిటిష్ కామన్వెల్తులో వుండాలా? లేదా బయటపడాలా? అన్న సమస్య నిరుడు ఉదయించింది. మన ప్రధాని ఈ విషయాన్ని గూర్చి చర్చించడానికి ఇంగ్లండు పోయారు. పోయి ప్రతి కామన్వెల్తు రాజ్యానికి బ్రిటిషురాజు అధిపతిగవుండ నవసరం లేదని, అట్టి ఆధిపత్యంతో ప్రమేయం లేకుండానే ఆ రాజ్యం కామన్వెల్తులో సభ్యరాజ్యంగా వుండవచ్చునని వాదించి, అక్కడ అందరిని ఒప్పించారు. మనది ఇప్పుడు ఒక గణ రాజ్యం. మనరాజ్యం అందులో సభ్యదేశంగా వుండటానికి వీలుగా నిరుడు ఆ కామన్వెల్తుకు కొత్తరూపాన్ని కల్పించారు. సోషలిష్టులు, హిందుమహాసభా సభ్యులు, ఇందుకు మనప్రధానిని అప్పుడు తీవ్రంగా విమర్శించారు. నేను ఆయన్ను అభినందించాను. ఆ నిర్ణయం నాకు బాగుంది. ఇప్పటికీ నా ఆ భావం మారలేదు. అఖిలభారత కాంగ్రెసు సంఘం ఆ నిర్ణయాన్ని డెహ్రాడూన్ సమావేశంలో అంగీకరించింది. దేశంలో కాంగ్రెసువాదులు చాలామందికేగాక, విదేశవ్యవహారాలనుగూర్చి ఆకళింపు బాగావున్న వాళ్ళకు అందరకు ఈనిర్ణయం నచ్చిందనే నా అభిప్రాయం.

ఆసియా రాజ్యాలలో మన దేశం ఒక ప్రత్యేక స్థానాన్ని పొందివుంది. పాశ్చాత్య దేశాల దోపిడీ విధానంనుంచి ఈ అఖండ ఆసియా భూఖండానికి నివృత్తిని కలిగించడంలో మనం గూడా కృషి చేయవలసివుంది. దీనితోపాటు ఆసియా శాంతిని సంరక్షించవలసిన బాధ్యతగూడా మనమీదవుంది. బర్మా, ఇండోనీషియాలు కష్టవాసరాల్లో పడివున్నప్పుడు మనం వాటికి సహాయం చేశాం. అందుకు ప్రతిగా, సహజంగా, అవి మనపట్ల స్నేహభావంకల్గి వర్తిల్లుతూ వున్నాయి.

చైనాతో మనకు పురాతన కాలంనుంచీ సాంస్కృతికమైన సంబంధాలు వున్నాయి. ఆ సంబంధాలనుగూర్చి మధురస్మృతులు మన మనస్సుల పచ్చనే వున్నాయి. అచ్చట సుదీర్ఘకాలం పోరాటాలు జరిగాయి. ఆఖరికి ప్రజాప్రభుత్వం ఏర్పడింది. స్వరూపం ఎట్లా వుంటుంది అన్నది భవిష్యత్తు గర్భంలో దాగివుంది. కాని చైనాప్రజలపట్ల మన ప్రేమ చల్లారకుండా అట్లాగేవుంది. వారికి ఈ రాజకీయ పరీక్షలలో విజయం చేకూరాలనే మనం ఆకాంక్షిస్తున్నాం. చైనా కొత్త ప్రభుత్వంతో మనం స్నేహం నెరపుతూనే వున్నాం. సమితిలో వారికి సభ్యత్వం కల్పించే నిమిత్తం భారతప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నది.

అంతర్జాతీయ సమస్యలలోకల్లా ప్రమాదభరితమైన పరిస్థితి కొరియాలో ప్రస్తుతం ప్రవర్తిల్లుతున్నది. ప్రస్తుతానికి ఆ ప్రమాదం అంతమేరకు నియమితం అయినట్లే కనిపిస్తున్నది. సమితి ఇందులో ప్రమేయం పెట్టుకొని, ఉత్తరకొరియాను దురాక్రమణదారుగా ప్రకటించింది. ఈ దురాక్రమణను అరికట్టడానికి అమెరికా తన సైన్యాలను సమితి నిర్ణయాలకు అండగా పంపింది. ఉత్తరకొరియా దురాక్రమణను మనదేశంగూడా ఖండించింది. కాని సమితికి అండగా సైన్యాలను మాత్రం పంపలేదు. ఈ విషయంలో మనదేశం అనుసరించిన విధానం చాలా సవ్యమైనది. నేను దాన్ని బలపరుస్తున్నాను.

శరణార్థుల సమస్య

దేశసమస్యల వంకచూస్తే, ఇందులో ప్రభుత్వం పరిష్కరించ వలసినవి ఎన్నోవున్నాయి. ఇందులో శరణార్థుల సమస్య ఒకటి. 1947 లో దేశం రెండుగా విభజింపబడిన దగ్గరనుంచి పంజాబునుంచిగాని, సింధునుంచిగాని, సరిహద్దు రాష్ట్రంనుంచిగాని వచ్చిన శరణార్థులకు పునరావాస సౌకర్యాలను సమకూర్చడాన్నిగూర్చిన సమస్య ఇంకా పరిష్కారం కానేలేదు. కేంద్ర ప్రభుత్వమేమి, రాష్ట్ర ప్రభుత్వాలేమి, తగిన సహాయాన్ని చేశాయి. కాలం గడిచినకొద్దీ శరణార్థులలో బాధా తీవ్రతగూడా తగ్గుతూ వచ్చాయి. అందువల్ల ఈ సమస్య కొంతవరకు సర్దుబాటైనట్లు కన్పిస్తున్నది. అయినా వారిబాధలను నివృత్తిచేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇంకా ఎంతో చేయవలసివుంది.

ఇది ఇట్లా వుండగా తూర్పు బెంగాలునుంచి శరణార్థుల ప్రవాహం ఎక్కువై పోయింది. జయపూర్

కాంగ్రెసు నాటికే ఈ ప్రవాహచ్ఛాయలు కనిపించాయి. అప్పుడే కాంగ్రెసు అధ్యక్షుడు తమ ఉపన్యాసంలో ఈ విషయమై గూడా ప్రస్తావించి వున్నారు. ఒక్క ఢాకానుంచి తూర్పు పాకిస్తాన్ ప్రభుత్వం 15 వేల మందిని ఏటిసంగా బయటకు గెంటేందీ ఆయన ఆ వుపన్యాసంలో వివరించి వున్నారు. అప్పటినుంచి ఆ ప్రవాహం జీవనది లాగా అట్లాగే కొనసాగుతూ వచ్చింది. ఆ వచ్చే వారు వచ్చేటప్పుడు తమ వెంట తమ ఆస్తులను తెచ్చుకొనే వీలుకూడా లేకపోయింది. ఈవచ్చిన కాందిశీకుల సంఖ్య అధికారులు చెప్తున్నట్లు 34 లక్షలా, లేక అనధికారులు లెక్కకట్టినట్లు 50 లక్షలా అన్న విషయాన్ని గూర్చి ఇప్పుడు చర్చించవలసి మకోలేదు. ఎంతమందివస్తే మాత్రం ఏమి గాని, మొత్తంమీద తూర్పు బెంగాలులో పాకిస్తాన్ ప్రభుత్వం హిందువులకు వుంటున్న భయాన్ని పారద్రోలగల విధంగా ప్రవర్తించలేక పోయింది. అది అనుసరిస్తున్న విధానం వారు నిశ్చయంగా తూర్పు బెంగాలులో వుండిపోగలట్లు చేసేదిగా లేదనిమాత్రం అందువల్ల స్పష్టపడిపోతున్నది.


ఈ సంవత్సరం ఫిబ్రవరినుండి తూర్పు బెంగాలు నుంచి ఈ కాందిశీకుల ప్రవాహం మరీ ఎక్కువై పోయింది. ఏప్రెల్‌లో జరిగిన ఢిల్లీఒప్పందంతో, అచ్చటినుంచి వచ్చేద్దామనుకున్న వాళ్ళకు పాకిస్తాన్ కొన్ని విసులుబాట్లు కల్గించడం జరుగుతున్నది. అంతేగాక, ఈ ప్రవాహంగూడా కొంతవరకు సన్నగిల్లింది. ఇంతవరకు ఈ ఒప్పందం బాగానే పనిచేసింది. కాని పాకిస్తాన్ హిందువులు భయభ్రాంతులు కాకుండా వుంటున్నారని, ముందు వారి కచ్చట ఏవో భద్రత వుంటుందని మనం చెప్పలేకుండా వున్నాం.

పాకీస్తాన్‌నుంచి కాందిశీకులై వచ్చిన వారు అచ్చట వదిలివచ్చిన ఆస్తిమొత్తం ఎంత వుంటుంది? అని కొంతమంది లెక్కలు ప్రారంభించారు. కొంత కాలం క్రిందట ప్రభుత్వంగూడా ఇట్టి లెక్కలను ప్రకటించింది. ఎంత హీనంగా లెక్కకట్టినా, వారు వదిలివచ్చిన ఆస్తి ౩౫ వందల కోట్లదాకా వుంటుందని ఖచ్చితంగా చెప్పవచ్చు. వారు పొందిన ఈ నష్టాన్ని కొంతవరకు తాను భరించగలనని కేంద్ర ప్రభుత్వం మాట ఇచ్చి వుంది. దేశవిభజన అవసరం ఎందుకు కల్గిందీ? అన్న విషయాన్ని అట్లా వుంచినా, వీరికి కష్టాలు, ఈ నష్టాలు, కల్గడానికి మనం అనుసరించిన జాతీయవిధానమే కారణమని చెప్పక తప్పదు. అందువల్ల తిరిగి వారిని ఆ కష్టాలనుంచి, నష్టాలనుంచి గట్టెక్కించవలసిన బాధ్యతగూడా మనమీదవుంది. సంవత్సరానికి ఒక ౨౫ కోట్ల చొప్పునో, ౩౦ కోట్ల చొప్పునో, ఖర్చు పెట్టడంతో ఇది తీరే సమస్యగాదు. వారు పోగొట్టుకున్న ధనానికి తగిన ముదరా ఇవ్వడం అంటూ అంతికన్నా సాధ్యం కాదు. అయినా ఈ సమస్యను పరిష్కరించడానికి కొన్ని వందల కోట్ల రూపాయలు కావలసివుంటాయి. ఒక క్రమవిధానాన్ననుసరించి ఆ మొత్తాన్ని సేకరించాలి. కొంత కాలం క్రిందట నేను ఇందుకు గాను ఒక పన్నును విధించాలని సూచించివున్నాను. అది సులభమైనపని అని నేను భావిస్తున్నాను. కాని ప్రభుత్వానికి అది నచ్చని పక్షంలో ఈ శరణార్థుల రక్షణార్థం వారు ఏదో చర్య సత్వరం తీసుకోవలసివుంటుంది.

పాకిస్థాన్—ఇండియా

దేశవిభజన జరిగిన దగ్గరనుంచి పాకీస్తాన్‌కు మనకు మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే వుంటున్నాయి. ప్రతివిషయం ఒక పెద్ద సమస్య అయి కూర్చుంటున్నది. అల్పసంఖ్యాకుల విషయం అట్లా వుందికదా అనుకొంటే, కాశ్మీర్ విషయం మరొకటి వచ్చింది. ఏ విధంగా చూచినా కాశ్మీర్ ఇండియాలో అంతర్భాగమే అని తేలుతుంది. పాకిస్తాన్ సైన్యాలువచ్చి దానిమీద పడి, దానిలో కొంత భాగాన్ని ఆక్రమించుకొన్నాయి. ఆఖరికి అచ్చట జనవాక్యం జరపడానికి వీలుగా తగిన పరిస్థితులు కల్పించేందుకైనా, ఆ సైన్యాలను ఉపసంహరించమంటే, ససేమిరా అని మొండి పట్టుపట్టుకు కూర్చుంది. భారతప్రభుత్వం పాకీస్తాన్‌ను దురాక్రమణదారని ప్రకటించవలసిందని సమితిని పదే పదే కోరివుంది. భారత ప్రజానీకం అంతా తమ ప్రభుత్వం ఈ కోర్కెను మన్నిస్తున్నారు. కొరియా విషయంలో సమితి ఏమిచేసిందో కాశ్మీర్ విషయంలో గూడా అట్లాగే చేయవలసిందని ఒక్క ప్రసిద్ధ అమెరికన్ పత్రికా విలేకరి వ్రాసివున్నారు. అట్లా చేయడం ఎంతో సమంజసంగా వుండేది. సమితికి ఎంతో బలం

కాంగ్రెస్ సభాదృశ్యాలు.



౧౫-వ తేదీనాటి విషయనిర్ణయసభ. వేదికపై ఆసీనులైయున్న పండిట్ నెహ్రూ, శ్రీ గాంధీజీ, సర్దార్ పటేల్, శ్రీ రాజగోపాలాచారి మొదలైనవారు.



౨౨. విషయనిర్ణయసభ [illegible] శ్రద్ధగా పరిశీలిస్తున్న శ్రీ టి. ప్రకాశం, సి. రాజగోపాలాచారి, మౌలానా అబుల్ కలాం అజాద్, పట్టాభి సీతారామయ్య, సర్దార్ పటేల్ గార్లు.

చేకూరేది. దాని న్యాయబుద్ధి లోకానికి బాగా వెల్లడి అయ్యేది.

భారతదేశం సమితిని బాగా బలపరిచే దేశాలలో ఒకటి. ప్రపంచశాంతిని స్థాపించాలన్నా, ఒక దేశానికి ఒక దేశానికి మధ్య యుద్ధాలు రాకుండా, విరోధాలు ప్రబలకుండా చూడాలన్నా, ప్రతిరాజ్యాన్ని కొంత అదుపులోనుంచి దానికి నైతికంగా అభ్యుద్ధానం కల్గేటట్లు చూడాలన్నా, ప్రపంచ ప్రభుత్వం అంటూ ఒకటి వుండాలని భారతదేశం భావిస్తున్నది. ఇట్టి ఆశయం ఐక్యరాజ్యసమితి ద్వారా నెరవేరగలదని భారతదేశం తలపోస్తున్నది. ఇట్టి భావాభినివేశంలో భారతదేశం తన నిస్వార్థతను ప్రకటిస్తూ సమస్త ప్రపంచం శ్రేయస్సును ఆకాంక్షిస్తున్నది. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అన్నది మన సభ్యతకు, సంస్కృతికి గీటురాయి,

సర్వేభవంతు సుఖిన
స్సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు
మాకశ్చిత్ దుఃఖభాగ్భవేత్.

పురాతనమైన ఈ భారతీయ సాంస్కృతిక మహోద్దేశాన్ని సమితి తనకు మేలుబంతిగా వుంచుకోవడం ఉచితం

కాని సమితి తాను నిష్పాక్షికంగా ప్రవర్తిస్తున్నట్లు తన సభ్య దేశాల్లో ఒక నమ్మకాన్ని కల్గించలేకపోయింది. వారిలో వారికి వుండుకున్న తగాదాలతో సమితిలో తరచు తగవులు ఏర్పడుతున్నాయి. భారతదేశం తన మంచితనాన్ని, సమితియందు తనకు వుండుకున్న గౌరవాన్ని ప్రకటిస్తూ, తనకు తానై ఈ కాశ్మీర్ సమస్యను, ఈ సమితి ముందు వుంచింది. ఇట్లా చేయడంవల్ల జరిగిందేమిటయ్యా అంటే, ఆయా దేశాలస్వార్థం పైకివచ్చి, అంతా ఇండియానే దుయ్యబట్టడం ప్రారంభించారు. వారి స్వార్థ విధానానాలకు ఇండియా గురి అయిపోయింది. కాశ్మీర్ లోంచి పాకిస్తాన్ సైన్యాన్ని బయటకు నెట్టాలంటే ఇండియాకు అదో పెద్దపని కాదు. అయినా ఆసైన్యం సంస్థానంలో కొన్ని భాగాలను ఆక్రమించుకొని కూర్చుంది. భారతదేశం సమితి గౌరవ ప్రతిష్ఠలకోసం ప్రాకులాడింది. సమితి భారతదేశం నెత్తిన పెద్దసమస్య రుద్దింది. అంతేగాని నిష్పాక్షికంగా మాత్రం అది వ్యవహరించ లేకపోయింది.

సర్ డిక్సన్ వచ్చాడు. వెళ్ళాడు. కాశ్మీరు సమస్య మటుక్కు. వున్నచోటనేవుంది. కాశ్మీరు నుంచి పాకిస్తాన్ సైన్యాలు వైతొలగాలని, సంస్థానంలో అబ్దుల్లా ప్రభుత్వాధికారం చలాయించే కావాలని భారతప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భారతప్రభుత్వానికి కాంగ్రెస్సే కాదు, అఖిలభారత ప్రజానీకంగూడా అండగా నిలుస్తారని, నేను హామీ ఇస్తున్నాను.

సంస్కృతి

దేశవిభజన తరువాత హిందూ - ముస్లిం సమస్యలో మార్పువచ్చింది. ప్రత్యేక నియోజకవర్గాల వల్ల కల్గిన ఫలితాలను గ్రహించిన వాళ్ళం అవడం చేత మన రాజ్యాంగంలో ఆ పద్ధతికి మనం స్వస్తి చెప్పాలి. పాకిస్తాన్ మాంత్ర ఇస్లాం రాజ్యంగా తయారైంది. అయినా భారతదేశంలో ఇంకా ౩౦ కోట్లమంది ముస్లింలు వున్నారు. మనదృష్టిలో హిందువులు, ముస్లింలు. సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, క్రిష్టియనులు అంతాఒక్కటే. అందరికి మనదేశంలో సమాన హక్కులున్నాయి. వీరంతా కలిసి ఒకేజాతిగాఏర్పడటం కోసం మనం కృషి చేస్తున్నాం. ఒకేసంస్కృతిని పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నాం. ఇందులో అన్ని మతాలుకలిసి పనిచేసి, దాన్ని పెంపొందించాలి.

సంస్కృతికి, మతానికి ముడిపెట్టి, దాన్ని గందరగోళంగా, పర్యవసించేటట్లుచేసే పొరపాటును మనం చేయరాదని కోరుతున్నాను. అనేక మతాల వారు ఇచ్చట వుండవచ్చు. అయినా, ఆ అందరి సంస్కృతి ఒక్కటే అయివుండే సావకాశంవుంది. సంస్కృతి దేశకాలమాన పరిస్థితులకు సంబధించింది. ఒక ప్రాంతం వున్నదంటే, అచ్చట నివశించే ప్రజల జీవితాలు, ఆచారాలు, భాష అన్నీ ఒకే విధంగా వుంటాయి. కాని ఎవరిమతం వారిది కావచ్చును. దాన్నిబట్టి పూజలు, పునస్కారాలు చేసుకుంటూవుండవచ్చును. చైనాఇందుకు ఒక ఉదాహరణ. కాంగ్రెసు వాదులమైన మన అందరిమీదాగూడా అట్టి సంస్కృతిని పెంపొందించవలసిన, అవసరం, ఇతరుల పట్ల ప్రేమసహనాలను ప్రదర్శించవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఆర్థిక సమస్యలు

ఇక ఆర్థిక సమస్యల వంకచూస్తే, అవిఎన్నో వున్నాయి. ఇందులో రైతులసమస్య ఒకటి. కార్మికుల సమస్య మరొకటి. పొలాలలో సేద్యంచేసే వాళ్ళ స్థితిగతులు, మిల్లులలో, ఫ్యాక్టరీలలో పని చేసేవాళ్ళ స్థితిగతులు ఒక విధంగా ఉండేవు. అయినా స్వాతంత్ర్యం అంటూ రావటంతో ఈ అందరిలోను ఒక నవచైతన్యం, తమ జీవితం బాగుపడాలన్న ఒక ఆశజనించటం సహజం. ఇట్టి సమస్యలను మన ప్రభుత్వాలు శక్తి సామర్థ్యాలతో జరిగిన 3 ఏండ్లుగా ఆకళింపుచేసుకొని పరిష్కరిస్తూ వచ్చాయి. అందుకు వారిని మనం అభినందించాలి. ఈ సమస్యలన్నీ ఇంకా తీరలేదు. వాటిని ఇంకా పరిష్కరించాలి. అందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్లఈ కృషివల్ల అనుకున్న ఫలితం కల్గలేదు. అయితే ముందు మార్గం మాత్రం సౌష్ఠవంగా పడిపోయింది.

ముఖ్యంగా రైతులకు సంబంధించిన సమస్యలనుగూర్చి కొంత విచారణ జరిగింది. ౧౯౪౮ లో యు. పి. ప్రభుత్వం జమీందారీ రద్దు విషయాన్ని గూర్చి మంచిరిపోర్టును తయారు చేయించింది. శ్రీ కుమారప్ప కమిటీ వ్యావసాయిక సమస్యలను గూర్చి మరో రిపోర్టును తయారుచేసింది. దానిని ఎ. ఐ. సి. సి. వారు ప్రకటించారు. రైతుల స్థితిగతులు బాగుపడాలంటే జమీందారీ విధానం రద్దయిపోవాలని నేను ౧౯౩౦ నుంచీ చెబుతూనే వున్నాను. జమీందార్లకు తగినపరిహారం చెల్లించాలని గూడా చెబుతూనే వచ్చాను. ఇప్పుడు అంతా ఈనా చెప్పిన విషయాలను అంగీకరించారు. ఒక యు. పి. లోనే గాక ఇంకా ఇతర రాష్ట్రాల శాసనసభల్లో గూడా ఇట్టి జమీందారీరద్దు బిల్లులను ప్రవేశపెట్టారు. కొన్ని రాష్ట్రాలలో అవి అమలులోకి గూడా వచ్చాయి. ఈ విధంగా అన్నిరాష్ట్రాలలో గూడా రైతులకు ఈ జమీందార్ల బాధ లేకుండా చూడాలి. అప్పుడుగాని రైతు, ఈ భూమి నాది. అన్న భావంతో సేద్యానికి దిగడు. ఈ విషయంలో యు. పి. ప్రభుత్వం చేసిన పనినిగూర్చి ప్రత్యేకంగా చెప్పవలసివుంది. జమీందారీ రద్దుబిల్లు అచ్చట ఈమధ్యనే ప్యాసయింది. ఈ బిల్లుప్రకారం రైతుగనుక పొలాన్ని ఇస్తున్న కవులుకు 10 రెట్లు మొత్తాన్ని గనుక ఇప్పుడు చెల్లించివేస్తే ఈ భూమి పూర్తిగా అతనిదై పోతుంది.

కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి భారతప్రభుత్వ కార్మికశాఖవారు తీవ్రంగా కృషి చేస్తున్నారు. వారికి కనీస వేతనము నిర్ణయించే విషయం గూడా ప్రభుత్వం ఆలోచనలో వుంది. ఇంతవరకు కొన్ని చట్టాలు చేశారు. వీటిమూలంగా కార్మికుల స్థితి కొంతవరకు బాగుపడింది. యజమానుల దానధర్మాలమీద ఆధారపడి వుండవలసిన అవసరం వారికి తీరిపోయింది. కార్మికులవలెనే, వ్యవసాయకూలీలపట్లగూడా కేంద్రప్రభుత్వం శ్రద్ధవహిస్తున్నది. కార్మికుల సమస్యకన్న, కూలీలసమస్య కొంచెం క్లిష్టమైనది. దేశంలో ఈ కూలీలు, వారి పోషణలో వున్నవారు మొత్తం తొమ్మిది పదికోట్లదాకా వున్నట్లు ప్రభుత్వంవారి లెక్కలవల్ల తెలుస్తున్నది. ప్రస్తుతం వీరితాలూకు సమస్యలను పరిష్కరించడానికి మనం ప్రయత్నం చేయాలి. ముందు ఇవి చాలా కష్టంగావున్నట్లు కనిపిస్తాయిగాని, తర్వాత, తరువాత మంచి మార్గంలో పడతాయి.

కంట్రోళ్ళు

ఇట్టి ఆర్థిక సమస్యలతో సంబంధించివున్న మరోసమస్యగూడా వుంది. అది కంట్రోళ్ళ సమస్య. గత యుద్ధకాలంలో బ్రిటిష్ప్రభుత్వం వీటిని ప్రవేశపెట్టింది. ఒక వస్తువుకు మంచి గిరాకీఏర్పడి, దాని ఉత్పత్తి ఆ గిరాకీకి తగినట్లు లేకపోయినపక్షంలో అది సరియైన సరకు అందరికి అందుబాటులో వుండేటందుకుగాను ఈ కంట్రోళ్ళను అమలుజరుపుతారు. ఐరోపాదేశాలలో ఇట్టి పద్ధతులు చాలాకాలంగా వున్నాయి. వారికి ఇవి దైనందిన జీవితంలో ఇతర విషయాల లాగా అలవాటై పోయినాయి. అందువల్ల కలిగే లాభాలు అవీ వారికి బాగా తెలుసు. కాని మనదేశానికి ఈ కంట్రోళ్లు యుద్ధ సమయంలో కొత్తగావచ్చాయి. ఇప్పుడు మనం గూడా వాటికి అలవాటుపడి పోతున్నాం. కానీ పాశ్చాత్యదేశాల ప్రజలకు వున్నంత క్రమశిక్షణ మనలోలేదు. అందువల్లే ఈ కంట్రోళ్ళంటే ఒక విధమైన అతృప్తి గూడా దేశంలో వుంది.

... ప్రభుత్వం ఈ కంట్రోళ్ళను పాశ్చాత్య దేశాలనుంచి ఇచ్చుటకు దిగుమతి చేసింది. అయితే, ఈ కంట్రోళ్ళను నడిపించే ఉద్యోగులు అంతటి మాన మర్యాదలుకలవాళ్లు కాకపోవడంవల్ల, ఇవి జయప్రదంగా పనిచేయడంలేదు. దానితో గందరగోళంబయలుదేరుతున్నది. చదువుకున్న వాళ్లుగూడా ఈ కంట్రోళ్లు పోతే బాగుండునురా అనుకుంటున్నారు. మన వర్తకులు వున్నారే, వారికి గూడా ఔచిత్యం ఎరిగి వ్యాపారం చేసేలక్షణాలు లేవు. ఏవిధంగా సంపాయిస్తేనేమి డబ్బును గడించడం వారి ప్రధాన లక్షణంగా కనుపిస్తుంది. ప్రభుత్వోద్యోగులు అట్లా, వర్తకులు ఇట్లా, మొత్తంమీద కంట్రోళ్ళంటే అవినీతికి పర్యాయంగా చేసివేసారు. అందువల్లకంట్రోళ్లు ఎందుకో, అందువల్ల ఎట్టి లాభాలు కల్గుతాయో తెలిసిన వాళ్లు గూడా, ఈ అవినీతిని అరికట్టడానికి కంట్రోళ్లు తొలగించవలసిందని కోరేదాకా వచ్చారు. ఇందుకోసమే మహాత్మాగాంధికూడా కంట్రోళ్ళకు అనుకూలంగా వుండలేకపోయారు. కాని పరిపాలకులకు అసలు కష్టాలు తెలుస్తాయి. కంట్రోళ్ళను తొలగించడంవల్ల వర్తకులు వస్తువుల ఖరీదులను అమితంగా పెంచివేశారు. అందువల్ల తిరిగి కంట్రోళ్ళను పెట్టవలసి వచ్చింది. సంఘాన్ని ఒకవిధంగా నియమబద్ధం చేయడం అవసరమే. అయినా ఆచేయడంలో ప్రజలను ఇబ్బంది పెట్టినట్లు కనిపించకుండా చేయాలి. సమాజంలో నైతిక పతనం ఏర్పడటానికి కారణమైన విషయాలను పరిహరించాలి. ఎట్టివస్తువులమీద కంట్రోళ్లు విధించాలో, ఎట్టి వస్తువులమీద అక్కరలేదో, విచారించటంగూడా అవసరం. కొన్నివస్తువులు వుంటేనే కాని పనిజరుగదు. కొన్నివస్తువులు అక్కర లేకుండానే జీవితం హాయిగా జరిగిపోతుంది. అట్టి వస్తువులమీద కంట్రోళ్లు విధించడం సాధ్యమైనంతవరకు పరిహరించడం మంచిది. అదికాక, కంట్రోళ్లు తప్పనిసరిఅయితేగాని ప్రభుత్వం వాటిని విధించరాదు. అంతమేరకు ఆర్థికశక్తులను విసులుబాటుగా పనిచేయనీయడం మంచిదని తోస్తున్నది. ఇది ఈసమస్యకు ఉచితమైన పరిష్కార మార్గం అనుకుంటాను.

ఈసంవత్సరం ఏప్రిల్ 25, 26 వ తేదీలలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్థిక నిర్మాణక్రమ సంఘాన్ని సమావేశపరిచాడు. దీనికి వివిధ రాష్ట్ర కాంగ్రెస్‌సంఘాల అధ్యక్షులు హాజరైనారు. ఈ సమావేశంలో కంట్రోళ్ళనుగూర్చిన చర్చలు జరిగాయి. రాష్ట్రప్రభుత్వాలు వీటిని తగినట్లు అములుజరుప లేకపోయినాయి. అందువల్ల వాటిని గూర్చిన పరిస్థితిని సాకల్యంగా తెలియపరచవలసిందని, అప్పుడు అనవసరమైన కంట్రోళ్లను తొలగించడాన్ని గూర్చి ఆలోచించవచ్చునని ఈ సమావేశం నిర్ణయంచేసింది. కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పాటిస్తుందనుకుంటాను.

ముఖ్య సమస్య

అసలు ఇప్పుడు వచ్చినసమస్య ఏమిటంటే, మనం మనదేశంలో యెట్టిసామాజిక, ఆర్థిక ధర్మాన్ని నెలకొల్పాలి? వర్గరహిత సమాజం కాంగ్రెసుకు ఎప్పుడూ ఆశయంగా వుంటూవచ్చింది. ఇట్టిసమాజాన్ని శాంతియుతంగా స్థాపించడానికి కాంగ్రెసు పూనుకొంది. మన రాజ్యాంగంగూడా ఇట్టిసూత్రాలను ఆధారంగా చేసుకొనే రచింపబడింది. ఈ విధంగా మనం పనిచేయడానికి ఒకసిద్ధాంతం అమరివుంది. దీనితోపాటు మరి కొన్ని ముఖ్యాంశాలను గూడా మనం పాటించవలసివుంది.

ఉత్పత్తి విషయం చూద్దాం. మనకుభారీపరిశ్రమలు, వాటి కేంద్రీకరణ, అందుకు తగినట్లు మన విధానాన్ని దిద్దుకోవడం—ఇవిఅవసరమా? లేకపోతే మన దేశంలోవున్న లక్షలాది గ్రామాలు ప్రాతిపదికగా తీసుకొని, పరిశ్రమలను అభివృద్ధి చేసుకుంటూ, ఏ గ్రామంలోప్రజలు, ఆ గ్రామంలో వస్తూత్పత్తికి దిగడానికి తగినవిధానాలు అవసరమా? ఇదిచాలా ముఖ్యమైన సమస్య.

సంపదుత్పాదనకుగాను అనుసరించే పద్ధతిని బట్టి ప్రజాజీవితం ప్రవర్తిల్లుతూ వుంటుంది. వారితిండి, వారితీరుగుడు, ఆఖరికి వారి సంస్కృతి అంతాకూడా ఈ పద్ధతిఎట్టిదైనా దానిమీద ఆధార పడివుంటాయి. ఈ విషయంలో నేను మహాత్మాగాంధీ సిద్ధాంతాలను నమ్మివున్నాను. పెద్దపెద్ద పరిశ్రమలను, ముఖ్యంగా దేశరక్షణకు అవసరమైన పరిశ్రమలను భారీఎత్తుగా నడపడమనడానికి నా కెట్టి అభ్యంతరమున్నూ లేదు. మామూలుగా మనఅందరికి అవసరమైన వస్తువుల

ఉత్పత్తికి, తగిన పరిశ్రమలను గ్రామాలలో నెల కొల్పడం మంచిది.

ఈ విధానం దేశంఅంగీకరించిందనీ, కాంగ్రెస్ వాదులు అంగీకరించిందనీ నేనుభావించాను. కాని ప్రభుత్వ విధానాలలో ఈ సూత్రాలుపట్టినజాడలు ఎచ్చోటా కనిపించ లేదు. ఈ విధానాన్ని మనం అంగీకరించినట్లయితే, మన అవసరవస్తువులను గ్రామాలలో ఉత్పత్తిచేయడానికి తగినసన్నాహాలుచేస్తూ, ప్రజలలో ఉత్సాహోద్దీప్తిని కల్గించాలి. నీవుస్వయంగా ఆపనిచేసిచూపి, అట్టిఉత్సాహాన్ని రేకెత్తించాలి. గాంధీజీకల్పించిన వాతావరణంలో ఇప్పుడు మంత్రులైనవారు చాలామంది మసిలేవున్నారు. ఈ పద్ధతి ఉచితంఅని వారు భావించగలరని నేను అనుకుంటున్నాను.

ఖాదీ పరిశ్రమ

మహాత్మగాంధి ఖాదీప్రాముఖ్యాన్ని, స్వదేశీ వస్తువుల ప్రాముఖ్యాన్ని నొక్కివక్కాణించారు; మనప్రభుత్వాలు కొన్ని ఖాదీపరిశ్రమకు, గ్రామీణ పరిశ్రమలకు దోహదం యిచ్చాయి. కాని ఖాదీఉద్యమంలో పనిచేస్తున్న కాంగ్రెసు కార్యకర్తలు చెబుతున్న మాటలనుబట్టి చూస్తే, ఆ ఉద్యమం దిగజారిపోతున్నదని తెలుస్తున్నది. ఉత్పత్తిని ప్రోత్సహించి, అమ్మకానికి తగిన విసులుబాట్లు కల్పించక పోవడం ఉచితమైనమార్గం అనిపించుకోదు.

మనగ్రామాలలో తయారైన వస్తువులకు దేశంలో తగిన చలామణీవుండేటట్లు చూడవలసినపని ప్రభుత్వం మీద వుంది. అదిచౌక, ఇదిగిరాకీ, అన్న మాటలుఇచ్చుటపట్టరాదు. ఖాది ఉదాహరణగా తీసుకుందాం. గాంధీజీ దాని ఉత్పత్తినిగూర్చి, వినియోగాన్ని గూర్చినిర్విరామకృషిచేశారు. అందువల్ల కలిగే బాగుఓగులనుదేశం కళ్లకుకట్టేటట్లు చూపారు చాలామంది ఆయన చెప్పినదాన్ని బాగాఆలోచించి, బాగుందని అగీకరించారు. కాంగ్రెస్‌వాదులంతా అంగీకరించారు. ఇప్పుడు అధికారం మనచేతుల్లోకి వచ్చింది. ఇప్పుడు ఆయనచెప్పిన ఈ ముఖ్యసూత్రాన్నిఅమలు జరపడానికి సంకోచిస్తున్నాం మన విశ్వాసంలో మనకేనమ్మకం లేకుండాపోయింది

*   *   *   *

కాంగ్రెసు ప్రభుత్వాలన్నవి, ఖాదీ వినియోగాన్ని, కుటీర పారిశ్రామిక వస్తువుల ఉపయోగాన్ని, ప్రోత్సహించే విధానాన్ని అనుసరించటం మంచిదని కాంగ్రెసు, ఆ ప్రభుత్వాలను హెచ్చరించడం ఉచితంగా నాకు తోస్తున్నది. ప్రభుత్వాలు, ప్రభుత్వోద్యోగులు, ఈ కార్యక్రమాన్ని వహిస్తే, ప్రస్తుతం ఎంతోక్లిష్టంగా కనబడుతున్న ఆర్థిక సమస్యలు చాలావరకు సుగమంగా తీరిపోతాయి.

మన దేశం అభ్యుదితం కావాలంటే గ్రామ స్వయం పోషకత్వం, ఆరోగ్యం, మొదలైన విషయాలలో సహకార స్నేహాభావం పెంపొందడం అవసరం. మన పట్టణాలు, నగరాలు ముందుకాలంలో ఎట్లావుండాలన్న విషయంలో గూడా నాభావాలు వేరుగా వున్నాయి. అవి ఇప్పటి మోస్తరుగామాత్రం వుండటం మనకు నచ్చదు.

స్వయం పోషకత్వం

మన విద్యావిధానం ఒక విద్యార్జన కాకుండా శీలాన్ని పెంచుకోడానికి, వస్తూత్పత్తి ద్వారా స్వయంపోషకం కావడానికి గూడా అనుకూలంగా వుండాలని నా అభిలాష. ఇట్లా ఇన్ని చేయడంవల్ల సామాజిక జీవితం సమగ్రమై, అభ్యుదయం పొందుతుంది. ఇదే మన ఆశయం. అందుకు మనం ఒక కృషి చేయాలి.

ప్లానింగు అన్నది తీసుకుంటే, దాని ముఖ్య ప్రయోజనం వస్తూత్పత్తి అయివుండాలి. దేశంలో పనిచేయనివాడంటూ వుండరాదు. ప్రతివ్యక్తి తన కాలాన్ని సద్వినియోగంచేస్తూ, అందులోనే ఏమన్నా మిగిలితే, ఆ కాస్తసమయంలోను ఏదో ఒక వస్తువును ఉపయోగకరమైన దానిని తయారు చేస్తూ వుండాలి. ఇట్టి కార్యక్రమంపట్ల దేశంలో ఉత్సాహాన్ని రేకెత్తించడం కాంగ్రెస్ కార్యక్రమంలో ఒక భాగంగా మనం పాటించాలి. ఈ ఉత్పత్తి క్రమంలో అంగబలం, యంత్రబలం రెండూ వినియోగపడాలి.

పొదుపు అవసరం

ప్రస్తుతం ఆర్థిక విషయాలను గూర్చి అనేక పథకాలు ఆలోచనలో వున్నాయి. కొన్నికొన్ని

సమయాలలో ధనం దుబారా చేయబడిన చోట్లు కూడా వున్నాయి. అనుభవం అంతగా మనవాళ్ళకు లేనికారణంచేత దీన్ని కొంతవరకు మనం సహించ వచ్చును. కాని ప్రభుత్వాలు ఇకముందునుంచి డబ్బును పొదుపుగా ఖర్చుపెడుతూ, ఆ ఖర్చువల్ల వచ్చేలాభాన్ని సమగ్రంగా పొందడానికి ప్రయత్నించాలి. ప్రస్తుతం కేంద్రప్రభుత్వమేమి, రాష్ట్ర ప్రభుత్వాలేమి తమఖర్చులను చాలాభాగం తగ్గించుకోవచ్చునని నా అభిప్రాయం. మనకు ఉన్న సంపత్తి పరిమితమైంది. ఆ సంపత్తిని మనం సరిగ్గా వాడాలి.

* * *

ఎంతో కాలం కష్టించి మనం స్వాతంత్ర్యాన్ని సంపాదించాం. దాన్ని . సంరక్షించుకోవడానికి కాంగ్రెసు ప్రజలను కృతనిశ్చయబుద్ధితో, పట్టుదలతో ముందుకు తీసికొని పోవలసివుంది. మనం స్వయంకృషిచేత మన చుట్టూవున్న అనంత ప్రజానీకంలో క్రమశిక్షణ ప్రవృత్తిని పెంపొందించ గలిగినట్లయితే దేశం నిజంగా పైకివస్తుంది. మనజీవితం నిరాడంబరంగా వుండాలి. మన ఆలోచనలు ఉదాత్తంగా వుండాలి. మనవాంఛలు నియమితమై ఉండాలి. ఏతద్వాంఛా పూర్తిలో మనం ఇతరులకుగూడా జీవనోపాధి ఏర్పడేటట్లు చూడాలి. గాని, వారిని మోసం చేయడంతో మన వాంఛలు పూర్తిఅవుతున్నట్లు భావించడం తగదు. ఇట్టి ఆలోచనలు మనకు బలాన్ని ఇస్తాయి, సౌఖ్యాన్ని చేకూరుస్తాయి.

కాంగ్రెస్ వాదులమైన మనకు కాంగ్రెస్ ఇంతకాలం సేవాభూమిగా వుంది. ఇప్పుడిప్పుడు ఎన్నికల ద్వారా అది అధికార వాంఛాభూమి అవుతున్న జాడలు కనుపిస్తున్నాయి. కాని సేవాభావం హెచ్చుగా వున్నంతకాలమే అధికారం అన్నది నిలుస్తుంది. అయినా కాంగ్రెస్ నియమావళి అతి ఉదారంగా వున్న కారణంగా అనేక మంది అధికార వాంఛాపరులు, ఇందులో కాలుపెట్టారు. అధికార సముపార్జనకు ఆశయంగా వారిందులో జేరారు. ఒక రాజకీయ పక్షం వున్నదంటే, ఇట్టిస్థితి దానికి సహజంగా వుంటుంది. కాని ఇందులోనే దేశసంరక్షణా సక్తులు, దేశసేవా రక్తులు, అధికార వాంఛా వినిర్ముక్తులు అయిన వాళ్లు కొద్దో గొప్పో, ఏమాత్రం మిగిలినాసరే, కాంగ్రెస్ ప్రశస్తి, కాంగ్రెస్ ప్రయోజనం అభ్యుదితం అవుతాయి.


కాంగ్రెసు నియమావళిలో లోపాలు

కాంగ్రెస్‌నియమావళిలో అల్పమైన దోషాలు కొన్నివున్నాయి. వాటిని మనం పరిహరించాలి. ఒక జిల్లాలో కొన్ని వేలమందిని కాంగ్రెస్ సభ్యులుగా చేర్చడం, ఒకటి రెండు జిల్లాల్లోనే కొన్ని లక్షల మంది ప్రాథమిక సభ్యులు, సమర్థసభ్యులు కావడం, మన కార్యకర్తల మానమర్యాదలు ఎంత నేలమట్టం అయినాయో తెలియ జేస్తున్నది. ఈ ప్రాథమిక సభ్యులకు ఈ సమర్థసభ్యులకు మన నియమావళి నిర్ణయించిన అర్హతలను బట్టి ఏఒక్క జిల్లాలోను ఇంతమంది సభ్యులు లభ్యంఅయ్యేందుకు వీలులేదు. అవి అట్లాసంతరించ బడినాయి. అందువల్ల ఈ విషయంలో దేశంలో ఎచ్చటఏమి జరిగినా అదివాస్తవానికి విరుద్ధంగా, సత్యానికి దూరంగా జరిగిందేనని చెప్పక తప్పడంలేదు. అటువంటి పనులవల్ల కాంగ్రెస్ పలుకుబడి నశిస్తుంది. కాంగ్రెస్‌లో సభ్యులసంఖ్య తక్కువై పోతుందన్న భయంమనకు అనవసరం. మనంనిర్ణయించిన అర్హతలకు తగినవారు ఏకొద్దిమంది వున్నా చాలు. కాంగ్రెస్ బలం పెరుగుతుంది. అదిశక్తిసంపన్నం అవుతుంది. ఆశయం సిద్ధిస్తుంది.

గాంధీ జయంతి

●

అక్టోబరు - 2



సత్యమ్మహింసయు శాంతమ్ము నా యాత్మ సంయమనమ్ము కా సాధు వర్త
నమె, లోక హిత కర్మ నాచరింపగ, దుష్ట నిగ్రహమును బూని నెరపు పట్ల,
ఆలంబనముగ, సత్యాగ్రహ విశిష్ట సమర విధాన మొకండు గరపి లోక
మునకు; ఖండాంతరమున, భారతావని, ఉజ్జ్వల విజయమ్ము లొంది దాన
ప్రబల నిరంకుశ ప్రభుత తానై పరివర్తన మ్మందుక వైదొలగి చ
నంగ, మైత్రిని నిల్ప, నాస్పద మమరించి; దేశ స్వాతంత్ర్యమ్ము తీర్చి దిద్ది,
ఉపవాస నిష్ఠ, కాలుష్యంబు దేశమం దెప్పుడు పొడమె, నప్పుడె కాల్చి,
జాతి విద్వేష పిశాచ భీభత్సమ్ము, కాల్నడ నొంటి నౌఖాలి నాగి

జనువు, మృతియును, కారణ జన్మునట్లు,
సిద్ధ సంకల్పములు, సు ప్రసిద్ధములుగ
ఏడుపదు లెన్మిదేడు, లియ్యిలను గడపి,
గాంధి, భారతపితయు, జగత్పితయు, మ
హాత్మ, దవతారమూర్తియు, నాగ దనరె.

వింధ్యాచలం

శ్రీ అడవి బాపిరాజు

రెండవ భాగము

౧

ఏప్రిల్ వచ్చింది. నేను వ్యాసం, విశ్వవిద్యాలయంవారికి సమర్పించాను. జ్యోతిర్మయి ఆనందమయిల పరీక్షలయ్యాయి. నేను బాగా సహాయం చేశానట. అందుచే వాళ్ళిద్దరూ మొదటితరగతిలో కృతార్థు లవుతారట. ఆ సహాయానికి వారు తాము నాకు తీరని బాకీకి లోబడిఉన్నారట.

ఆ నాలుగునెలలు ఎంత హాయిగా గడిచిపోయాయో! ఆ కుటుంబంలో ఒక్కణ్ణయిపోయాను. ఆనందమయి నేనంటే నానాటికి విపరీతమైన భక్తిలోకి దిగింది. మొట్టమొదటిరోజుల్లో చనువు తగ్గించుకుంది. పాఠం అవసరం ఉన్నప్పుడే ఆమె చదువుకునే మేడమీద హాలులో మే మిద్దరం కలిసేవారం. సాయంకాలాలు మేము నలుగురమూ టెన్నిసు ఆడుకునేవారం. ఎప్పుడైనా మేము నలుగురమూ వారి తోటకు వెళ్ళేవారము.

మార్చినెలలో త్రిపాఠీకి బారైలీ జిల్లా బదిలీ అయింది. ఆతడు తన వంటమహారాజుతో, పరివారంతో,బదిలీప్రదేశానికి పోయాడు. పరీక్షలు కాగానే నేనూ, జ్యోతిర్మయీ ఆనందమయిలూ కలిసి ఆయన ఉద్యోగనగరానికి వెళ్ళవలసిఉన్నదట.

మాది గోదావరీతీరం. పశ్చిమ గోదావరిజిల్లా. పెద్దకుటుంబం. మేము అయిదుగురం అన్నదమ్ములం. నేను మూడోవాడిని. నాకన్న పెద్దవాళ్ళిద్దరూ చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఒకడు రేడియోలో అసిస్టెంటు ఇంజనీరుగా ఉన్నాడు. తిరుచునాపల్లిలో పని. రెండవ అతడు బి. ఏ. ఆనర్సు ఆంగ్లభాషవిషయంగా మొదటి తరగతిలో కృతార్థుడై రాజమండ్రీ ప్రభుత్వకళాశాలలో సహాయ ఆచార్యపదవిని పొంది కాలక్షేపం చేస్తున్నాడు. నాకన్న చిన్నవాళ్ళిద్దరూ ఒకడు ఇంటరూ, ఒకడు వ్యవసాయకళాశాలలోనూ చదువుతున్నారు.

మాకు ఒక్కత్తే సహోదరి. ఆమె మా అందరికన్న పెద్దది. ఆమె నలుగురుబిడ్డల తల్లి అయినది. నాకు చాలా సంబంధాలు వచ్చాయి. కాని ఉద్యోగం లేకుండా, ఏవో నాలుగు రాళ్ళు సంపాదించుకుంటూ ఉండకుండా వివాహం చేసుకోనని పట్టుపట్టాను. నాకు ఇరవై నాలుగోఏడు జరుగుతూ ఉన్నది. నేను పరిశోధించిన విషయం చాలా ముఖ్యమైన విషయం. అలహాబాదు విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు, ఈ రోజుల్లో, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు, ఆ రోజుల్లో, నేను పాశ్చాత్య దేశాలలోని సైన్సు మాసపత్రికలకు వ్యాసాలు వ్రాస్తూ ఉన్నాను. అవి చాలా మెచ్చుకుంటూ ఉద్దండులైన పాశ్చాత్య పండితు లెందరో నాకు ఉత్తరాలు వ్రాసినారు, వ్రాస్తూ ఉన్నారు.

మేమంతా కుమాయోన్ జిల్లా, వెళ్ళి, త్రిపాఠీతో ఆ హిమాలయకీకారణ్య ప్రదేశమైన జిల్లా అంతా తిరిగినాము. పెద్దపుల్లు బరిమీద తిరుగుతూ ఉంటే

కనుక్కొన్నాము. ఆ హిమాచలప్రజల ఆచారవ్యవహారాదులు గమనించాము. వారి దైనందిన జీవితంలోని కష్టనిష్ఠురాలు, దుఃఖానందాలు గమనిస్తూ ఈ ప్రజలకు భారతమందు ఇతర ప్రజలకు ఎన్ని పోలికలున్నాయో అని అనుకున్నాను. మామిడిజాతులు ఎన్ని వేలున్నా అవి రుచులలో, అసలు తత్వంలో ఒకటేకదా.

నేను తిరిగి వెళ్ళేసమయంవచ్చింది. నేనూ ఆనందమయీ, వాళ్ళదాదీ-ముగ్గురం కలిసి తిరిగి అలహాబాదువచ్చి, అక్కడనుంచి నేను దక్షిణానికి రావడం నిశ్చయం చేసుకున్నాము. త్రిపాఠీ,జ్యోతిర్మయీ ఎంతో ప్రేమ పూర్ణమైన వీడికోలిచ్చారు నాకు.

జ్యోతిర్మయి : చతుర్వేదిగారూ ఆంధ్రరాష్ట్రం కోసం మీరేమి ప్రయత్నాలు చేయదలచుకొన్నారు. ఆంధ్రరాష్ట్రంసంగతి తేల్చవలసిందని కాంగ్రెసుకార్యవర్గానికీ కాంగ్రెసు పెద్దపెద్దలకూ మీ ప్రకాశంగారూ రంగాగారూ గట్టిగా వినతిచేశారా? ఏం చేయగలరు వారు?

నేను : గవర్నరు జనరల్ చే వారు ఆర్డరు వేయించవచ్చును. పైసంవత్సరం జనవరినుంచి కొత్త రాజ్యాంగపు బిల్లు శాసనంఅవుతుందట. అప్పటినుంచీ అమలులోనికి వస్తుందట. అది రాకమునుపే ఆంధ్ర రాష్ట్రం రావాలి.

ఆనందమయి : వస్తుందని మీకు ధైర్యంగా ఉందా?

నేను : రాజగోపాలాచారిగారు రానియ్యరండి,

త్రిపాఠి : అదేమిటండీ, ఆయనకు ఆంధ్రుల మీద కోపమా?

నేను : కోపమని కాదు. ఆయన గాఢమైన రాజకీయ పరిజ్ఞానం కలవారు. తమిళులందరికి మదరాసు విషయంలో చాలా పట్టుదల ఉంది. కాని మదరాసు తమిళరాష్ట్రానికి వెళ్లినా, ఆంధ్రరాష్ట్రానికే పూర్తిగా వెళ్ళినా, ఎవరికో ఒకరికి నష్టం. అందరికన్న ఎక్కువనష్టం తమిళబ్రాహ్మణులకు. మరీ నష్టం వర్తకానికీనూ!

ఆనం: మీరెలా అయితే బాగుంటుం దంటారు.

నేను : చరిత్ర అలా ఉంచండి. ఆ విషయమే తేల్చాలంటే వీరి వాదనా నిజమే, వారి వాదనా నిజమే కాని ఈనాటి పరిస్థితులు గమనిస్తే మదరాసు రెండురాష్ట్రాలకి సమంగా పంచితే రాజ్యాంగనీతి మొదటి రకంగానిర్వహింపబడుతుం దని నాకు గట్టి నమ్మకం.

త్రిపాఠి : ఇదెక్కడ తీర్పయ్యా! ఒక మహానగరం రెండుగా విభజిస్తే వచ్చే కష్టాలు మనం తీర్చలేనివి పౌతాయి."

నేను : అది వట్టిమాట లెండి. కాదంటారా, రెండోరకం, మదరాసు నగరం కేంద్రప్రభుత్వ పాలనలోనే ఉండాలి. అప్పుడు తమిళబ్రాహ్మణులకూ, ఆంధ్రులకూ, మదరాసులో ఉన్న ఇతరప్రాంతాల వారికీ అన్యాయం జరగదు.

జ్యోతి : పండిట్జీ ఇప్పుడప్పుడే రాష్ట్రాలసంగతి తలపెట్టవద్దంటారు.

నేను : అదే పెద్దలకు ప్రజల హృదయం కొంచెమయినా తెలియ దన్నమాటకు సాక్ష్యం. ఆంధ్రులందరూ స్వరాష్ట్రం కావాలంటున్నారు. కాంగ్రెసు పెద్దలు ఆ విషయంలో జాప్యంచేసినకొలదీ ఆంధ్రులలో నిస్పృహ, నిరాశ, కాంగ్రెసంటే నిరసనా ఉద్భవిస్తున్నది. మా దేశంలో కమ్యూనిష్టులు దుష్టచర్యలకు పూనుకున్నారు. గాని, వారే సరియైన మార్గంలో నడుస్తూ ఉంటే తప్పకుండా ఎన్నికలలో నెగ్గితీరుతారు.

త్రిపాఠి : సరి మార్గం లేదు గనుకనే, కమ్యూనిష్టుదురంతాలను అణచివేయడానికి వీలుగా ఉండడానికి రాష్ట్రవిభజన పనికిరాదన్నారు, ఆ కాంగ్రెసు పెద్దలే.

నేను : అవునండీ! ఉత్తరాదివారికీ, దక్షిణాది వారికీ వింధ్యాచలం అడ్డుగావడం అదేలంటాను.

ఆనంద : అడ్డంరావడం లేదుగా ఇప్పుడు. అగస్త్యుడు. ఇంకా దక్షిణాపథంలోనే ఉన్నాడు.

త్రిపాఠి: కాంగ్రెసు వర్కింగుకమిటీవారు పటేల్ గారికీ, నెహ్రూజీకి, రాజేంద్రబాబుకూ తుది నిర్ణయం వదులుతారుటగాదా. అదేమి జరుగునో చూద్దాము.

ఆనంద: దేశంఅంతా మాకు రాష్ట్రం కావాలని వాంఛించేవారే. కాని సమయం ఉంది కాదా చతుర్వేదీ.

౨

రైలు బయలుదేరేవేళ అవుతున్నది. మేమంతా స్టేషనుకు వచ్చాము. బారైలీనుండి అలహాబాదుకు మేము ఇద్దరం రెండవతరగతిలో ఎక్కినాము. ఆనందమయి నాదగ్గిరగా కూర్చుంది. మాతో వచ్చే దాదీ మూడవతరగతిలో ఎక్కింది. ఆనందమయి ఒక అరగంటసేపు మౌనంగా కూర్చుంది. నేనూ ఏవో ఆలోచనలలోనై మాటలులేకుండా కూర్చున్నాను. నే నెక్కడ. ఈ త్రివేదీ కుటుంబం ఎక్కడ? ఏ పురాతనానుభూతివల్ల ఈకుటుంబానికీ నాకూ ఈలాంటి సన్నిహిత స్నేహం ఏర్పడిందో! నేనున్న ఇన్నాళ్లూ నాకు ఈ కుటుంబం ఉందనే తెలియదే? వీరందరినీ వదిలి తిరిగి వింధ్యాచలందాటి దక్షిణాపథానికి వెళ్లిపోతాను.

"ఏమిటండి చతుర్వేదిజీ మీ రాలోచించేది?"

"మిమ్మందరినీ వదిలి వెళ్లిపోవడం ఎట్లాగా? అని అనుకుంటున్నాను."

"మిమ్మల్ని కొన్ని అంతరంగికమైన విషయాలు నేనడగదలచుకొన్నాను. సిగ్గుపడకుండా నిజం చెప్పాలని ప్రార్థిస్తున్నాను. మీ వివాహవిషయమై ఏదైనా సంబంధం ఏర్పాటై ఉందా?"

నాకు ఆశ్చర్యం వేసింది. ఎందుకు ఈ అమ్మాయి నన్నీ ప్రశ్నలు వేస్తూవుంది. ఆ అమ్మాయి నాజూకుగా పొడుగుగా ఉన్న బాలిక. ఆమె ఒంటిపై బంగారం నల్లగా కనబడేటంత తెలుపు పసిమి ఎరుపుల రంగుతో వెలిగిపోయే బాలిక. పెద్దకళ్లు కాటుక అంచులతో సగం దాగకొనిన పెద్ద నీలి కనీనికలతో గంభీరమైన ఆలోచనలు లోన దాచుకునే బాలిక. ప్రతిఅవయవమూ తీర్చిదిద్దినట్లు, మేలిమి బంగారంతో పోతపోసిన విగ్రహంలా ఉంటుంది. కోలమోము, సమనాసిక, నిండు పెదవులతో విలువంపులు తిరిగిన నోరు: ఆ పెదవు లెప్పుడూ కాశ్మీరకుసుమాలవలె ఎరుపు లలిమి ఉంటాయి.

నేను ఆ బాలికను ఏదో దివ్యానురాగంతో నాహృదయాంతరంలో పూజిస్తున్నానని నేనే అనుకొనడానికి భయపడి, ఆలాటి ఆలోచనలు రానిచ్చేవాడిని కాను. ఆమెకు చదువుచెప్పేటప్పుడు ఎంతో మధురమైన తన కంఠంతో ప్రశ్నలు వేసే సమయాల, ఆమె వాక్కులలోని ప్రతిధ్వనిస్పందనమూ నా హృదయాన్ని 'మైక్'ను చేసి ప్రతిస్పందనమై నా జీవితం అంతా ఆ అమృతశబ్దాలతో తరంగితమైపోయేది. వారింటిలో ఉన్న ఆ మూడునెలలూ నా విషయమై స్వయంగా ఆ బాలికే అన్ని ఏర్పాట్లు చేసేది. ఏ లోటూ జరగనిచ్చేదికాదు.

నాకూ, ఆమెకూ వింధ్యాచలం అడ్డం. ఆ పర్వతశిఖరాలూ, లోయలూ, నర్మదాతపతులూ, నా జీవితానికీ, ఆమె జీవితానికీ, నా ఆలోచన పథంలో శాశ్వతంగా అడ్డంవచ్చినవి-అనే నిశ్చయం నాకు మొదటనే ఉద్భవించింది.

"నాకే వివాహసంబంధం ఏర్పాటైలేదు ఆనందమయీ! నేను ఎప్పుడూ ఆ విషయమై ఆలోచించుకోనేలేదు."

"మీరు ఏ బాలికనైనా ప్రేమించినారా?"

"ఆ! నాకు ప్రేమ అంటె ఏమిటో తెలియదు. నా పరిశోధనా, నేనూ, అంతే నా బ్రతుకు. నేను ప్రేమిస్తే గీమిస్తే నా పరిశోధనకే."

"అబద్ధం ఆడకండి. ఒకరోజు మీరు తెలుగుభాషలో ఏదో పాట పాడుతూన్నారు. ఆ పాట చాలా అందంగా ఉంది. ఏమిటండీ ఆ పాట అని అడిగినాను. మీరు సిగ్గుపడుతూ ఆ పాట కర్థం చెప్పినారు. మీ కవులలో కిషణశాస్త్రిపాట అన్నారు ఇదంతా జ్ఞాపకం ఉందా?"

"ఉంది, ఆనందమయీ!"

"ఆ పాట అర్థం వినగానే, మీ హృదయంలో కొన్ని రహస్యస్థలాలు నాకు దర్శన మిచ్చాయి. నిజం చెప్పండి ఎవ రా అమ్మాయి.

"నిజం చెపితే నీకు కోపం రాదుకదా!" నాగుండె ఝుంఝూవేగం తాల్చింది.

"నాకు కోపం ఎందుకండీ?"

"నీ ప్రశ్నకు జవాబు చెప్పేముందు ఎందుకు నీ వీ ప్రశ్నలు వేస్తున్నావో అడగవచ్చునా?"

"అడగండి. నాకు కారణం ఉంది. అయినా తర్వాత చెప్తాను. ముందు మీరు నా ప్రశ్నకు జవాబు చెప్పండి!"

"నిన్నుగురించే!" అనేశాను. ఏం చేయను. నన్నా పరిస్థితిలోనికి ఆ అమ్మాయి తీసుకువచ్చింది.

"నిజం?"

"నిజం!"

"సరే! నేను చెప్పే కారణం వినండి. మీ హృదయంలో నన్ను ఎందుకు తలపోసుకుంటున్నారో, ఏమో? నేనుమాత్రం మిమ్మల్ని, మీరు మాయింటికి వచ్చిన మొదటిక్షణంలోనే ప్రేమించాను. నా సర్వస్వమూ ఆక్షణంలో మీకు దత్తమైపోయింది. మీరు చూపుల్లోగాని, మాటల్లోగాని మీ హృదయం ఏమిటో నాకు ఎంతకాలమో అర్థం కానియ్యలేదు. ఆ పాటతో నాకు కొంత అర్థమైంది. 'తొలి ఉషస్సును నేనె, తొలిప్రేయసిని నేనె!' అని."

ఆ మాట లా బాలిక అంటున్నది, నా గుండె ఆగిపోయింది! ఎక్కడ విధ్యాచలం. కలలో నన్నా అంత దివ్యమైన పవిత్రనాదంతో నిండిన మాటలు వింటా నని ఊహించలేదు.

"నిజమేనా! ఆనందమయీ...ని...ని... నిజమేనా?"

ఆ అమ్మాయి మోము ఏదో పరమ ద్భుతకాంతులతో వికసించిపోయింది. స్వచ్ఛమైన చెంపలు అరుణ రాగరంజితమై ఆమె కన్నులు జ్యోత్స్నాపూర్ణ కిరణాంకితమై ఆమె ఫాలము ఆనందక్షీరవీచీమూర్తిమంతమై నాకు దర్శన మిచ్చింది.

'ఆనందమయీ ఏమి చెప్పను. ఈ ఆలోచన ఆలోచించడానికికూడా తగనివాడిని. నవ్వు దివ్య సౌందర్యవతివి. ఉత్తరాదిబాలవు, భాగ్యవంతులబిడ్డవు"

'అయితే? ఇది మీ ప్రేమకు అడ్డాలా?' ఆనందమయి నా వంక ఆశ్చర్యంగా చూచింది. 'కాబట్టి మీరు భయపడిపోయారా?'

ఎవరైనా మామాటలు వింటున్నారేమోనని భయపడినాను. మాతోపాటు ఆ ప్యాసింజరులో ఆసెకండు స్పెషల్ తరగతిలో ఇద్దరో ముగ్గురో ప్రయాణం చేస్తున్నారు. వాళ్ళు మమ్మల్ని భార్యాభర్తలే అని అనుకున్నారు కాబోలు. మా యిద్దరికి ఒకసీటు వదిలివేసి తాము ఇతరసీట్లు ఆక్రమించినారు. వారు మాకు దూరంగానే ఉన్నారు.

"కాదా ఆనందమయీ! మీ నాన్నగారూ అమ్మగారు, ఒప్పుకుంటారా? మీ అక్కగారూ బావగారూ తెల్లబోరూ."

"నిజమే!"

"తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టిన కృతఘ్నుడను అయిపోనూ! వారి దృక్పథంలో!"

విషాదచ్ఛాయలు ఆక్రమించిన చిరునవ్వు ఆమె మోముపై ప్రసరించింది. "మా అక్కకూ నా హృదయం తెలియజేశాను. ఆమె మా బావతో చెప్పింది. మా బావకూ చాలా ఆనందం కలిగింది. అందుకనే మా బావ మిమ్మల్నికూడా బారైలీ రమ్మన్న కారణం. మా అక్కో, బావో ఈసంగతి మీతో మాట్లాడుదాము అనుకున్నారు. నేనే వద్దన్నాను. నేనే మీతో మాట్లాడాలని నిశ్చయించుకున్నాను. మా తండ్రిగారు ఇష్టపడక పోవచ్చును. కాని నేను అన్నింటికీ సిద్ధంగా ఉన్నాను. నా కిప్పుడు పందొమ్మిది. నేను మేజరు నయ్యాను."

"ఆనందమయీ!"

"ఏమండి?"

"నువ్వు – నువ్వు అవతరించిన దేవతవు – నన్ను – ఈ వికారిని నిజంగా—"

"ప్రేమిస్తున్నానా, అంటారా? మీకు నమ్మకం లేదా? వాళ్ళంతా చూస్తున్నారుగాని, మిమ్మల్ని గాఢంగా నా హృదయానికి—"

"నేను నిన్ను దరికైనా తీసుకోలేని దద్దమ్మను."

"మీకు ధైర్యం లేదు. మీ హృదయాన్నే మీరు నమ్మలేరు."

"ఒక దేవకన్య—"

"నేను దేవకన్యనూ కాను. మీరు దేవుడూ కారు. మన మిద్దరమూ మానవత్వము పూర్ణంగా స్పందించే మానవులం. మీ అభిప్రాయం చెప్పండి."

"ఎక్కడ నిన్ను ప్రేమించిపోతానో అని భయపడి పోయాను. నా సంగతి ఎవరు గ్రహిస్తారో అని భయపడిపోయాను. పాఠం చెప్పేటప్పుడు, నువ్వు నేనూ ఒంటిగా ఉన్నప్పుడు నా పూజ ఎక్కడ బయలుపడిపోతుందో, నీ వేమి గ్రహించిపోతావో, నిన్నేమి బాధపెట్టానో అని లోలోన గజగజ వణికి పోయాను దేవీ!"

"అంత గాఢంగా ప్రేమిస్తున్నారుటండీ నన్ను! ఎంత ఆనందం? మీ హృదయం ఏమీ గ్రహించలేక పోయాను. మీరు గొప్పశాస్త్రవేత్తలే కారండా, మంచినటులు కూడా!"

"నాకు నిన్ను ముట్టుకోవడమే భయం వేసేది. నువ్వు నన్ను స్పర్శించినప్పుడు ఏం మూర్ఛపోతానో అని బిఱ్ఱబిగుసుకుపోయేవాడిని."

"అదా అసలువిషయం. నేను మిమ్మల్ని ముట్టాలనే ముట్టుకునేదాన్ని. ఏ వంకనో మీ చెయ్యి, మీ భుజం స్పృశించేదాన్ని. ఏమాత్రం వీలుదొరికినా మీ దగ్గిరగా కూర్చునేదాన్ని. మీరు బిగుసుకు ఉన్నారు. మీహృదయంలో ప్రేమ లేదు. ఎందుకు నన్ను నేను ఇంత చులకన చేసుకుంటున్నాను. అని ఒంటిగా ఉన్నప్పుడు బాధపడేదాన్ని సుమండీ! ఈ నాటికి నా జన్మ సాఫల్యం అయింది."

"అయ్యో వెర్రిదానా! మీ నాన్నగారు ఒప్పుకోరే. మనగతి ఏమిటి ఇకముందు?"

"ఆయన ఒప్పుకున్నా సరే, లేకపోయినా సరే, మన వివాహం తథ్యం."

మా ప్రయాణం మహదానందపూర్ణమై సాగిపోయింది.

మేం అలహాబాదు వెళ్ళినరాత్రే తల్లిదండ్రులతో తన వివాహం సంగతి చెప్పింది కాబోలు. అప్పటికి తొమ్మిది గంటలయింది. చరచరా నేనున్న గదిలోనికి త్రివేదీగారు చక్కా వచ్చారు. "ఇంత ద్రోహివని అనుకోలేదే నిన్ను. ఇంత కుట్ర పన్నుతావురా? నువ్వు మా ఇంటిలోనుంచి వెంటనే వెళ్ళిపో. తలక్రింద మూడు కలల శిఖండిని పెట్టుకున్నానో! రాక్షసుడా!" అని అగ్నిబాణాలవంటి మాటలు తుపాకీ పేల్చా రాయన. నేను నిలువునా నీరయిపోయినాను. తుపాకీ పేలుస్తే నీరెల్లా అవుతానులెండి. శాస్త్రనిజం కాదామాట. గుండెమాసుకుపోయి రక్తహీనణ్ణయి ఉంటాను. వారు రాగానే నిలుచుండి నమస్కరించాను. ఏవేవో భావాలలో ఆయనకు నచ్చచెబుదా మనుకున్నాను. ఆయన అగ్నిహోత్రుడే. మాటలూ, వాదనలూ వినే శాంతమే లేదు.

"వెంటనే వెళ్ళు! సిగ్గూ లేదు. లజ్జా లేదు. ఇంటిలో మదరాసీవాణ్ణి ప్రవేశపెట్టుకోడానికి నా కేమీ ఇష్టం లేదు. కాని ఆ మూర్ఖురాలు, జ్యోతిర్మయికి మంచీ, చెడ్డా ఏమన్నా తెలుస్తేనా?"

నేను మౌనం వహించి తలవాల్చుకుని నిలబడి ఉన్నాను.

"నువ్వు బందిపోటువు. వెనకనుంచి బాకుతో పొడిచి చంపే నీచ హంతకుడవు!"

నా హృదయం పాతాళాలకు క్రుంగిపోయింది

"నువ్వు థగ్గువు, పిండారీవి!"

ఇంతట్లో ఆ గదిలోనికి ఆనందమయి క్రోధసంతప్తవదనంతో విసవిస నడిచివచ్చింది.

"నాన్నగారూ! ఇక నోరు మూయండి.

నా భర్తను నోటికి వచ్చినట్లు తిట్టడానికి మీ కధికారం ఎవ రిచ్చారు ?"

"నీ భర్తా ? అప్పుడే పెళ్లికూడా అయిందీ ? ఎంత కొంప ముంచావు ?"

"నేను కొంప ముంచలేదు. మీ కొంప తరింప చేశాను. మీరు వేయి సంవత్సరాలు తపస్సు చేసినా ఇటువంటి అల్లుణ్ణి సంపాదించలేరు. మీ ఇంటిలో ఒక్క నిముషం మే మిద్దరమూ ఉండము. రండి చతుర్వేదిగారూ ! మీ సామాను సర్దుకోండి. నా సామాను సర్దుకొని నేనూ వస్తున్నాను.

"నీ సామా నే ముంది. అంతా నేను కొని ఇచ్చిందే!"

"నా కిచ్చిన వెనక నా సామా నే! అయినా మీ రిచ్చినది నే నేమీ తీసుకువెళ్లదలుచుకోలేదు. మాయి తన భూముల రాబడిలోనుంచి వచ్చిన అయిదువేలలో నాకు రెండు వే లిచ్చింది. అవి పట్టుకు వెళ్తాను. ఇవిగో మీ రిచ్చిన నగలు."

ఆ బాలిక నెమ్మదిగా తన మెడలోనుండి చేతులనుండి కొన్ని నగలు తీసి బల్లమీద పెట్టింది. నా చేయి పట్టుకుని గదిలోనుండి, హాలులోనుండి, మెట్లమీదనుండి క్రిందిహాలులోనుండి వీధిలోనికి నడిచి వెళ్లిపోయింది. వీధిలో మే మిద్దరమూ అలా చేయి చేయిపట్టుకునే అలహాబాదుస్టేషను వరకూ నడిచి పోయాము.

ఆనందమయి హృదయంలో ఏ తుపానులు వీస్తున్నాయో నాకు తెలియదు. నా హృదయంలో వేసవి కాలపు గాడ్పులో ఏవో నిండిపోయాయి. ఈ బాలిక జీవితము భగ్నం చేశానా?? వింధ్యాచలం ఎంతపని చేశాడు. ఎందరి జీవితాలు విచ్ఛిన్నం చేస్తున్నాడు ! కాదు. దేశంలో ఎన్ని త్రివేణీసంగమాలు సాధ్యము చేస్తున్నాడో!

"ఆనందమయీ, నీ తలితండ్రుల్ని, నీ భావి భాగ్యభోగాలను అన్నీ వదిలి ఇలా నాతో వచ్చేస్తున్నావే!"

"మీతో నేను రావడ మేమిటి, మీరే నాతో వచ్చేస్తున్నారు. మీ భావి ఆంధ్రబాలికావధువును, మీ చుట్టాలను, పక్కాలను, మీ దేశంలో మీకు మీ చుట్టాలలో గలుగబోయే గౌరవాన్ని, అన్నీ వదిలి నాతో వచ్చేస్తున్నారు."

మే మిద్దరం అంతదూరమూ నడిచే వెళ్ళినాము. స్టేషనలోకి వెళ్ళి మొదటితరగతి విశ్రాంతిమందిరంముందున్న కుర్చీలలో కూర్చున్నాము. ఎక్కడికి పోవాలి? మా ఊరు పోవాలా? ఎక్కడికి? నా కేమీ ఆలోచనలే లేవు. అనుకున్నంతా అయింది. ఆ దేవి తనంత తాను తన ప్రేమ నాకు తెలిపింది గొన్ని గంటలముందే కాదూ. ఆ ఆనందతరంగము ఏ ఆకాశపథాలకో మమ్మిద్దరినీ ఎత్తుకుపోయింది. ఆ కల్లోలము అక్కడే మాయమైంది. ఆ ఎత్తునుంచి ఎంతో లోతుకు గభీమని పడిపోయాము.

ఆనందమయి మాటలాడక అతితీక్షంగా చూడని చూపులతో ఏవో చూస్తున్నది.

ఇంతట్లో గబగబ జోడుచప్పుడు అవుతుండగ త్రివేదిగారు మేము కూర్చునివున్న కుర్చీలదగ్గరకు చక్కా వచ్చాడు. "చతుర్వేదిగారూ. నా కోపానికి మీరు క్షమించాలి. మిమ్మల్ని అనరాని మాటలు అన్నాను. ఈ సత్యయుగంలోకూడా నేను మహాతెలివైనవాడిలా ప్రవర్తించాను. నన్ను మీరు సంపూర్ణంగా క్షమించాలి. బేటీ. నీ ముసలితండ్రి తెలివి తక్కువగా అన్న మాటలు పాటించక, నన్ను క్షమించి ఇంటికి రా తల్లీ" అని అంటూ ఆయన కుడిచేతితో కొమరితచేతిని, ఎడమచేతితో నా చేయిని పట్టుకొని, మా ఇద్దరిని లేవదీసి నడిపించుకు తీసుకు వెళ్లాడు.

బైట వారి పెద్దకారు సిద్ధంగా వున్నది. కారులో త్రివేదిగారి సతి కాళిదాసిగారున్నారు.

"చతుర్వేదిగారూ, మీరు ముందు కూచోండి. నేను అమ్మాయి వెనకాల కూర్చుంటాము.' అనిఅంటూ త్రివేదిగారు నన్ను ముందుసీటులో కూర్చోబెట్టి తాను

ఆనందమయి వెనకసీటులో కూర్చున్నారు. ఆనందమయి ఏమీ మాటాలేదు. నేనూ ఏమీ మాటలాడలేదు.

ఇంత తొందరగా ఆయనలో మార్పు కలిగిందేమిటి? ఆనందమయితల్లి త్రివేదిగారికి గట్టిగా ఏమయినా చెప్పిందా? నా చరిత్ర సంఖాంతం కొదలచుకొని వున్నదా? ఇంతమార్పు ఇంతలో ఆయనకు కలగడం అత్యాశ్చర్యకరమే. ఆయన సహజంగా చాలా సున్నితమైన మనసు కలిగినవాడై వుండాలి. ఒక్కసారి వింధ్యప్రాంతానికి ఉత్తరదక్షిణాలకు వివాహసంబంధం కలగడం ఆయన మనస్సుకు వజ్రాఘాతంలా తగిలి వుండవచ్చు. కాని ఉత్తమ హృదయం కలవాడవడంబట్టి ఆశయాలు అభిప్రాయాలు ఎన్ని వున్నా మనసు మార్చుకోక తప్పింది కాదు. అని అనుకొన్నా.

ఇంతలో వారి భవనంముందర మా కారు ఆగింది. మేమంతా దిగి లోనికి వెళ్ళిపోయాము. ఆ రాత్రికి నేను ఆనందమయిని కలుసుకోనడానికి వీలు లేకపోయింది. నాకు రాత్రి ఏమీ నిద్ర పట్టలేదు. లేచి కూర్చున్నాను, పడుకున్నాను. గది అంతా బోనులో వున్న జంతువులా పరిక్రమించాను. మనసులో ఏదో తెలుసుకోలేని ఆవేదన. ఏం చేస్తారు త్రివేదిగారు? ఇంతత్వరలో మార్పు రావడం నిజమైన విషయమేనే? ఏదైనా భయంకర రహస్యం వెనకాల దాగివున్నదా? ఏ మవుతుంది! నా యీ నీరసపుమనసులో ఏవో వికృతమైన ఆలోచనలు పుడుతూవుంటాయి.

గంటలు వరసగా కొట్టుకొంటూ గడచిపోతున్నవి. నాకు కాలం ఆగిపోయినట్లే కనపడింది. అంతుతెలియని ఆలోచనలు. చూపు ప్రసరింపలేని అగాధమైన స్థలాలు. దారి కనపడరాని కంటక భూయిష్టమైన చీకటి అడవులు. ఎక్క వీలులేని ప్రాంతాలు కలిగిన ఎత్తైన కొండలు. ఆటంలో అంతర్గర్భితమైన సాత్త్విస్వరూపుడైన ప్రోటనులోని మహాశక్తి, కాలాంతకగర్జనతో విచ్ఛిన్నమైపోయిందా?

తెల్లవారింది. నేను స్నానాదికాలు నిర్వర్తించుకుని గదిలో కూర్చున్నాను. వంటమహారాజు కాఫీ, పండ్లు, పూరీలు, తర్కారీ పట్టుకువచ్చాడు. ఏదో కతుక్కతుగ్గానే తిన్నాను. ఈ సమయంలో త్రిపాఠీగారు వుంటే ఎంత సంతోషంగా వుండేది. చల్లగా హాయిగా ఒడుదుడుకులు లేకుండా సాగిపోయే నా జీవితం పతనాలై, ప్రభంజనతాడితకల్లోలాలై, రాళ్లలో, గుట్టల్లో, మొరకపల్లాల ప్రవహించడానికి సిద్ధమైపోయింది. అంత దారిద్ర్యంలోనూ చెక్కు చెదరని ధైర్యంతో, కలో, గంజో తాగుతూ గౌరవంగా బ్రతికివచ్చిన నేను ఏమి కష్టాలకు లోబడాలో అన్న ఆలోచన కలిగింది.

ఏమికష్టాలయితే నేమి? ఎన్ని హింసలకు లోనయితే నేమి, జీవితం ప్రచండపూరితసమస్యలను ఎదుర్కొనవలసివస్తేనేమి, ఈ సర్వసౌందర్యరాశి, ప్రేమమయి ఆనందమయి, నన్ను తన్నుతా వలచి వచ్చినప్పుడు, ఆ పవిత్రాదృష్టాన్ని జీవితంమధ్య దాచుకొంటానుగాక!

ఈ ఆలోచన వచ్చింది. ఏదో చప్పుడు విని తల ఎత్తాను. నా దేవి, నా ఆత్మేశ్వరి, ఆనందమయి వస్తున్నదని గుమ్మం దీక్షగా చూచాను. గుమ్మంలో ఇద్దరు పోలీసుఇన్స్పెక్టర్లు ప్రత్యక్షమయినారు. అందులో పెద్దతను "హల్లో! చతుర్వేదిగారూ, గుడ్ మార్నింగ్, మీ మీద ఒక వారంటు జారీ అయిందండి. మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాము. క్షమించాలి. మీరు మాట్లాడకుండా నాతో రండి. మే మేమీ గడబిడచెయ్యం. మా పోలీసుకారు ఆవరణలోకే తీసుకువచ్చాము. ఎవ్వరికీ తెలియకుండా చడీ చప్పుడూ కాకుండా వెళ్లిపోదాము. మా డిప్యూటీ కమిషనర్ త్రివేదిగారితో మీ అరెస్టువిషయమై మాట్లాడుతున్నారు." అని వలిపిడుగులలాంటి నాలుగుమాటలూ అని నవ్వుతూ నిలుచున్నాడు. నా స్థితి వర్ణించుకోలేను. తల తిరిగిపోయింది. తూలి పడబోయాను. రెండవఇనస్పెక్టర్ గభుక్కున వచ్చి నన్ను అదిమి పట్టుకొన్నాడు. నే నింతటిలో ధైర్యం తెచ్చుకొని "ఎందుకండీ వారంటు" అని ప్రశ్నించాను.

"మీరు హాస్టల్‌లో ఏదో అరాజకపు పనులు చేసేందుకు కుట్ర పన్నారట" అని ఏదో కాగితం టపటప ఆడిస్తూ చూపించినాడు.

"ఇదేదో చాలా పెద్దపొరబాటు. మీరు వైస్ ఛాన్సలర్ గారిని అడగండి. మీరు చాలా భ్రమపడుతున్నారు. ఆ వారంటు నా మీద అయివుండదు. ఈ విషయంలో త్రివేదిగారు ఏమన్నారు?"

"త్రివేదిగారు ఏమంటారో మాకిప్పుడు ప్రస్తుతం అవసరం లేదు. మిమ్మల్ని ఈ రాష్ట్రాన్నుంచి పంపించివేయడమే ఈ వారంటులోవున్న విషయం. ఆలస్యమైపోతున్నది రండి, లెండి" అని అంటూ అతడు నాదగ్గరకు వచ్చి చేయిపట్టుకొన్నాడు. నేనిక మాట్లాడకుండా వారితో నడచివెళ్ళి త్రివేదిగారి భవనం ముందు పోర్చిలో నిలుచునివున్న పోలీసు కారులో ఎక్కి కూర్చున్నాను. నా ఇరుప్రక్కలా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు కూర్చున్నారు. మా కారు సాగిపోయింది.

౪

ఆ కారు ఎంత దూరం వెళ్ళిందో ఎంత కాలం నడిచిందో నేను గమనించే స్థితిలో లేను. నేను ఏదో భయపడినది నిర్ధారణ అయినది. నే నేమిటి, కుట్ర చేయట మేమిటి! ఇది త్రివేదిగారు పన్నిన పన్నుగడ అని, తళుక్కుమని నాకు ఆలోచన హృదయంలో మెరుపు మెరిసింది.

ఆనందమయి గతి ఏమవుతుంది. ఆ బాలికకు ఈ విషయం తెలిసిందా? నామీద నిజంగా ఏదయినా కృత్రిమపు, ఘోరమైన నేరం ఆరోపించారా? నాగతి ఏమౌతుంది.? దీనివల్ల నా డి. ఎస్. సి. పరీక్షకు అంతరాయ మేమయినా కలుగుతుందా? ఆనందమయిని ప్రేమించడమే తప్పా. ఆ బాలిక తనంత తాను తన ప్రేమను తెలుపుకోకపోతే నా ప్రేమను నేను తెలిపివుంచేవాడిని కాదే! ఉత్తమంగా, ధర్మంగా ప్రేమించుకొన్న ఇద్దరు యువతీయువకులమధ్య వింధ్యాచలేశ్వరుడు అడ్డం వస్తాడని నాకు ఈషన్మాత్రం ఆలోచన తట్ట లేదే! వింధ్యాచలేశ్వరు డే నాకీ దివ్యప్రేమను ప్రసాదించాడు. ప్రేమ అణుశక్తి కన్న మహత్తరమైన శక్తి కలది. సీసంవంటి నా బ్రతుకును బంగారంకింద మార్చివేసింది.

మా కారు సాగిపోతూవుంది. నేను కారులో ఒళ్లు తెలియని నిద్రకు లోనయ్యాను. మెలుకువ వచ్చేసరికి మేము కాశీకి వచ్చినాము. మా కారు బెనారస్ కాంటొన్మెంటుస్టేషనుదగ్గిర ఆగింది. మేము ముగ్గురం దిగాము. అరెస్టుచేసిన ఇన్‌స్పెక్టరు నన్ను చూచి, "చతుర్వేదిగారూ! మీపైన వారంటుమాట అబద్ధం. త్రివేదిగారు మాకు గాఢమైన స్నేహితులు. వారికీ సహాయం చేయమంటే మేము చేసినాము. మీ సామాను పుస్తకాలు వగైరా అన్నీ వారి బంట్రోతు 'సేవూగాం' పట్టుకువస్తాడు. మీరు ఇక్కడే ఉండండి. మీకు ఖర్చులకై ఈ రెండువందలు ఇమ్మని త్రివేదిగారు మా చేతి కిచ్చారు. ఈ కారు వారి స్నేహితుని కారు. మీరు మామీద రిపోర్టు వగైరాలు చేయకండి, మీ పుణ్యం. మా ఉద్యోగాలు పోతాయి. ఆయన చేసిన పని మా కేమీ నచ్చలేదు. ఈరోజుల్లో కూడా త్రివేదిగారు ఇలా చేయడం చాలా పొరపాటు. ఈ విషయం ఇంతటితో వదలదు. ఆనందమయి అంటే మాకందరికీ ఎంతో అపేక్ష." అని అంటూ రెండు నూరు రూపాయల నోట్లు నా చేతిలో పెట్టబోయాడు.

"ఇన్‌స్పెక్టరుగారూ, నాకా నోట్లు వద్దు. త్రివేదిగారికీ మీకూ నాగాఢ అభివందనాలు. మీరంతా చాలా గొప్ప నాటకం ఆడారు. మీరంతా ఏదైనా సినిమ కంపెనీ పెట్టి, అందులో వేషాలు వెయ్యవలసినవారే. నెహ్రూగారి కొమరిత ఇందిరాదేవి ఒక పార్సీయువకుని పెళ్ళిచేసుకుంటే తండ్రి వద్దనగలిగారా? రోజులు మారిపోయాయి. మనకు పూర్ణస్వాతంత్ర్యం వచ్చింది. కాని మనదేశం హిట్లరురాజ్యం కాదే. అయినా మీరు కోరినారు గనుక మీపైన రిపోర్టు చేయను." అని నేను వారిని వదిలి ప్లాటుఫారంమీద వేరేచోటికి వెళ్ళినాను. టిక్కట్లమ్మే స్థలానికి వెళ్లి వెంటనే అలహాబాదుకు పోయే బండికి టిక్కెట్టుకొని ఆ బండి రాగానే వెళ్ళిఅందులో కూర్చున్నాను. పోలీసు వారిద్దరూ తిరిగి కారులో

వెళ్ళిపోయారు. నేను అలహాబాదుకు తిరిగి వస్తానని వారికి తెలియదు. అలహాబాదుకు సాయంకాలం చేరుకున్నాను. స్టేషన్‌నుండి ఒక హోటలుకుపోయి భోజనంచేసి, టాక్సీ చేసుకొని మా గురువుగారైన రాంప్రసాద్ విద్యాలంకార్ గారి ఇంటికి వెళ్లాను. మా గురువుగారు ఎంతో ఆదరంగా నన్ను ఆహ్వానించారు. డాక్టరు విద్యాలంకార్ ఇంగ్లండు,అమెరికా డాక్టర్ ఆఫ్ సైన్సు' డిగ్రీలు పొందివచ్చిన ప్రజ్ఞావంతులు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఆచార్యోత్తములు. ఆయన నన్ను తమ పుత్రునికన్న ఎక్కువగా ఆదరించేవారు. వారి శిష్యునిగా ఉన్న ఈ రెండేళ్లూ నన్ను అత్యంత ప్రేమతో వేయికళ్ల కనిపెట్టి ఉండేవారు.

"ఎక్కడనుండి వస్తున్నావు చతుర్వేదీ ?"

"కాశీనుంచి పితాజీ !"

"కాశీకి ఎప్పుడు వెళ్లావు. బారైలీ వెడుతున్నానని చెప్పావుగా అక్కడనుండే తిన్నగా కాశీకి వెళ్లావా ?"

"లేదండి. ఆ కథ అంతా రామాయణం అంత ఉంది !" అని జరిగిన విషయాలన్నీ మనవి చేశాను.

"రాం ! రాం ! త్రివేది ఇంతటి పని చేశాడా ! వారి కుటుంబం నాకు బాగా పరిచయమే ! జ్యోతిర్మయినీ, త్రిపాఠీని, ఆనందమయినీ బాగా ఎరుగుదును. వారంటే నాకు ప్రాణం ! పరేకానీ ఆ ఇన్‌స్పెక్టర్లను చివాట్లు పెడతాను. నువ్వు ఇక్కడే నా ఇంట్లో ఈవిషయం ఏదో తేలేవరకూ ఉండు. ఇల్లు నీదే. ఏమీ మొహమాటం పడకు, మీ గురుపత్ని నీవంటే ఎంతో ఆనంద పడుతుంది."

అని తన భార్యకడకు తీసుకువెళ్లినారు.

అక్కడ ఆయన నా కథఅంతా భార్యతో చెప్పినారు. ఆమె చాలా ఆశ్చర్యం పొందింది. ఆమెకు నలుబది ఏళ్లుంటాయి. నన్ను "బేటా, చతుర్వేదీ!" అని పిలుస్తారామె. ఆమె ఇంటరుప్యాసయిన ఇల్లాలు. హిందీలో కవయిత్రి. రేడియోలో తాము రచించిన గీతాలు తీయని కంఠంతో పాడుతూఉంటారు. జ్యోతిర్మయి ఆనందమయి లంటే ఎంతో ఇష్టం ఆమెకు. ఆనందమయీ నేనూ మా ఆచార్యులవారి దగ్గిరకు ఎన్నిసార్లో వచ్చేవారం. ఆనందమయి మా గురుపత్నితో అరగంటైనా సంతోషంగా కాలం వెళ్లబుచ్చకుండా ఇంటికి ప్రయాణం కాదు. మా గురుపత్ని పేరు ఉమాసుందరీదేవి.

ఉమాసుందరీదేవి :—ఏమయ్యా చతుర్వేదీ లోకమోహిని అయిన బాలికను వశపర్చుకున్నావే. ఏమన్నా వశీకరణమంత్రం ఉపదేశమయ్యావా?

నేను :—మీ ప్రయాగత్రివేణీసంగమంలో స్నానం చేయగానే మా కెన్నో మహత్తరశక్తులు సన్నిహితం అవుతాయి మాతాజీ !

ఉమ :— కాదయ్యా! మీ దక్షిణాదివారికి చాలా మంత్రతంత్రాలు వచ్చునని మావైపు ఎంతో ప్రతీతి.

నేను :—అలాగే మావైపున ఉత్తరాది వారంతా మహర్షులనీ, వారి ఇళ్లల్లో దేవతలు పరిచారికలుగా తిరుగుతూఉంటారని మావాళ్లు చెప్పుకుంటూ ఉంటారు. మా అమ్మ నేను మీ విశ్వవిద్యాలయంలో చేరడానికి వచ్చేముందు, "నాయనా మాయచేసి తీసుకుపోయి దేవికి బలియిస్తారు జాగ్రత్త" అని చెప్పింది.

ఉమ :—రాకపోకలు తక్కువై, పరిచయాలు ఏమాత్రమూ లేక ఈలా అవకతవక అభిప్రాయాలు ప్రచారంలోకి వస్తాయి.

గురూజీ :—చతుర్వేదీ! నువ్వు బాగా విశ్రాంతి తీసుకో. నీ కో గది సిద్ధంచేయిస్తాను. రేపు ఉదయం అన్నివిషయాలు మాట్లాడుకొందాము.

వారి ప్రేమ నా హృదయానికి వర్ణింపలేని శాంతి ప్రసాదించింది. నాకు ఒళ్లు తెలియని నిదుర పట్టింది. సాయంకాలం ఉలిక్కిపడి లేచాను. ఆనందమయి వచ్చి నన్ను తన హృదయానికి అదుముకొన్నట్లు కల వచ్చింది. ఆ కలలో, నా కౌగిలిలో నుండి ఆ బాలికను ఆమెతండ్రి బరబరా లాక్కొని

పోయినట్లు వచ్చి "ఓ" అనిగుండె దడదడమంటూ ఉండగా లేచాను.

ఎంతవరకో గాని నా కా దడ తగ్గలేదు. లేచి స్నానాలగదికి వెళ్లి వచ్చాను. మా గురువుగారి దుస్తులు నా గదిలో సిద్ధం చేసిఉంచారు. అవి ధరించి, నా గదినుండు హాలులోనికి వచ్చేసరికి ఆనంద మయి ఎదురుగుండా నన్ను రక్షింపవచ్చిన పరమసాన్నిధ్యంలా నిలుచునిఉంది. ఇం కెవ్వరూ ఆ హాలులో లేరు.

నన్ను చూడడ మేమిటి ఆమె రెక్కలు వచ్చినట్లు నాదగ్గిరకు వాలి నా కౌగిలిలో ఒదిగిపోయింది.

"నా దివ్యదేవీ!"

"నా పరమదేవా!"

*

ఆమెను నా గదిలోనికి తీసుకొనిపోయాను. అలా ఒకరి కౌగిలిలో ఒకరం ఒదిగిపోయి వున్నాము మా ప్రేమకు మాటలు లేవు,

"ఇంతట్లో తలుపుదగ్గిర పండిజ్జీ!" అని వంట మహారాజ్ మాట వినబడింది.

మేము ఇద్దరమూ కౌగిలిలోనుండి విడిపోయి చెరి ఒక కుర్చీమీద కూర్చున్నాము. మహారాజ్ బల్ల మీద ఫలోపహారాదులు, కాఫీ, అన్నీ ఉంచి "ఇద్దరూ సేవించండి" అంటూ తలుపు దగ్గిరగా వేసి వెళ్లిపోయాడు.

"ప్రీతమ్! మిమ్మల్ని పోలీసువారు తీసుకువెళ్లడం అదీ నాకు రామామాయి చెప్పింది. నాన్నగారు అంత క్రూరహృదయులని కలలోనన్నా అనుకోలేదు. నన్ను స్టేషనునుండి ఇంటికి చేరాక లోపలికి తీసుకుపోయి, ఒక గదిలో పెట్టి తాళంవేశారు. అప్పటినుండి ఇంత వరకూ నాకు భోజనంలేదు. ఇంతవరకూ మా అమ్మతో గాని, నాయనగారితో గాని మాట్లాడలేదు. ఏం చెయ్యాలో నేను నిశ్చయం చేసుకొన్నాను. తలుపు తాళంవేసినన్నాళ్లు భోజనం చేయను, ప్రాణం పోతుం దని భయపడలేదు."

"ప్రాణకాంతా! మహారాజ్ఞీ! ఓహో! ఎల్లా వచ్చావు ఇక్కడకు?"

"పక్షిలా మారిపోయి, కిటికీలోంచి దూరి ఇక్కడకు ఎగిరివచ్చి ఇక్కడ మామూలురూపం పొందాను."

"నేనిక్కడ ఉన్నానని ఏలా తెలిసింది?"

"చెప్తా ఉండండి" - అంటూ నా ఒళ్లో కూర్చుంది. "నాకు చాలా ఆకలిగా ఉంది. నాచేత మీరు తినిపిస్తేగాని ఏమీ సహించదు." అని నా మెడచుట్టూ తన ఎడంచేయి వేసింది. కుడిచేత్తో నాగడ్డం పట్టుకుని తనవైపు తిప్పుకొని. "ప్రభూ, నేను నా నిరశనవ్రతదీక్ష మానివేసేముందు మొదటిముద్దగా మీ ముద్దు అరగిస్తా నని ప్రతిజ్ఞ చేసుకున్నాను. నాకు మీ ప్రథమ చుంబనము ప్రసాదించండి!" అని నవ్వుతో, ప్రయాణము అయిన కంటి నీటితో నావైపు చూచింది.

నాకూ కన్నుల నీరు తిరిగినది. ఆమెను గాఢంగా అదుముకొని మాటలు లేక, కాశీ విశ్వేశ్వరుని మనస్సులో తలచుకొంటూ, ఆమె పెదవులు చుంబించినాను. ఆమె నాకు ప్రతిఫలం ప్రసాదించినది. మా కంటి నీటి ప్రవాహాలు త్రివేణీ సంగమం అయ్యాయి.

ఆమెచే నెమ్మదిగా చా తాగించాను. తర్వాత పాలలో నానవేసిన రొట్టి కొంత తినిపించాను. పళ్లరసం త్రాగించినాను.

"ఏం చేస్తున్నారు పిల్లకాయ లిద్దరూ" అని చటుక్కన తలుపు త్రోసికొని మా గురుపత్ని లోనికి చక్కావస్తూ, "ఎల్లా ఉన్నవారు అలాగే ఉండాలి. నేను చూడాలి, నా కళ్లు చల్లబడాలి. నా జన్మ తరించాలి" అని అన్నది.

నా ఒడిలోనుండి ఆనందమయీ, నేను కుర్చీ మీదనుండీ, సిగ్గుపడుతూ లేచి నిలుచున్నాము.

"ఎందుకు లేచారు? నాకు కోపం వచ్చింది. మళ్లీ యథాప్రకారం కూర్చోండి. మీ ప్రొఫెసర్ సాబ్ ఎన్ని అల్లర్లో చేసేవారు."

ఏం చేస్తాం. అల్లాగే యథాతథంగా కూర్చున్నాము. మా ఎదురుగుండా ఉమామాయి కూర్చున్నారు. చెప్పవద్దూ నేను సిగ్గు అణచుకొనడానికి విశ్వప్రయత్నం చేశాను. ఆనందమయి విజయం పొందింది. అల్లరిపిల్ల! చెయ్యాలని నా జుట్టు సవరించింది. నా మోము అదిమిపట్టి తనవైపు త్రిప్పుకుని, ఒక నిమేషం తేరిపారచూచి, ఉమామాయి వైపు త్రిప్పి, "ఏమండి పిన్నీ! ఈ అబ్బాయి మోము బాగానే ఉం దనుకుంటాను. దక్షిణాదివారంతా కోతు లనుకున్నాము. కాదని కొంచెం నిర్ధారణ అయింది సుమండీ!" అని అంటూ మోములో గంభీర ముద్ర తాల్చింది.

ఉమామాయి పకపక నవ్వుతూ "అల్లరిపిల్లా! ఆతనిముందు దివ్విటీముందు దీపంలా ఉన్నావు. కాస్త రంగు ఉంటే సరేనా, నా కొడుకు మన్మథుడు. నువ్వో" అని నవ్వి ఆమెకూడా మోములో గంభీర ముద్ర ధరించింది.

నేను : "ఇంతకూ మే మాంధ్రులం. ఆంధ్రు లెవ్వరో నిర్ధారణ చేశారా!" అన్నాను.

ఆనందమయి : "రాక్షసు" లని అన్నది.

ఉమామాయి : "దేవతలు, దేవతలే!" అని దృఢంగా చెప్పింది.

మేము ఇద్దరమూ లేచి ఆతల్లికి పాదాభివందనాలు చేశాము. ఆమె మా తలపై చేతు లుంచి ఆశీర్వదించి, "చతుర్వేదీ నీ వధువును వాళ్ల తలితండ్రులతో మాయమాటలు చెప్పి తెల్లవారుతూనే తీసుకువచ్చాను. నువ్వు ఈ ఊరు తిరిగి వచ్చేశావని వా రెవరికీ తెలియదు. నువ్వు ఇంటినుంచి కదలి బయటకి వెళ్లు. ఆనందమయి ఇక్కడే ఉంటుంది. ఆమె పెట్టెబేడా తర్లించుకువచ్చేటట్లు చేశాను. మీ ప్రొఫెసర్ గారు జ్యోతిర్మయికీ, త్రిపాఠీకి టెలిగ్రాము ఇవ్వడానికి వెళ్లినారు. వీలయితే ట్రంకుఫోనులో మాట్లాడతా మన్నారు. ఈలోగా లక్నోరిజిష్ట్రారుతో మాట్లాడి అక్కడ మీ ఇద్దరికీ రిజిష్టరువివాహం జరిగే ఏర్పాట్లు చేస్తూ ఉన్నారు. మధ్యాహ్నం లక్నోకు వెళ్లి వస్తారు. అప్పైన సంగతులు ఆలోచిద్దాము." అని ఆమె లేచి "జాగ్రత్తగా వుండండి రెండు మూడు రోజులలో వివాహం, నేనూ, ప్రొఫెసరూ, ఇతర సైన్సుఆచార్యులూ ఇద్దరో ముగ్గురో భార్యలతో లక్నో వస్తారు. ఈ విషయం ఏమాత్రం ఎవ్వరికీ తెలియకుండా ఉంచదలుచుకొన్నాము." అని అంటూ ఆమె తలుపు దగ్గరగా వేసి వెళ్లిపోయింది.

మా ఆనందసుధా సముద్రం అయిపోయింది. ఆనందమయి నా శ్రీమహాలక్ష్మి!

౬

ఆ సాయంకాలానికి జ్యోతిర్మయీ త్రిపాఠీ మా ప్రొఫెసర్ గారి ఇంటికి చక్కా వచ్చారు. జ్యోతిర్మయి చెల్లెలిని కౌగిలించుకొని, "చెల్లీ ఎంత అదృష్టవంతురాలివే!" అన్నది.

రాగానే నా చేయి విరిగేటట్లు జాడించిన త్రిపాఠీ "నువ్వు దురదృష్టవంతురాలవా?" అన్నాడు కోపం నటిస్తూ. "నేనేకాక నా చెల్లికూడా అదృష్టవంతురాలు" అని జ్యోతిర్మయి మాట ముడిచింది.

త్రిపాఠి :— అంతే కద !

జ్యోతిర్మయి :— మీరు మరీనండి. ఏమో, నా కన్న నా చెల్లే అదృష్టవంతురాలే నేమో, ఆలోచిస్తే అలాగే కనబడుతోంది.

మాయి :— ఒకరికన్న ఒకరు అదృష్టవంతులు లెద్దురూ:

ఆ మర్నాడు మే మంతా లక్నో వెళ్లినాము, నాకు ఆనందమయికీ రిజిష్టరువివాహ మయింది.

దారిలో త్రిపాఠీ నాతో రహస్యంగా "మామగారికి నీ మీద కోపం ఏమీ తగ్గలేదు భాయ్! అంతా నీపనే అంటారు. నేనూ జ్యోతీ ఎన్నో చెప్పినాము, ఆయన మనస్సు తిప్పలేకపోయాము. కాని అత్తగారి మనస్సు తిరిగింది." అని చెప్పినారు.

వివాహంకాగానే లక్నోనుండి వెంటనే అలహాబాదు వచ్చివేశాము. నేను తక్క తక్కినవారందరూ త్రివేదీగారింటికి వెళ్లినారు.

మాటలమధ్య మెమ్మదిగా మా గురువుగారు త్రివేదిగారితో అంతా చెప్పినారట. ఆయన నోట మాట రాక కుర్చీలో కూలబడిపోయినారట. కొమరిత పాదాభివందనం చేయడానికి వెడితే "ఛీ దుర్మార్గురాలా నీ మొహం చూపకు నాకు" అని ఆమెను కాలితో తన్నినారట. అంతతో మాగురువుగారు ఉగ్రుడై లేచి "నీసంగతి దేశదేశాల చాటుతాను. ఏ యుగంలో ఉన్నావు నీవు. వింధ్యాచలం ఇంకా ఆకాశంఅంటే ఉందనుకున్నావా!' అని లేచినారట.

త్రిపాఠి "మామగారూ! మీరంత తెలిసినవారూ భక్తులు, గాంధీజీ జవహర్ పండిట్జీల శిష్యులై, ఈలాంటి వారవుతారని కలలోనన్నా అనుకోలేదు. కూతుర్ని తన్నారా? నన్నూ, జ్యోతిర్మయినీ తన్నండి. ఈ పరిణామానికి కారకులం మేము. ఆనందమయి చతుర్వేదీని ప్రేమించేటట్లు చేశాము. ఆతడు ఉత్తముడు. మహోదారచరిత్రుడు. ఆలాంటివాడు అల్లుడవడం మీరు పూర్వజన్మలో చేసిన పుణ్యం" అని విసవిస అవలకు నడిచిపోయాడట. అందరూ అన్ని విధాలా చెప్పినారట. ఆనందమయి తండ్రిపాదాలకడనే పడివుందట. ఆనందమయితల్లి కాళీమాయివచ్చి కూతుర్ని లేవదీసి అమ్మడూ, నాన్నగారు తన్నినారా? నీకర్మమేమి, నేనూ నీతో వస్తాను పద. ఇంత ఉత్తములే ఇలా అయ్యా రేమి! అది నాకర్మ" అంటూ కౌగిలించుకుందట ఆ బాలికను తల్లి.

మా మామగారు సింహంలా లేచారట. "సరే! మీరంతా సంస్కృతికలవారు. నేనుమాత్రం పరమ ఛాందసుణ్ణి! అనుకోండి. కన్నతల్లీ, నీకూ చతుర్వేదికే నిజమైన వివాహం చేస్తాను. ఆచార్యా! మీరు ఆ శుభకార్యం వైభవంగా జరిపించండి. తల్లీ! నిన్ను తన్నిన పాపానికి నాకు నివృత్తి ఏప్రాయశ్చిత్తం చేసుకుంటే పోతుందో!" అని ఆనందమయిని తన హృదయానికి అదుముకొని వెక్కి వెక్కి ఏడ్చినారట. అప్పు డందరికళ్ళూ చెమ్మగించినాయట. జ్యోతిర్మయీ త్రిపాఠీ, ఆనందమయీ తండ్రికడ సాష్టాంగపడినారట.

నా వివాహం పరమాద్భుతంగా జరిగింది. మా వాళ్లంతా ప్రయాగ తర్లివచ్చారు.

వింధ్యాచలేశ్వరుడు పకపక నవ్వుచున్నాడు. భారతదేశంలో అన్నీ నదీనదులూ త్రివేణీసంగమానికి చుట్టాలై వచ్చినాయి.

"ఓం అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ."



వర్షాలక్ష్మి

శ్రీ దిగుమర్తి సీతారామస్వామి

చిరబుభుక్షార్త చాతకజీవనదము
చక్రవాకవియోగాగ్ని సామిధేని
లలితనలినీ నవోఢకుఁ దొలగుబావ
మేచకాభ్రము నభముపై మిట్టిపడియె.

ద్యావాపృథ్వ్యవకాశధూసరములై వ్యాపించెఁ జీకట్లు; ధూ
ళీవాత్యల్ తెగవోతరించి పరచెన్; లేఖర్షభస్యందనా
రావామ్రేడితముల్ సెలంగె నురుముల్; వర్షోపలవ్రాతధా
రావర్షంబులు పెల్లుగాఁ గురిసె; వర్షాభుల్ సురేణ్మాగఘుల్

మఘువు నేల్బడిఁ జల్లని మబ్బు గొడుగు
నీడఁ బుడమికి వేసగి పీడ వదలె
గోపకుల్ రండు! ప్రత్యగ్రకుటజకుసుమ
కల్పితార్ఘ్యము లందిచ్చి గారవింప.

ప్రావృషేణ్యపయోదవర్ణనావైచిత్రిఁ
        గవిరాజుగంటము కలవరించె;
వర్షేందిరానుకంపావిశేషమ్మునఁ
        గృషికుండు హాలపాణిఁ గేలి సేసె;
విద్యుల్లతాలాస్యవిధమున కుప్పొంగి
        నెమ్మి విచిత్రనృత్యమ్ము సలిపె;
ప్రావృడ్జలప్లుతి బడలి మిళిందము
        కుసుమవక్షమునఁ దుంపెసలు గునిసె;
కలువ కనుమూసె; గేదగి బలిసి నవ్వెఁ;
దలను బంకించె మాలతి; పిలిచె జాతి;
నీపలతికాలతాంతవనీపరాగ
మాసరములగు వార్షికవాసరములు.

మెరపుల కాగడాల్ చదల మేగిన మబ్బుల చాందినీల క
ట్లురుముల తూర్యముల్ వనమయూరనృతుల్ జిగి కొండమల్లెలున్
గరగొరగాని నేరెడుల కాన్కలు మొల్లముగాఁగ గడ్డిపూల్
పరచిన దారి శ్రావణికి స్వాగత మిచ్చె ధరిత్రి వేడుకన్.

వచ్చిన వానకారు తెరవన్ గని గౌరవముం బొనర్పఁగాఁ
బొచ్చెము లేని తీయ వలపుందలపున్ బడి గ్రామదేవతల్
పచ్చపిసాళివన్నెల తివాసిని వైచిరొ నాఁగ నొప్పె లేఁ
బచ్చిక విచ్చలించిన ప్రవాళ నదీనదపార్శ్వభాగముల్.


బురదను గాలుమోపుటకె పొక్కెడు నెడ్లు పొలమ్ము దున్నుచో
నిరయములో యనన్ బురదనీళుల నిండిన పంటకాల్వలన్
నిరవధికప్రమోదమున నిద్రలు వోయె లులాయరాజి యె
క్కరునకు ఖేద మెయ్యది, సుఖం బది యొక్కని కన్న చాడ్పునన్.

అతివేలంబుగఁ బారుచుండెడి సరస్యంభః ప్రవాహంబులన్
బ్రతిబింబించిన లేతసూర్యుడును వెల్లంబారు మేఘమ్ముల
ద్భుతమోదం బిడె వెఱ్ఱిపాట మురళిన్ బ్రోయించుకొం చాలతో
బ్రతినిత్యమ్ము చరించు గొల్లనికి - వర్షాదృశ్య మహా నట్టిదే.

కొండమల్లెలు గేదగుల్ కొప్పుదురిమి
పిడుగు టండెల రవళులు వెగటుగాఁగ
మెరపు గాజులు పదిమార్లు మెరయఁజేసి
చెఱఁగు బోంగన గ్రామీణవనితపోల్కి.



మీరు మెక్లీన్‌తో
నేడు పళ్లు తోముకున్నారా?



నోటిని పరిమళభరిత మొనర్చి
దుర్వాసనను
నివారిస్తుంది

ఆమ్లాలను విరిచివేసి
మీ ఇగుళ్లను
సంరక్షిస్తుంది

పళ్లమీది మరకలను తొలగించి
వాటిని ధవళతర
మొనర్చుతుంది

అనుకరింపశక్యంకాని ప్రత్యేక సూత్రం ప్రకారం తయారైన మెక్లీన్స పెరాక్సైడ్ టూత్ పేస్టు జగద్విఖ్యాతి గాంచినది. దీనికి కారణాలు: ఇది మిక్కిలి పరిశుభ్రమైనది. పంటిమీది మరకలు తొలగించుటలోను, నోటిని శుభ్రపరుచుటలోను శక్తివంతంగా పనిచేస్తుంది. వాడునపుడు ఆహ్లాదకరమైనది, పరిమళభరితమైనది.

కోట్లకొలది ప్రజలు అలవాటుగా నిత్యం మెక్లీన్స్‌తో దంతధావనచేస్తూ తమ నిత్య కృత్యాలను ప్రారంభిస్తున్నారు.

నేడే మెక్లీన్స్ కొనండి!



MTX 2 T6

కథానిక:

విభావరి

●

శ్రీ కె. వీరభద్రాచారి

హృదయాలు వికసించే పండువెన్నెలలో చల్లని పిల్లగాలులు గిలిగింతలు పెట్టున్నాయి. రాకాచంద్రికల్లో ద్రవించుతున్న నిద్దపు పాలరాతివిగ్రహంతో అరమోడ్పుకనులలో మౌనసంభాషణ సాగిస్తున్నాడు శిల్పి - శివశ్రీ. ప్రక్కనే అందాలు చిందే సౌదామిని ఆనందలేశమైనా లేని భావనలలో ఆలోచనలు సాగిస్తుంది. శివశ్రీ మూడుపదులు వసంతాలు నిండని యౌవనమూర్తి. ఆ విశాలనయనాంచలాల్లో అతని కళాప్రౌఢిమములోని గాంభీర్యము రేఖామాత్రముగ దర్శన మిస్తుంది. తారుణ్యం, సౌందర్యం శివశ్రీని మరింత కళామూర్తిగ చిత్రిస్తాయి. మాటలు రాని, హృదయం లేని ఆ శిలావిగ్రహమే తన జీవిత సర్వస్వముగా ఎంచుకొనే లుబ్ధత్వము గోచరిస్తుంది ఆ కళాజీవి ఏకాగ్రతలో. ఆరాధించి ఆరాధించి ఆ అచ్యుతసుందరిలో ఐక్యము కావటమే అతని జీవిత పరమావధిగా ఆశిస్తున్నాడా అనిపిస్తుంది. నిండు కండ్లలో చూచి చూచి అరమోడ్పుకనులలో ఏమో ఆలోచిస్తాడు. చూడలేని అందాలను అన్వేషిస్తున్నట్లు కన్నులు మూస్తాడు. ఈ రసవాహినినుండి బయటికి రాలేడు. హృదయమిచ్చి హృదయాన్ని అభిలషించే సుందరి తన సరసనుందనే జ్ఞానమైనా అతనికి లేదేమో! మూసిన ఆ కళ్లతో తాను దర్శించేది ఆ శిల్పకన్య అతిలోకసౌందర్యశోభలనేనా?

అపుడపుడే యౌవనప్రాంగణంలో అడుగు పెట్టున్న సౌదామినిలో తీయని కలలు తేలిపోయినాయి. ఏ శివశ్రీకి-అతని శిల్పానికి-కళామయజీవితానికి తాను ముగ్ధురాలైనదో - ఆ శివశ్రీకే- తన తల్లిదండ్రులు తన్ను వివాహం చేయపోతున్నారంటే తన అదృష్ట మనుకొంది. అంతులని ఆనందంతో జీవితమే ఓ మధుర వసంత మనుకొంది. హృదయాంకితమైన శివశ్రీకి తన సర్వస్వము సమర్పణ చేసికొంది. ఆరాధించింది. "మన మిద్దరం జీవికొజీవులం" అనే శివశ్రీమాటలు విన్నప్పుడు, తిరిగి స్మరించుకొన్నప్పుడు తన సౌభాగ్యానికి ఎంతో గర్వపడింది. కాని శిల్పిజీవితగతి ఆమెకు ఎన్నాళ్లో అర్థం కాలేదు. శిలాఖండాలకు కళాసుందరి రూపాలను నేర్పుతో ఇచ్చే అతనికి ధన్యవాదాలర్పించుకొంది. కాని ఆ శిలలలో, ఉలిచెక్కుళ్లలో ఆ సేవలో-తన్ను తన ఉనికినే విస్మరించాడు. ఎన్నాళ్ళని సహిస్తుంది? ఎన్ని తీయని రేలు, మరెన్ని జ్యోత్స్నా వికాసాలు, ఎన్నెన్ని ఉషశ్రీలు, వృధాగా, లోని మధురవాంఛలు లోనే మణగిపోతూ, తరలిపోయినాయి. "ఈ విగ్రహాల సౌందర్యమంతా నీ అందాలో ఎన్నోవంతు? అయినా నీ మూర్తేగా ఈ సృష్టికి మాతృక!" అనే, తన శివశ్రీ, తన్నెందుకిలా ఉపేక్షించాడు? "సృష్టికర్తకే రూపముంటే తాను చేసిన యీ విశ్వంలో సౌందర్యాన్నంతా గాలించి నిన్ను చూచి నీ అపూర్వసౌందర్యానికి గర్వంతో తన కళాకౌశలానికి తానే మురిసిపోతూఉండేవాడు" అనే తన శివశ్రీకి, తన అందాల్లో విశ్వాసం పోయిందా? లేక అతను అన్నట్లే తన సృష్టికి తానే మురిసిపోతున్నాడా! సౌదామిని సుఖజీవితానికి ఈ బండరాళ్లు ప్రతిబంధకాలయాయి. ఏమిటీ విచిత్రసాపత్న్యము?

వెన్నెలలకు, పిల్లగాలులకు రేగే మధురవాంఛలు సౌదామిని లేతహృదయాన్ని ఉక్కిరి బిక్కిరి చేసినాయి. పైగా తన మాటలకు పలుకని, తనవైపైనా చూడని, శివశ్రీ నిర్లక్ష్యము, ఉపేక్ష, మనస్సును కలచి

స్తున్నవి. శివశ్రీ తన మధురస్వాప్నికలోకపు అవధులు దాటలేదు. తన కళాజగత్తు వీడి ఈ వాస్తవ ప్రపంచంలో అడుగు పెట్టలేదు. తన సౌదామిని-తన మెరుపుతీగ-తన కళామూర్తుల మాతృక-పిలుపు, విసుపు కూడ అతనికి వినపడలేదు. మరి సహించలేకపోయింది సౌదామిని. ఎన్నాళ్ళని! ఎన్నేళ్ళని! తన జీవితాన్నిట్లా అర్థంలేని త్యాగం చేసుకోవటమెందుకు? ఎందుకీ కల? ఎందుకో ఈ శిల్పం? హృదయం ప్రణయం లేని రాళ్ళలో, యితని హృదయం, ప్రణయం, కూడ మాయమైనాయి. తానిక ఇక్కడ ఉండలేదు. ఈ రాళ్ళలో ఈ ఔదాసీన్యంలో-ఈ నిర్జీవవాతావరణంలో ఉండలేదు. ఈ చైతన్యము లేని ప్రాంగణంలో-ఈ మృతశిలల హృదయము గల వ్యక్తితో సౌదామినివంటి నవోఢయువతి ఎట్లా ఉండగలుగుతుంది? తనలోని-సౌందర్యాన్ని, కవోష్ణమధువాంఛలను ఆస్వాదించి, అనుభవించి ప్రత్యనుభవాల నిచ్చే వ్యక్తి ఈ కళాశిలి కాడు.

పాపం! సమాధిలో శివశ్రీ ఒక నీడ లేచి తన పైనుండే పాకిపోవటంకూడ గుర్తించలే. తన అర్ధాంగి తన్ను విడిచిపోవటం ఎలా ఊహించగలుగుతాడు?

* * *

చిక్కని పాలలా వెన్నెల కురుస్తోంది. మంచు సూదుల్లా పొడుస్తోంది. చలిగాలి బాధ కలిగిస్తోంది. ఇంచుమించు అరణ్యంలోలా ఆ తోటల్లో నడుస్తున్న సౌదామినికి తన స్నిగ్ధహృదయంలో వెచ్చదనము, మధురవాంఛలలోని తీక్ష్ణత్వము, నవయౌవనంలోని సౌందర్యశ్రీలు 'అడవికాసిన వెన్నెల'ను జ్ఞాపకం చేశాయి. కళ్లు చెమరించాయి. ఏదో అనిర్వాచ్యమైన వేదన-ఏదో ఉద్వేగంతో ఆమెపాదాలు త్వరత్వరగా కదులుతున్నాయి. అర్థం లేని, గమ్య మెరుగని ఆ ప్రయాణం అంత వేగంగా సాగటం సమన్వయించుకోలేని విషయం. కాని సత్యం. అందుకనే ఎదుర వచ్చే వ్యక్తికి ఆమెపాదవిన్యాసాల్లో ఓ విచిత్రలాస్యం గోచరించింది. సన్నని దారి విడచి ప్రక్కగా పొదల్లో ముళ్ళల్లో నడుస్తున్న ఆ సుందరిస్థితి అర్థం చేసుకోలేకపోయినాడు. చేసుకోకుండా ఉండలేదు. అతడే సామ్రాజ్యచక్రంలో నాటి 'నాట్యరత్న'. తన అఖండనాట్యకళాప్రౌఢిమ చేత దేశాన్ని సమ్రాట్టును ముగ్ధులను చేసి ఆనందాన్నిచ్చి 'రత్న' పదవి స్వీకరించాడు. ఆకర్ణాంతమైన అతని ఆ ఎర్రని కండ్లలో ఓ ప్రత్యేక ఆకర్షణ, నిరంత సౌందర్యదృక్కు సూచితమౌతాయి. ఎదుటి మెరుపుతీగకు కనులందరి, కనపడనట్టుగా ఎదరకే వెళ్లాడు. ఆమెకు ఇహలోకజ్ఞానము, ఇంద్రియచైతన్యం మృగ్యమైనట్టు, చాచిన సుధాకర్ చేతుల మధ్యకు చేరుకొంది. సుధాకర్ తిరిగి ప్రయాణం సాగించాడు, ఆ అందాలను మూటకట్టుకొని తన సౌధానికి.

* * *

'నాట్యరత్న'కూ సౌదామినికీ హృదయాలు కలిశాయో లేదో చెప్పలేము కాని చేతులూ, చూపులూ కలిశాయి. నేటినుండి సౌదామిని సుధాకర్ అర్ధాంగి. కాని సుధాకర్ కో చేరరాని, తెలియరాని, తెలుసుకొనేందుకు అధికారం లేని, ఓ విషయముంది. అతడడుగరాదనే వాగ్దానముతోనే ఈ పాణిగ్రహణం జరిగింది. అది ఆమె పూర్వజీవితం. ఆ జీవితగ్రంథంలో ఇంతవరకు గతించిన ఘటలను తిరిగి రేగనీయకూడదు. శివశ్రీతో తన జీవితం జ్ఞాపకానికి వస్తే సౌదామిని తన ప్రస్తుతజీవితంలో ఇకేమి సౌఖ్యాన్ని అనుభవించగలుగుతుంది? ఆ అనుభవాల ఛాయలనైనా స్మృతిపథాన పడనీయకూడదు. అట్లా అయితే తాను గృహాన్ని విడిచి వచ్చిన ఆశయం కొంతైనా నెరవేరుతుందేమో! సుధాకరు డనుకొంటాడు: 'గతించిన ఆశ్వాసాలలో వర్ణితమైన ఏ విషాదకావ్యమో పునఃస్మరణలో దుర్భరదుఃఖాన్ని కల్గిస్తుంది కాబోలు' అని తాను ప్రశ్నించకూడ దనుకొంటాడు. ఆమె నిషేధించిన రహస్యస్థలాల ప్రవేశించకూడ దనుకొంటాడు. ఏ పొరపాటుననో ప్రవేశిస్తాడు. ఆమె తెల్లపోతుంది. ముఖం విషాదావిల మౌతుంది. కండ్లనీళ్లు తిరుగుతాయి. సుధాకర్ కు పశ్చాత్తాపం కలుగుతుంది.

ఓ రోజు సుధాకర్ ఆనందాలు చిందే చిరునవ్వులతో సౌదామినిగదికి వచ్చాడు. ఏకాంతతను

భరించలేని నిస్పృహా, ప్రియుని రాక నెదురుచూచే నిరీక్షణ ఆమెలో ద్యోతక మౌతున్నాయి. "రాణీ! నేటి నా ప్రణవనృత్యం చక్రవర్తినే గాదు భగవానునికూడా మెప్పించి వుండాలి. నేటి నీ సుధాకర్ నృత్యం నీవు కూడా చూస్తే ..కానీ నీకో మంచి కానుక తెచ్చా.. నాట్యంలో ముగ్ధుడైన చక్రవర్తి కోరుకొమ్మంటే నీకో సవతిని...కోరుకొన్నా—చూడు ఈ ప్రతిమను ఎవరో శిల్పి...నా రాణిని తన స్వప్నాల్లోనైనా చూచి ఉండాలి...లేకపోతే ఈ పోలిక లెలా వస్తాయి?"

"సుధా! ఇది చక్రవర్తిఆస్థానంలోదే ?" సౌదామిని ప్రశ్న.

"మొన్నటి శిల్పప్రదర్శనలో ప్రథమబహుమానం, ప్రత్యేకగౌరవం అందుకొన్న ప్రతిమ. నిజానికి అసాధ్య మనుకొన్న నా కోరికను సాధించుకొన్నందుకు నా నాట్యాన్ని నేనే అభినందించుకొన్నా—"

'స్వర్గానికి పోయినా సవతిపోరు తప్పలేదు' అన్నట్లు—సౌదామినికి అదే ప్రతిమ అదే బండరాయి—ఇక్కడకూడ సిద్ధమైంది. ఇందరి హృదయాల్లో ఇంత విశిష్టస్థానాన్ని సంపాదించుకొన్న ఆ శిల్పసుందరిని తాను చేతులారా ముక్కలు చేయటం ఎలా? గంగపాలు చేయట మెలా? అమ్మో! హృదయం బ్రద్దలు కాదూ? శివశ్రీని తాను విడచినా తన్ను శివశ్రీ వదలటం లేదు. ఆమె మరిచిపోవటానికి చేసే ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోతున్నాయి. శివశ్రీకి తన హృదయంలో ఓ సుస్థిరస్థానముంది. చిత్రాంకితమైన శివశ్రీమూర్తి ఎంత ప్రయత్నించినా అదృశ్యం కాదు సరికదా, రోజురోజూ రంగులు పూసుకొని మరింత ప్రస్ఫుట మౌతుంది. ఆమె కీచిత్రవ్యథ దుర్భరమైంది. ఏ మనుకొంటుంది? శరీరానికి హృదయానికి సంఘర్షణ అనుకొంటుందా? సాంప్రదాయానికి సంస్కృతికి యుద్ధ మనుకొంటుందా?—

లేదు, తన జీవితంలో ఇక శాంతి లేదు. వెలుగు లేదు. ఆనందం లేదు. అయినా శివశ్రీ తన కేం లోపం చేశాడని? అతని అద్భుతకళానైపుణి; దేశదేశాలకు ఆదర్శంగా నిలచే ఈ సుందరమూర్తులను ఏకాగ్రతతో సాధించటం—ఇవేనా అతని లోపాలు? అతని కెవ్వ రున్నారు? అయినా—ఎందు కీ గతజల సేతుబంధనం? తన చిరునవ్వుల్లో ఆనందసౌధాలు నిర్మించుకొనే అమాయకజీవి—తననే సర్వస్వముగా ఆదరించే యీ సుధాకర్ను అన్యాయం చేయలేదు.

* * *

"సౌదామినీ! ... సౌదామినీ!!" వెర్రికేకలు తోటల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆనాడు శిల్పప్రదర్శనానికి సౌదామినిని తీసుకొనిపోవాలని శివశ్రీ ఆరాటం. తనకు తెలియని ఏ ప్రదేశాలకు వెళ్తుంది? వెతికాడు తోటలన్నీ. ఊరంతా గాలించాడు. నిస్పృహతో నిరాశతో ఇల్లు చేరుకొన్నాడు. తన సౌదామిని తన్ను విడిచిపోయిందేమో నని పసిపిల్లవాడిలా ఏడ్చాడు. తన జీవితమే శూన్యం చేసి పోయింది. మోడయిపోయిన తన నిరాశాపూరితజీవితంలో చల్లని వెన్నెల చిమ్మిన సౌందర్యమూర్తి సౌదామిని స్మారకచిహ్నంగా ఆ ప్రతిమను ప్రదర్శనకు తీసుకొనిపోకూడదనుకొన్నాడు. కాదు. తన బ్రతుకి కెందుకు? విషాదమధురస్మృతు లెందుకు? ఆ సౌందర్యంలోని ఛాయలనైనా ప్రపంచం చూడ గలుగుతుంది.

మరునాటి ఉదయానికి రాజధానినగరం చేరుకొన్నాడు శివశ్రీ; తన 'మూర్తి'తో. జీవితంలోని, బరువు, విషాదం అంతా అతనిముఖంలో కండ్లలో కనబడుతున్నాయి. ప్రదర్శన దిగ్విజయంగా సాగింది. చక్రవర్తి ఓ విధమైన గర్వంతో శిల్పాలన్నిటినీ చూచాడు. శివశ్రీ కళామూర్తిని చూచి ముగ్ధుడయాడు. చకితుడై నిలబడ్డాడు — ప్రథమబహుమానం శివశ్రీది. అందుకొన్నాడు. ఎందు కిది తనకు? ఎవరికోసం? తన గౌరవానికి మురిసే దెవరు? నాటి సాయంత్రం చక్రవర్తి శివశ్రీని తన ఆస్థానంలో 'శిల్పరత్న', పదవి స్వీకరించమని సగౌరవంగా కోరాడు. "నా కళాతపస్సు ముగియలేదు" "నే నీ పదవికి అసమర్థుడను" ఇలా తప్పుకొంటాడు శివశ్రీ. చక్రవర్తిలోని అహం, కీవి ప్రజ్వలించా యి. "లేదు అంగీకరించి తీరాలి" అజ్ఞాపించాడు. "న న్నాజ్ఞాపించే అధికారం మీకు లే"దనే

జవాబు నెమ్మదిగా. సభాసదులంతా నిర్విణ్ణులయారు చివరికి—"నా సౌదామిని నాకు లభించేవరకూ నే నే విషయాన్నీ అంగీకరించలేను." అన్నాడు శివశ్రీ—'అయితే మేమూ ప్రయత్నిస్తాము. ఒక నెల గడువు. ఆ పైన మీరు ఈ 'శిల్పరత్న' పదవి స్వీకరించకపోతే రాజాజ్ఞాతిరస్కారనేరంపై......' సభ ముగిసింది. నాట్యరత్న సోదరకళాజీవస్థితికి బరువెక్కినగుండెలతో పోయాడింటికి—"రాణీ!"ని పిలచి అంతా చెప్పాడు. స్వాతంత్ర్యరక్తిలో, కళాసేవలో తనకు ఆదర్శమూర్తి శివశ్రీ అన్నాడు తుదకు. అంతా తెలుసుకొంది సౌదామిని. ఇప్పుడు తాను కనపడితే వచ్చే విచిత్ర ఫలితాలను తన హృదయం భరించలేదు. ఎందరికో హృదయవేధ కలిగించే పని తాను చేయదు. శివశ్రీని మరువలేదు. సుధాకర్‌ను విడువలేదు. శివశ్రీ ఏ మౌతాడు? అతడు పవిత్రహృదయంతో తన చేతులలో నుంచిన అతని జీవితమును చివరికి తా నిట్లా దిద్దిందా? సుధాకర్ ఏమి కావాలి? తటస్థంగా ఊరుకోవటం తప్ప—ఈ విషమపరిస్థితులలో తా నేమి చేయాలో తెలవలేదు. ఆ అనుభవంలేని — వ్యథితహృదయునికి గడిచిపోతున్నాయి, గంటలు ... దొర్లిపోయినాయి దినాలు—

గడువు సమాప్తమైంది. తోటల్లో పిచ్చిగా తిరిగే శివశ్రీని బంధించి తెచ్చారు రాజభటులు. వెర్రి కేకల్తో సౌదామినిని పిల్చుకొంటూ ఆస్థానంలో ప్రవేశించాడు శివశ్రీ. అతనిలో ఈ నెల—ఈ ఒక్క చిన్న నెల ఎంత మార్పు తెచ్చింది! జవాబైనా చెప్పని శివశ్రీ "దురహంకారానికి" రాజుగారి అహంకారం హెచ్చుపెరిగింది. రాజాజ్ఞ నుల్లంఘించిన పాపానికి, 'శిల్పరత్న' పదవిని నిరసించిన శివశ్రీ దురహంకారానికి ప్రాయశ్చిత్తంగా మరణశిక్ష...కోటవెలుపలి కొండకొమ్ముననుండి క్రింద నదిలోనికి పడద్రోసి చంపాలి శివశ్రీని. సభ నిశ్వాసాలతో వేడెక్కింది. హాహాకారాలతో విలపించింది. కన్నీటిలో మసక కమ్మింది. ఓ మూలనుండి పెద్ద వెర్రికేక వినపడింది. విషాదావిలమైన ఆ స్వరం శివశ్రీ ఆప్తులదే అయివుంటుం దనుకొన్నారు. సభ్యులు సానుభూతితో—ఇద్దరికి మాత్రము అందులో ఏదో కనపడింది. వినపడింది. 'సౌదామినీ' అని అరిచాడు శివశ్రీ. 'రాణీ!' అన్నాడు సుధాకర్. కాని ఆమె లేదక్కడ. శివశ్రీ పరుగుపెట్టే ప్రయత్నాలన్నీ బంధించిన రాజభటులు వ్యర్థంచేశారు. సుధాకర్ శివశ్రీని విడువలేదు. తన రాణీ ఇచటి కెందుకు వచ్చినదో? ఎన్నడు గదినైన వీడి బయటికి రాని ఈమె నేడు బహుశా శివశ్రీ విషాదజీవిత వృత్తంమీద జాలిగలిగి రాజాస్థానానికి వచ్చివుంటుంది. అయినా కళాదేవి వరప్రసాదమూర్తిగా కనపడే శివశ్రీ ఇలా మరణించాల్సిందేనా అని అతని బాధ.

అయినా ఇంటికి పరుగెత్తాడు. సుధాకర్... మృత్యుమందిరానికి తరలించారు శివశ్రీని—

... ...

అప్పుడే కోడి కూసింది. చీకట్లు తొలగుతున్నాయి. ఉషశ్రీలు విరుస్తున్నాయి. క్రింద నదిలోనుండి ఒక మధుర—నీరస—స్త్రీ—స్వరం 'శివశ్రీ! శివశ్రీ!' అని జపిస్తున్నట్లు వినిపించింది. సరిగా పైనున్న ఉన్నతశిఖరంమీది శివశ్రీకి. 'సౌదామినీ' అని పెద్దగా జవాబుగా అరచాడు. 'శివా!' అని మళ్లా...'సౌదామినీ' అని తిరిగి...రాజభటులు విసరకముందే తానే దూకాడు క్రిందికి శివశ్రీ—'సౌదామినీ సౌదామినీ' అంటూనే. ఇంకా నీరసించిపోయిన గొంతు ఆహ్వానిస్తునే వుంది 'శివా' అని. చేరుకొన్నాడు తన సౌదామినిని చివరికి...కాని ఆమెకౌగిలిలో చేరాడో లేదో_ కన్నుమూశాడు. తన శివ తన్ను చేరుకొన్నాడు... ఈ రక్తపు ముద్దగానైనా...కౌగిలించుకొంది. గాఢంగా లేనిబలం తెచ్చుకొని...నదిలో కొట్టుకొని, మునిగి, తేలి, చేరుకొని రాత్రంతా ఆ నీళ్లలో, మితిలేని హృదయవేదనలో గడిపిన ఆమె సుకుమారశరీరం ఈ ఆయాసాన్ని సహించలేకపోయింది. విషాదసంఘర్షణల్లో విశీర్ణమైన ఆమెహృదయం ఈ విచిత్ర ఆనందాన్ని భరించలేకపోయింది. సౌదామినిప్రాణవాయువులు అనంతవిశ్వంలో లీనమయాయి—'సుధాకర్' చూచాడు విరాగిలా—దిగ్భ్రమతో—రెండు సుందర శరీరాలు గాఢాశ్లేషంలో నదీజలాల్లో జలజలా సాగిపోవటం—

'మరణము జీవయాత్రకు సమాప్తము కాదు,' అంటారు భారతీయతాత్త్వికులు. అందులో సత్యాన్ని పరిశీలించేందుకు ఇక్కడ అర్హతకంటె ఆవశ్యకత తక్కువ. కాని ఒకటిమాత్రం సత్యం. శివశ్రీ ఉత్తమ శిలావిన్యాసాలనూ, సౌదామిని ఉదాత్తసౌందర్యాన్నీ దర్శించేందుకు దేశం నోచుకోలేదు.

ఉత్తరరామచరిత్ర

(గత సంచిక తరువాయి)

శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి

ఋష్యశృంగాశ్రమమునం దున్న అరుంధతీ వసిష్ఠ కౌసల్యాదులు కోడలు లేని యయోధ్యకు వెళ్ళలేక వాల్మీకియాశ్రమమునకు వచ్చిరి. కూతురి కష్టమునకు సంతప్తుడైన రాజర్షి జనకుడు మిథిల విడిచి యడవుల సంచరించుచు నచ్చటికే వచ్చెను. అరుంధతీ కౌసల్యా జనకులును, ఆటలాడుకొనవచ్చిన లవుడును రంగస్థలమున గనవత్తురు. నాలవ యంకములోని ముఖ్యపాత్రము లివే—

వాల్మీకిరామాయణ మన్న భవభూతికి ప్రాణము. రెండవ యంకమునం దది నూతనవేద మని తన్నిర్మాణ కథ చెప్పించి మరల నిచ్చట దానిని లవునిచే ప్రశంసింపజేసి, అంతర్నాటకసూచనగా నందలి యొక భాగమును మహర్షి దృశ్యకావ్యముగా రచియించె నని పలికించెను. వృత్తవర్తిష్యమాణ కథాంశముల నైక్యము కలిగించు నీ రంగము కేవలము కల్పితము. ఇం దెక్కువగా పోషింపబడినది కరుణమే. ముందుగా సామాజికుల చెవిని బడిన జనకుని మాటలు కంట నీరు పెట్టించు ననుట యత్యుక్తి కాదు. పసిపిల్లగా నున్న కూతురి మొగము తలచుకొని వగచు నతని మాట లివి :—అనియత రుదితస్మితం—ఇత్యాది—

కలకల నవ్వు చొక్కపరి,
కావున నేడ్చుచు నొక్కసారి, యిం
పులు దులకించు కొన్న పలు
మొగ్గలకాంతులు పర్వ, ముద్దుగన్
తెలియని పల్కులన్ బలుక
నేర్చిన నీ పసిపిన్ననాటి కో
మలవదనారవింద మిదె
మానసదర్పణగోచరం బగున్"

అడవిపాలయిన జానకియవస్థ నూహించుకొని యన్న దుఃఖవచనము లివి :—

"నూనం త్వయా పరిభవంచ వనంచ ఘోరం
తాంచ వ్యథాం ప్రసవకాలకృతా మవాప్య,
క్రవ్యాద్గణేషు పరితః పరివారయత్సు
సంత్రస్తయా శరణ మిత్య సకృత్స్మృతోఽ
హమ్"

అనుచితనింద భర్త విడ
నాడినయట్టి పరాభవంబు కా
ననగతి కొన్న వేదన య
నన్యసహాయత దుఃఖవార్ధి మున్
చినతఱి దుష్టజంతువులు
చేరినయప్పుడు, భీతి జెంది, నా
యన! యని యెన్నిసార్లు హృద
యంబున నన్ను, దలంచితో కదా!

"నా వంశములోని పిల్ల కగ్నిశుద్ధి యేమిటమ్మా! రామభద్రుడు చేసిన యీ పరాభవమునకే తలవంచుకొనియుండ మరల మాకు లోకాపవాదమా?"

అని జనకుడు కోపముతో ననగా "నిజము నిజము. అగ్నిశబ్దము సీతాశబ్దముతో సరితూగజాలదు, సీత యంటే చాలును" అని పలికి, అరుంధతి సీతను స్మరించి, నీవు చిన్నపిల్లవైనా, శిష్యురాలవైనా నీ పవిత్రత నాకు నీమీద భక్తిని నెలకొల్పినదనుట జనకుని దుఃఖ ముపశమింపజేయుటకును ప్రవాదము పరిహరించుటకు నుపయుక్తమైనది. ఈ సందర్భములోని యీ క్రింది వాక్యము విద్వల్లోకవిశ్రుతము—

గుణాః పూజాస్థానం గుణిషు నచ లింగం నచ వయః"

లవుని చూచి 'వీడు చిన్నతనమునాటి మా రామచంద్రునివలె నున్నాడ'ని కౌసల్యయు, "వీనిముఖములో కూతురిపోలిక, యల్లుని పోలిక కనవచ్చుచున్న"

దని జనకుడును, తమలో భావించుట యెంత నైజమో, ఆ ముప్పురి సంభాషణము నంత సహజమై ప్రేక్షకులను రంజింపజేయున ట్లున్నది. జనకుని కున్నంత దుఃఖము కౌసల్యాదులకు లేదని యెవ రందురు? అయితే, ఏమి చేయుదురు? కడుపు చించుకొంటే కాలిమీద పడునుగదా!—విధిలేక దిగమ్రింగుచు నడవిలో తలదాచుకొనుచున్నారు. స్త్రీ లట్లు నోరు మూసుకొని కాలము గడపుచుండ, జనకుడు క్రోధావేశపరవశుడై రాముని పౌరజానపదులను శపింప బూనుట సముచితమా? ప్రజానురంజనము రాజధర్మమని యెఱుగడా? అని పాత్రౌచిత్యశంక యిచ్చట కలుగవచ్చును. ఎంతటి వివేకియైనా, తండ్రిప్రాణము. వచ్చిన కష్టమా, నిర్హేతుకము. లోకములో నే తల్లిదండ్రులు నిట్టి ఘోరవిపత్తు సహింపలే రని తెలుపుటకే కవి యీ పాత్రము నిట్లు దిద్దె ననుకొనుటయే సమాధానము. ఈపట్టున మఱియొక కవియైతే రామపక్షమున వాదించుటకు వసిష్ఠుని పిలుచుకొనివచ్చి వాక్కలహము కల్పించునేమో కాని, ఔచిత్యజ్ఞుడైన యీ కవి యట్లు చేయక జగత్పూజ్యులైన యరుంధతిమాటలచే నతని కోపమును చల్లార్చెను. ఆ సమయమందు లవు డన్న యీ మాట యెంత సందర్భోచితమో చూడుడు—

కౌసల్య:—తల్లీ భగవతీ రక్షించు. కోపించు రాజర్షిని ప్రసన్నుని గావించు.

లవుడు:—'అతిపరాభూతులైన మహర్షివరుల కోప ముడిగింప బ్రతిమాలుకొనుటె మందు.'

తరువాతకథకు సూచకమైన యిందలి మేధ్యాశ్వప్రసంగము పరుల తేజంబు నోర్వని లవుని స్వభావము నావిష్కరించుచు, పంచమాంకము నాహ్వానించుచున్నది.

పంచమాంకము నాక్రమించినదికూడా కరుణమే కాని, వీర మొకింత కలసినది. ఆదిలోనే సైనికులను బాణపరంపరతో తఱుముచున్న లవుని చూచి చంద్రకేతు వాశ్చర్యపడును. సారథి సుమంత్రుడు చూచి చిన్ననాడు కౌశికుని జన్నము రక్షించిననాటి శ్రీరాముని తలచుకొనును. వెనుకకు పోయిన భటులు మరల వచ్చుట చూచి—

"నా క్రుధాగ్నికిన్...."

వెనుకకుఁ బోయి హేలమెయి
వెండియు నాఁగుచు వచ్చు మీదు వా
హిని యొక ముద్దయయ్యెడు స
హింపను హేళన రండు రండికన్.

అనుచు లవు డనగా—చంద్రకేతు విట్లనెను—

"రమ్మ రమ్మ నీ...'
జత యన నీ బలంబు నిక
షంబన నే నిదె చంద్రకేతుఁడన్"

ఆ సమయమున లవుని పరాక్రమమున కచ్చెరు పడుచున్న సారథి, వీ రిరువురి ద్వంద్వయుద్ధ మెట్లంగీకరింతు నని యనుమానించుటయు, జృంభకాస్త్రము ప్రయోగించి సేనల నణగించిన లవుని మహత్త్వము కనుగొని తదస్త్రసంప్రదాయ మూహించుటయు, సాకూతములు. లవశౌర్యద్యోతకములు.

పిదప వీరకుమారు లిరువురు పరస్పరస్నేహానురాగముతో చూచుకొని తమలో ననుకొన్న మాటలును, వారి చేష్ట లాలోకించిన సుమంత్రుని మాటలును మన స్తత్త్వవేత్తయగు భవభూతి పరేంగితజ్ఞానమునకు జ్ఞాపకములు. కవి కావశ్యకమైన దర్శనమునకీ ప్రసంగము మఱియొక నిదర్శనము. కుమారుల మాట—

"యదృచ్ఛాసంవాదః కిము గుణగణానా మతిశయః?
పురాణో వా జన్మాంతరనిబిడబద్ధః పరిచయః?
నిజో వా సంబంధః కిము విధివశా త్కోఽప్యవిదితో?
మమైతస్మిన్ దృష్టే హృదయ మవధానం రచయతి.

"సమయవిశేషమో? నియతి
సంగత సద్గుణతా విశేషమో?
అమలిన పూర్వజన్మ సము
దంచిత మైత్రి విశేషమో? యవే
ద్యమయిన దేహబాంధవ మ
హత్త్వమొ? యీతని జూచినంత జి
త్తము కడు సావధానమయి
తత్పరమయ్యె నిదేమి చిత్రమో?"

అపుడు సుమంత్రుడు, తారామైత్రి యనియు చక్షూరాగమనియు వ్యవహరింపబడు నిష్కపటప్రేమ యొకానొకరి కొకానొకరిపై గలుగుట ప్రాణి స్వభావము. అని తలచి లవుని చూచి కన్నీరు గార్చుచు ననుకొన్న మాట యిది—

"మనోరథస్య యద్బీజం తద్దైవే నాదితో హృతం,
లతాయాం పూర్వలూనాయాం ప్రసవ స్యోద్భవః కుతః?"
నీదు మొలకెత్తు నభిలాష కాదియైన
బీజమును ముందఱే దుష్టవిధి హరించె,
హృదయమా! ఎక్కడైనను మొదలు కోసి
నట్టి తీగను మొగ్గలు పుట్టునొక్కొ?"

ఇందు, వీరబాలుర రక్తసంబంధ మవేద్యమైనా అది పరస్పరవీక్షణమున సహజప్రేమ స్ఫోరకమయి నట్లు వర్ణించుటయు, అడవిలో విడిచినపుడే సీత మృతి చెందిన దన్న తలంపుతో నిరాశపడుచున్నట్లున్నా, సుమంత్రుని మదిలో లవుడు సీతకొడుకు కాడా యన్న యనుమానము స్ఫురింపజేయుటయు, కవితో త్కర్ష నావిష్కరించుచున్నవి. ఈ ప్రకరణమందలి వీరు నువ్వురి మాటలు మానసాకర్షకములు; రసపోషక ములు. తరువాతి ప్రసంగములో 'మా పెదనాయన గారి ప్రతాపమునుగూడా సహింపవా?' అని చంద్ర కేతు వన్నపుడు "అది వేఱుమాట. క్షత్రియశర్మ మొకనియందే మూర్తీభవించి యున్నదా?" అని లవు డనుట ఔత్రమున కుచితమే గాని, "పరశురాము నోర్చిన యా మహావీరుని నీ వెఱుగవు. ఆయనయెడ యాక్షేపము చేయకు"మని, సుమంత్రు డన్నపుడును "ఆ రఘువీరుని మహిమ గణింపని యిత డెంతటి నాయ కోత్తముడో" అని చంద్రకేతు వన్నపుడును, లవుడీ క్రిందివిధముగా నన్న మాట లించుక విచారణీయములే.

"బ్రాహ్మణులకును వాక్కున, బాహుజులకు
బాహువుల నుండు వీర్య, మీ పల్కు నిజము,
శస్త్రధరుడైన విప్రు నా జామదగ్న్యు
గెల్చు టొక గొప్ప యాసె మీ క్షితివరునకు?"

"ఆ రఘునాథుని చరిత్రగాని మహిమగాని యెవ్వరెఱుగరు? చెప్పదగిన విశేష మేదేని కలదా; చెప్పుము. లేదా, ఊరకుండి వినుము—అది:—

"వృద్ధాస్తే హ్యవిచారణీయచరితా స్తిష్ఠంతు" ఇత్యాది—

"వారలు పెద్ద లా చరిత
వర్ణన కూడదు - సుందుసుందరిన్
బోర వధించి పేర్చిన య
మోఘయశస్కులు, వారి నుండనీ!
వీరు ఖరున్ వధించునెడ
వెన్కకుఁ బోయిన పోక, వాలిపై
సారశరంబు వేయు ఘన
చాతురియున్ జగతీ ప్రసిద్ధమే"

ఇవి, యీ రథికసారథులకు కాదు, సామాజికు లకు కూడా గర్వోక్తులుగాను, ఎత్తిపొడుపుమాటలు గాను ధిక్కారముతోడి కఠినవచనములుగాను తోచక పోవు. యాగీయాశ్వమును బంధించుటచే పోరాట యిన సిద్ధమే. లవుఁడు సంధికి వచ్చి గుఱ్ఱమును విడు చుట యబద్ధమే. అయినా వెంటనే యీ బాలు రిద్దరు యుద్ధమునకు దిగుటకు పై మాటలు త్వరపెట్టినమాట నిజము. ఇంక:—

లవుడు శ్రీరాముని మహిమ విననివాడా కాడు. ఇపు డతడు వర్ణించిన దతని మహిమయేనా? కాదు. అయితే, లోకోత్తరపురుషు డని యెఱిగియు నిట్లు సోల్లుంఠనముగా తిరస్కారభావము చూపుట యీ పాత్రమున కుచితమా?—దీని కంతకును మూలము నాల్గవయంకము కడపట నశ్వరక్షకు లన్న యీ క్రింది మాట:—

"యో౽యమశ్వః పతాకేయ మథవా వీరఘోష
సప్తలోకైకవీరస్య దశకంఠకులద్విషః [ణా,
ఈ తురంగంబు సప్తలోకైకవీరు
డయిన దశకంఠశత్రుని జయపతాక,
కానిచో నెల్ల రాజలోకంబునకును,
వీరఘోషణ యగు నిదే వినుడు వినుడు."

ఈమాట విని, సగర్వముగా లవు డపుడు "భూతల మరాజకమా యేమి" అనుచు, గుఱ్ఱమును కట్టివేయు డని వటువుల కాజ్ఞాపించెను. అపు డొక భటుండు 'ఛీ చపలా! ఏ మన్నావు?' అనుచు బెదరింప జొచ్చెను. ఆ వీరఘోషణాప్రసంగము మనస్సును కలచుచుండుటచే వీరౌద్ధత్యముతోప నిట్లు పలికెనని మనము సమర్థింపజూచినా, పైమాటలయం దనౌ చిత్యము స్ఫురింపకపోదు. అందుచే లవుని బాల్య చాపల్య మిందుకు కారణ మనుట యుక్తము. ఈ యభిప్రాయమును షష్ఠాంకమందు లవుని మాటలే యిట్లు స్పష్టపఱిచినవి. రాముని చూచినంతనే ముందుగా లవు డన్నదియు, దానిపై రాము డన్నదియు నివి:—

"మృష్యతా మిదానీం లవస్య బాలిశతాం తాతపాదాః. అశ్వానుయాత్రికేభ్య స్తాతప్రతాపా

విస్ఫురణ సుప్రత్యక్ష మీరాయిత మనేన— నన్వయ మలజ్కార్కః క్షత్రియస్య —

సుందర్శ్ని సుష్టింపదలచియే కవి యిచ్చట నీ పాత్రముచే వీరప్రతాపోచితముగా కమ్రోచితముగా ని ట్లనిపించె ననుట స్పష్టము. ఇక:—

లవచంద్రకేతువులు దివ్యాస్త్రయుద్ధ మొనరించుచుందురు. శంబూకవధ మొనరించి తిరిగి వచ్చుచున్న శ్రీరాము డా సంగ్రామము చూచి శాంతింపు మని కేక వేసి వారి నడుమ పుష్పకమునుండి దిగును. ఈ సుస్గరి సమావేశముతో షష్ఠాంక మారంభ మగును. లవుని చూచుట తడవుగా "ఇతడు లోకము రక్షింప నవతరించిన యస్త్రవేదమా, మూర్తీభవించిన క్షాత్రమా, సద్గుణగణమా, జగత్పుణ్యనిర్మాణరాశియా? ఇతనిని చూచినంతనే నా యంతరాత్మ దుఃఖము విడిచి స్నేహాభరిత మయిన దేమో!" అనుచు రాముడు లవ మయహృదయుడై తర్కించుకొనుటయు, అతడు కంటపడినంతనే లవుడు "ఆహా మహానుభావుని దర్శనము!

అంచితధ్యానమునకు నాహ్లాదపదము
పావనైకాంతభక్తికి పట్టుగొమ్మ-

మహనీయులందు విలసద్గంగాది తీర్థములందువలె నుహిమం బొకండు సహజంబై యుండు—అనుచు, పరమానందమున నతని మనసున భావించుటయు, అప్పట్టున సహజములు, కథాపక్షమున సాకూతములు. ఈ సందర్భమున, కుశలవుల జృంభకాస్త్రలాభము విని దాని సాంప్రదాయమును స్మరించియు, వారి పుణ్యమహిమ యనుకొన్నాడు గాని, తా నిచ్చిన యభ్యనుజ్ఞను స్మరింపలేదు. సీత యపుడే పోయినదని నమ్ముచున్న యతని కపుడు, లవుడు సీతకొడుకన్న యనుమానమేని యుదయింపకపోవుటయే కారణము. అది కవీంద్రుని కథాప్రవర్తనకౌశలము—

అంతలో, లవచంద్రకేతువుల యుద్ధము విని కోప ధైర్యములతో విల్లు మ్రోగించుచు వచ్చు కుశుని చూచి రాము డాశ్చర్యానందపరవశు డగుటయు, తమ్ముని వలన రఘుకులనాయకుడైన శ్రీరాము డిక్కడ నున్నాడని విని యతడు సవినయముగ సమీపించుచు నతని చూచి, ఆహా!

"అహో ప్రాసాదికం రూపమనుభావశ్చ పావనః,
స్థానే రామాయణకవి ర్దేవీం వాచ మవీవృధత్.

ఏమి యనుభావ! మేమి రూ పేమి మహిమ
అహహా! రామాయణ కవీంద్రుడు ఘనఘనుండైన
యర్హ నాయకు సమకూర్చె యర్హ దివ్య
ఫణితి వాగ్దేవి నుపయోగపఱిచెం గాదె?

తాతా, ప్రాచేతసాంతేవాసి యగు కుశుండు నమస్కరించుచున్నా డనుటయు, నెంత పాత్రోచితములో, ఎంత భావగంభీరములో! చెప్పెడి దేమి? తరువాత వీరు ముగ్గురు నొక చెట్టునీడ నుపవసింతురు. పిల్లలిద్దఱు తన కుమారులను భావము క్రమక్రమముగా సహేతుకముగా రాముడు నిరూపించుకొనుచుండును. ఇది యద్భుతమైన సమావేశము.

భవభూతి మంచి మంత్రికాడు. భార్య చని పోయిన దనుకొను భర్తను, భర్తను మానరాని భార్యను పంచవటీరంగమున కలిపి యద్భుతముగా మాటలాడించి యిద్దఱి నేడ్పించిన ధీరుడు. ఆ చతురత యీ వనరంగమునందు తండ్రి యనుకోని కొడుకులను, కొడుకు లనుకొనుచున్న తండ్రిని కలిపి మాటలాడించి, తండ్రిని మాత్రమే యేడ్పించినది. ఇందలి సాత్రపోషణము, వర్ణన నైపుణి యన నిదే యని చాటుచు ప్రేక్షకులను తన్మయులను గావించు నన్న నాశ్చర్య మేమి? చిత్రప్రదర్శనమందును ప్రథమాంక మందును ప్రసక్తికి వచ్చిన యంశము లెన్నో యిపుడు రాముడు స్మరించును. ఆ సతీపతుల యాంతర్యము, వారి రహస్య చర్య లెన్నో యిపుడు బయటపడును. ఈ ఘట్టమును విశదీకరింప బూనితినేని గ్రంథవిస్తర మగును గావున నుదాహరణకు రెండు మాటలు వినిపించెద.

తర్కించితర్కించి, కుశలవులు తన పుత్రులగుదురని మనస్సులో ననుకొనుచు, వీరి నడుగుదునా యని రాముడు కంట నీరు పట్ట 'అయ్యో! దుఃఖించుచున్నారే' మని లవు డడుగును. అదేమి మాటరా తమ్ముడా! అని కుశు డిట్లు మందలించును:—

"ననా సీతాదేవ్యాః కిమివ నచ దుఃఖం రఘుపతేః
ప్రియానాశే కృత్స్నం కిల జగదరణ్యం హి భవతి,
స చ స్నేహస్తావా నయమపి వియోగో నిరవధిః
కిమేవం త్వం పృచ్ఛ స్యనధిగతరామాయణ ఇవ"
ఆరయను సీతలేని బ్రతు
కక్కట దుఃఖమురాదె యేనికిన్?

ప్రేయసి పోయినన్ జగము
పెద్దయరణ్యము, వారి ప్రేమ మ
జ్ఞేయ, మపార మీ విరహ
సింధువు, దీని నెట్లుంగ వోర్తు? రా
మాయణ మెన్నడున్ జదువ
నట్టులు ప్రశ్నలు వేయఁజూతువే?"

దీనితో తన యూహ తలక్రిందు కాగా, ఆయూహలో చనను విడిచి రాముడు, నాయనా! రామాయణము లోని శ్లోకము విన సంతోషపడుచున్నా ననెను. కుశు డీక్రిందిశ్లోకము చదివెను.

"ప్రియాతు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి,
గుణై రూపగుణైశ్చాపి ప్రీతి ర్భూయో౽భ్యవర్ధత"

ఇది విన్న నాయకుని హృదయ మేమేమి స్మరించెనో! ఎంత పరితపించెనో!! దానికే తెలియును. లవుడు చదివిన,

"త్వదర్థ మివ విన్యస్తః శిలాపట్టో౽య మగ్రతః"

అను శ్లోకము విని రాముడు లజ్జించి దుఃఖించుటయు నట్టిదే. అంత, తన రాక విని తన్ను చూచ నరుంధతీ వసిష్ఠ జనక కౌసల్యాదులు వచ్చుచున్నారని విన్న రాముని హృదయావేగ మందుమా, ఊహాతీతము.

సీతను విడిచినదిమొదలుగా నీ ద్వాదశవత్సరములలోను రాముడు దుఃఖమూర్తియై జీవముతో నున్నా డనుటకు తెలిని యీ మాట యొక్కటి చాలును:—

"ఏ, డెక్కడి పాపజీవుడ నో
యిప్పటికైన నశింప దెక్కటా!"

ఇంక, సకలవిషయనిర్ధారణమున కవతరించిన సప్తమాంకము చూతము. ఈ మహాకవి యద్భుత సృష్టిలో నద్భుతమైన యిదే అంతర్నాటకము. ఇందలి కథాసంవిధాన మంతకంటె నద్భుతము.

ఈ యంతర్నాటకము నిర్మించినవారు వాల్మీకి మహర్షిగారు. దీని నభినయించువా రప్సరసలు. గంగాతీరము రంగస్థలము. సామాజికులు, దేవాసుర దేవయోని విశేషులు, జంగమస్థావరములు, సకల పౌరజానపదులు, కుశలవచంద్రకేతువులు, అరుంధతీవసిష్ఠాదులు, రామలక్ష్మణులు. వాల్మీకి పిలిపింపగా వచ్చిన శ్రీరాముడు సభాసన్నివేశము గావింపు మని తమ్ముని నియోగించెను. అత డట్లు సిద్ధము చేసెను. ఇంక:—

ముందుగా రంగస్థలము జొచ్చి సూత్రధారుడు:—

"మేము యోగదృష్టితో చూచి కరుణాద్భుత రసమిశ్రము పావనమునైన చిన్న రూపకము నిర్మించినాము. గౌరవబుద్ధితో దీనిని సావధానముగా తిలకింపుడు." అని వాల్మీకిమహర్షిగారు సకలసామాజికుల కానతిచ్చుచున్నారని చెప్పి, రాముని యానతిని లక్ష్మణుడు నడవిలో విడిచిపెట్టిన సీత దిక్కు లేక ప్రసవ వేదన భరింపలేక గంగలో పడుచున్న దని కథసూచించి పోవును - ఇది ఏకపాత్రప్రయుక్త ప్రస్తావన. ఇది ప్రథమాంకకథకు తరువాతి విషయము. పండ్రెండు సంవత్సరముల క్రిందటిది.

ఇక నాటకప్రయోగమున తెలియవచ్చిన ముఖ్య విషయము:—

సీత నీటిలో పిల్లలను గన్నది. గంగావసుంధరలు వారిని గట్టుకు చేర్చిరి. అమ్మా నే నీ యవమానము సహింపలేను, నీలో లయము గావించుమని సీత యనును. పిల్లలు పాలువిడిచినపిదప నీ కోరిక నెఱవేర్తునని భూదేవి యనును. ఆ పాత్రములు నిష్క్రమించును. తరువాత,

ఆ మాటలు విన్న రాముడు నిజము తెలిసికొని, హా సచ్చరిత్ర దేవతా! దీనినిబట్టి నీవు లోకాంతరమున విశ్రమించియున్నా వనుట నిశ్చయము. హా దేవీ! అని మూర్ఛిల్లును. అనంతరము వాల్మీకి యన్నట్లుగా, అద్భుతముగా సముద్రమునుండి లక్ష్మి పైకి వచ్చినట్లు సీతాదేవి గంగలోనుండి పైకి వచ్చును. గంగావసుంధర లామెను తీసికొని వచ్చి యరుంధతి కర్పింతురు. ఆమె లోకమునకు సత్యవృత్తము వినిపించి రాముని కర్పించును. పుష్పవృష్టి కురియును.

ఇందు వాల్మీకి ప్రతిజ్ఞను బట్టియు సీతా గంగా వసుంధరా పాత్రముల మాటలను బట్టియు, కుశలవులను గన్నపిదప సీత భూమిలో లయమైనదన్న రాముని యభిప్రాయము నిజమని విదితమగును. ఇకనో, ఉత్తర కాండ వాల్మీకి నిర్మితము కాకపోయినను (కాదని నా సంస్కృతకవి జీవితమున నిరూపించితిని..) పౌరాణిక సంప్రదాయమును బట్టియు, ఉత్తరకాండను బట్టియు, కుశలవులను వాల్మీకి పెంచెనన్న విషయము కవి తెలిపెను గాని, వారిని కన్నపిదప సీత జీవించియున్న దన్న విశ్వాస మతనికిని లేదు. అందుకు తగినట్లె యీ

యంతర్నాటకము నిర్మించెను. అయినా నాటకము శుభాంతము గావించు నుద్దేశముతో పై విధముగా సీత నర్పింపజేసెను. ఇది కారణముగా నీ నాటకమందలి ప్రధానరసము విప్రలంభశృంగారమనియు సకరుణ విప్రలంభ మనియు, కొందరూహించిరిగాని, కవి మతమున కరుణమే ప్రధానమనుట స్పష్టము. కవి యీ రూపకమును శుభాంతము చేసినసందర్భముకూడా యంథ్రుకే తోఁప్పడుచున్నదని పాఠకు లూహించియే యుందురు.

ఈ మహాకవి వీరప్రధానముగా మహావీరచరిత్రను శృంగారప్రధానముగా మాలతీ మాధవమును నిర్మించెను. ఆ రెంటికికూడా దేశమున వ్యాప్తి లేకపోలేదు గాని, యితని కెక్కువ కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన నాటక మిదే యనవచ్చును. భాషలో కరుణరస కావ్యము లెన్నో యున్నవి గాని, దృశ్యకావ్య దృష్టితో మాచువారికి దీనిని మించిన దింకొకటి లేదని తోచక పోదు. ఒక్క పొల్లుమాట లేకుండ నక్కఱలేని పాత్ర మొక్కటియు రాకుండ నొక నిమిష మేని వ్యర్థము కాకుండ:—

"వీనుల విందు కన్నుగవ
వేడుక నాలుక తీపియై కథా
ధీనముగాగ బుద్ధి రస
దీప్తముగాఁగ మనంబు మేను భా
వానుగతంబుగాఁగ గతి
నాత్మనికైన ముదంబు నీతి వి
జ్ఞాన మొసంగు కావ్యము ని
జంబుగ రూపక మెంచి చూడఁగన్."

అను లక్షణమున కనుగుణమై సర్వాంగసుందరమై చిరస్థాయి యగు దీనిని మనము వినుతించుట లెక్క కాదు. ఇతని సహవాసి యను వాక్పతిరాజే యిట్లు నుతించినాడు:—

"భవభూతిజలధినిర్గతకావ్యామృతరసకణా ఇవ స్ఫురన్తి,
యస్య విశేషా అద్యాపి వికటేషు కథానివేశేషు"

ఈ కవీంద్రునికి రామాయణమువలెను కరుణ రసముమాడ్కని, మిక్కిలి ప్రియములైన పదార్థములు మఱికొన్ని కలవు. వానిలో మొదటిది గోదావరి. తత్తీరమున జన్మించి తత్పరిసరారణ్యముల విహరించినవా డగుట యందుకు కారణము. అట్లే వన ప్రదేశములలో పంచవటి, గిరులలో ప్రస్రవణాద్రి, మృగములలో ఏనుగు, లేడి, పక్షులలో నెమలి, చెట్లలో కడిమిచెట్టు, అత్యంతప్రియములు. వృత్తములలో శిఖరిణి యితని కభీష్టమని క్షేమేంద్రుని మాట వల్లనే విదితము:—

"భవభూతేశ్శిఖరిణీ నిరర్గళతరంగిణీ,
చకితా ఘనసందర్భే యా మయూరీవ నృత్యతి"

దీనినంతనుబట్టి యితడు ప్రకృతి నుపాసించిన పావనశీలు డని స్పష్టమగును. వేదవేదాంతిసాంఖ్య మీమాంసాదులు పఠించిన యీ వశ్యవాణి సుదా ద్వైతు డని యీ కృతిలోని యీ మాటయే చాటు చున్నది.

"విద్యాకల్పేన మరుతా మేఘానాం భూయసా మపి,
బ్రహ్మణీవ వివర్తానాం క్వాపి విప్రలయః కృతః"

దాంపత్య మద్వైత మనుచు వర్ణించుటకూడా యితని మతమునకు జ్ఞాపకమే. ఇంక గ్రంథము పెంచ నేల?

"యం బ్రహ్మాణ మియం దేవీ వాగ్వశ్యే వానువర్తతే,
ఉత్తరం రామచరితం తత్ప్రణీతమ్...—

(దీనికి పాఠాంతర ముండుగాక) అను నితని ప్రస్తావనావాక్యము నితని యాత్మస్తుతిపరత్వమున కారోపింపక, వాస్తవమైన యితని వాణీప్రియత్వమునకే యారోపింతము. చెప్పినట్లు చేసిన తీర్ణప్రతిజ్ఞుడు కాడా భవభూతి?

"ప్రాచేతసేన యాఽఽసీతా పాలితా భవభూతినా
సర్వత శ్చర్వ్యతే వాణీ సైవాద్య కవిమానిభిః"

విజయతాం భవభూతివాణీ. ఇతి శివమ్.

వృత్రవధ

★

శ్రీమతి నాయని కృష్ణాకుమారి

[పాత్రలు]

బృహస్పతి

మనువు	...	దధ్యంచుడు
యయాతి	...	అధర్వాణుడు
అంగిరసు	...	అత్రి
భృగువు	...	కణ్వుడు

మఱికొందఱు ఋషులు

కాటుక పూసినట్లు లోకమంతా చీకటి. ఆ అంధకారంలో సుఖాలు తెలియని మనుష్యుల స్వరాలు తొరట్లాడుతూ ఉంటవి.]

మొదటి గొంతు : ఏమిటే ప్రళయం?

రెండవ గొంతు : అంధకారం లోకాన్ని వరించింది.

మూడవ గొంతు : ఉషస్సు! ఏదీ చల్లని తల్లి? ఆమెతనుద్యుతి చల్లారిపోయిందా?

మొదటి గొంతు : ఆమె నయనద్వయంలో కాంతిరేఖలు ఆరిపోయి ఉంటవి.

రెండవ గొంతు : ఎవరు నువ్వు? (ఒళ్ళు తడిమి) నీవు—దేవలుడవా ?

మూడవ గొంతు : మా జైగీషవ్యుడేడి నాయనా? ఎక్కడోయి? ఇటు, ఇటు! తండ్రీ! కొస్త చేయూత.

దేవలుడు : హా! భగవతి! ఉషోదేవి! * ఆచార్య బృహస్పతి ఆకట్టుకుని ఉంటాడు నిన్ను.

జైగీషవ్యుడు : (స్పర్శ సహనయించి) ఎవరిది? అరిష్టనేమి?

అరిష్టనేమి : ఆం!...అదును చూచుకొని విచ్చలవిడిగా చిందులు తొక్కుతున్న ఈ చీకటి చూడు.

వసుహోముడు : ఓ నిశాదేవతా ! భద్రా ! మమ్మల్ని సులభంగా తరింప చేయుదానవుకా!

ఉతథ్యుడు : ఓ అదితీ! ఓ మిత్రావరుణులారా ! మా అపచారాలు మన్నించి కాపాడండి.

[కణ్వాదు లెనమండ్రుగురు ప్రవేశిస్తారు. తపోలబ్ధములైన కాంతివాహినులు వారి శరీరాలనుండి వినిర్గతములై చీకట్లను పాఱద్రోలుతుంటవి.]

జాజలి: ఆహా! ఆచార్యభృగువు! ఆ అగ్రగామి!

కపిలుడు : అదుగోనయ్యా! ఆర్యుడు కణ్వుడు గూడ నున్నాడు.

దేవస్థానుడు : ఇటు, ఇటు చూడు! దధ్యంచ, యయాతి, మనువులు! ఏమి కీవి! ఎంత పావనులు వారు!

అరిష్టనేమి : అదుగో! అందరి నసుక ఆ మహాత్ముడు అంగిరసు.

కొందఱు : ఇక నేమి? ఆరిపోయిన ఆశలు పునరుజ్జీవితములైనవి.

మఱికొందఱు : ఈ ప్రళయసమాప్తిని వారు పొందించగలరు.

* ఉషస్సు ఆయన భార్య.

ఇంక కొందఱు : ఉష్ ! ఆచార్యభృగువు, ఆ ఆర్యు డేదో చెప్పనున్నది.

... ...

భృగువు : ఓయి మహర్షులు! సుఖదుఃఖాతీతులు! మీరు అవధానంతో వినండి.

అరిష్టనేమి : ఏమి చెప్పునో ఆర్యుడు?

దేవస్థానుడు : అది ప్రియము కారాదా? భగవంతుడు ఇంద్రుని కటాక్షము మననుండి తొలగకుండును గాక!

కొందఱు : ఉష్! అవధానముతో వినండి.

... ...

భృగువు : మనవిరోధి - ఆ నీచుడు - వృత్రుడు.

కొందఱు : ఆఁ! ఏమి? ఆ పాపివలన నేమి ఉపద్రవము?

మఱికొందఱు : ఆర్యులు విపులముగ చెప్పి మన శాంతిని కలిగింతురుగాక.

భృగువు :—ఆ చల్లని తల్లి—ఉష—దాని బందీ...

అందఱు :—ఆఁ!

రోమశుడు :—హా దివోదుహిత! శంబరునంతటి కరుకువా డైనా డేమి తల్లీ ?

సోమకుడు :—ఏమి పాట్లు అవక్షీణరు !

అర్వావసువు :—పాపము ! బృహస్పతి !! ఆచార్యునకు మనస్థైర్యమె చెడునోయ్ !

ఉతథ్యుడు :— కాదటయ్యా ? ప్రాణమునకు ప్రాణము ! ఆవిడ విడినందుకే అసువులు వదలవలసిన మాట.

కొందఱు :—ఉష్ ! అవధానముతో వినండి !

... ...

గౌతముడు :—ఆఁ ! అంతటితో బోక ఆ సప్త గోవులను కూడ ఆకట్టెనా ?

చ్యవనుడు :—సప్తసింధువుల నడ్డగించి, జీవ స్రవంతులను చేతులతో ఇనికించెనా ?

కపిలుడు :—సూర్యుని సప్తాశ్వముల కళ్లెములతో క్రక్కదలించి అంతఃపాతాళమున అణచివైచెనా ?

దేవలుడు :—ఇక లోకమునకు వెలుగు ?...

జైగీషవ్యుడు :—ప్రాణములకంటె ప్రియములగు హోమధేనువులు ?—

అరిష్టనేమి : —ప్రాణముల నిలువరించుట కాహారము ?...

అర్వావసువు :—ఆరోగ్యదాయి - ఆహ్లాదకారి ఆదిత్యుడు ?...

అందఱు :—నాస్తి ! నాస్తి ! హా భగవాన్ !

ఉతథ్యుడు :—అహో నిగ్రహ ! ఇక కారుచీకటి తమఃప్రవృత్తిని మన కాపాడించి కన్నబిడ్డలవలె సాకుకొంటుందా !

అరిష్టనేమి :—ఇక చల్లనితల్లి - ఆ నవరూప ఉషాదేవిని చూడలేం మనం ?

జాజలి :—ఇక వేయి వెలుగులు వేల్పు-ఆయన పొన్నపూచాయ నీరెండ-కనపడదు మనకు.

అందఱు :—నాస్తి ! నాస్తి ! హా భగవాన్ !

కొందరు :—ఓ చిత్రావసు ! దయగలదానివి... మమ్ము భద్రంగా దరిజేర్చు.

మఱికొందఱు :—ఓ యింద్రుడా ! ప్రతీచీ దిక్కును జయించిన మహావీరుడా ! మమ్ము కాపాడవయ్యా !

దేవస్థానుడు :—ఉష్ ! ఆగండి ! ధ్యాననిమగ్నులైన కణ్వులు ఇప్పుడే లేచి ఏదో చెప్పబోతున్నారు.

జైగీషవ్యుడు :—అతిప్రసన్నమైన ఆయన ముఖం చూస్తే ఆశాంకురాలు వర్ధితాలవుతున్నవి.

... ...

కణ్వుడు :—ప్రజ్ఞానిధులారా ! మనకు తరణోపాయము లభించింది.

అందఱు :—అహో మా భాగధేయము ! ఎట్లు? ఎట్లు ?

కణ్వుడు !—ఇంద్రుడు—మనప్రభువు...

కపిలుడు :—అవును. ఆయన ఆజ్ఞ మన మాటలకు మల్లెల దండ.

కణ్వుడు :—అతడు శక్తిమంతుడు.

గౌతముడు :—అవును. ఆయనశక్తిచేతనే మన క్షేమ మింతవరకు పరిరక్షిత మైనది.

కణ్వుడు :—అతడు శతక్రతువు!

చ్యవనుడు :—అవును. మనచే నిర్వహింపబడిన క్రతువులలో సోమపాయియై, హవిష్యభోక్తయై — అతడు శత్రునాశకు డగును.

కణ్వుడు :—ప్రజలకు మేలొనగూర్చుట అతని కనుపాప.

వసుహోముడు : — అవును. అంధకారమున దాగిన అసురులను తరుమగొట్టుటకు, దేవతలందరిలో ఆయనొక్కడే పూనుకొనునది.

కణ్వుడు : — మనము ఆచార్య బృహస్పతిని ప్రథమ యాజ్ఞికుని జేయుదము. మన్వాదు లేడుగురు ఆ సప్తాస్యునకు సహాయులగుదురు గాక! మహోన్నతి పర్వతము లందేపుగ పెరుగు బంగారుచాయ సోమ వృక్షములనుండి చిలుకొరముగల సోమరసము సిద్ధ మగు గాక! పశువు హవిస్సులతో యజ్ఞవాటి అలరు గాక! పది తెరగుల *ధీతులు భూనభోంతరమ్ముల మారుమ్రోగును గాక!..... మనము రాత్రి క్రతుకర్మ ప్రారంభింతము. అందు మంత్రపూరితములగు హవిస్సులతో, పవిత్ర సోమపానముతో బలవంతుడైన ఇంద్రుడు వృత్రుని వధించును. ప్రజలకు సుఖప్రాప్తి కలుగజేసి ప్రభుధర్మమును నిలువరించును.

కొందఱు :—అవును. అది ఆచరింపదగిన పని. ఆచార్య బృహస్పతితోడ మన్వాదులను ఋత్విజులుగ అర్థించుచున్నాము.

అందఱు :—వారు శీఘ్రముగ ఇంద్రుని పూజింతురుగాక! ఉక్థలను పఠించి అక్షయమించిన సోమముచే ఆయనను పురికొల్పుదురుగాక!

దేవలుడు :—కాని...

కొందఱు :—ఏమి దేవలా ?.. దేవలా ?...

దేవలుడు :—వృత్రుడు. బలవంతుడు!

వసుహోముడు :—కావచ్చును.

దేవలుడు :—వానికి నూరుకోటలున్నవి. అవి అయోనిర్మితములు...

జైగీషవ్యుడు :—అయిన ?

* (ధీతులనగా) మంత్ర యుక్తములైన ప్రార్థనలు—

దేవలుడు :—వాడు నదులనే చుట్టు ముట్టిన వాడు! సూర్యునే అకట్టినవాడు!

అరిష్టనేమి :—నిజము. మన ప్రభువింద్రుడు అతని నెదుర్కొనునా?

ఉతథ్యుడు :—ఎదుర్కొని నిలువరించునా?

కొందఱు :—ఏమి ఇంద్రుడసమాన పరాక్రమ శాలి.

దేవస్థానుడు :—అతడు తన వజ్రముతో వృత్రుని తుత్తునియలుగ గొట్టును.

రోమశుడు :—ఆ ప్రహరణమువలననైన శబ్దముచే భూమ్యాకాశములు దద్దరిల్లును.

సోమకుడు :—వజ్రమును నిర్మించిన త్వష్టి కూడ ఆ సమయమున గడగడ వణకును.

జైగీషవ్యుడు :—అవును. ఆ ప్రభువు కోపదేలిన తన ఆయుధపుటంచులతో వృత్రుని ప్రాణములహరించి ప్రజకాహ్లాదము సంధించును.

అందఱు :—తథాస్తు.

కొందఱు :—మనుష్యులను ద్వేషించు వృత్రుడు క్రిందికి పడిపోవును గాక.

మఱికొందఱు :—ఇంద్రునిచే చంపబడి దస్యు సంతానము అజ్ఞాతముగ అధోలోకమునకు పోవుగాక.

ఇంక కొందఱు :—మా శత్రువు మూడు లోకముల అడుగు భాగమున నశించును గాక.

అందఱు :—తథాస్తు! ఓయి శతక్రతు! మా మీద పగగొన్నవారి నందఱిని చంపుము. ఈ సంభవింప నున్న యుద్ధమునందు మారక్షణకై ఉత్సుకుడవుగమ్ము.

౨

[యజ్ఞవాటి - హోమధూమాలతో ఆవృతమైన ఆ స్థళం పవిత్రతకు రూపులు దిద్దుతూ ఉంది. ఏకముఖంగా లగ్నమైన అక్కడి వారిదృష్టి అచంచలత్వాన్ని పొంది కార్యదీక్షలో మగ్నమై పోయింది.]

బృహస్పతి :—మరుత్తులతో గూడిన ఇంద్రుని సోమపానము చేయుటకు పిలుచు చున్నాము.

అత్రి :—మాచే జేయబడు ఈ స్తవము శ్రేష్ఠమై నీకు సుఖప్రదాయిని యగుగాక.

కణ్వుడు :—ఓయి ఇంద్రా! అభిషవించిన సోమము నిమిత్తము నిన్ను బిలుచుచున్నాము.

భృగువు :—దర్భలపై నభిషవించి రసవంతము లైన సోమములను దేవవిభుడు పానము జేయుగాక.

అంగిరసు :—బలప్రదాయి ఇంద్రుని రక్షను క్షేమమును గోరి ఆహ్వానించుచున్నాము.

దధ్యంచుడు :—యాజ్ఞికులము మేము - పవిత్రమైన మంత్రములతో నింద్రు నాకర్షించుచున్నాము. మాకోర్కెలను ప్రభువు కడముట్టించునుగాక.

అందఱు :—హే అధిప! అలసింపక మంత్రములచే పిలువబడినవాడవై మాకు మేలు కూర్చు.

అంగిరసు :—ఓ శతక్రతు! పవిత్రమంత్రాలచే ఆహూతుడవై నీవు మా ఆపద కడతేర్చు.

అథర్వణుడు :—ఓయి ప్రభు! హోమ ధూమాలచే కప్పుకొని సుగంధయుతాలయిన ఈ హవిస్సులు నీకోసమే.

బృహస్పతి :—ఓ ఇంద్రా! నిర్భయముగ దీర్ఘతమస్సు మమ్మావరింపనట్లు రక్షించెదవుగాక.

అత్రి :—నీ కనుగుణమై అవసరమైన శక్తిని మా నుండి గ్రహించుము.

అందఱు :—కర్మసంబంధమైన సోమరూప హవిస్సులు - సుశీలురగు యాజకులస్తుతులు - ఆర్యుడు, ఇంద్రు నాకర్షించుగాక.

... ...

దేవలుడు :—అదుగో, అదుగో! వృత్రుని మందిరములో చీకట్లు కమ్ముతున్నవి.

జైగీషవ్యుడు :—మాదేవయ్యా! చూడు! ఆర్యునకు, ఆ దాసునకు యుద్ధ మారంభమైనది.

ఉతథ్యుడు :—ఆ, ఆ! త్వష్టృకుమారుడు—ఆ అసురుడి మాయచే ప్రభువును గప్పివేయుచున్నాడు.

కొందఱు :—భళి! ఆర్యుడు వానిమాయలను - సూర్యకిరణములు మంచును వలె, విడగొట్టినాడు.

కపిలుడు :—జాజలీ! జాజలి! కొంపమునిగినది.

జాజలి :—ఆ!...వృత్రుని సహచరుడు కుత్స యనువాడు మనప్రభువును బంధించెను.

ఉతథ్యుడు :—ఏలనయ్యా? అంతభయము! ప్రభువు ఎంతలో విడిపించుకొనెను...బలమైన బుజ విస్ఫూర్తిచే పిప్రసహచరుని విసిరికొట్టినాడు.

దేవస్థానుడు :—నిజము... చూడు! మన ప్రభుని కెంత సమయస్ఫూర్తి! మరుత్తులను, విష్ణుని, అగ్నిని అటు కాపుదలబెట్టి వజ్రమాత్ర సహాయుడై చకచక తొంబదితొమ్మిది ప్రవంతులను తరించుచున్నాడు.

దేవలుడు :—బాపురే! ఇక కోటలను గూడ ముట్టడించినట్లే

అందఱు :—అహో శతక్రతు! విజయీభవ!

అరిష్టనేమి—ఎంత అద్భుతముగ విజయి ఐనాడోయి ప్రభువు?

వసుహోముడు :—మంత్రపూతమైన సోమపానము—సామాన్య మా మఱి?

దేవస్థానుడు :—హవిస్సుల బలమూరక పోవునా మఱి?

జైగీషవ్యుడు :—ఆచార్య బృహస్పతి ఆశ్వర్యమున పొల్లు వచ్చునా మఱి?

కొందఱు :—అదియట్లే! అదియట్లే!

అందఱు :—విజయోస్తు! హే భగవన్!

రోమకుడు :—ఇంతవరకు వృత్ర తూర్యము ముగిసినది.

సోమకుడు :—ఇక ఆర్యుడు అప్తూర్యమును మొదలిడినాడు... చూడు! రౌద్రమూర్తియై శత్రులను చెండాడు ఆ శోభ చూడు!

అర్వావసువు :—చేతికి జిక్కినవారు పిడికెడుప్పునకు కొఱగాకుండ పోవు ఆతీరు చూడు!

చ్యవనుడు :—అతెన్నుస ప్రభుని మించి చెలరేగిన మరుత్తుల విజృంభణ చూడు!

కొందఱు :—అహో! ప్రభువు చాతుర్యము! సప్తసింధువుల చెరబాపినాడు... అవి విశృంఖలములై సంతోషపు పొంగువలె పొర్లి వచ్చుచున్నవి.

అందఱు :—హే భగవన్! అది ప్రాణాధారము—జలము.

అరిష్టనేమి :—అయినదా? అప్తూర్యము ముగిసినట్లే ఇక!


రత్నం
అతిమృదువైనది!
సబ్బు వాడుటలో కిట్టుం :
నురుగుతీసి రుద్దుకో - అంతేగాని
సబ్బునుశరీరంపైఅరగతియ్యకు
సబ్బుపెట్టెనుపొడిగావుంచుము.
దీని లావణ్యమైన నురుగు చర్మమునకు చాలా మెత్తదనం యిస్తుంది. పరిశుభ్రంగా చేసి, సిల్కువలె చర్మాన్నితయారుచేస్తుంది. చర్మం మోటుగా, పాలిపోయినట్లు చెయ్యదు.
మైసూరు
శాండల్ సోప్

ఉతథ్యుడు:—అహా! ఇక గో-ఇష్టి! గోవులన్న ఆయన కేమి ప్రియము? ప్రభువు హృదయమును మన కన్న ముందాక్రమించుకొన్నవవి.

జైగీషవ్యుడు :—ఓయి!మాయదారి రక్కసుడు, ఎన్ని మెలకువలు ... ఆర్యుని దెబ్బ అతి చిత్రముగ దప్పించుకొనెనే!

జాజలి :—అయ్యో! అయ్యో! అక్కడతో ఆగినదా? మన ప్రభున కొపాపిష్టి ఖడ్గాఘాతమే తగిలినది.

కొందఱు :—ఆఁ ఆఁ! తూలిపోవు చున్నాడు ప్రభువు.

మఱికొందఱు :—మంత్రములు! మంత్రములు!

ఇంకకొందఱు :—యజ్ఞాగ్ని ని ప్ర జ్వ రి ల్ల జేయుడు! ఆర్యుని నూత్నశక్తి ఆవహిల్లవలయును.

అందఱు :—సోమపాయికి జయము కలుగవలె! మంత్రపూతములగు హవిస్సుల శక్తి రిత్తపోకుండు గాక!

*   *   *   *

చ్యవనుడు :—అమ్మయ్యా! తేరుకున్న ప్రభుని జూడ నా కన్నులలో వెన్నెల లొలకినవయ్యా!

గౌతముడు : శ్రమచే ప్రభుని ఫాలమున ఉబికిన స్వేదకణములు ఆరునట్లు విసరవలెనని యున్నది నాకు.

కొందరు :—ఏమిప్రభువు! ఎంతధీశక్తి! ఆహా!

రోమశుడు : అదిగో! బాహాబాహి,ముష్టా ముష్టి అప్రతి స్పర్థులిరువురు విజృంభించు చైనను జూడు!

వసుహోముడు:—భళి! నలుడు బాహుకుడైనాడు! వృత్రుని గర్వముబాగుగా అణగినది... అదుగో! అదుగో! ఆర్యుడు విజయగర్వమున రొమ్మప్పళించి గోవిమోచనము గావించుచున్నాడు.

కొందఱు:—ఆహా, ప్రభువుప్రజ్ఞానిధి! గోవులు విడివడినవి- అవి హోమధేనువులు- కామధేను తుల్యములు.

అందఱు :—జయము! గోసంరక్షణాధిషణ! జయమునీకు!

జాజలి :—ఇకదివిష్టి మొదలైనదయ్యా!

సోమశుడు :—ఈ దెబ్బతో వృత్రుని పనిసరి.

ఉతథ్యుడు :—కాక ?...ఇంతకు - అవిష్ణుని చేతనే చచ్చినంత దెబ్బతిన్నాడు.

అర్వావసువు :—కావలసినదే! అముగ్ధ-దక్షిణా దేవిని ఉసురు పెట్టినపాపి!

గౌతముడు :—పాపము! తెక్కకొన లేదోయి వృత్రుడు!- ఇంతలో ఆర్యుడు విజృభింపనే విజృంభించినాడు.

చ్యవనుడు :—ఇక నొక టేమోక్షము-అదిచరమము.

*   *   *   *

బృహస్పతి :—వృత్రు డింద్రునిచే జంపబడి మూడు లోకముల యడుగుభాగమునకు బోవుగాక!

మనువు :—మనుష్యులను ద్వేషించిన ఆతుచ్ఛుడధః పతితుడగును గాక!

కణ్వుడు:—ఓశూరుడా! దిక్కులేని అరి, నీశరణు జొచ్చును గాక!

అంగిరసు:—ఓ ఇంద్ర! అతివిశాలమై, నిర్భయమైన వెలుగును మేము పొందెదము గాక.

యయాతి:—ఓయి ఇంద్రా! వృత్రుని సంహరించి వెలుగు సంపాదించుకొని వచ్చుటకు తగిన బలము మంత్రపూతములైన హవిస్సు లనుసంధించు గాక.

భృగువు :—శతక్రతు దత్తమైన శక్తిచే శోభిల్లు నీవు జయమందుదువు గాక.

అందఱు :—మాచే పఠింపబడిన మంత్రములు వృత్రుని ప్రాణములను నీవైపున కాకర్షించును గాక.

...   .

జైగీషవ్యుడు:—ఆర్యుడు ఋజిశ్వన సహాయుడై బలిష్ఠములైన పిప్రుని కోటలను తునా తునకలు చేసెను.

అరిష్టనేమి:—అందుకే కాదు. ఆ దాసుని కన్నులలో అపజయము తొలుకాడుచున్నది?...ప్రభువు-సోమపానముచే కైపెక్కిన కనులలో, మదోన్మత్తత తాండవించుచున్నది.

దేవలుడు :—అదిగోనోయి! కొన తేరిన వజ్రముతో ఆర్యుడు వృత్రుని మొగముపై బొడుచుచున్నాడు.

వసుహోముడు :—అంతే, అంతే! అసహాయుడైన పిప్రుని ప్రభువు చావగొట్టి చెవులు మూసెను.

అందఱు:—శంబరుడు హతుడైనాడు. ప్రభూ! ప్రభూ! విజయీభవ!

కొందఱు:—ఆహాహా! అతడేనయ్యా పరాక్రమశాలి! పిప్రుని చీకటి గోతిలో పాతిపెట్టి సూర్యరశ్మి లేని గాఢాంధకారమున వధించినాడు ప్రభువు.

[ఇంద్రుడు విడిపించిన ఉషస్సు - ఆమె వెనుక ఆదిత్యుడు—ఒక్కపెట్టున లోకాన వెలుగు చిమ్ముతుంది]

ఉతథ్యుడు :—కన్నులు వచ్చినట్లు—ఎక్కడిదోయి ఈవెలుగు ?

జైగీషవ్యుడు :—అహో ఉషోరాగపు ప్రసన్నత మలయమరుత్తువలె దెసల గ్రమ్ముచున్నదోయి!

దేవలుడు :—ఆమె ఉషోదేవి—ఆ నవరూప సుప్రసన్న—ఇప్పుడు మనకు...

జాజలి :—ఆమె వెనుక సూర్యదేవుడేనా?... ఆ అన్నా చెల్లెండ్రు చీకటి పాలిటి గొంగలు.

అరిష్టనేమి :—ఆదిత్యదేవుని కళ్ళల్లో తొలుకాడే ఆ వాత్సల్యముచూడు! చెల్లెలిపాటు కతని నిప్పుగుండె కూడా కరిగిఉంటుంది.

గౌతముడు :—చ్యవనా! చ్యవనా! ఇటు— ఇటు చూడవయ్యా! యజ్ఞవేదికపై నున్న ఆచార్య బృహస్పతి కన్నులలో నీరు చిలికినదేమి ?

చ్యవనుడు:—కొనున్న ప్రియాసమాగమసూలమున నుబుకు ఆనందబాష్పములవి.

కపిలుడు :—ఆదక్షిణ - సాధ్వి - నీరునిండిన కళ్ళతో, ఆవేగాన పతి పాదాల పై వ్రాలడానికి వస్తూన్న ఆ వైఖరి ఎంత పూజనీయమోయి!

కొందఱు :—అహో! విజయియైన ఆర్యుడు ప్రసన్నముఖముతో మనవైపుకే తరలివస్తున్నాడు.

ఋత్విజులు :—హే అధిప! సోమపాయివై, హవిర్భోక్తవై, అహర్నిశము ప్రజాహ్లాదకారివికా!

అందఱు:—జయము! వృత్రహన్ జయము!! జయము!!

భక్త్యంజలి

★

శ్రీ బులుసు వెంకటేశ్వర్లు

౧

పరమభారతస్వాతంత్ర్యభాగ్యసిద్ధి
కొఱకు స్వార్థము లవమైనఁ గోరకుండఁ
దనువు మనువును నర్పించి చనినయట్టి
ధన్యపురుషుల కధిక భక్త్యంజలి యిదె.

౨

పరమసుందరితోడి వివాహమట్లు
పరమభారతస్వాతంత్ర్య భాగ్యసిద్ధి
కొఱకు నురికంబముల నెక్కి నఱుకఁబడ్డ
ధన్యపురుషుల కధిక భక్త్యంజలి యిదె.

౩

పరమభారతస్వాతంత్ర్యభాగ్యసిద్ధి
కొఱకుఁ గారాగృహంబులకున్ సమస్త
జీవితంబును ధారవోసిన యనంత
ధన్యపురుషుల కధిక భక్త్యంజలి యిదె.

౪

పరమభారతస్వాతంత్ర్య భాగ్యసిద్ధి
కొఱకు నజ్ఞాతవృత్తి నకుంఠితమగు
సేవ చేసి గతించిన భావనీయ
ధన్యపురుషుల కధిక భక్త్యంజలి యిదె.

౫

పరమభారతస్వాతంత్ర్యపర్వదినము
భరతవీరుల దివ్య సంస్మరణదినము
ధర్మసత్యాగ్రహపవిత్ర కర్మఠు లగు
ధన్యపురుషుల కధిక భక్త్యంజలి యిదె.

నా హృదయం

'విశ్వం'

నాహృదయం
పగుల్లుతున్న ఘనాఘనం
నాహృదయం
పిగులుతున్న మహానగం
నాహృదయం
రగులుతున్న బడబాశిఖి
నాహృదయం
ధగధగమను నాగుపడగ
నాహృదయం
ప్రళయకాల ప్రభంజనం
నాహృదయం
మలయానిల ప్రకంపనం
లోకపు పాపాల భైర
వానీకం నమలి నమలి
చీకటిలో చెడగ్రక్కిన
కాకోలం కరుడుకట్టి
కాక లుమిసి కంపు గొట్టి
కడలదాక క్రమ్ముకొన్న
పాషాణపు మూసలోన
శతసహస్ర పుటాలలో
శతధా పరిశుద్ధమైన
బంధూకపు సిధూరం... నా హృదయం
ఆకలి మిడినాగుకోడె
చీకటికోఱల గ్రసించి
కాటేసిన విషపుఘాటు
కాలేయం చుట్టుకొనగ
గఱుసువారి కాఱు నలుపు
గంట్లకట్టి నుడివోలిక
గురుభేతాళాకృతితో
గుఱగ లెట్టు శ్వేతవరా
హాని కిఱవు సమకూర్చె
ఘోర కుధర గహ్వర వ ప్రాకారం
నా హృదయం

వల పెఱుగని వాజమ్మల
తలపుల తలుపులను జీల్చి
కలకాలం గొడ్డుబోతు
వలకాకల చిక్కి చివికి
జలధారాసేచనతో
చెలువగ్రమ్మి చావనున్న
తీయని చవి, మాయనీక
కాయవాటు వయసు నిచ్చి
కమ్ర మధూదయిని దెచ్చి
ఆమ్ర కిసాలయము నిచ్చి
ఆనందోద్యానవీధి
నలనల్లన పరతెంచే
మలయానిల కలగానం... నా హృదయం.
ఇరుప్రక్కల విరులు విరిసి
తరువుల తలబరువు మెరసి
జరజరజర పఱతెంచే
సెలయేటికి జీవమిచ్చి
కలనాదం పలికించే
వలపుల పెదజల్లించే
చలువజలద పంక్తిలోని
నిలువనీటి తెఱల చాయ... నాహృదయం
మొండిచెట్టు ఖండించగ
మోసులెత్తి ఒకేఒక్క
ముడిపై గుడిగా నిల్చిన
మొగ్గలోని కింజల్కం... నాహృదయం.
లోనలోన కుళ్ళి కుళ్ళి
బోనానికి పనికిరాక

కోనగుమ్మడిని గ్రుచ్చిన
కోడికత్తి... నాహృదయం.

బోడికొండ బొమ్మజెముడు
కాడలపై గఱుసువారి
వాడి మొక్క వంగియున్న
కాడుముళ్ల కంకాళం... నాహృదయం.

సగము కాలి పొగ లుమిసే
భగభగభగ తెగమండే
నిగనిగనిగ సెగ లెగసే
రగులుతున్న చితులచుట్టు
పగులుతున్న తల పుర్రెలు
ప్రిదులుతున్న గుండెపొరలు
చదలగంటు చమురు తెరలు
జంబుకాల సందోహం
జబర్దస్తి తెగబలిసిన
వల్లకాటి వసపిట్టా... నాహృదయం.

అమృతభాండ మబ్ధినుండి
అమరులకై అందించిన
ఆ మహర్షి ధన్వంతరి
అంగుష్ఠం
నాహృదయం.

నా హృదయ పరీత నవ్య
నానా రూపాలకోటి
నాళాలకు అంతు లేదు.
నరనారాయణ నాగేం
ద్రత్రిమూర్తివిగ్రహమ్ము
కరిగిపోసి రూపు దించి
సరిజేసిన అచ్చుదిమ్మె
నాహృదయం.

ఆమని మామిడి చివురుల
కోయను కోయిల గొంతుక.
వేసవియెండల మంటల
విలపించే నదీఘోష,
వర్షాభ్రం ఫెళఫెళఫెళ
పగిలి మ్రోయు ఉరుము మ్రోత
కలగలిసిన సింఫోనీ... నాహృదయం.

పడిపోయిన కొంప జూచి
బావురుమంటుం దొకపుడు.
చెడద్రొక్కిన చేను జూచి
మిడిమేలపు మెకాలపై
విరుచుక పడుతుం దొకపుడు.
కడతేరిన మొదవు జూచి
నడివీథిని పడి దొర్లే
నక్క దోసకాయ జూచి,
చిక్కి శల్యమైన కుక్క
బక్క పీన్గు కనుగ్రుడ్లను
ముక్కులతో పొడుస్తున్న
మాలకాకి దూల జూచి,
కాలుతున్న ఇనుప ఊచ
కాడలతో పొడిచివేయ
గాలంలా వెడలుతుంది-
శూలంలా తాకుతుంది
నా హృదయం.

పరపీడన పరమావధి
పరశ్రమే ఉపాధిగా
పరభోజన పోషణమున
బ్రతికే సోమరి పోతుల
బండతనం మొండితనం
ముండతనం చూచినంత
గుండె కుమ్మరకుట్టినట్టు
కుతకుతకుత ఉడుకుతుంది
కుమ్మరావముకుండవోలె
నెమ్మదిగా యెర్ర నెక్కి
నిగ్గుదేరి అగ్గికాలి
నిగనిగతో ఖణేలు మని
నినదిస్తుం దీ హృదయం
ప్రణదిస్తుం దీ హృదయం.

నాకలోక ధునీపద్మ
నవనీతప్రాయ మధుర
మధుధారా సేచనాన్ని
కథలల్లో కావ్యాల్లో
కమ్మని గానం చేస్తూ,
మురుగుగుంట పురుగులలో
ముక్కు పెట్టి కుక్కబతుకు
బతికే మూర్ఖులను చూచి
భూ నభోంతరాళం, బ్ర
ద్దలు కొట్టే ఛీత్కారం
బయలుపరుస్తుం దొకపుడు.

నీతీ నియమం అంటూ
గోతుల్లో పూడుకున్న
గొఱ్ఱెదాటు భావాలను
గొణగొణగొణ వల్లిస్తూ
నల్లకుక్క కనిపిస్తే
వళ్ళుబికే కామమ్మల
జల్లుమనే రామన్నల
కళ్ళలోని కావరాన్ని
కసిబిసిగా పగలబిండి
కాకులకూ గద్దలకూ
కలంకారి మొద్దులకూ
కాలమానం లేకుండా
కొంగులలోకి పోగూ లని
కోరుతుంది నా హృదయం.

సంగనాచి మాటలతో
టుంగుబుర్రలా కులికే
రంగు తోలుబొమ్మలనూ
కొంగజపం దొంగలనూ
భంగికొటి కొట్టి కొట్టి
'భవసాగర మీదలేను
ప్రభూ! నన్ను కొనిపొ'మ్మను
పాడుబండ సన్నాసుల
బీడుబతుకు, కాడుబతుకు
మోడుబతుకు, నీడబతుకు
చీడపురుగు బతుకు జూచి
ఛీఛీ అంటుం దొకపుడు,

తాడూ బొంగరము లేని
మోడుజనం, లోకాన్నే
కాడు జేసి పారేసిన
కాంచనాన్ని పూజిస్తూ
కాంక్షిస్తూ కలవరిస్తు
కాసులకై మాసులనే
మాసులనే దాసులుగా
మోసు కెళ్ళి అమ్మకునే
ముచ్చులనూ మూఢులనూ
దాసత్వం భూమికలలో
దాచుకున్న దరిద్రులను

కుక్షింభర ముష్టిజాతి
భ్రష్టుల కనుగొన్నంతన
భగ్గున మండు నొకప్పుడు,
మూతి నాకు మాటలతో
గోతి త్రవ్వి తడిబట్టల
గొంతుకోయు క్రూరాత్ముల
మంతనాల జతనాలకు
మారణహోమం చేయగ
మంత్రపునశ్చరణ జేయు
మహాయోగి
నా హృదయం.

నాహృదయం కోకోపల
నవభావోద్యాన కుంది
పుపుపువ్వున పొర్లిపోయి
రివురివ్వున పరతెంచే
దవుదవ్వుల వ్యాపించే
పవమాన ప్రకంపనకు
జివుజివ్వున మొరయు నొక్క
కవి విపంచి కల దక్కడ.

ఈ అనంత భూగోళంలో
ఏ మూలలో ఏ నేలలో
ఏ మనిషో ఏ జాతో
ఏ సంఘమొ, ఏ వర్గమొ,
ఏ పీడన కగ్గమైన
ఈ విపంచి కంపిస్తుందీ
ఈ విపంచి విలపిస్తుందీ.

ఏ బాధను ఏ గాథను
ఏ సోదను విన్నంతన
ఏదో ఒక బరువు గొంతు
ఏడుస్తుం దందులోన
ఏ రాక్షస దంష్ట్రిల లో
కారాధ్య ప్రజగుండియ
కూరాకై నలుగుతున్న
మారాముల పడుతున్నా..
క్రోధఘూర్ణితాబ్ధిక్రియ
రోజూకుంటు పైకి లేచి

రంకె వేసి నిలుస్తుంది
రణగర్జన చేస్తుందీ
నా హృదయం.
నా హృదయం.
నా హృదయం.

పర ప్రతారణ
పరబుద్ధుల, మం
పరను వదలి, కం
పరను పుట్ట ఫా
లాక్షుడు తా ప్ర
త్యక్షుండగా మోగు
రొడ్డి నిలిచినా
గడ్డికఱవ కే
ళోద్ధతి నురికే
ప్రబుద్ధ జన సం
బరము జూచి అం
బరము నందు కొని
విరామ మెఱుగని
పరాకు తెలియని
జరామరణ౯గుల
చాయపడిని ని
ర్జర వజ్రా ఘా
త రక్తరంజిత
పరమ వీర శం
ఖారవ మట్టుల
గర్జిస్తుందీ
నిర్జిస్తుందీ.

కర్కశ కరోత్క
టక దష్టిత క
ర్మవీర బాహు
శ్రమాపనోదన
చణమై చల్లని
మల్లెల వెల్లువ
చల్లే జల్లున
కల్లోలాలను
వెల్లివిరియు, రా
గాల మూర్ఛనల
గానము సేయుచు
కలస్వరాలను
కల్పిస్తుందీ
జల్పిస్తుందీ.

ఈవిపంచి మ్రోయించని
వేని లేవు.
ఈవిపంచి వాయించని
వేవి లేవు
ఈవిపంచి పల్కించని
వేవి లేవు
ఈవిపంచి ప్రపంచించు
నెన్ని యేని.
మావిమ్రోకల చిరువురు
తొవిచిందు.
కావి బూపపిందెల నయ
గార మొందు.
మోవివిరిసిన చిరునవ్వ
మ్రోత లొలుకు
నీవిపంచిక విశ్వరూ
పావసథము.

వలవల యేడ్చును
కలకల నవ్వును
జలజల ముక్తా
ఫలముల రాల్చును.
చలముపట్టి, ఏ
డులతరబడి, ఏ
కలుగున దూరిన
విడువక, కొలిచి
పొడిని చేసి, సా
పడును త్రేన్చునూ,
నవకమ్ములతో
జవజవలాడే
జపాప్రసూన
స్ఫువుల విదిల్చే
పువుబోడులవా
చవుల తేనియ
దవిలికరిగి, అం
డాల నిండు, చెం
దొగలరాల్పు, చం

చిరము దాల్చు, కం
ధరము విచ్చు, మం
దారమాలికా
ధారాంతర సూ
త్రాకృతితో, సా
కార ప్రేమ సు
ధా రంజితమై
సారాకన్నుల
తారాజువ్వల
హార తెత్తునూ

నాహృదయం

పారాతిరుగును

నాహృదయం.

చతురవాక్యమ్ము విన్న
నా మెతలు వట్టు
రుచిరరేఖల గన్న
నర్రులను చాచు
శిశిరహిమకణ మంజుల
శీర్ణ కుసుమ
సంచయమ్ముల విధుర
సుష్కతను జూచి
కంచుగొంతుక నెత్తి ఘోషించుచుండు

నాహృత్కుశేశయ
అంతర్నివేశనముల
కల దొక్క జవరాలు
కలువపూల రేకులవలె గుస్తరించిన
ఆమె అంగకముల వెన్నెలల్ గాయు
కన్ను లెత్తిన నెత్తమ్మిగుత్తులు
చిత్తజల్లుగ చిందుచుండు,
వాలుగల చాయ లోరగన్నుల
నెర్రజీర తోచును,
గొంతు కెత్తిన
నవనీతమృదుత జారు.
నిండు యెడద కారుణ్యమ్ము పండు,
కేలుదోయి కదలింప
కోమల తోరణాలు జల్లుజల్లున రాలు.
కజ్జలము లూర్చు ముంగురులు
నాయెడంద దోబూచులాడు.

శిల్పి చెక్కిన లావణ్యసీమ లెందరేని గల
రైన వారల మేనిచాయ
లేదొ శైతల్యమున గుండె నిల్వ ముంచు,
నీమె గన్గొన నీరెండ లివతళించు.
శాస్త్రముఖులలోని కొలతల
చక్కజేసి, దిద్ది తీర్చిన
బొమ్మల తీరు వేరు.
ప్రకృతి తన యిచ్చవచ్చిన వరవడులను
సృష్టిజేసిన యీయమ తీరు వేరు.
ఖరకరునిబోలె ధగధగ
మెరవదు, హిమకరునివోలె
మించమన్ తన దే
కరణిని తారక వోలిక
చిరుమినుకును గాదు
గుండె చీల్చుక పోవుగా.
ఆమె దేవత కాదు, దైత్యయును కాదు
మగువ, కేవల మానవ మాత్రురాలు
అమృత మివ్వ దాసవమ్మైన నానదీదు
చలువనీటితో వెన్నెలల్ చిలుకరించు.
సుమపరిచయ మొసయించదు
కమనీయ మధూక సరణి కాన్పించదు ఈ
రమణీమణి సామాన్యుల
కమే యాత్మ మహాత్మ్యములకు నావలిదగుటన్.
కనీనికా కల్పిత గీతిరమ్యా
వినీత హృజ్జల్పిత రీతిశమ్యా
అనేక భావాకుల మూర్తిధన్యా
సా నిత్యకన్యా మమభాగ్యజన్యా.
చుక్కల మనసుల నెరగదు
చక్కని పూబాస తెలిసి చావదు
మరి ఏ చిక్కుసమస్యల నెరుగదు
మక్కువతో నన్ను కళ్ళ మాట్లాడించున్.
భువి వదలదు, దివి కెగరదు.
చవులూరుచు పాలవెల్లిచాయ జవదు మా
ఘువనీ వని విహరింపదు
నవలామణి వర్ణిమనిషి నానావిధులన్.
మనసు నిద్రింపించి
మనుషులను మరపించి
కనరాని అనురాగ
కళలలో మురిపించి

తనియించి ప్రైయక్తి
కత పెంచి, దంతాల
మేడలో నుంచి పా
రాడ నీనట్టి
బంధన ము కా దీమె
ఇంధనము కాని.
లోకంలోనే నరకయాతనల,
చీకట్లలో కుమిలి కృశించే
పాకీవాని జీవితపరమార్థం
నాకు చూపి, పిడిబాకు గ్రుచ్చినది
నీకోసంగా నీవు బతకడం
నీచత్వమ్మని నూరిపోసినది
ఈ జవరాలే
నా జవరాలే.

మగటాల జిగిదేలు
నగరాల నడివీధి
మొగబట్టి కాళ్ల మూ
పురము తో నీడ్చుకొని
బరువైన జీవనా
శ్వాసము బట్టి నడుచు పాం
థుల నుదుటి చెమట చూ
పించి ఏడ్పించినది
ఈ కాంతయే
ఈ దయాస్వాంతయే.

పల్లె బీడుల
వల్లకాడుల
నల్లుకొను తీ
వెల్లు పెంచిన
ఇళ్ళు, రా కూ
తుళ్ళ విరహము
చల్లజేయుట
కొరకు గాదని
మళ్ళలోనూ
రాళ్ళలోనూ
పెళ్ళలోనూ
బ్రతుకు కాల్చుక
కళ్లలో ఊపిరిని విడిచే
ముళ్ళ మనుషుల
ఇళ్ళ దేవత
వెళ్ళిపోగా పాడువోయే.

గుళ్ళు ఈ పాద
రి శ్ళటం చును
కళ్ళు విప్పిం దీమెయే
వళ్ళు కదిపిం దీమెయే.

చిలిపితనం గ్రు
చ్చిలు కన్నుల వ
ర్తిలు దైన్యం కు
ప్పలు కోసుక తి
ప్పలువడు మూడం
చుల చీరెల కా
సుల వెచ్చము కొం
పల గూల్చగ కు
క్కల పక్కల నొ
త్తిలిన మనిషి ను
క్కలను కాకిపి
ల్లలను ముట్టవని
పలికిన దీజవరాలే
పలికించిన దీ జవరాలే.

పలుకు పలుకు
ములుకులు గా
పులకరింప
చిలకరించి
కలత రేపి
పలికించిన పడతి, మనసు
మలిపించిన మగువ, కత్తి
ఝళిపించిన చాన, ముక్తి
తలపించిన తన్వి ఈమెయే.

ఎంత సాహసి యామె,
చెంతనే నిలుచుండి
మంతనా లాడుతూ
ఎంత ఏడ్పించినది
ఎంత కదలించినది
ఎంత రగిలించినది
ఎంత చదివించినది
ఎంత! ఏంత!! ఏంత!!!

ఎంత అగాధ మామె
హృదయాంతరాళం.
ఎంత గభీర మామె భావన
ఎంత తీక్ష్ణమైనదామె ఆవేశం

ఎంత సూక్ష్మమైన దామె ప్రతిభ
ఎంత లక్ష్యశుద్ధి గల దామె ధైర్యం
ఎంత యెత్తైన మనిషి
ఎంత లోతైన మనిషి
ఎంత ఘాటైన మనిషి
ఎంత చాటైన మనిషి
రంపాన కోసినా
కంపర మెత్తని గుండె.
శంపాలత ప్రచ్చినా
కంపించని కనుపాపలు
చంపి చంపి అణువణువును
చింపి చింపి చెండాడిన
తెంపరియై తుదిదాకా
నింపాదిగా నెమ్మదిగా
నిండు కుండలా వెళ్ళే
దండిమనిషి.

కాపురాలు నాపరాళ్ళైపోగా
దీపంలో ఆముదానికి దిక్కు లేక
కోపాలనే వండుకుని
శాపాలతోనే పరిషేచనం చేసి
పాపాలతోనే
ప్రాణాహుతులు తీసుకుంటున్న
వారిని చూచి సొరిపోదు
మరి,
దూరదృష్టితో దుగ్ధతో
దుర్భిణీయంత్రం వేసి
లోతుల్లోకి చూచి
ఈ పాడుబావుల్లో నిండుకున్న
పూడు మట్టిని తీసి
తోడుపడాలంటూ
తోరతోరగా
తాడూ బాల్చీ తీసుకొని
బయల్దేరుతుంది.

దిక్కు లేదురా కంబగిరిరామా యని
బిక్క మొగం వేయదు.
తుక్కూ దుగ్గూనే ఈ సరుకంతా అని
పక్కనపడి తల విదిలించుకొని
చక్కా వానప్రస్థానికి,
కాపడెత్తదు.

చుక్కలు చుట్టూ ఉన్నాయని
దిక్కుతెలీక
నిక్కి నింగిలో వెలిగే
చుక్కలవేపు చూస్తూ
సొక్కిపోదు.

గొప్ప చెలుకగాడలను కొని
చొప్పదంట్లు నెమరేస్తూ
చప్పగా ఉండడమే
చక్కెర స్వభావమంటూ
జబ్బ చరిచి వాదానికి దిగే
నిబ్బరస్తులను చూచి
యెబ్బెట్టుగా వెక్కిరిస్తుంది.
'తబ్బిబ్బు కాకండి నాయనా
గబ్బిలాలెందుకయ్యేరురా
ఉబ్బిపోబోకండి తండ్రీ'
దిబ్బలో కూర్చుండి
దినిటేల వెదకినా
దివ్య మాణిక్యాలు
దొరకవంటుందీ
పురుగులే అందులో
పొరలు నంటుందీ.

మనిషిని మనిషి పీక్కుతినే
మాయకాలం పోయేదాకా
తనువూ, మనసూ, చనవూ, మనుగడా
ధనయత్రాలైన
దగ్ధయుగం భగ్నమయ్యేదాకా,
సొంపూ సోయగమూ
మూతవున్న డబ్బీలలోనే
పరకాయ ప్రవేశం చేసివున్నాయనుకునే
కరకాక్యశకం గలించేదాకా,
కవిత్వం, కథలూ, చిత్రకళా, సంగీతం,
లవలీలాస్యం, తాండవనృత్యం
సర్వ సమస్తం
మార్వాడీ కొట్టులోనే
తాకట్టు పెట్టాలనే
గర్భదరిద్ర శతాబ్దం
గతించిపోయ్యేదాకా,
ఆరోగ్యవనాలూ విశ్రాంతిసదనాలూ
ఆసుపత్రులూ, ప్రసూతివైద్యాలయాలూ


శిశుగృహాలూ బాలోద్యానాలూ
చెక్కుబుక్కుల బరువునుబట్టే
చిక్కే దుర్గతి నశించేదాకా
బాలశిక్ష మొదలు* 'మాల' శిక్ష దాకా
కూలంకషంగా చదివినా
గాటిని బడితేనే గాని
కూటికి నోచుకోని
విడ్డూరపు కాలం
ఊడ్చుకు పొయ్యేదాకా
కండలుకోసి పోళ్ళేసుకొని
కుంపకాల్చుకునే కర్మకాండ
నిర్మూల మయ్యేదాకా
నిండుమనిషి గుండెల్లో
పుండు మానిందాకా
పండుమనిషి వెన్నెముక
దిండు కానుకునేదాకా—
కండువా వేసుకున్నవారికే ఆస్తరణలూ,

*1 MALAW

మండువాల్లున్నవారికే మడతమంచాలూ,
దండిగా తిన్నవారికే దబ్బకుర్చీలూ,
మొండిజనాభాకే సభాతాంబూలాలూ,
గుండీలు బంగారం వైతేనే ఉంగ్రాళ్ళూ,
మింపల మిడతలైతేనే మేనాలూ,
దంపలో మంచిముత్యాలుంటేనే బరాబరులూ,
ఖండితంగా సొంత కారుంటేనే కరస్పర్శలూ,
ఉండునునే—

దిక్కుమాలిన రోజులు
నక్కల పాలయ్యేదాకా
లోకానికి శాంతిలేదు
దేశానికి కాంతిరాదు
మనిషికి మర్యాదుండదు
మగువకు మానం నిలవదు.
మందమతీ మధ్యతరగతీ
బృందగతీ బృహస్పతీ
నందిరతీ నయవిరతీ
ముందుగతీ గను సుమతీ.

[శ్రీపం]



శ్రీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారు

శ్రీ బండారు తమ్మయ్య

పండితప్రకాండులగు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి యాకస్మికాస్తమయవార్త విని యఖండసంతాపమునకు లోనయిన మిత్రమండలిలో నే నొకండను. ఆంధ్రభాషాసేవను బహుముఖములుగ గావించిన ధన్యమూర్తులు శ్రీ శాస్త్రిగారు. తద్విశేషములను సెప్టెంబరు 'భారతి' లో మిత్రులు శ్రీ నిడదవోలు వేంకటరావుగారు కొంతవఱకు వివరించియే యున్నారు. తమ పాండిత్యమును గవిత్వమును గేవల మవధానములకు, గావ్యరచనమునకు, అధ్యాపకజీవనమునకే వినియోగించియున్నచో శాస్త్రిగా రాంధ్రసారస్వతమున కత్యంతము చిరస్మరణీయములగు సేవను గావించిన వారుగాకయే యుందురేమో!

అధ్యాపకపదవిలో ప్రవేశించిన కొలదికాలమునకే యందుండి మరలి యన్వేషక (పరిశోధక) పదవిని వారు స్వీకరించుట దైవప్రేరణమున ఆంధ్రలోకమునకు లభించిన మహాదృష్టముగ గణింపదగును. మదరాసు ప్రాచ్యలిఖితపుస్తకాలయ మందలి యాంధ్రపండితపదవిలో శాస్త్రిగారిలో గర్భితమై యున్న సహజపరిశోధనాశక్తికి, ప్రతిభాశక్తికి బట్టుగొమ్మయై యిట్టిట్టనరాని నిట్టలంపు సేవను వారిచే బహువిధములుగా దెలుగుబాసకు జేయింపగల్గినది. అందుండి యుపకారవేతన మొందినయనంతర మట్టి పదవియే తిరుపతి దేవస్థానమందలి ప్రాచ్యపరిశోధనాలయమున వారికి బ్రాప్తించుట మఱొక పుణ్యవిశేషము. తత్ఫలితముగ గడచిన కొలది వత్సరములలో వా రొనర్చిన ఘనకార్యములు లోకమునకు సువిదితములు. ఈదృశోత్తమోపకృతుల నితోధికముగ నొనరింతురని యాశించుచున్న తరుణములో వా రిట్లు లస్తమించుట మన దురదృష్టము—విధివిధానములు దుర్గ్రాహ్యములు గదా!

శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు ప్రాచ్యలిఖితపుస్తకాలయమున Specicl Assistant to The Curator పదవియం దున్నప్పుడు తాళపత్రగ్రంథసంపాదనముకయి తమ పండితబృందముతో కోనసీమకు ౧౯౧౪-౧౫ ప్రాంతమున వచ్చినప్పుడు నేను అమలాపురము తాలూకాకచేరిలో బనిచేయుచుంటిని. అప్పుడే శ్రీ కవిగారితో నాకు ప్రథమపరిచయభాగ్యము లభించి వారితో నేను గూడ గొన్ని గ్రామముల కేగి తోడ్పడియుంటిని. అప్పుడు ప్రభాకరశాస్త్రిగా రేకారణముననో సెలవుమీద నుండుటచే తత్సంచారములో గవిగారితో వచ్చియుండలేదు. లేకున్నచో వారి పరిచయభాగ్యము కూడ నా కప్పుడే గల్గియుండెడిది. వారి నామప్రతిభాపరిచయములు మాత్రము పత్రికావ్యాసములమూలమున నంతకుముందు కొన్నియేండ్లనుండియే వారియెడ నాకు గౌరవభావములను గలిగించియుండెను.

మన పూర్వకవులలో శ్రీనాథకవిసార్వభౌమునియందు నాకు మొదటినుండియు నభిమానము మెండు. నేనె యన నేల? అతనియెడ నట్టి గౌరవాభిమానములు లేని తెలుగుబిడ్డ డుండండనియే నా నమ్మకము—ప్రభాకరశాస్త్రిగారు కూడ శ్రీనాథునియెడ నాకన్న నెక్కుడు భక్తిగౌరవములు గలవారనియే యెన్నదగును—శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు కూడ అభినవ వ్యాసులు, వాల్మీకులు, కాళిదాసులు, భట్టబాణులు, తిక్కనలు మున్నగువారు వెలసియున్నారేగాని యభినవ శ్రీనాథులు మాత్రము వెలయలేదని, యెప్పటికిగూడ వెలయజాలరని యొక సందర్భమున వ్రాసి శ్రీనాథుని యద్వితీయస్థానమును బ్రశంసించియున్నారు. శ్రీ వీరేశలింగము పంతులు గారి యాంధ్రకవుల చరిత్రము ప్రథమభాగము పునర్ముద్రణములో శ్రీనాథుని చరిత్రము

నందు వారు లిఖించిన కొన్ని విషయములు నాకు దలకంటగించుటచే వానిని జదివినప్పుడు భావావేశముతో 'శ్రీనాథమహాకవి గుణతత్త్వ విచారము' అను వ్యాసమొకటి వ్రాసి ప్రకటింప నెంచితిని. కాని వ్రాతలో నూహించిన దానికన్న నెక్కువయి యది యొక గ్రంథముగా దయారయ్యెను. అంతలో శ్రీపంతులుగారు పరమపదించుట జరిగెను. దానితో నా గ్రంథమును బ్రకటించు నభిలాషము కూడ నీరసించెను.

కొన్ని సంవత్సరముల తరువాత ౧౯౨౨ లో చారిత్రకవిషయ సంబంధికములగు నందలి ఖండములు "క్రీడాభిరామము శ్రీనాథునకు దానితో గల సంబంధము" "శివరాత్రి మాహాత్మ్యరచనాకాలము" అను రెండు మాత్రము, ఆంధ్రపత్రికా సారస్వతానుబంధములో బ్రకటించియుంటిని, కేవలము శ్రీనాథుని శీలగుణతత్త్వములకు సంబంధించిన భాగము లప్పటికి నిప్పటికి గూడ బ్రకటింప నేలేదు. కాని యంతలో శ్రీ ప్రభాకరశాస్త్రిగారి "శృంగార శ్రీనాథము" ౧౯౨౩ లో ప్రకటితమయ్యెను. దానిలో శ్రీనాథుని శీలమునుగూర్చి శాస్త్రిగారు సంగ్రహముగ నయినను వీరేశలింగముపంతులుగారి యభిప్రాయముల ననుగమించినట్లు వ్యక్తమగుటచే నందు గూర్చియు, అభిప్రాయభేదములు గల మఱికొన్ని యితర విషయముల గూర్చియు "శృంగార శ్రీనాథ విమర్శనము" అను పేరితో గొన్ని వ్యాసములను ఆంధ్రపత్రికా సారస్వతానుబంధములో గొంతవఱకును, "సారస్వత సర్వస్వము" అను మాసపత్రికలో సమగ్రముగను ౧౯౨౮-౨౯ సంవత్సరములలో బ్రకటించియుంటిని.

ఈ విమర్శనము వలన శాస్త్రిగారి గ్రంథప్రాశస్త్యమునుగుఱించి లోకమన్యథా తలంపకుండుటకయి, గ్రంథము గుణాధిక్యము గలదని మునుముందు లిఖించుటయే గాక చివరను మరల "గుణగ్రహణము" అను ప్రత్యేకశీర్షిక క్రింద నితరవిధముల దాని యమూల్యతనతివేలముగ బ్రశంసించియుంటిని. చారిత్రకవిషయనిరూపణములో చాటుపద్యముల యప్రామాణ్యమును శాస్త్రిగారుకూడ దమ గ్రంథమం దొక విధముగా నంగీకరించియే యున్నారు. బూటకంపు బ్రాయములగు చాటువులమాట విడిచినచో కేవల మాతని గ్రంథములను బట్టి మాత్రము శ్రీనాథుని శీలమునుగూర్చి మనము శంకింపదగిన యాధారములు లేవనియే నా నిశ్చితాభిప్రాయము. వాడుక కథలు, పుక్కిటి పురాణములు, చాటువులు నున్నగు వానికి మనము ప్రామాణ్యమిచ్చినచో నన్నయ తిక్కనాదులగు ,మన పూర్వకవీశ్వరు లందఱు శీలములనో యేదో యొకతీరున గళంకిత మొనర్పవలసియే యుండును.

౧౯౩౦ సంత్సరములో శృంగార గ్రంథమాలికలో బ్రకటితమయిన "క్రీడాభిరామము" నకు దాము వ్రాసిన పీఠికలో శ్రీ శాస్త్రిగారు నా శృంగార శ్రీనాథవిమర్శనమును బురస్కరించుకొని యందలి శ్రీనాథుని శృంగారిశేఖరత్వవిషయముననే గావించిన విమర్శనమునకు మాత్రము సమాధానములుగా మరల జాటుపద్యముల ప్రాపునే యాలంబించి యశ్లీలములగు చాటువుల నెన్నిటినో యుదాహరించి వాని కర్తృత్వమును శ్రీనాధున కారోపించిరి. ఇందలి ప్రధానాంశములకు నా ప్రతివచనములను ఆంధ్రేతిహాస పరిశోధకమండలివారి రెడ్డిసంచికలలో "శ్రీనాథమహాకవి" యను వ్యాసమునం దొసంగియున్నాను.

ఇదిగాక వేమనకాలమునుగుఱించి కూడ గొన్ని విమర్శప్రతివిమర్శనములు ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలలో మా యిరువురకు జరిగియున్నవి-

మఱియు శాస్త్రిగారు బసవపురాణపీఠికలో వెలువరించిన మత, చారిత్రక, భాషావిషయకాంశములు కొన్నింగూర్చి నే నందందు గొన్ని విమర్శ వ్యాసములు ప్రకటించియుంటిని. బసవపురాణమున శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు వ్రాసిన ప్రస్తావనను, శాస్త్రిగారి పీఠికను సావధానముగ జదివినవారికి మతవిషయములలో వారి యిరువుర యభిప్రాయములకు గూడ సామరస్యము కుదురలేదని వ్యక్తము కాగలదు. వారి పీఠికలోని విషయములు కొన్ని తగవులకు దానకములు కాకపోవని శాస్త్రిగారు స్వయముగానే వ్రాసికొన్నారు. జంకు గొంకులు లేక తమకు దోచిన యభిప్రాయములను - శాస్త్రిగారు వెల్లడించుట, పంతులుగారు వాని నట్లే ప్రకటించి తమ వ్యక్తిగతాభిప్రాయములను ప్రస్తావనలో వివరించి చివరను "కర్ణాటాంధ్రభాషలందు గల వీరశైవవాఙ్మయమును బరిశోధించి పండితులు వీరశైవతత్వమును వ్యక్త మొనరుగాక!" అని యాదేశించుట వారి యిరువుర హృదయవైశాల్యమునకు నాదర్శకములుగ నున్నవనుట సుస్పష్టము.

గ్రంథకర్తలు, విమర్శకులు తమ తమ యభిప్రాయముల నావిష్కరించుట లోకోపయోగమునకే గాని మఱొక ప్రయోజనమునకు గాదని విజ్ఞులకు జెప్పనక్కరలేదు. తెలుగునాట యారాధ్యుల శైవ విషయమున శాస్త్రిగారు వెలువరించిన యభిప్రాయములమీద శ్రీ మడికొండ నాగలింగశాస్త్రిగారు కూడ నొక విమర్శనము ప్రకటించియున్నారు. పూర్వోక్తవిమర్శనములు గాక ప్రభాకరశాస్త్రిగారి మఱే వ్రాతల గూర్చియు నే నెట్టి విమర్శనములు గావించినవాడను గాను.

భాషావిషయములలో వా రావిష్కరించిన పలుసంగతులు గూర్చి నా కెప్పుడు బ్రమాణబుద్ధియే కలదు. భిన్నాభిప్రాయము లున్నపట్ల మాత్ర మేవిషయముగూర్చి యైనను విమర్శపూర్వకముగ మదభిప్రాయముల వెల్లడించి నంత నేను వారియెడ గావించిన యపచారమేదియు లేదు. ఇందువలన వారి యెడ నాకు గల పూజ్యభావ మెన్నడు గొఱవడ లేదు. ఇంతకు నివియెల్ల నిరువదియేండ్లపైబడిన నాటి ముచ్చటలు. ఉభయుల వ్రాతలు సహృదయ లోకము నెదుట నున్నవి. ఎవరికి బోలిన తెఱంగున వారు సత్యమును గ్రహించియే యుందురు.

చాల వత్సరములవఱకు శాస్త్రిగారికి నాకు బ్రత్యక్షపరిచయభాగ్యము ఘటిల్లకున్నను మస్యమస్యమేమొండొరుల ముత్తరప్రత్యుత్తర వ్యవహారము జరిగించుకొనుచు నేయుండెడివారము. వారి క్రీడాభిరామపీఠిక వెలువడకపూర్వము వ్రాసిన యొక లేఖలో నెన్నటికయిన నొక పండితసభలో సమావేశ మయినప్పుడు తత్సమక్షమున శ్రీనాథుని శీలముగూర్చి నన్నొప్పించి నాచేత గూడ వారి యభిప్రాయముల నామోదింపజేయగల మని వ్రాసియుండిరి. కాని యట్టి భాగ్యము కలుగనే లేదు.

ఆంధ్రేతిహాసపరిశోధకమండలివారు ౧౯౩౯లో రాజమహేంద్రవరమున గావించిన రెడ్డి సామ్రాజ్య వర్ధంతి సందర్భమున జరిపిన సారస్వతసభకు శాస్త్రిగారధ్యక్షులుగా దయచేసియుండిరి. అప్పుడే మా యిరువురకు బ్రథమతః ప్రత్యక్షపరిచయము గలిగెను. అది సుముఖముగ సౌమనస్యముతోనే ప్రవర్తిల్లెను.

ఆ సభలో నే నప్పుడు "రెడ్డి పౌరుషము" అను పద్యములతోపాటు, శ్రీనాథుని శీలాదికములగూర్చి మదభిప్రాయ సారాంశ గర్భితముగ నంతకు బూర్వము జాలకాలము క్రిందట నేపత్రికలలో బ్రకటితములయిన "శ్రీనాథమహాకవి; గురుదక్షిణా నవరత్నములు" అనుపద్యములుగూడ వారి సమక్షమున జదివియుంటిని. అప్పుడుగూడ వారెట్టి వైమనస్యమును జూపలేదు. బసవపురాణ పీఠికావిషయకములయిన నా విమర్శ వ్యాసములకు శాస్త్రిగారు ప్రతివిమర్శనము లసలు వ్రాయనే లేదు. ఆ విమర్శాంశములు సంగ్రహముగ దాహృతములయి ౧౯౩౭ సంవత్సరములో బ్రకటితమైన "పాలకురికి సోమనాథకవి" అను గ్రంథప్రతిని గౌరవార్థముగ నేను బంపినప్పుడుగూడ శాస్త్రిగారట్టి యుద్యమమున కేమియు బూనలేదు.

కావున నితరుల విమర్శనములవలన సత్యము తమకే యవగతమయినచో నాదరబుద్ధితో దాని నామోదించుటయు, లేక సత్యనిర్ణయ మొనర్ప సహృదయులున్నారుగదా యని యా భారము వారిపయినిడి యూరకుండుటయు నను నార్జవసంపద శాస్త్రిగారి హృదయమం దెక్కువగా నెక్కొనియుండు నని వ్యక్తము కాగలదు.

కేవలము వాదాభినివేశముతో దమ వ్రాతల నెల్ల నెట్లయిన నిలువరింప బ్రతివిమర్శనములో వ్రాసి పెనగులాడు స్వభావము వారియెడ గానరాదు. భాషావిషయక చర్చలకు సంబంధించిన వాదోపవాదములను వ్యక్తిగతస్పర్ధలుగా సహృదయు లెవరు గణింప జాలరు. "స్పర్ధయా వర్ధతే విద్యా" అను సూక్తి చొప్పున నట్టివి విద్యా వర్ధకము లగుటయే గాక యన్యోన్య ప్రేమ వర్ధకములుగూడ గాదగును. కృతికర్తపయి నెనరునకు గాని కనలునకుగాని మనమున నెడ మీయక నిష్పక్షపాతబుద్ధితో కేవలము సత్య నిర్ణయమునకయి పూనువిమర్శకుడే యాతనికి నిక్కంపు హితుడు. అట్టి వానిని సాదరబుద్ధితో దిలకించు గ్రంథకర్తయే సహృదయుడు.

కావున బూర్వోక్తములయిన నా విమర్శనములు శాస్త్రిగారియెడ నాకు గల పూజ్యభావమునకుగాని నాయెడ వారికి గల వాత్సల్యమునకుగాని ప్రతిబంధకములుగా బరిణమింపలేవు. వాస్తవస్థితి యిట్లుండ, బలు


వురకు సాధారణముగా విమర్శకునియెడ సహనశీల ముండనేరదను భావనచే గాబోలు మా యిరువురకు సౌర్వైరమను నపవాదము కొన్ని యెడల గలదని తెలియుచున్నది. దానిలో నిసుమంతయు సత్యము లేదని మనవి చేయుచున్నాను. అట్టిదేదయిననున్నచో దానిని మాయింపుటయే నా యీ లేఖయందలి ప్రధానోద్దేశము.

నాకు శాస్త్రిగారితోనే గాదు భాషాసేవకు లెవరితోడను గూడ కొన్ని విషయములలో నభిప్రాయ భేదములున్నను వైమనస్య మనునది యేకోశమందును లేశమయినను లేదు. నా యనుభవములో శాస్త్రిగారు కూడ నట్టి దేదియు నా యెడ బ్రకటించియుండలేదు. విద్యాగురువులకు దచ్ఛిష్యులు పుత్త్రప్రాయులు, సతీర్థులు వారి శిష్యు లొండొరులు సోదరప్రాయులు నగుదు రనెడి మన దేశమందలి సనాతన సంప్రదాయము ననుసరించి శ్రీ ప్రభాకరశాస్త్రిగారు నాకు జ్యేష్ఠసోదరసమానులుగూడ నగుదు రని మనవిచేయుచున్నాను. వారి గురువర్యులయిన శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారును, నా గురువరులగు శ్రీమల్లాది సూర్యనారాయణశాస్త్రిగారును సుప్రసిద్ధశబ్దశాస్త్రజ్ఞులగు శ్రీ చర్ల బ్రహ్మయ్యశాస్త్రి తాతపాదుల శిష్యరత్నములయిన సబ్రహ్మచారులు.

సోదరతుల్యులయిన వారి యిరువుర శిష్యులమయిన మాయెడ గూడ నట్టి న్యాయమే వర్తించును గదా! అందులో నన్ని విషయములను నాకన్న పెద్దలగు ప్రభాకరశాస్త్రిగారు నాకన్నయు వారికి నేను తమ్ముడను గానేర్తును. వారికే గాదు శ్రీ కాశీ కృష్ణమాచార్యులుగారొకతడవ నాపేరువిని చలోక్తిగా సెలవిచ్చినట్లు నేను లోకమందఱకు గూడ తమ్ముడనే "పితృసమో జ్యేష్ఠః" అను ధర్మముచొప్పున శ్రీప్రభాకరశాస్త్రిగారు నాకు బితృసమానులుగూడ నయ్యెదరు.

కావున వారియెడ నాకు గల భక్తిప్రపత్తులను లోకమునకు విశదముగ నివేదించుచు, వారి యాకస్మిక నిర్యాణశ్రవణాఘాతమున ఘూర్ణిల్లి నేనుగూడ సోదరులందఱతో పాటు అశ్రుతర్పణ మొసంగుచు, తదాత్మశాంతికయి పరమేశ్వరుని బ్రార్థించుచు వారి చరణాబ్జపీఠి క్రింది పద్యప్రసూన మర్పించుచున్నాను.

"అన్నా! మిత్రమ! య స్తమించితె; వియో
గార్తిన్ సుధీచక్ర మా
పన్నంబై కడువేగ; తిర్పతిసఖున్
బ్రాపింప నున్నెగిత
త్సాన్నిధ్యంబునకున్ గురుండు పిలువన్
స్వర్గంబునుం జేరితే!
కర్ణాటన్ విడు మాదు తర్పణములన్
గైకొందు నీ తమ్ములన్
గ్రన్నన్ నీదు ప్రభాకరప్రకరముల్
గారుణ్య విస్ఫూర్తి నెం
దున్నన్ బర్వగ జేసితో సంతసము.
నుద్బోధముం జేయుమా!!"



అలవాటు

[కథానిక]

శ్రీ ఇవటూరి కామేశ్వరరావు

"ఏమండీ!...మిమ్మల్నే కాఫీ చల్లారి పోతోంది" ఉదయాన్నే కాఫీ ఇవ్వడం ఆమెకు బాగా తెలుసు. మద్రాసులో కాపురం పెట్టిన తరువాత వారికి కాఫీ బాగా అలవాటయింది. కాఫీ లేక పోతే ఉండలేరు.

అదేమిటో ఆ కాఫీకి అదేం శక్తో - విచిత్రమైన శక్తి. ఆ కాఫీ ఏ విధంగా ఇవ్వాలో లక్ష్మికే బాగా తెలుసు. మరొక్క చెంచాడు పంచదార వేసి రుచి చూచింది కాఫీ. ఆమె ముఖంలో లేతనవ్వు తొణికిసలాడింది. రావుకు వేడి కాఫీ అంటే చాలా యిష్టం. అందులో ఈ రోజు ఉదయం లక్ష్మి ప్రత్యేకించి జాగ్రత్తగా తయారుచేసింది.

రావుదికూడా చాలా మెత్తటి మనసు. అయితే అతనికి కొంచెం కోపం ఎక్కువ. అందరికి మల్లేనే కోపం ముక్కుమీద ఉంటుంది. ఏ మాత్రం హెచ్చు తగ్గులు వచ్చినా సహించే ఘటం కాదు అతనిది. అతని కోపానికి అతనేం చేయగలడు? ఎవరు ఏం చేస్తారు గనుక? అందులో ఇటీవల అతడు జబ్బు పడ్డప్పటి నుంచీ కోపం మరి కొంచెం ఎక్కువయింది. లక్ష్మికి ఉండే ఓర్పు అతనిలోవుంటే..? అయితే లక్ష్మి తర్చు ఆయింట్లో జరిగే సంఘటనలకు తట్టుకుని ఆదుకుని రావడం పరిపాటు అయిపోయింది.

ఆ రోజు రావు ముఖంలో చిరునవ్వు లేదు. ఆ క్రితం రోజు రావు ఆఫీసులో తన ఆఫీసరు ఏదో చిన్నతప్పుకు తనమీద కారాలూ మిరియాలూ నూరడం ఏదో జరిగింది. కాగా రావు తిరిగి సమాధానం ఇవ్వలేక చేసిన తప్పుకు క్షమాపణ వేడుకోవలసి వచ్చింది. కాని అతని మనస్సులో ఉద్రేకం చెలరేగింది. విశ్వాసం లేని తన ఆఫీసరుమీద చెలరేగిన ఆ కోపానలజ్వాల అక్కడికక్కడికే ముకుళించుకుని పోయినప్పటికీ ఆ జ్వాల ఇంటివరకూ కూడా ప్రాకి వెళ్లడం అతనిగ్రహపాటే.

సమయం సాయంకాలం. కుర్చీలో రావు మౌనంగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు. సాయంత్రం ఆమె యిచ్చిన టీ చాలా బాగుంది. కాగా లక్ష్మిమీద కేకలు వెయ్యడానికి ఏమీసాకులు కూడా లేవు. చిట్టితల్లి ప్రక్కవాళ్ల అమ్మాయితో ఆడుకుంటోంది. ఆట తమకంలో ఉంది. పాపం— తన చిట్టితల్లి క్రికెటుబ్యాటు సంగతేమరచిపోయిందనుకున్నాడు రావు. ఆవీథి ఎదురింటి అమ్మాయి దగ్గర ఒకబ్యాటు ఉంది. అదిచూచినప్పటినుంచీ తనకు కూడా ఒకబ్యాటు కొనిఇమ్మని తన్ను వేధించుకుతింటూ వచ్చింది. అయితే చిట్టితల్లిని వచ్చే వారందాకా ఆగమన్నాడు రావు—జీతాలు వచ్చే వరకూ!

భోజనం అయింది. ఆరోజు పదార్థాలు బాగున్నాయేమో రావుకు కడుపునిండింది. అదృష్టవశాత్తూ లక్ష్మి తాను భోజనం చేసేటప్పుడు ఇంటి అద్దెను గురించి గాని 'బియ్యంరేషను' కు డబ్బును గురించి కాని అతనిజ్ఞప్తికి తీసుకురాలేదు. తన ఆఫీసరు వేసిన కేకలు మరచి పోసాగాడు రావు. తన చిట్టితల్లితో కాసేపు ఆడుకున్నాడు. ఇంతలో అతనికి మరుసటి రోజు 'రేషన్ల' సంగతి గుర్తుకువచ్చి—

"లక్ష్మీ! మర్చిపోయాను" అన్నాడు రావు గోడకు తగిలించిన కోటుతీస్తూ!

"కేషన్లకు డబ్బు యిద్దామన్న సంగతే మరచి పోయాను"

అంటూ కోటు జేబు తడవడం ప్రారంభించాడు రావు.

"నావద్ద సరిగా పది రూపాయలే ఉన్నాయ్ ఛాలినా అంతే చాలక పోయినా అంతే."

ఏదీ? నోటేదీ? ఎక్కడ పెట్టాడు ఆ పది రూపాయిలు? కోటు లోపలజేబులోనా? కనుపించ లేదే? పోనీ చొక్కా జేబులో ఉందేమోనని చొక్కా జేబు తడిమాడు. అక్కే ఎక్కడుంటుంది? మరి ఆ పది రూపాయల కాగితం ఏమైనట్లు? అతనికి ఆశ్చర్యమయింది.

లక్ష్మి తన పెనిమిటి ముఖం ఎర్ర బారడం గమ నించింది "కనిపిస్తుందిలెండి ఖంగారు పడకండి"

"ఎక్కడో ఉంటుంది. జేబులోపెట్టింది ఏమై పోతుంది?" అంది లక్ష్మి శాంతంగా.

ఆమె అలా అనడం అతనికి చుర్రుమంది. కోపం కూడా వచ్చింది.

"అయితే నీవే చూడు" అంటూ కోటు ఆమె ముఖాన విసిరాడు రావు. తానుకూడా చూచింది. కాని ఏమైంది? ఆయన జేబు రుమాలూ, ఏవో కొద్ది చిల్లర తప్ప ఆమెకు మరేమీ కనుపించలేదు.

"ఒకవేళ నోటు బయట ఎక్కడైనా పడి పోయిందేమో" అంది లక్ష్మి అతని ముఖం కేసి చూస్తూ!

"ఆఁ నీకు తెలుసు. మహాచెప్పొచ్చావు.అబ్బా! ఈ యింట్లో కొచ్చినప్పటినుంచీ ఇదేవరస వెధవ యిల్లు డబ్బు నిలిస్తేగా—ఆఫీసులో స్థిమితం లేదు. ఇంట్లో అంతకన్న లేదు" అంటూ రావు కేకలు వేస్తూ తీదరించుకుని ముందు గదిలో కుర్చీలో కూలబడ్డాడు.

౨

ఇంతలో తన సహజమైన నవ్వుముఖంతో వేడి కాఫీ తీసుకువచ్చింది లక్ష్మి.

"నాకేం కాఫీఅక్కర్లేదు" అని అరిచాడు రావు. తాను ఏదైనా మాట్లాడితే ఇంక ఎగిరిపడ తారని పలక్కుండా కాఫీకప్పు బల్లమీదపెట్టి మెల్లిగా వంటింట్లోకి చక్కాపోయింది లక్ష్మి.

"ఏం నీకేం చెయ్యడా? కాఫీ అక్కర్లేదని చెప్పలా?" అని గదిలోంచి రావు కేక—కాని కప్పులో కాఫీ సువాసన ఆఘ్రాణించేవరకూ నాలిక తడి అయింది రావుకు, ప్రాణం లేచివచ్చింది.

"కాఫీ తీసుకోనేలేదు; ఇహ అన్నంమాత్రం తింటారు గనుకనా" అనుకుంది లక్ష్మి. శుక్రవారం పూటా తిండితినకుండా ఆయనను వెళ్ళనివ్వకూడదని నిశ్చయించుకుంది. చిట్టితల్లి తన బుల్లిగ్లాసుతో తన తండ్రి దగ్గర భాగంకోసమని గదిలోకి వచ్చింది. అప్ప టికి అతను కాఫీ త్రాగేశాడు. ప్రతిరోజూ ఓ చుక్క కాఫీ పోస్తేనేగాని వెళ్ళేదికాదు. ఈరోజు! చిత్రం...! పిల్లని మరిచిపోయి కాఫీత్రాగేశాడు. అతనికి మనస్సు చివుక్కుమంది.

భోజనంవేళ అయింది. రావు పోసుకునేందుకు వేన్నీళ్లు సిద్ధంగా తోడిపెట్టింది. ఒళ్లురుద్దుకోను సబ్బు, తుడుచుకోను తువ్వాలు—రావు తొడు క్కునే పంట్లాము, చొక్కా, అన్నీ సిద్ధపరచింది.

అయితే అతనికోపం అంత త్వరగా చల్లారు తుందా? కాస్తగాలి తగిలితే చాలు కోపం నిప్పులా రగుల్కొంటుంది మంట అయేవరకూ! కోపం తాను చేసినతప్పు వల్లనేపుట్టి చివరికి పశ్చాత్తాపంలో తేలు తుంది. ఇదొక నిశ్చలసత్యం.

లక్ష్మి గడియారంవైపు చూచింది. అయిదు నిమి షాలు తక్కువ తొమ్మిది. ఈ సమయంలో తాను ఏ విధంగా ప్రవర్తించుకోవాలో ఆమెకు బాగా తెలుసు. రావు భోజనం తయారయిందా అనికేక వేసేవరకూ భోజనం తయారయిందని చెప్పకూడదనుకుంది. ఒక వేళ అలా అడుగుతారనుకోండి. అడిగితే ఏమి సమా ధానమివ్వాలో ఆమెకు తెలుసు. దానికి సమాధానం 'మీ కోసమే కాచుకుని కూర్చున్నా' నని అనాలని కూడా ఆమెకు తెలుసు. అంతే ఆయన భోజనానికి రావడం గబగబా కళ్ళెం ఖాళీ చేయడం—అంతా క్షణంలో జరిగిపోతాయి. అని ఏవేవో అనుకుంటుంది అయితే అనుకున్నది అనుకున్నట్లు జరుగుతుంది గను కనా.

ఇంతలో రావు భోజనానికి వచ్చి కూర్చున్నాడు. లక్ష్మి వడ్డించడం ప్రారంభించింది.

"ఊఁ చాలు ఇక పెట్టకు" అన్నాడు రావు. లక్ష్మి తాను మామూలుగా వడ్డించినట్లే ఓ కెరడు ఎక్కువగా పడింది కాబోలు. ఇంకేముంది—అమాంతంగా కంచం వెళ్ళి గోడకేసి కొట్టుకుంది. కంచంలో పెట్టిన అన్నం అంతా చిందర వందర అయిపోయింది. ప్రక్కన పెట్టిన గ్లాసెడు నీళ్లు బోర్లకిలపడి వొలికి పోయాయి.

గబగబాలేచి తను ఆ క్రితంరోజున తొడుక్కున్న పంట్లాము వేసికొని తన కోటు తగిలించుకో సాగాడు రావు.

"ఇదేమిటి ఈ నలిగిపోయిన ప్యాంటు వేసుకున్నారు! చాకలి తెచ్చినది దణ్ణెంమీద వేశానే." అంటూ గుమ్మంలో రావుకు అడ్డుగావచ్చింది లక్ష్మి.

"ఏమండీ! శుక్రవారంపూట తిండి తినకుండా వెళ్తారా? నామాటవినరూ?..." రావు మాట్లాడలేదు.

"ఎందుకంతకోపం చెప్పండి—నే నేంచేశానని" ఏంలాభం లక్ష్మి చెప్పినవన్నీ చెవిటిచెవినేకాని అతను వింటేగా? ఆకోపానికేమైనా అర్థముందా? అప్పుడు ప్రక్కయింట్లో ఆడుతున్న చిట్టితల్లివచ్చి—

"నాన్నా! నాన్నా! ఆఫీసుకు ఇంత తొందరగా వెళుతున్నావేంటి నాన్నా!" అంటూ అప్పుడే వీధిలో అడుగుపెట్టిన తండ్రిని సమీపించింది. ఇంట్లో జరిగిన కథసంగతి ఆకుర్రపిల్లకేం తెలుసు.

"నాన్నా! నా క్రికెటుబ్యాటు సంగతి మరచి పోకునాన్నా—తప్పకుండా సాయంత్రం పట్టుకు రావాలి."

"బ్యాటు కావాలానీకు—వేలెడు ఉన్నావో లేదో?" అంటూ వీపుమీద ఒక్కచరుపు చరిచాడు రావు. పాపం చిట్టితల్లిది లేతశరీర మేమో—నొప్పితో తల్లిదగ్గరకు పరుగునవచ్చి ఏడిచింది. ఇవన్నీ చూసేసరికి లక్ష్మి కళ్ళవెంట నీళ్లు గిర్రున తిరిగాయ్. "ఊరుకోతల్లీ ఏడవకు" అంటూ పొంగి పొరిలి వచ్చే దుఃఖం ఆపుకుంటూ—పాపం పెదిమ కర్చుకుంది—లోనికి వెళ్ళింది లక్ష్మి:—

3

రావు ఆఫీసుకు వెళ్లాడే కాని అతని మనస్సు స్థిమితం లేదు. మనస్సు మనస్సులో లేదు. ఏలా ఉంటుంది. పనిమీదకు దృష్టిపోతేగా? తనమీదే ఉంది తప్పు. తానే చేశాడు తప్పు చేసినతప్పు ఒప్పుకోవడం అంతటి సులభమైన పనికాదు. ఒకవిధమైన బాధ అతనిని వేధించింది. పాపం కుర్చీలో ఆలాగే కూర్చుని పోయాడు రావు. డబ్బు పోవడానికి తన భార్యా చిట్టితల్లీ బాధ్యులా? వాళ్ళమీద తనకెందుకింతకోపం? తనేం బాధ్యురాలుగాదు అన్నట్లు ఆమె ఎందుకు నటించాలి? ముఖం తుడుచుకోను తన ప్యాంటు జేబులో ఉన్న చేతి రుమాలు బయటకు తీశాడు. ఏదో జేబులోంచి క్రిందపడింది. ఏమిటా అని చూశాడు. ఏముంది? అదే పది రూపాయలనోటు. క్రిందికివంగి నోటు పైకి తీశాడు. ఆ నోటే. అనుమానం ఏమీ లేదు. ఇంతవరకూ నోటు తన ప్యాంటు జేబులోనే ఉందన్నమాట. రావు ప్యాంటులో పది రూపాయల నోటుపెట్టానన్న సంగతే మరచిపోయాడు

ఇంట్లో ఎంత హంగామా జరిగింది. ఎంతటి అవివేకం. సరిగా తన ప్యాంటు జేబు వెతుక్కోక పోవడం తనతప్పా? అమాయకురాలైన తన లక్ష్మి తప్పా? తాను ఎంత తెలివిమాలినపని చేశాడు. తన భార్యను కేకలు పెట్టి ప్రేమతో, అనురాగంతో తనను వెంటాడిన తన చిన్నారి-చిట్టితల్లిని కొట్టి పంపించిన చేతులేనా యివి? ఆ రోజు రోజంతా తాను లక్ష్మికి ఎంతటి దిగులు కల్పించాడు. ఆమె ఎంత ఆవేదనపడుతోందో పాపం. లక్ష్మి రోజంతా ఉపవాసం ఉంది కాబోలు. ఆమె మనస్సు ఎంత దుఃఖిస్తోందో!

అతనిసుఖం అతని దుఃఖం భార్యది మాత్రం కాదా—అయినప్పుడు భార్యను ఆవిధంగానేనా చూట్టం? భర్తకు ఆమాత్రం వివేచనాశక్తి ఉండక్కర్లేదూ? భార్య ఎపుడూ ఎత్తిపాడిచే భర్త అడుగులకు మడుగులొత్తుతూ ఉండవలసిందే? భర్త గీచింది గీటూ—భార్యనోరు మూసుకుని ఉండవలసిందేనా?

రావుకు వళ్లు కంపరమెత్తింది. మనస్సు ఒక్కసారిగా విరిగి వేయివ్రక్కలయిన ట్లనిపించింది. హృదయంలో చండప్రచండమైన తుపాను చెల

రేగింది. అతని కళ్ళవెంబడి అప్రయత్నంగా అశ్రువులు రాలాయి.

ఈ విధమైన వివేచనా శూన్యమయిన పనులు ఇక తిరిగి చేయగూడదనుకున్నాడు. తన చిట్టితల్లికి బ్యాటూ, తన లక్ష్మికి మల్లెపువ్వులూ కొనుక్కుని చకచకా ఇంటి ముఖంపట్టాడు రావు.

"లక్ష్మీ! నన్ను క్షమించవూ! నేను చేసిన తప్పుకు నీవు క్షమించవూ! నీమనస్సుకు ఎంతకష్టం కలిగించాను" అందా మనుకున్నాడు రావు. చిట్టితల్లి బ్యాటుచూస్తే ఎంత, సంతోషిస్తుందో. ఈ ఆలోచనలతో రావు మరింతత్వరగా నడవసాగాడు. గుమ్మంలో అడుగుపెట్టాడు.

గుమ్మంవద్ద తనకోసం నిరీక్షించే తన చిట్టితల్లి ఈరోజు అక్కడ కూర్చోలేదే? ప్రక్కయింటికి వెళ్లి ఆడుకుంటోందా?

"లక్ష్మీ...!" మధురకంఠంతో పిలిచాడు రావు. అయితే సమాధానం రాలేదు. అతనిగుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి. గబగబా గదిలోకి వెళ్లాడు. లక్ష్మి చిట్టితల్లి ప్రక్క కూర్చుని ఉంది. చిట్టితల్లి పక్కమీదపడుకుని ఉంది—ఎఱ్ఱబారినముఖంతో.

లక్ష్మి ప్రక్కనే నిలుచునివున్న రావు కేసి చూచింది. చిరునవ్వుతో 'అమ్మడూ' అంటూ రావు పిలిచాడు. "ఇదిగో నీకు బ్యాటు తీసుకువచ్చాను నాన్నా."

చిట్టితల్లి మరోవేపుకు తిరిగింది. రావు వంగి చిట్టితల్లి చేయి పరీక్షించాడు.

'పిల్లను ముట్టుకోవద్దు' అంది లక్ష్మి కొంచెం కోపంతో". చిట్టితల్లి పగలల్లా ఒకటే ఏడిచింది. జడుసుకుందో ఏమో ఒళ్లు కాలిపోతోంది. అంతా మీమూలానే"

"అయ్యో పాపం! చిట్టితల్లి. ఇదిగో వెళుతున్నా డాక్టర్ని పిల్చుకువస్తా" అంటూ బయటకు చక్కా పోయాడు రావ్.

* * * *

రెండు రోజులు పోయిన తరువాత చిట్టితల్లి బ్యాటుచూసి మురిసిపోయింది. ఆ మురిసిపోతున్న చిట్టితల్లి నెత్తుకొని ముద్దెట్టుకుని ఆనందంతో పొంగిపోయాడు రావు. వారిద్దరినీచూసి అనిర్వచనీయమైన ఆనందం అనుభవించింది లక్ష్మి.



రాజరాజనరేంద్రుని

కలిదిండి తామ్రశాసనము

●

శ్రీ భావరాజు వేంకటకృష్ణరావు

గత చిత్రభానుసంవత్సర ఫాల్గుణసంచిక ఆదిగా స్వభానుసంవత్సర చైత్ర, వైశాఖసంచికలు మూడింటియందు వరుసగా ‘నీ భారతిపత్రికలో నా మిత్రులు డాక్టరు నేలటూరి వెంకటరమణయ్యగారు ‘రాజరాజనరేంద్రుని కలిదిండితామ్రశాసనము’ను సవ్యాఖ్యానముగ బ్రకటించిరి. వారు చాలా పెద్ద వ్యాఖ్యను వ్రాసి, యందనేక చారిత్రకవిషయములను చర్చించి కొన్ని సిద్ధాంతములను ప్రతిపాదించినారు.

ఆద్యంతములు వారు, రాజరాజు వట్టి దుర్బలుడనియు, ఎట్టులో చోళుల ప్రాపుండబట్టి సింహాసనంమీద కూర్చుండి రాజ్య మేలగల్గినాడనియు, చోళుల ప్రాపే లేకుండిన రాజరాజు రాజ్యమును గోల్పోయి, పదచ్యుతుడైయుండు ననియు పర్యవసానము తేల్చిరి. అంతే కాదు. ఆ యభిప్రాయమును మనసులో పొదుకొల్పి శాసనమును అన్వయించిరి. వెంకటరమణయ్యగారి అభిప్రాయములు, సిద్ధాంతములు చాలమట్టుకు నిరాధారములైన కల్పనా విశేషములు. వారి యూహాజనితములు. ఇట్టి వాటిని విమర్శించి వెంకటరమణయ్యగారి మతము ఎట్లు అసంగతమో, ఎట్లు ప్రమాణరహితమో, వారి చారిత్రక విమర్శన, ఎట్లు తప్పుత్రోవను నడిచెనో జూపుటకు యదార్థముగ నుండు చరిత్ర ఎట్లున్నదో తెలుపుటకును ఈ వ్యాసమును వ్రాయబూనినాడను. వెంకటరమణయ్యగారు నా విమర్శనమును సహృదయతతో స్వీకరింతురుగాక.

కలిదిండి శాసనమునకు దరువాతికాలమునాటిది కోరుమిల్లి శాసనము. అని వెంకటరమణయ్యగారి యభిప్రాయము. పట్టాభిషిక్తుడైన అనతికాలమునందే రాజరాజు చీదమార్యునికి, కోరుమిల్లి మహాగ్రామమును అగ్రహారముగా ధారవోసెను. అది, చంద్రగ్రహణ సమయమున జరిగెను. రాజరాజు పట్టాభిషిక్తుడైన శ. ౯౪౪ సంవత్సరమున మాఘసుద్ధ పూర్ణిమనాడు చంద్రగ్రహణము బట్టెను. దానికి సరియైన ఇంగ్లీషుతారీఖు జనవరి ౯, ౧౦౨౩, సంవత్సరము. శాసనమును పరిశీలించిన కీలుహారను పండితుడు గూడ ఈ యభిప్రాయమునే తెలిపియున్నాడు.

ఆవిషయ మటుండనిచ్చినను కోరుమిల్లి శాసనమునందు అనవసరమైన చోళుల ప్రసక్తిలేదు. దానినంతయు ముక్తసరిగా వర్ణించినాడు శాసనకావ్యకర్త చేతనభట్టు. కోరుమిల్లి శాసనమునందు ప్రాధాన్యమంతయు రాజరాజునకు, విమలాదిత్యునకు, శక్తివర్మకు నీయబడెను. కలిదిండి శాసనము ప్రత్యేకముగా మేనమామ నుగ్గడించుటకును, మేనమామ బంపిన దండనాథులను ప్రశంసించుటకును బుట్టినది. కోరుమిల్లి, కలిదిండి శాసనకావ్యములను రెండింటిని రచియించినది ఒక్కడే. రాచయపెద్దేరి భీమనభట్టు తనూజుడు చేతనభట్టు. *

శాసనవిషయమును బురస్కరించుకొని కవన మల్లవలయును గావున చేతనభట్టు కలిదిండి శాసనకావ్యమందు, క్రొత్తవిషయములు, చోళుల చెవులకు, హృదయములకు ఇంపైనవాటిని చేర్చి, కూర్చినాడు. రెండవ శక్తివర్మను గూర్చి ప్రశంసచేయునపుడు ఆ

---

* ఇప్పటికిని చేతనభట్టువారని యింటిపేరుగల బ్రాహ్మణు లున్నారు రాజమహేంద్రవర ప్రాంతమునందు. బహుశా వారి వంశకర్త మన శాసనకావ్యకర్త చేతనభట్టు కావచ్చును.

రాజు "మృదుభాః కరైః" క్షమాతాపమును చల్లార్చెనని కోరుమిల్లి శాసనమునందును, "ద్విట్తమోహరః" అని కలిదిండి శాసనమునందును వర్ణించినాడు అట్లే, విమలాదిత్యుని గూర్చియు ఇంచుక చిన్న పదముల మార్పుతో వర్ణనము చేసినాడు. విమలాదిత్యుడు రాజ్యమును జయించుకొని పరిపాలించినట్లు గూడ తెలిపినాడు. కోరుమిల్లి శాసనమందు లేని విషయమొకదానిని, బాల్యమందే రాజరాజు యౌవరాజ్యాభిషేకము నొందినాడన్న విషయమును కలిదిండి శాసనమునందు చేతనభట్టు తెలిపియున్నాడు. కలిదిండి శాసనమం దావిషయమునకు అవసరమున్నది. ఇట్లనేక సందర్భముల నాలోచించినపుడు కోరుమిల్లి శాసనము రాజరాజదేవర శాసనములన్నిటిలో మొదటిదని తోచును. కలిదిండి శాసనము రెండవది. మూడవది నందంపూడి శాసనము.

రాజరాజనరేంద్రునికి నన్నయభట్టు రాజపురోహితుడని వెంకటరమణయ్యగారి మతము. దానికి ప్రమాణము లేదు. మహాభారతావతారికయందు గూడ నన్నయభట్టు రాజరాజు కొలువును వర్ణించుచు, "మంత్రి పురోహిత, సేనాపతి, దండనాయక, దౌవారిక మహాప్రధానానంత, సామంత, విలాసినీ పరివృతుండయి" అని, రాజపురోహితు డొకడు వేరుగా నున్నాడని తెలియపఱచియున్నాడు. "తన కులబ్రాహ్మణు" అని తన్నుగురించి చెప్పుకున్నాడు. రాజ పురోహితుడు అగుటవల్లను, భీమనభట్టు చేతనభట్లు ఆ కాలమున పేరొందిన కవులైయుండినట్లు తోచుట చేతను, నన్నయభట్టు, తా నుభయభాషా కావ్యరచనాశోభితు డయ్యును, భీమనభట్టు, చేతనభట్టులు రచియించిన శ్లోకములను "కొన్నిటిని తన నందమపూండి శాసనగ్రంథములోని కెక్కించుకొని యున్నాడు" నన్నయభట్టు గొప్ప నేరమును చేసినాడు! వెంకటరమణయ్యగారి దృష్టిలో నన్నయభట్టు ఎంత సులభు డయినాడు? రెండు సంస్కృత శ్లోకములైన వ్రాయజాలని పండితమ్మన్యు డయినాడు! వెంకటరమణయ్యగారు తెలిసియు పొరబడినారనుకొందును.

చాళుక్య రాజ్యాంగమునందు పురోహితుడు మంత్రి సేనాపతుల వంటివాడు. పంచప్రధానులలో నొకడు. తిథిశ్రాద్ధముల బెట్టించుచు, నిత్యము ఇంటికి వచ్చి తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాది పంచాంగముల శ్రవణము చేయు అధమ బ్రాహ్మణవృత్తి చేయువాడు గాడు చాళుక్యరాజ్యాంగములోని పురోహితుడు. అతని పదవికి ఒక బాధ్యతయు గౌరవము నున్నవి. 'కటకేశుడు' ఒక యుద్యోగి. ఒక నియోగమును నిర్వహించువాడు, సైన్యాధ్యక్షుడు గాడు. చాళుక్యరాజ్యాంగమునందు సేనాపతి మంత్రి సమానుడు. వేరుగా నున్నాడు. కటకేశుడు, కటకాధీశుడు అను నియోగము గల యుద్యోగి రాజధానీ నగరమునకు అధిపతి (గవర్నరు.) కావచ్చును. అతనిని కటకపాలు డనియు ననవచ్చును.

శాసనవిషయము— ఖ్యాతిగన్న రాజరాజబ్రహ్మమహారాజను మహాదండాధిపతి యొకడుండెను. ఆతడు మధురాంతకభూపాలుని కరుణారసముచే తడిసి వర్ధిల్లిన యశోలతిక గల వాడు. మఱియు రాజేంద్రచోడభూపాలుని రాజ్యలక్ష్మి యను మహానిధిని గాపాడుటకు దక్షతగల యుగ్ర భుజంగసదృశములైన బాహువులు గలవాడు. నా మేనమామయగు రాజేంద్రచోడక్షితిపాలుని ఆదేశమును వినినవెంటనే దక్షిణదిక్కునుండి మహాప్రచండసైన్యమును ముందు బెట్టుకొని శత్రురక్తమును పానముచేయు నాసక్తితో అపరకాలుడా యన్నట్లు తత్క్షణమ ఆంధ్రదేశమునకు వచ్చెను. ఆతనితోపాటు భక్తిచేతను, రాజసేవయందు క్లేశము నొందుట వల్లను, రాజేంద్రచోడభూపతిని సంతుష్టపఱచిన మఱియిద్దఱు దండనాథులుకూడ, ఉత్తమచోడచోడగోన్, ఉత్తమచోడ మిలాడుడయ్యాను అనువారలు సైన్యసమేతులయి అరణ్యమును బోలిన కర్ణాటసైన్యముల నెదుర్కొనుటకు ఆంధ్రదేశమునకు వచ్చిరి. ఆముగ్గురు దండాధిపులును ఉజ్జ్వలమైన మూడు అగ్నులవలె ప్రకాశించుచుండిరి. అప్పుడు కర్ణాటద్రవిడ మహాసైన్యములకు ఘోర సంగ్రామ మయ్యెను. చివరకది సమానయుద్ధముగా పరిణమించెను. విజయలక్ష్మి ఎవ్వరిని వరించలేదు. కాని రాజేంద్రచోడుని పనుపున వచ్చిన ముగ్గురు చోడదండనాయకులును యుద్ధభూమిని మడిసిరి. వారి నుద్దేశించి కలిదిండి గ్రామమునందు—బహుశః యుద్ధము జరిగి వారు మడిసిన తావున— రాజరాజేశ్వరాలయమని యొక శివాలయమును, మరిరెండు శివాయతనములను రాజరాజు గట్టించి ప్రతిష్ఠించెను. ఆ దేవళము

లందు నిత్యము పూజాదులు జరుగుటకును, నృత్త గీతాదిమంగళవాద్యము కొఱకును, ఏటేట నున్న ప్రబనులు మొదలయినవి చేయించుటకును, బలి, ఉపహారాది నైవేద్యములు సాగించుటకును, మఱియు న్యాయారశాస్త్రము లభ్యసించు విద్యార్థులకు ఏబది మందికి భోజనాదుల కొఱకు ఒక సత్రము నడుపుటకును, ఏబదియిద్దరు వేశ్యలకును, హుతజాతవేదసులయిన నూర్గురు బ్రాహ్మణులకును, కుబేరసమానులయిన నూర్వురు వైశ్యులకును, నూర్వురు శూద్రులకును నివాసముల కల్పించుటకును, కలిదిండికి మేనమామ పేరిట మధురాంతక నల్లూరని ప్రతినామముంచి రాజరాజు ధారవోసెను. ఆరీతిగ నడచుటకు మిగిలిన రెండు శివాలయములకునుగూడ వల్లపు గుద్రవార విషయములోని (అనగా నేటి కైకలూరు తాలూకా) కడపట్టు అవకూరు గ్రామముల నిచ్చెను.

కలిదిండిశాసనము రాజరాజనరేంద్రుని కాలపు చరిత్రాంశములను ఇదివరకు దెలియనివాటిని వాకొనుటచేత చాలా ముఖ్యమైనది. వెంకటరమణయ్యగారు ఈవిషయమునుగుర్తించి, కలిదిండిశాసనములో నుదాహృతమయిన యుద్ధ మెప్పుడు జరిగె నన్న విషయమును పెద్దగా చర్చించి రెండు సిద్ధాంతములను ప్రతిపాదించిరి. కలిదిండి యుద్ధము శ. ౯౬౪ సంవత్సరమునకు సరియైన 1042—43న జరిగెననుట మొదటిది. కలిదిండి శాసనోక్తదానము, అటుతరువాత మరికొంత కాలమునకు కీ. శ. 967 సంవత్సరమునకు సరియైన 1045—46న చేయబడిన దనుట రెండవది. ఈ రెండుసిద్ధాంతములను ప్రతిపాదించుటకు వెంకటరమణయ్యగారు చాలా శ్రమపడిరి. తమ సిద్ధాంతములను నిలవబెట్టుకొనుటకు పెక్కు విషయములను చర్చించిరి. వారి వ్యాఖ్యను, చర్చలను చదివినవారికి, చరిత్ర యథార్థముగ నట్లు జరిగెనా యని భ్రమ కలుగకమానదు. చరిత్ర రచన చేయునపుడు శాసనములను బరిశోధించినపుడు, ఒక యభిప్రాయమును ముందుగా మనసులో నిడుకొని, ఎదురుపడిన శాసనోక్తవిషయములను వాటిలో అన్వయించుట పాడిగాదు. నిష్పక్షపాతబుద్ధితో సత్యాన్వేషణమునకు బూనుకొనుట శాస్త్రపద్ధతి, ఋజుపద్ధతి. కావున వెంకటరమణయ్యగారి రెండు సిద్ధాంతములును విమర్శకు నిలువజాలవు. వాటిని సమర్థించుటకు ఊహించి చేసినఇతర నిర్ణయములు, రాద్ధాంతములుకూడా నిలువజాలవు.

శాసనవిషయమునుగూర్చి పరిశీలనచేయుటకు బూర్వము, రాజరాజుకు సమకాలికులయినవారి కాలములును, తత్సంబంధములయిన కొన్ని ముఖ్యాంశములను మనసునం దుంచుకొనుట అవసరము. అవి యేవి యన—

(౧) చోళచక్రవర్తి రాజకేసరివర్మ రాజరాజు : ౯౮౫ సంవత్సరమున జూను ౨౫, జూలయి ౨౫ తేదీల నడుమ నెపుడో పట్టాభిషిక్తుడై ఇంచుమించుగా ౧౦౧౩ సంవత్సరాంతమువఱకు, పాలించెను. ౧౦౧౩ సంవత్సరము జూలయినుండి అతని ౨౯ వ విజయ రాజ్య వర్షము ఆరంభించెను. (౯౮౫—౧౦౧౩) అతనికి పశ్చిమచాళుక్యులలో వరుసగా (౧) నూర్మడి, ఇమ్మడి, తైలపదేవుడు (౯౭౩-౯౯౭), తరువాత అతని పెద్దకుమారుడు అకలంకచరిత ఇరివబెడంగ సత్యాశ్రయుడు (౯౯౭-౧౦౦౯) పిమ్మట నతని తమ్ముని పెద్ద కుమారుడు త్రిభువనమల్లాభిదానుడయిన ఐదవ విక్రమాదిత్యుడు (౯౯౭-౧౦౧౩) ను మువ్వురును సమకాలికులు. రాజరాజ రాజకేసరివర్మ ఒకటి రెండు సంవత్సరములకు చనిపోవుటకు బూర్వము కుమారుడు రాజేంద్రచోడునకు పట్టము గట్టి తాను రాజ్యపరిత్యాగము చేసెను.

(౨) రాజేంద్రచోడుని పట్టాభిషేకము ౧౦౧౨ సంవత్సరమున మేయి ౩౦ వ తేదినాడు జరిగెను. అత డారేండ్లు మాత్రము రాజ్యముచేసి ౭ వ యేటను అనగా ౧౦౧౮ సంవత్సరమున మెయి ౩౦ దాటిన తరువాత డిశంబరు ౩ వ తేదిలోగాను, ఒక శుభ ముహూర్తమున తన పెద్ద కుమారుడు రాజాధిరాజునకు పట్టము గట్టెను. నాటినుండి తండ్రి కొడుకు లిరువురును గలిసి రాజ్యము చేసిరి. రాజేంద్రచోడుడు ౧౦౪౩ సంవత్సరమున మెయి నెల దాటినతరువాత నెప్పుడో కాలధర్మము నొందెను. [౧౦౧౨-౧౦౪౩] రాజేంద్ర చోడునకు జగదేకమల్ల జయసింహుడు సమకాలికుడు. ౧౦౧౫-౧౦౪౨.

(౩) రాజాధిరాజు అతని తండ్రి గతించిన పిమ్మట పునరభిషేకము ౧౦౪౩ సంవత్సరమున జూను నెల తరువాత నెప్పుడో జరిగెను. అతని రాజ్య

కాలము ౧౦౧౮-౧౦౪౩-౧౦౪౩-౧౦౫౩. అతని తరువాత అతని తమ్ముడు రాజేంద్రదేవుడు రాజయ్యెను. రాజాధిరాజునకు ఆహవమల్ల సోమేశ్వరుడు సమకాలికుడు.

(౪) రాజేంద్రదేవుడు తనఅన్న జీవించియుండగనే ౧౦౫౨ సంవత్సరము మేయి ౨౮ వ తేదినాడు పట్టాభిషేకము చేసుకొనెను. బహుశః, ఆహవమల్ల సోమేశ్వరునితోడి యుద్ధమునకు పోవుటకు ముందు రాజాధిరాజు, తమ్మునికి రాజ్యము బట్టము కట్టియుండును. ఈ విషయమింకను సందేహాస్పదము. రాజేంద్రదేవుడు ౧౦౬౨ న మార్చి నెలతరువాతను, సెప్టెంబరునకు లోగను, నడుమ ఎప్పుడో మరణించెను. అతని రాజ్యకాలము ౧౦౫౨-౧౦౬౨. అతనికి కూడ ఆహవమల్ల త్రైలోక్యమల్ల సోమేశ్వరుడే సమకాలకుడు., సోమేశ్వరుని రాజ్యకాలము ౧౦౫౩-౧౦౬౮.

కలిదిండిశాసనమున రాజరాజు బ్రహ్మరాజాది దండాధిపులు తన మేనమామ దేశానుసారము ఆంధ్రదేశమునకు వచ్చినారనుటను బట్టి, కలిదిండి యుద్ధము రాజేంద్రచోడుని జీవితకాలమునందే, 1018—1043 సంవత్సరముల నడుమ జరిగియుండు ననుట నిస్సంశయము. అదియును గాక, ఆ యుద్ధము రాజరాజ—విష్ణువర్ధనుడు పట్టాభిషిక్తుడైన తరువాతనే జరిగియుండవలయును. అనగా 1022—1043 సంవత్సరముల నడుమకాలమున జరిగియుండవలయును,

వెంకటరమణయ్యగారి సిద్ధాంతము ననుసరించి జగదేకమల్ల జయసింహుని మరణమున కించుక పూర్వమో, లేక పరమందో శ. 942 అనగా 1042 సంవత్సరమున జరిగియుండెను. కాని ఆ యుద్ధము 1042—43లో జరిగియుండెనా యన్న విషయము విచార్యము—అది అసంభవము, కయ్యమునకు కాలుసాచి, ముందుగా తన సైన్యములను ఆంధ్రభూమికి బంపినవాడు కర్ణాటభూమీశుడు. చావునకు సిద్ధమై యున్న ఇమ్మడి జయసింహుడు యుద్ధమునకు ముందంజ వేసినా డనుట ఒప్పదు. కావున 1042—43నకు బూర్వమే, ఒకానొక బలవత్తమమైన కారణమును బురస్కరించుకొని ఆంధ్రదేశముమీదికి సైన్యములనంపి యుండవలయును. అదియును గాక రాజేంద్రచోడుడు తన ౬ వ రాజ్యసంవత్సరము తరువాత, 1012 + 6 = 1018 సంవత్సరము తరువాత. పశ్చిమచాళుక్యుల మీదికి దండయాత్ర బోయియుండ లేదనుట స్పష్టము. ఇమ్మడిజయసింహుడు 1020 నాటికే గంగవాడి, నొలంబవాడి. రాష్ట్రములందు తన యేలుబడిని మరల సుస్థిరముగా స్థాపించుకొనగల్గెను. *

కాని రాజేంద్రచోడుడు తన రాజ్యపు టుత్తర సరిహద్దులను సంరక్షించుకొనుటకు గంగవాడికి దక్షిణమునందును, తూర్పుదిశయందును గడిదుర్గములందు బలిష్ఠములైన సైన్యములను కాపుపెట్టుకొనెను.

జగదేకమల్లుని రాజ్యారంభకాలమున, 1015—1017 సంవతరముల నడుమ, రాజేంద్రచోడుడు రట్టపాడిమీద దండయాత్ర జేసెను. ఆ దండయాత్రలో ముందుగా మైసూరులో చేరిన ఎడతొరెనాడును జయించెను. తరువాత వరదానదిగొడ్డున నున్న వనవాసనగరమును సాధించెను. ఇది బొంబాయి రాజధానిలో దక్షిణకొనను కార్వారు తాలూకాయం దున్నది. అటనుండి రాజేంద్రచోడుడు కొల్లిపాకను ముట్టడించి కొల్చెను. తన్నెదుర్కొనిన ఇమ్మడి జయసింహుని ముశంగియుద్ధమున పూర్తిగ వోడించెను. పిమ్మట అప్పటికి చాళుక్యరాజధానులలో నొకటిగా నున్న మాన్యఖేటమును సాధించెను. ఆవిధముగా దిగ్విజయము గావించి † రాజేంద్రచోడుడు స్వదేశాభిముఖు డయ్యెను—

రాజేంద్రచోడుడు జయించిన నాలుగు దుర్గములును పశ్చిమ చాళుక్యులకు మిక్కిలి ముఖ్యము లయినవి. మాన్యఖేటముగూడ శత్రుహస్తగతమయిన నాటినుండి ఇమ్మడి జయసింహుడు తెప్పరిల్లెను. నాటినుండి ఆతని విజయములు ప్రారంభమయ్యెను. రాజేంద్రచోడుని నోడించి, మరల తన జీవితకాలములో రొట్టపాడిమీద క్కాలుబెట్టకుండ, చిదుకగొట్టి పంపెను. బలగామెజిల్లాలో నొక చోట నున్న

* బాగలిశిలాశాసనము, బళ్లారిజిల్లా: AR. ౯౭-౧౯౦౪.

† తిరువాలంగాడు తామ్రశాసనము. SII. III Part Ph.; తిరుమల-కొండశాసనము. SII. I ph 96-99ఆదే Eh. Id. P. 229 యందు సంస్కరింపబడి మరల ప్రకటింపబడియెను.

జగదేకమల్లుని శిలాశాసన మొకటి, ౧౦౧౯ నాటిది, రాజేంద్రచోడుని పరాజయమును దెలుపుచున్నది *

అందు జగదేకమల్లుడు, తాను "రాజేంద్ర చోళ గజమృగరాజ"ని చెప్పుకున్నాడు. ఆ శాసన మందే, అప్పటికి పెక్కు పర్యాయములు రాజేంద్ర చోడుని సముద్రమందు ముంచినానని కూడ చెప్పు కొన్నాడు. దీనినిబట్టి చూడ, రాజేంద్రచోడుడు గొప్పగా చెప్పుకున్న రట్టపాడి దండయాత్ర, చివరకు పరాజయముగా పరిణమించినట్లు కనబడుతున్నది. జగదేకమల్లుని మీరజ్ తామ్రశాసనమునాటికి చోళుల పరాజయము పూర్తియైనది. ఆ శాసనము శ. ౯౪౬ కు సరియైన రక్తాక్షి సంవత్సర వైశాఖశుద్ధ పూర్ణిమనాడొసగబడిన దానమును దెలుపుచున్నది. ఆతిథి ౨౫ ఏప్రిల్ ౧౦౨౪ కు సరిపోవును. ఆనాడు ఉత్తరదిశయందు దండయాత్ర సాగించబోవుచు, కొల్లాపురముచెంత విజయస్కంధావారమున విడిసి యుండి జగదేకమల్ల జయసింహుడు ఎడతొరె రెండు వేలనాటి సీమలోని గ్రామము నొక బ్రాహ్మణునికి అగ్రహారముగా ధారవోసెను. ఆ శాసనకావ్య మందు, మహావీరుడైన రాజేంద్రచోళుని జయ సింహుడు సంపూర్ణముగ నోడించి యాతని సైన్యమును బరిమార్చి, యాతని సంపదలనెల్ల హరించి పరాభ వించి పంపెనని యున్నది. †

అది సత్యముగాదు. ఏ యెడతొరెనాటిని తాను జయించితినని రాజేంద్రచోడుడు సగర్వముగ పలికెనో, ఆ ఎడతొరెనాటిలోని గ్రామమునే జగదేకమల్లుడు రెండేండ్లయిన దాటకుండ దానము చేసెను. ఈ వృత్తాంతముల నన్నింటిని పరిశీలించి నపుడు రాజేంద్రచోడునికిని, ఇమ్మడి జయసింహు నకును జరిగిన యుద్ధములు ౧౦౧౯ నాటికి పూర్వమే జరిగియుండెనని నిశ్చయ మగుచున్నది. అంతియే గాదు అటుతరువాత జయసింహునిమీదికి జీవితశేష భాగమున రాజేంద్రచోడుడు యుద్ధమునకు బోలేదని కూడ నిశ్చయింపవచ్చును. చోళభూపతివల్ల తన కింక నే యొత్తిడియు గలుగబోదని ధైర్యముకల్గిన నాడు గదా జయసింహుడు నిర్భీతితో ఉత్తరదిశకు జైత్రయాత్ర బోయియుండును!

ఇక జగదేకమల్లు డెప్పుడు ఏ కారణము చొప్పున ఆంధ్రదేశముమీదికి తన సైన్యములనం పెనన్న ప్రశ్నకు సమాధానము కావలయును. ఆ సమాధాన మునుబట్టి కలిదిండి యుద్ధకాలమును నిర్ణయింపవీలగును తిరువాలంగాడు, తిరుమలకొండ శాసనములను పరి శీలించినపుడు రాజేంద్రచోడుడు తన దండనాథు నొకని విజయరాజ్య సంవత్సరము ౭-౧౧౦ నడుమ (౧౦౧౯—౧౦౨౨) గంగాజలములు గొనితెమ్మని ఉత్తరదిశకు సైన్యమిచ్చిపంపెను. ఆ ధండనాథుడు గంగాజలములను గొనివచ్చుటయు, దానిని గంగైకొండ చోళపురములోని గంగగుండమందు బోయించుటయు రాజేంద్రచోడుని ౧౨ వ రాజ్యవర్షమునకు పూర్వము ౧౦౨౨ ఆ ప్రాంతమున జరిగియుండును. ‡ గంగా

---

* Ind. Ant. M. J. P. ౧౫ పంక్తులు ౧౩ మొ. అదే Ep. Cam., sk ౧౨౫

† Miraj plats of Jayasimha II. Ind Ant. Vol. vii p.

‡ తిరువాలంగాడు తామ్రశాసనముకంటె తిరుమలకొండ శాసనము కొంత యెక్కువ ప్రాశస్త్యము-చారిత్రకదృష్ట్యా - కలదు. దానికి అనేక కారణము లున్నవి. వాటి నిట చర్చింపను - కాని తిరువాలంగాడు తామ్రశాసనకావ్యము, రెండు భాగములుగా నున్నది. మొదటిది సంస్కృతభాషలో నున్నది. రెండవది తమిళభాషలో నున్నది. సంస్కృత భాగము మొదట ౧౦౧౦ సంవత్సరమున రచియింప బడియెను. కాని యది మరి పదునైదేండ్లలోపల, అప్పటివరకు వృత్తాంతముల నన్నింటి చేర్చుకొనెను. శాసనకావ్యకర్త, రాజాజ్ఞను పాటించియే శాసన కావ్యమును ఆ విధముగా పెంచి సంస్కరించి యుండును. అప్పుడు శ్లోకములు ముందుండవలసినవి వెనుకను, వెనుక నుండవలసినవాటిని ముందును పెట్టి, కావ్యమును రచించియుండును. లేకున్న ౧౦౧౨ కి తరువాత జరిగిన విషయములు, ౧౦౧౨ న యీయ బడిన శాసనకావ్యములలోనికి జేరుటకు అవకాశ ముండదుగదా! ౧౦౨౪, ౧౦౨౫ సంవత్సరముల నాడు జరిగిన ద్వీపాంతరదండయాత్ర కథకూడ ఈ తిరువాలంగాడు శాసనములలోనికి వచ్చుటకు వేరొక కారణము గాన్పింపదు - ఇక తమిళభాగము ౮వ విజయరాజ్యవర్షమున నెట్లు వ్రాయబడియెనో, ఆ రీతి గనే మార్పుచెందక నిలచియున్నది.

జలమును పరాజితులయిన రాజన్యులచేత మోయించుకొని స్వదేశాభిముఖ్యుడై తిరిగివచ్చుచున్న తన దండనాథుని కలుసుకొనుటకు రాజేంద్రచోడుడు గోదావరి దరికి యెదురేగెను.

గోదావరి యనగా చాళుక్యరాజధాని రాజమహేంద్రవరము గావలయును. రాజేంద్రచోడుడు, అనుగు మేనల్లుని పట్టాభిషేక మహోత్సవపు వేడుకలను సందర్శించి, గోదావరి పావనోదకముల జలకమాడుచు రాజమహేంద్రవరమున గొంతకాల ముండి గంగాజలములతో స్వరాజధానికి మరలివచ్చెను. తిరువాలంగాడు శాసనము తెలుపుతున్న ఒడ్డెరాజును, యాతని సోదరుని జయించి, చంపిన వృత్తాంతమును, మలకొండశాసనము దెలుపు చక్రకూటమును సాధించిన వృత్తాంతమును, ౧౦౨౨ కు బూర్వ మెప్పుడో జరిగియుండవలయును. లేదా తన దండనాయకుని వీరకృత్యములను రాజేంద్రచోడుడు తన కృత్యములుగా ప్రకటించుకొనియుండును. అందు అసంగతము ఏమియును లేదు. గోదావరిని జేరినతరువాత రాజేంద్రచోడు డుత్తరదిశకు బోయిన ట్లూహింప వీలుకానరాదు. తిరువాలంగాడు శాసనకావ్యము సంస్కరింపబడిన విధానము, అది పొందిన యిప్పటి కడపటి రూపమును పై రెండు ఊహలకును సావకాశమిచ్చుచున్నవి.

తిరువాలంగాడు, తిరుమల శాసనములను ఎంత పరిశీలించినను రాజేంద్రచోడుడు తన మేనల్లునికి రాజరాజనరేంద్రునికి రాజమహేంద్రవరమున స్వయముగ పట్టాభిషేకము జరిగించుటకు పోయియుండినట్లూహించుటకు అవకాశము గాన్పింపదు. అట్లూహించుట వెంకటరమణయ్యగారి కల్పనాశక్తి మూలకారణము. రాజేంద్రచోడుడు పశ్చిమచాళుక్యులచేత నోటువడి తన సైన్యములకు పరాజయము కలుగుట వలన నిరుత్సాహముకలిగి దేశమున కేమైన యుపద్రవములను కలిగించకుండుటకై గంగాయాత్ర నొకదానిని కల్పించెను. నీలకంఠశాస్త్రిగా రనుకొన్నట్లు చోళుల శౌర్య పరాక్రమములు ప్రతాపానలములు భరతఖండమునందు జాటవలయునని కాదు *

వెంకటరమణయ్య గారు నీలకంఠశాస్త్రి గారు చెప్పినదానిని విచక్షలేకుండ అంగీకరించి, 'యదియే సిద్ధాంతమని నారు. భగీరథుని కంటె తాను గొప్పవాడ ననిపించుకొనుటయే రాజేంద్రచోడుని ఆశయము. కావున రాజేంద్ర. చోడుని దండనాయకుని ఉత్తరాపథ దిగ్విజయ యాత్రకును, ఒడ్డెరాజాదులను జయించిన కథకును రాజరాజనరేంద్రుని పట్టాభిషేకమునకును ఆంధ్రదేశ వ్యవహారములకు నెట్టి సంబంధమును లేదు. వెంకటరమణయ్యగారి సిద్ధాంతము యథార్థ చరిత్రను మరుగుపెట్టుచు, వారికి గల చోళపక్షపాతమును ఆంధ్రభూమియెడల దురభిప్రాయమును వెల్లడి చేయుచున్నది.

ఇంతవఱకు చర్చించినదానిని బట్టి జగదేకమల్లుడు ఆంధ్రదేశము మీదికి దండును బంపినది. యాతని యుత్తరాపథ దండయాత్రను ముగించిన ౧౦౨౫ తరువాతను అని నిర్ణయింపవచ్చును. కలిదిండి యుద్ధ మాకారణమున ౧౦౨౫ తరువాతను జరిగియుండవచ్చునని స్థూలముగా నిర్ణయింప వచ్చును. ఇంతకంటెను సూక్ష్మముగా నిర్ణయింపవచ్చును. కాని తత్పూర్వము వెంకటరమణయ్యగారు కల్గించిన యపోహలను తొలగించినగాని యీ నిర్ణయము సులభసాధ్యముగాదు. చోళులమీద వారికి గల యభిమానము పూర్తిగా వారిని చరిత్రపరిశోధనయందు తప్పదారిని త్రొక్కించెను. పక్షపాతము వహించి చరిత్ర నన్వేషింప బూనినచో యథార్థము యథార్థముగ గోచరించదు

పూర్వచాళుక్యుల ప్రశస్తి విషయమును వివరించుచో, వెంకటరమణయ్యగారు, వేంగీశులు పదికొండవ శతాబ్దారంభమునుండియు మొదటి శక్తివర్మను సింహాసన మెక్కిననాటనుండియు, చోళులకు ఆశ్రితు లైరని వ్రాసిరి. వేంగీమహారాజ్యము స్వాతంత్ర్యమును గోల్పోయి, వేంగీశులు తాము మహా

---

* రాజేంద్రచోళునికి వేంగిపాదాక్రాంతముగా లేదు. జయసింహు డోటువడనూ లేదు. తమిళ ప్రతాపమును స్తుతిచేయుటయందును తమిళాభిమానమును జూపుటయందును అసంబద్ధ విషయములను కుప్పలు కుప్పలుగా చరిత్రయని వ్రాయుటయును నీలకంఠశాస్త్రిగారికి కడుంగడు ఇష్టము. Journal of Oriental Research Institute Vd. Vol Part VII pp. 199-216 (at p. 204

రాజాధి రాజులమనియు, పరమేశ్వరులమనియు స్వభుజ బలపరాక్రమములచేత రాజ్యమును జయించుకొంటిమనియు, చెప్పుకొన్నను వేంకటరమణయ్యగారి దృష్టియందు "చోళసామ్రాజ్యాంతర్గత సంస్థానముగా మారెను. చరిత్రకు సత్యమునకు అతిదూరములైన యిట్టి వ్రాంతలు వెంకటరమణయ్యగారి చోళాభిమానమును, వారి కొకప్పుడు పై అధికారులయిన నీలకంఠశాస్త్రి గారు త్రొక్కిన త్రోవను త్రొక్కుటయందు గల భక్తితాత్పర్యమును, చారిత్రకపరిశోధనాశక్తిని సరిగా నుపయోగింప శక్తిచాలమియును జాటుచున్నవి - యథార్థమునకు చోళులు వరుసగా మూడు తరములు తమ యాడుబిడ్డలను వేంగీసుల కిచ్చి వారితో సంబంధబాంధవ్యములు గలుపుకొనిరి. అట్లు గావించుటకు వారి యుద్దేశము వేంగీసులతోడి మైత్రిని, బాంధవ్యముతో గట్టిపఱచుకొనుటయే. చోళకన్యలను పెండ్లియాడినంత మాత్రాన వేంగీసులు అభిమానమును జంపుకొని, స్వాతంత్ర్యమును వదలుకొని పారతంత్ర్యమున బడి, మామలకు, బావలకు సామంతు లగుదురా? సామంతులైనట్లు జూపు సాధనసాక్ష్యము లేనైన యున్నప్పుడు గదా యట్టి యూహలను గావించుటయు, వ్రాయుటయు నొప్పును. బీరవచనములతో పొంగిపొరలు ఆనాటి చోళశాసనములుకూడ వేంగీశులు చోళులకు సామంతులైరని వాకొని యుండలేదు. వెంకటరమణయ్య గారు, చోళరాజకన్య కుందవాంబను పెండ్లియాడి తన రాజ్యాభిషేకమునకు బూర్వము విమలాదిత్యుడు, చోళరాజధానియగు తంజనగరప్రాంతమున నుండు తిరువైయ్యారు ప్రాసాదమున నివసించు చుండెను" అని వ్రాసిరి. ఈ యూహ నిరాధారమైనది. ఇదిట్లు వ్రాయుట మిక్కిలి శోచనీయము. శాసనములను పరిశీలింతము. పట్టాభిషిక్తుడయిన తరువాత ఒకసారి విమలాదిత్యుడు చోళదేశమునకు బోయినట్లు చూపు శాసన మొక్కటే కలదు—అదియే తిరువైయ్యారు శాసనము *

అందు, చోళచక్రవర్తి రాజరాజుయొక్క ౨౯ వ విజయరాజ్య సంవత్సరమున, తిరువైయ్యారులో మహాదేవీశ్వరాలయములోని మహాదేవునికి విమలాదిత్యుడు ఎనిమిది వెండిపాత్రలను సమర్పించినట్లున్నది. ఆ శాసనమునందు సంవత్సరము తప్ప తిథి వారనక్షత్రములు, శకమును లేవు. కాని యది ౧౦౧౨ - ౧౦౧౩ సంవత్సరమునాటిదని తెలియుచున్నది.

ఆ శాసనమందు విమలాదిత్యుడు విష్ణువర్ధనమహారాజని పేర్కొనబడినాడు. రాజరాజునకు విమలాదిత్యునికిని గల బంధుత్వము తెలుపబడలేదు. రాజరాజు తన ౨౯ వ విజయరాజ్య సంవత్సరమున రాజ్యపరిత్యాగము చేసెను. వార్ధక్యము, ఆసన్నమరణము దానికి కారణములు. అతని కుమారునికి రాజేంద్రచోడునికి రాజ్యము నభిషేకించెను. రాజేంద్రచోడుని పట్టాభిషేకము ౩౦ మేయి ౧౦౧౨ నాడు జరిగెను †

శ్యాలకుని పట్టాభిషేక మహోత్సవమును దిలకించుటకు, మరణ మాసన్నమైయున్న మామగారిని చూచుటకు విమలాదిత్యుడు తంజనగరమునకు బోయియుండవచ్చును. తిరువైయ్యారు దేవళము తన యత్తగారిపేరిట ప్రతిష్ఠచేయబడిన దగుటచేత అభిమానముతో దానికి దానములు జేసెను. అంతకన్న అందు విశేషము ఎక్కువ లేదు.

చాళుక్యుల పౌరాణికవంశక్రమమును జుగుప్సాకరమగు మాటలతో తెలిపిరి వెంకటరమణయ్యగారు. "చోళరాజకన్యను పెండ్లాడి, చోళరాజ్యమున నివసించుచుండిన కాలమున విమలాదిత్యునకు పౌరాణిక రాజవంశములతో సంబంధము కల్పించుకొనవలయునని ఇచ్ఛ పొడమియుండును.........................

'కావున మామగారి వంశమువలె దన వంశమును ప్రాచీనక్షత్రియ వంశమని ప్రకటించుటకు విమలాదిత్యుడు పౌరాణిక వంశానుక్రమణికను నిర్మించుకొని శాసనస్థము గావించుకొనెను.' అని యేమేమో వ్రాసినారు. ఈ వ్రాతి కేవలము కల్పనావిశేషము. చోళరాజ వంశముకంటె చాళుక్యరాజవంశము కనీసము రెండు వందలయేండ్లు ప్రాచీనతరమైనది. ఆ విషయము ౧౧ వ శతాబ్దమున అందరికిని రాజలోకమున దెలిసిన ప్రసిద్ధవిషయము.

ఆ విషయము చోళులకునుగూడ తెలియును. అట్టియెడ విమలాదిత్యు డెట్టి శ్రమయును పడనక్కరలేదు. ఆ విషయ మటుంచినను వెంకటరమణయ్యగారి యపూర్వపుటూహకు ఏదైన ఆధార మున్నదేమో పరిశీలింతము. పౌరాణిక రాజవంశములతో ముడివెట్టు వంశకథలు కర్ణాటాంధ్రదేశములందు చిర

---

*AR NO 215 OF 1894= SII. V. NO5 14

† Sewell Historical inscriptions, Southern India, p. 60.

కాలమునుండి వ్యాప్తియందుండెను. విమలాదిత్యుని రణస్థిపూండిశాసనము ౧౦౧౯ నాటిది - అందులో వర్ణితమైన పురాణవంశకథవంటిది జగదేకమల్ల-ఇమ్మడి జయసింహుని కాలమునాటిబలగామయ్యెశాసనమందు గనబడుచున్నది. అదియు సరిగా ౧౦౧౯ సంవత్సరము నాటిది *

ఇంకను గల దొక విశేషము. అంతకుబూర్వపు శాసనమందు, - అది జయసింహుని పెద్దన్నగారగు అహామల్ల విక్రమాదిత్యుని కౌశం శాసనము - ఇంచుమించుగా విమలాదిత్యుని రణస్థిపూండి తామ్ర శాసనములోని కథవంటిది, కొంత గలదు.†

అది ౧౦౧౩ సంవత్సరమునాటిది. కావున, కొంతకాలమునుండి, రెండు మూడు వందల సంవత్సరములనుండి వచ్చుచున్న పౌరాణిక రాజవంశములతో తమ వంశమును ముడివెట్టుకొను ఉద్దేశము, తత్పూర్వముండిన దొక ఐతిహ్యము, పూర్వ, పశ్చిమ రాజ చాళుక్య వంశములందు పరంపరగా వచ్చుచుండినగాని, పరస్పర విద్వేషములతో కుమిలిపోవుచున్న రాజమహేంద్రవర, కళ్యాణకటక చాళుక్యులు, సరిగా ఒకే కాలమున పౌరాణిక వంశానుక్రమణికను ప్రకటించుకొనుట సంభవము గాదు.

ఇంక ఎటువచ్చినను, రణస్థిపూండి శాసనము కథ పూర్తిగా సంస్కరింపబడిన వృత్తాంతము. ఆదినుండి విమలాదిత్యునివఱకు వేంగిరాజచాళుక్య వంశమునందు విచ్ఛేదము లేదు. కావున ముందు వారి పౌరాణిక వంశక్రమము ముందుగా రూపమును దాల్చెను. కావున విమలాదిత్యుడు మామగారి వంశ కథలకు దీసిపోకుండ తానొక కథను - అత్తవారింటనే కాలక్షేపమును లేక గూర్చుండినకాలమున కల్పించుకొన్నాడని వ్రాయుట జుగుప్సాకరము!

రాజరాజనరేంద్రుని జననము, బాల్యము. రాజరాజు బాల్యమందే, యువరాజపదలాంఛనమైన కంఠపట్టికను ధరించినాడని కలిదిండి - శాసనము తెలుపుచున్నది. ధర్మ, స్మృతి, శాస్త్రవేత్తల మతము ననుసరించి పదునారేండ్ల ప్రాయము వచ్చువఱకు బాల్యదశ యగును. కావున యౌవరాజ్య పట్టాభిషేకము రాజరాజుకు ఏ పదియేండ్లనాడో జరిగియుండును. అది విమలాదిత్యుని పట్టాభిషేకానంతరమున జరిగియుండును. ఆనాటికి రాజరాజు పదియేండ్లవాడయిన, అతని జననము, ౧౦౦౨ సంవత్సరప్రాంతమున జరిగియుండుననుట అసంగతము గాదు. వెంకటరమణయ్యగారు రాజరాజు ౯౯౫ సంవత్సరమందు జనించియుందు రనిరి. అది యొప్పుకొనినచో, నాతని యువరాజు పట్టాభిషేకమునాటికి పదునారేండ్లు నిండినవాడగును. ఆ వయసు బాల్యదశలో చేరదు. రాజ్యపరిత్యాగము చేయదలచిన విమలాదిత్యుడు రాజరాజుకు యుక్తవయస్సు వచ్చువఱకు, అనగా ౧౬ సంవత్సరములు నిండి ౧౭ వ సంవత్సరము నడచువఱకు, రాజ్యము చేసెను. అట్లు చూచినను రాజరాజు జననము ౧౦౦౨ సంవత్సర ప్రాంతమున, శ. ౯౨౪ సంవత్సరమున అగుచున్నది. దానినిబట్టి ఆ మహారాజు పట్టాభిషేకమునాటికి ఇరువది యేండ్లు నిండిన యువకుడని నిర్ణయింపవచ్చును.

రాజరాజు విమలాదిత్యున కగ్రతనయుడు. ఆతని సవతితమ్ముడు విజయాదిత్యు డెప్పుడు పుట్టెనో తెలియరాదు. అగ్రతనూజు డగుట బట్టి విమలాదిత్యుడు రాజరాజును యువరాజుగా నభిషేకించినాడు. ఇందు చోళుల ప్రసక్తిగాని, ప్రోద్బలము గాని యుండెనని వెంకటరమణయ్యగారూహించుట అసంగతము. విమలాదిత్యుడు ఆంధ్ర దేశమునకు మహారాజాధిరాజు, పరమేశ్వరుడు. శత్రువులను జయించి రాజ్యమును గైకొన్నవాడు. ‡

అతని యాజ్ఞ నుల్లంఘింప సాహసముగల వాడొక్కడు నాంధ్రభూమిని లేడు - అట్టి సందర్భమున చోళుల గొప్పదనముచేతను, ఒక చోళచక్రవర్తికి మనుమడు, ఇంకొకనికి మేనల్లుడు నగుటబట్టి, రాజరాజుయొక్క యువరాజ పట్టాభిషేకము నిర్విఘ్నముగా, నిరాటంకముగా జరిగిపోయెనని నిస్సంశయముగా బలుకవచ్చునట! ఈ విధముగా. చోళులను అప్రస్తుతప్రశంసచేయుటయు, విమలాదిత్య 'రాజరాజులను అప్రస్తుతముగా అధములను జేయుటయు జరిగినది. వెంకటరమణయ్యగారి 'చోళపక్షపాతమునకిది యొక తార్కాణము. (సశేషం)

---

* Ind, Ant. Vol. V. P. 17.

† Md. Ant. Vol. XVI. p 21.

‡ "అరాతిధ్వాంత విధ్వంసదక్షః" అని కలిదిండి శాసనమును, "విజిత్య విజయీ రిపూన్" అని కోరుమిల్లి శాసనమును, వీరుడని నందంపూడి శాసనమును వాకొనుచున్నవి. రణస్థిపూండి శాసనమునందు విమలాదిత్యుని యుద్ధముల ప్రశస్తి రెండు శ్లోకములందు గలదు. ౧౫, ౧౬ శ్లోకములు.

‘సత్యఅహింస’లకు జన్మదినం

●

శ్రీ **వేలూరి** సహజానందం

అక్టోబరు ౨ న ఇంటింట జరిగే పుట్టినరోజు పండుగ. ఒక్క మతస్థులకు, ఒక్క ప్రాంతీయులకు, ఒక్క దేశస్థులకు మాత్రమే కాదు ఈపుణ్యదినం. సర్వజనులకు, అన్ని ప్రాంతాలవారికి, ప్రపంచమంతటా స్మరించుకునే పవిత్రదినం.

దరిద్రులు, ధనవంతులు, బానిసదేశాలు, స్వతంత్రదేశాలు అందరూ చేసుకొనే పండగ.

ముఖ్యంగా మన దేశంలో ఈనాడు ప్రజలందరూ “గాంధీజీకి జై” అంటూ ఉత్సవాలు చేస్తారు. ఊరేగింపులు జరుపుతారు. జెండా ఎగురవేస్తారు. తెల్లని ఖద్దరు ధరిస్తారు. సత్యం, అహింస అంటూ జపిస్తారు.

ఏడాదికొకసారి జరిగే ముచ్చట. ఒక యుద్ధం గెల్చిన వీరునివలె, మంత్రశక్తితో మహిమలు చేసిన మాంత్రికునివలె, ఏదో కొత్తమతాన్ని నిర్వచించిన ఉపదేశకునివలె కాదు గాంధీజీని ఎక్కువగా స్మరించేది ప్రజలు.

జనసమూహాలను సంఘటితపరచి, ఒక్క తాటిమీద నడిపించినందుకు కూడా కాదు. హరిజనోద్ధరణకూ కాదు. ఆర్థికసమానత్వంకోసం ఆయన చేసిన ప్రబోధంగురించీ కాదు. ఫలసిద్ధితర్వాత జనసమూహాలు నాయకుని విస్మరించవచ్చు. ఉచ్చస్థితికి వచ్చాక పతితులూ ఈ ఉద్ధారకుని విస్మరించవచ్చు. దారిద్ర్యకూపంలోంచి బైటపడ్డాక ప్రజలు ఈ సమత్వప్రబోధకుని మఱచిపోవచ్చు. స్వరాజ్యంతో కైపెక్కిన దేశస్థులు నిర్మాతను మఱచిపోవచ్చు.

కాని ఇంతటితో, వీరి మఱపుతో మరుగున పడిపోయేవాడు కాదు గాంధీజీ. పై చెప్పిన పనులు మటుకే గాంధీజీ చేసివుంటే, నేడు కాకపోతే రేపైనా గతానికి గుర్తుగా మటుకే చరిత్రవీథిన గోచరించేవాడు. ఈ పనులు ఎంత ఉపయోగకరమైనవైనా ఇవి గాంధీజీయొక్క జీవితసత్యం కాజాలవు. మహాత్మునికి సత్యాన్వేషణే జీవితము. ఈ సత్యాన్వేషణలో లభించినవే హరిజనోద్ధరణ, స్వరాజ్యం వగైరా.

కేవలం సంస్కారంకోసం కృషిచేసిన మహనీయులున్నారు. అలాగే కేవలం రాజకీయ, ఆర్థిక దురన్యాయాలను నిర్మూలించిన వీరులున్నారు. కేవలం సంస్కృతినే ప్రబోధించిన ప్రబోధకులున్నారు. కాని వీరి కృషి అసంపూర్ణము. జీవితముయొక్క సంపూర్ణస్వరూపము వీరి కదృశ్యము. జీవితాకాశములోని ఏ ఒక దిక్కులోని చీకట్లో, వెలుతురో వీరి కగపడేది. గాంధీజీవి సత్యచక్షువులు. వాటికి జీవితంయొక్క హ్రస్వరూపాలు కాక, యావత్తు-చిత్రమూ గోచరమౌతుంది. జీవితంలో సత్యంయొక్క వెలుతురు సోకని కోణం ఉండదు. సత్యాన్వేషణే జీవిక అయిన జీవుల పదచిహ్నాలు జీవనక్షేత్రమందంతటా కనిపిస్తాయ్.

గాంధీజీని పదేపదే జపించేవారు ఈ సత్యాన్వేషణను అర్థంచేసుకోవాలి. “గాంధీజీ చెప్పినట్టు కాంగ్రెసుపార్టీ నడుచుకోవటంలేదు. మంత్రులు నడుచుకోవటంలేదు.” అని మామూలుగా వింటూ ఉంటాం. నిజం చెప్పాలంటే ప్రజలూ గాంధీజీని అనుసరించుటలేదు. ఎవడికి పడితే వాడు రెండోవాడిని “వీడు గాంధీటోపీ పెట్టాడు. కాని అది గాంధీకి టోపీయే,” అని అంటాడు.

గాంధీజీని అనుసరించటమంటే, ఆయన ప్రధానసాధనను అనుసరించటం. ‘సత్యాన్వేషణను అనుసరించటం. మిగతా రాజకీయ, సాంఘిక, ఆర్థికవిష

యాలు కాలంబట్టి మారుతూఉంటయ్. పదేళ్ళక్రితం చెప్పిన మాటలు ఈనాడు పనికిరావు. వస్తువుల ఉత్పత్తిప్రకారం, ఆర్థికనిర్మాణం మారుతుంది. కాని ఎప్పటికీ మార్పు చెందక, అన్నికాలాలకు ధ్రువతారలా ఉండేది సత్యాన్వేషణ. సంఘ నిర్మాణం మారుతుంది. ఆర్థికవ్యవస్థ మారుతుంది. కాని ఈ మార్పులను యోచించి, వీటి కనుమక్కు, తీరు తీర్చిదిద్దవలసిన, దిద్దగలిగిన సత్యాన్వేషణ మారదు. అది మసిబారని దీపం.

న్యాయం, దయ, క్షమ, స్వాతంత్ర్యం ఇవన్నీ ఆ సత్యాన్వేషణవల్ల సిద్ధిస్తయ్. ఎదురుబడ్డ బిచ్చగానికి ఏ గానీ పారవేయటంతో చాలదు. అది పుచ్చినవానికి తృప్తి కాదు; దాతకు ముక్తి కాదు. డబ్బుకోసం జేబులోకి చెయ్యి పోనిచ్చినట్లే, మనోనేత్రాన్నికూడా తెఱచి, సంఘంలో ప్రత్యేకం ఈ జీవిభుజాన జోలె ఎందుకు వేలాడుతోంది, ఈ విశాలవిశ్వంలో వీనికి ఉండటానికి తావు ఎందుకు లేదు, కష్టపడి జీవించటానికి భూమో, తదితర సదుపాయాలో ఎందుకు లేవు అని సత్యాన్వేషణను సాగించాలి. అప్పుడే ఆ సమస్య కూకటివేరు చేతికి తగులుతుంది. ఇలాగే ప్రతివిషయంలోనూ.

సత్యాన్వేషణ రెండోవాడి ఉద్ధరణకోసం కాదు. తెలిసీ, తెలియకుండా ప్రతివాని చుట్టూ కమ్ముకుపోతున్న కల్మషం ఈ సత్యదీప్తిలో కనబడుతుంది. ఇది, ఈ సత్యాన్వేషణ. ఆ ఆ అన్వేషకులను అజ్ఞానంలోంచి చెఱవిడిపిస్తుంది. తమను పీడిస్తున్న అన్యాయాలను స్పృహకు తేవటమే కాక తామూ ఇతరులకు చేస్తున్న దురన్యాయాలను చూపెట్టుతుంది. ఇది ఆత్మను పరిశుభ్రం చేసుకోవటం.

కోటీశ్వరులు దరిద్రుల సహాయార్థం వందలు, వేలు, లక్షలు దానం చేస్తారు. కాని దారిద్ర్యాన్ని స్థిరంచేసే తమ జీవన, సంపాదనాపద్ధతులను మార్చుకోలేరు. మార్చుకోరు. సత్యాన్వేషణే జీవితమయిన గాంధీజీకి దానం చేయటానికి వేలూ లేవు. కోట్లూ లేవు. కోటానుకోట్ల దరిద్రుల దారిద్ర్యాన్ని పంచుకొని, ఖరీదైన మేలు బట్టలు మాని కొల్లాయిగుడ్డ, కుటీరం అవలంబించాడు. మహాత్ముని స్వజీవితంలో ఇతరులను దరిద్రులను చేసే దుష్టవిధానం లేదు. ఈ దుష్టవిధానం లేని జీవితాన్ని ప్రతివ్యక్తీ జీవిస్తే చాలు. అదే మార్గం సంఘంలో దారిద్ర్యాన్ని నిర్మూలించటానికి. ఇంకొకడిని దరిద్రుడిని చేసే దుష్టవిధానాన్ని వదులుకోటం అన్ని దానాలకంటె ఉత్కృష్టధర్మం. ఒక్క దారిద్ర్యవిషయంలోనే కాదు. అన్ని విషయాల్లోనూ రక్తమాంసాలు చివికి, జబ్బులు వచ్చేంతగా తమ అధికారంకింద ఉన్న జనంచేత పని చేయిస్తారు. ఎక్కడో వ్యాధిగ్రస్తులకని కట్టే ధర్మాసుపత్రికి చందా లిస్తారు. ఆ చందా లివ్వటంతోపాటు, తాను చెయ్యవలసిన ముఖ్యకార్యం ఉంది—తను చేయించేపని పద్ధతి పనివాళ్ళను పీల్చి పిప్పిచేసేట్టు లేకుండా చేయటం.

ప్రతివ్యక్తీ సత్యాన్వేషణను జీవితధర్మంగా గుర్తించి ఆచరించినప్పుడే మన స్వరాజ్యం న్యాయరాజ్యం అవుతుంది. లేకపోతే, ఇతర రాజ్యాలతోపాటే మనం. రాజ్యస్వరూపాల్లో ఎన్ని భేదాలున్నా ఆంతర్యంలో విశిష్టమైన సత్యకాంక్ష లేనిదే, అన్నీకూడా మనుష్యుని దుఃఖానికే కారణం అవుతయ్.

ఇవ్వాళ ప్రభుత్వం, మంత్రులు, ఉద్యోగస్థులు కాంగ్రెసుపార్టీ, ఇతరపార్టీలు, ప్రజలు యావన్మందీ ఈ ప్రాగ్దిశాజ్యోతి సత్యాన్వేషణవైపు తిరిగి, ఆసక్తితో ఉత్తేజితులవాలి. నిజంగా దేశాభ్యుదయం, విశ్వాభ్యుదయం కోరేవారిలో ఈనాడు ఒక్కడైనా సత్యాన్వేషణనే జీవితధర్మంగా ఎంచి జీవిస్తే చాలు. దేశం తేజస్సుతో, జీవంతో కలకలలాడుతుంది.

గాంధీజీని ఆరాధించే ప్రజల మధ్య, రాజకీయ హత్యలు, ప్రభుత్వ దౌర్జన్యం, చీకటివ్యాపారం, ప్రజల మూఢత్వం, నిర్లిప్తత విచ్చలవిడిగా విహరిస్తున్నయ్. ఇవన్నీ జరుపుతూ చేసే గాంధీజీ ఆరాధన ఆరాధన కాదు. వంచన. హత్య. గాంధీజీశరీరాన్ని పిస్టలుతో పేల్చి ఆయన సందేశాన్ని విశ్వమంతట ప్రతిధ్వనింపజేశాడు హంతకుడు. కాని ఈ స్వార్థభక్తులు ఆయనపటాలకు మొకరిల్లి, ఆయన సందేశాన్ని కాళ్ళ తొక్కుతున్నారు.

గాంధీజీ జన్మించిన నేడు ఏ ఒకని మనస్సులోనైననూ నిశ్చలమైన నిర్మలమైన సత్యాన్వేషణ జనిస్తే, అది మహా సుముహూర్తం. అది సుప్రభాతం! సత్యానికి పునర్జన్మ—మనుష్యకుటుంబంలో.

కలగూరగంప

నోబెల్ శాంతి బహుమానం అందుకొన్న మొదటి నీగ్రో రాల్ఫ్ బంచ్

నోబెల్ బహుమానాలు, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రాలు, శాంతికాముకత్వం, మొదలైన విషయాల్లో ప్రపంచ విస్తృత ప్రజ్ఞాధురీణులైన వారికి ఏటేటా, ఒక్కొక్క విశేషానికి ఒక్కొక్కరికి ఇయ్యటం ౫౦ ఏండ్లుగా పరిపాటిగా వస్తూంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ శాస్త్రజ్ఞుడు. స్వీడిష్ పారిశ్రామిక వేత్త (డైనమైట్‌ను కనుగొన్నవాడు). కొంతనిధిని సమకూర్చి తన పేర ఈ ప్రపంచ బహుమానాలు, ఏటేటా, ప్రపంచ విస్తృతంగా ఆయా విషయాల్లో ఖ్యాతిగడించిన ప్రముఖులకు ఇచ్చే ఏర్పాటు చేశాడు.

గత సంవత్సరం శాంతి బహుమానం, బాయిడ్ ఆర్, అనే ఆంగ్లేయునికి ప్రపంచ ఆహారసమస్యపై కృషిచేసినందుకు ఇచ్చారు. ఈ సంవత్సరం ఈబహుమానం పాలస్తీనా సమస్యను శాంతియుతంగా పరిష్కరించిన ఐక్యరాజ్యసమితి కార్యవర్గ సభ్యుడైన అమెరికన్ నీగ్రో, రాల్ఫ్‌బంచ్ అందుకొన్నాడు. అమెరికన్లు (ఇతనితో) ఇప్పటికి పదకొండుగురు ఈ నోబెల్ శాంతి బహుమానం అందుకొన్నారు. గాని నోబెల్ బహుమానం అందుకొన్న మొదటి నీగ్రో ఈతడే.

జీ వి త ము

రాల్ఫ్‌బంచ్ మిషిగాన్-రాష్ట్రంలోని డెట్రాయిట్‌లో ౧౯౦౪ ఆగస్టు ౭ వతారీఖున జన్మించాడు. తండ్రిమంగలివృత్తిలోఉండేవాడు. వాళ్ళది చాల బీదకుటుంబం. రాల్ఫ్‌కు ౧౩ ఏళ్ళు వచ్చేటప్పటికేతలిదండ్రులిద్దరూ గతించారు. ఇతని పితామహి ఇతన్ని పెంచసాగింది. ఆమె చూపులకు చాలా అబ్బనాకారి. కాని మహాధీరోదాత్తగుణ సంపన్న.


మనుమడికి బాల్యంలోనే, తమ నీగ్రోజాతి అంటే గర్వపడేతత్వం అలవర్చింది. వర్ణ వివక్షత రూపాన ఎవరోనర్చిన అగౌరవమూ సహించవద్దని బోధించింది. ఆమె చాలా దైవభక్తురాలు. ఆమె బోధలతో వర్ణవివక్షతను శాంత సహనంతో నిగ్రహించే మెలకువలు బంచ్ అలవర్చుకొన్నాడు. అదీకాక మనసు వికసించే ఈడులో ఈ వర్ణవివక్షతకు రాల్ఫ్‌గురి గాని కారణంవల్లకూడా వర్ణద్వేషం అతని మనసులో అంకురం ఏర్పరుచుకోలేదు. పెద్దవాడయి అమెరికాలో ఈ సమస్యబారిని పడవలసిన ఈడు వచ్చేటప్పటికి బంచ్, తనశాంత సహనవిధానంలో తెల్లవారి వర్ణవివక్షతను ఎదుర్కొని నిగ్రహించగల మనో వికాసాన్ని, ధైర్యాన్ని చేకూర్చుకొని రాటుతేరాడు.

అతి బాల్యస్థితినుంచీ కూడా కష్టపడి జీవితం గడుపుకోవలసిరావటం బంచ్‌కు అలవాటయిపోయింది డిట్రాయిట్‌లో పేపర్లమ్మే కుఱ్ఱవాడిగాను, డెలివరీ బాయ్‌గాను పనులుచేసి ఇంటికి ఆర్థికపుష్టి చేకూర్చితోడ్పడ్డాడు.

ఆ తర్వాత లాస్ అంజలిస్‌కు కుటుంబం మారింది. అక్కడహైస్కూలులో చదువుకొంటూనే చిన్న చిన్న నౌకరీలు చాలాచేశాడు. లాస్ అంజెలిస్ టైమ్సు పత్రికలో, సీసపు బ్లాకులు మోసే కుఱ్ఱవాడిగా పనిచేస్తూ, ఆఫీసు మెస్సింజర్‌బాయిగా కూడా పని చేశాడు. ఒక వేసంగి అల్లే హాలీవుడ్‌లో ఒక ఇంటి నౌకరుగా పనిచేస్తూ పొట్టపోసుకొన్నాడు.

అమెరికాలో నీగ్రోగా పుట్టినందువల్ల అనుభవించవలసిన అవమానాల అనుభవం బంచ్‌కి, కొంత ఆలస్యంగా ప్రారంభమైనా వాట్లబాధ అవగతమౌతూనే వచ్చింది.

బంచ్, జెఫ్ఫెర్సన్ హైస్కూలులో అందరి కన్నా తెలివైన కుర్రవాడుగా పేరు పొందాడు. స్కూలులో ప్రారంభోపన్యాసం ఇయ్యటానికి అందరికన్నా అగ్రస్థానంలో అతను ఎన్నికయ్యాడు. గాని, లిఖితంగా గాక, ఆచారంగా స్కూలులో వున్న అనువాయితీ ప్రకారం, బంచ్‌కి (నీగ్రోకు) సీనియర్ ఆనర్ సంఘంలో ప్రవేశం లేదు. ఉపన్యాసం ఇచ్చే అర్హత లేదు. ప్రిన్సిపాలు స్కూలునుంచి అతనికి



1950 నోబెల్ శాంతి బహుమానం పొందిన డాక్టర్ రాల్ఫ్ బంచ్, లాంగ్ ఐలండులోని తనస్వగృహంలో కుటుంబసమేతంగా కాలక్షేపం చేస్తున్న దృశ్యం. 1949 లో పాలస్తీనా తగాదాలను పరిష్కరించటానికి మధ్యవర్తిగా వుండగా యీయన సాధించిన మహాకార్యానికి, నోబెల్ శాంతి బహుమానం పొందారు.

వీడ్కోలు చెప్తూ, "రాల్ఫ్! నువ్వు వెళ్లిపోవలసి వచ్చినందుకు నేను చాలా విచారిస్తున్నాను. నిన్ను నీగ్రోలాగ నేనేనాడు అనుకోలేదు" అన్నాడు.

"ఆ మాటతో స్తంభించి పోయాను. ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. కాని ఆ విషయం ఏనాడూ మర్చిపోలేక పోయాను" అంటాడు బంచ్.

వర్ణవివక్షత అతన్ని క్రుంగదీయలేదు. మరింత దృఢసంకల్పుణ్ణి చేసింది. "వర్ణవిభేద పరిగణన కారణంగా, జీవితంలో నేను పొందిన విజయం నాకు మరింత మధురతమ మయింది" అన్నాడు.

కాలేజీలో, ఆటలలో, చదువులో రెండింటి లోనూ ప్రథమ స్థానాలలో నిలచాడు: విద్యార్థుల డిబేటింగ్ సొసైటీ అధ్యక్షుడు, సీనియర్ తరగతి వార్షిక పత్రికలలో స్పోర్ట్సు సంపాదకుడు. రాజకీయ శాస్త్రంలో ప్రవీణతవల్ల ఉచిత వేతనం సంపాదించుకొని ఫి-బేటా—కప్పా, అనే ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు.

కాలేజీ చదువు కాలంలో, తీరిక సమయాల్లో, హోటళ్లలో పనిచేసి జీవితభృతి సంపాదించుకొన్నాడు.

౧౯౨౭ లో హార్వర్డు విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేటు ఫెలోషిప్పుకి చదువుకని ఇతనికి స్కాలర్ షిప్పు ఇచ్చారు. కాని చేతిలో రైలుఖర్చులకు కూడా రాగి దమ్మిడీ లేనందున విరమించుకోదల

చాడు. రాల్ఫు అంటే నీగ్రో సంఘంలో మంచి పలుకుబడి, ఆదరాభిమానాలు ఉన్నాయి. వెంటనే నీగ్రోక్లబ్బువారు, బెనిఫిట్ ప్రదర్శనాలు ఆడి, వెయ్యి పౌనులరొక్కం, రాల్ఫుబంచ్‌కిచ్చి, హార్వర్డు పంపించారు. బంచ్ కేంబ్రిడ్జిలో (అమెరికా, మసాచ్యుసెట్సు రాష్ట్రంలో) దిగి, ఒక బుక్‌షాప్ యజమాని దగ్గరకు, లాస్‌ఆంజిలీస్‌లో ఒకరిదగ్గరనుంచి రికమెండేషన్ తీసుకువెళ్ళాడు. రికమండేషన్ విషయం సామాన్యమైనది. "ఇతనుకొనుక్కోవలసిన క్లాసు పుస్తకాలు కమిషన్‌తగ్గించి తక్కువధరకు ఇయ్యవలసిం" దని మాత్రమే. బుక్‌షాప్ యజమానికి కొంచెం దృష్టిమాంద్యం ఉంది, రికమెండేషన్ చదవకుండానే ఉద్యోగం కోసమేకదా ననుకొని, షాపులో గుమస్తాఉద్యోగం ఇస్తానన్నాడు. బంచ్ వెంటనే ఉద్యోగంలో చేరాడు. ప్రొద్దున్నపూట విశ్వవిద్యాలయంలో చదువుతూ, మధ్యాహ్నం అంతా షాపులో ఉద్యోగంచేస్తూ ఆర్థికసమస్యను పరిష్కరించుకొన్నాడు. కొన్నాళ్ళ తర్వాత యజమాని భార్య ఎందుకో షాపులోకి వచ్చి బంచ్ వంక చూసి తెల్లబోయి లోపలికిపోయింది. కాసేపటికి యజమాని బంచ్‌ని లోపలికి పిల్చాడు.

"బంచ్! నువ్వు నీగ్రోవా!"

"మరేమనుకున్నారు?"

"సరేలే, అయిందేదోఅయింది. ఇప్పుడేం ఫరవాలేదు. కానిమొదట నువ్వునీగ్రోవని తెలిస్తే నీకు ఉద్యోగం ఇచ్చేవాణ్ణికానేమో. ఇప్పుడింక నువ్వే కావాలిమాకు." అని అభినందించాడు యజమాని.

ఒక ఏడాది చదువు పూర్తిఅయాక హార్వర్డులో ట్యూటరు పదవి, థేయర్ ఫెలోషిప్పుపట్టము ఇచ్చారు బంచ్‌కి. ౧౯౨౮ నుంచి ౧౯౪౧ దాకా బంచ్ హోవార్డులో అపుడపుడు లెక్చరర్ ఉద్యోగాలు చేస్తూనే ఉన్నాడు. ౧౯౩౪ లో హార్వర్డు విశ్వవిద్యాలయం బంచ్‌కి డాక్టరేటు బిరుదంఇచ్చింది. రాజకీయశాస్త్రంలో డాక్టరు బిరుదం సంపాదించిన మొదటినీగ్రో రాల్ఫుబంచ్.

రాల్ఫుకు, ౧౯౪౧ లో అమెరికన్ ప్రభుత్వోద్యోగం దొరికింది. "కో ఆర్డినేటర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్" ఆఫీసులో అసిస్టెంటుగా వేసుకున్నారు. ౧౯౪౩ నాటికి అక్కడి ఆఫ్రికావార్తా సేకరణ శాఖకు, ముఖ్యోద్యోగి అయాడు. ప్రభుత్వ వర్గాలలో పలుకుబడిరానారంభించింది. డంబర్టన్ ఓక్సు సమావేశానికి సలహాదారుగా తీసికొన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్మాణకార్యక్రమంలో కూడా ఇతని సహాయం ఎక్కువఉంది. ౧౯౪౬ లో ఐక్యరాజ్యసమితి కార్యవర్గంలో ఉద్యోగిఅయ్యాడు. ఇప్పుడు, ఆ సమితి ధర్మకర్తృత్వ శాఖకుదర్శకుడు.

౧౯౪౭ లో పాలస్తీనాసమస్యను సమితి పరిష్కరించాల్సి వచ్చినప్పుడు, సమితి పాలస్తీనా సంఘంతో బంచ్‌నికూడా పాలస్తీనా పంపించారు. ఆతర్వాత వసంతకాలంనాటికి, అరబ్బులు, యూదుల మధ్య యుద్ధం ప్రజ్వరిల్లింది. కౌంట్ బెర్నడొటి మధ్యవర్తిత్వాని కొప్పుకొన్నాడు. సమితి కార్యదర్శి, ట్రిగ్వీలి, బంచ్‌ని వెంటనే పారిస్ వెళ్లి బెర్నడొట్‌ని కలుసుకొని అతనితో పాలస్తీనా బయలుదేరవలసిందని, తంతియిచ్చాడు. యీ పని నాలుగైదువారాలకంటె ఎక్కువపట్టదని హామీ ఇచ్చాడు. కాని పదకొండు నెలలు పట్టింది. ౧౯౪౮ సెప్టెంబరులో బెర్నడొట్ హత్యతో, మధ్యవర్తిత్వభారం పూర్తిగా బంచ్‌పై బడింది. ఆతర్వాత ఎనిమిది నెలలలో తన అపారలోకజ్ఞానం, వ్యవహారదక్షత ఆధారంగా బంచ్ పాలస్తీనాలో శాంతి సమకూర్చాడు.

పాలస్తీనా వ్యవహారంలో, బంచ్ ప్రదర్శించిన, శాంతము. ఓరిమి, పరేంగితజ్ఞానము, సౌమనస్యము, జనప్రియత్వము, కార్యదీక్ష, స్థితప్రజ్ఞలక్షణాలు, అతనికి నోబెల్ శాంతి బహుమానం చేకూర్చిపెట్టాయని చెప్పవచ్చును.

ఐక్యరాజ్యసమితి వ్యవహార విధానము

ప్రథమ ప్రపంచ సంగ్రామకాలంలో నానారాజ్యసమితి (League of Nations) ఏర్పడింది. ద్వితీయ ప్రపంచసంగ్రామకాలంలో మిత్రరాజ్యాలను ఆధారం చేసుకొని ఐక్యరాజ్య సమితికి ప్రాతిపదికగా అట్లాంటిక్ ఛార్టరుద్భవించింది.

ఐదేండ్ల క్రితం, యుద్ధానంతరం, విజయదేశరాజ్యాల మొత్తంతోనూ, ఓడిపోయిన రాజ్యాలు కూడా కొన్ని కలిసి ౫౧ రాజ్యాలతో, ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. ఈనాటికి ఈ సమితిలో సభ్యదేశాల సంఖ్య ౬౦ అయింది.

ఇంకా సింహళం, నేపాల్ మున్నగు పదునాల్గు రాజ్యాలు సమితిసభ్యత్వానికి నిత్యం ప్రయత్నిస్తూ అగ్రరాజ్యాలలో ఏదో ఒకదాని "వీటో" అధికారం ధర్మాన, సభ్యత్వం సంపాదించుకోలేక తహతహలాడుతున్నాయి.

ప్రస్తుతం సమితిలో సభ్యరాజ్యాలు ఏభైతొమ్మిది. ఐక్యరాజ్యసమితి ఏర్పడినప్పటి ౫౧ సభ్యదేశాలు ఇవి.

అర్జెంటీనా; ఆస్ట్రేలియా; బెల్జియం; బొలీవియా; బ్రెజిల్; బీలోరష్యన్ యస్. యస్. ఆర్; కెనడా; చిలీ; చైనా; కొలంబియా; కోస్టారికా; క్యూబా; జెకోస్లొవాకియా; డెన్మార్కు; డొమినియన్ రిపబ్లిక్; ఈక్వెడార్; ఈజిప్టు; ఎల్‌సాల్వడార్; ఎధియోపియా; ఫ్రాంసు; గ్రీసు; గాటమేలా; హైటి; హోండూరాస్; ఇండియా; ఇరాన్; ఇరాక్; లెబనాన్; లైబీరియా; లక్జంబర్గు; మెక్సికో; నెదర్లాండ్సు; న్యూజిలండు; నికరాగువా; నార్వే; పనామా; పరాగ్వే; పెరూ; ఫిలిప్పైన్సు; పోలండు; సౌదీఅరేబియా; సిరియా; యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా; టర్కీ; యుక్రేనియన్ యస్.యస్.ఆర్; యు.యస్.యస్.ఆర్. (రష్యా); యునైటెడ్ కింగ్డమ్



ఐక్యరాజ్యసమితి భద్రతాసంఘం, కొరియాయుద్ధంలో అమెరికన్ ఆధ్వర్యాన సమితిసేనలు యుద్ధం చేయటానికి తీర్మానించినప్పటి సమావేశం

(బ్రిటన్); యునైటెడ్ స్టేట్సు (అమెరికా); ఉరుగ్వే; వెనిజులా; యుగోస్లావియా.

ఆ తర్వాత అఫ్ఘనిస్థాన్, ఐస్‌లాండు, స్వీడన్, పాకిస్థాన్, ఇజ్రాయేల్, థాయ్‌లాండు, బర్మా, యెమెన్‌లు, ఎన్నిటిదీ చేరటంతో ఈ ఐదవ సమావేశం నాటికి సభ్యదేశాలు ౬౦ అయాయి. ఇంకో ౧౪ దేశాలు సభ్యత్వానికై కాచుకొని ఉన్నాయి.

ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశములో ఈ ౬౦ రాజ్యాల సభ్యులూ ఉంటారు. ప్రతిసభ్య దేశానికి ఒక ఓటు ఉంటుంది. సర్వసభ్యసమావేశంలో ముఖ్యమైన విషయాలపై జరిగే నిర్ణయాలన్నిటికీ హాజరైన సభ్యులలో మూడింట రెండు వంతులవారి ఓట్ల మెజారిటీ ఉండితీరాలి. తక్కిన సాధారణ విషయాలలో మామూలు మెజారిటీ ఓట్లు వస్తే చాలును.

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఆరు ముఖ్య సంఘాలు ఉన్నాయి. ప్రతిదానిలోను సభ్యులందరికీ ప్రాతినిధ్యం ఉంటుంది.

ఈ సంఘాలు వరుసగా ఇవి.

1. భద్రతా సంఘము—రాజకీయాలు, భద్రత ఈ సంఘ కార్యకలాపాలు.

2. ఆర్థికసంఘము— కార్యకలాపం—ఆర్థిక, ధనపరిస్థితులు.

3. సాంస్కృతిక సంఘము— సాంఘిక మానవధర్మ, సాంస్కృతిక విషయాలు.

4. ధర్మకర్తృత్వ సంఘము— (స్వపరిపాలన లేని మండలాలుకూడా ఇందులో చేరుతాయి.)

5. పరిపాలనా సంఘము— పరిపాలన విశేషాలు, బడ్జెట్లు ఈ సంఘ కార్యకలాపాలు.

6. న్యాయిక సంఘము— న్యాయశాస్త్రం, చట్టాలు, ధర్మనిర్ణయాలు, ఈ సంఘ కార్యకలాపాలు.

ఈ ఆరూ కాక సమితికి రెండు వ్యావహారికసంఘాలున్నాయి. ఒకటి సర్వసభ్య సారథ్యసంఘం— రెండు అర్హతానిర్ణయ సంఘం. సారథ్యసంఘం, సమావేశం అజండాకై పెట్టిన విషయాలనుముందు పరిశీలించి సమితికి నివేదిస్తుంది. అర్హతా నిర్ణయసంఘం, ప్రతినిధుల అర్హతానర్హతలను పరిశీలించి తన నిర్ణయాలను సమితికి నివేదిస్తుంది. సమితికి వేరే మరికొన్ని స్థాయీ సంఘాలున్నాయి. ప్రత్యేక పరిస్థితులలో ప్రత్యేక సంఘాలను నియమించే అధికారంకూడా సమితికుంది. ఈ వేర్వేరు సంఘాలలో ఏకసమయంలో పనిచేయగల ఉసులుపాటుకై ప్రతి సభ్యదేశమూ, ఐదుగురు ప్రతినిధులనూ, వారికి ప్రత్యామ్నాయంగా, పని చేయవలసిన అవసరం కలిగితే పనిచేసేందుకు మరి ఐదుగురు సభ్యుల పేర్లనూ, సమితికి పంపించవచ్చును.

ఐక్యరాజ్యసమితి వ్యవహారవిధానం సామాన్యులకు చాలా తికమకలుగా కనిపిస్తుంది. ఒకొక్క విషయంపై జరిగే వాదాలను దాదాపు అదే రూపంలో, సమితిచర్చలలో ఐదారుమాట్లు, రోజూ పేపరులో మాస్తూవస్తూంటే సమితి వ్యవహారం అంటే సామాన్యపాఠకునికి విసుగుపుట్టూవస్తుంది. కాని దీని కీలకం సమితి వ్యవహారకాండలోనే ఉంది.

ఒక దేశ ప్రతినిధి ఒక తీర్మానాన్ని, లేదా ఒక ప్రశ్నను, సర్వసభాసమావేశ చర్చలో ప్రవేశ పెట్టదలచుకొన్నాడనుకోండి.

ముందర లాంఛనంగా, ఆ విషయాన్ని ఐక్యరాజ్యసమితి కార్యదర్శికి (Secretary General) తెలిపి, ఆ విషయాన్ని సమితిసభలో చర్చకు తేవలసిందని అర్థించాలి. అప్పుడు కార్యదర్శి ఈ విషయాన్ని జనరల్ కమిటీకి తెలుపుతాడు. జనరల్ కమిటీలో, సమితిఅధ్యక్షుడు, ఏడుగురు ఉపాధ్యక్షులు, (ఈ ఏడుగురులో ఐదుగురు, అగ్రరాజ్యపంచకం ప్రతినిధులు, తక్కిన ఇద్దరూ సమితి ఎన్నుకొన్నవారూ), పై చెప్పిన ఆరు కమిటీల ఛేర్మన్లూ, సభ్యులుగా ఉంటారు. జనరల్ కమిటీలో ఈ విషయం మొదటి దఫా చర్చకు వస్తుంది. (సభ్యుల ఉపన్యాసాలు మొదటివిడత జరుగుతుంది.) అంతతో ఈ విషయాన్ని పరిశీలించాలో అక్కర్లేదో సర్వసభా సమావేశానికి నివేదిస్తారు. ఇక్కడ సామాన్యంగా తోసిరాజనటానికి వీలు లేదు. ఎందుకంటే విషయం చర్చకు కోరిన సభ్యుడు, సరాసరి, సర్వసభ్యసమావేశంలోనే, ఈ విషయం చర్చించవలసిందని కోరుకోవచ్చును. సర్వసభ్యసమావేశానికి విషయం చర్చకు వచ్చిందనుకొందాం.

అంతటితో సర్వసభ్యసమావేశం, ఈ విషయాన్ని చర్చించటానికి పై ఆరుసంఘాలలో అర్హ

న్నైన సంఘాన్ని నియమిస్తుంది. అల్లా ఒక విషయం భద్రతాసంఘాని కొచ్చింది అనుకొందాం. భద్రతా సంఘం ఈ విషయాన్ని మళ్ళీ పూర్తిగా చర్చిస్తుంది. మునుపటి వాదప్రతివాదాలే (ముఖ్యంగా అమెరికా రష్యాసభ్యులనుంచే) మరింత కోలాహలంగా మళ్ళీ జరుగుతాయి. (రెండోవిడత అవే ఉపన్యాసాలు పేపర్లలో చదవుతాం) అమెరికా ఔను అంటే రష్యా కాదంటుంది. లేదా అటు దిటూ-ఇద్దరూ ఏకీభవించిన విషయం అంటూ ఇంతవరకు లేదు. అయితే ఇక్కడ ఓటింగుకు పెట్టేటప్పటికి, అమెరికామాట నెగ్గటమే పరిపాటి. అక్కడినుంచి తీర్మానాన్ని ఫామేదాగా తయారుచేయటానికి సబ్ కమిటీకి పంపిస్తారు. సబ్ కమిటీనుంచి తీర్మానం మళ్ళీ మొదటిసంఘానికి 'వస్తుంది. మళ్ళీ మూడోవిడత వాదోపవాదాలు జరుగుతాయి. ఇక్కడ ముఖ్యసంఘాలలో సామాన్యపు మెజారిటీ తెచ్చుకొంటే, ఇక్కడనుంచి, సర్వసభాసమావేశానికి తీర్మానం చర్చకు వస్తుంది. ఇన్నాళ్ళు వింటూవచ్చిన వాదాలు మరింత ఘాటుగా నాలుగోమాటు వింటాం. ఇక దీనిపై ఆఖరిఓటింగ్ ఇక్కడ జరుగుతుంది. సర్వసభ్యసమావేశంలో తీర్మానానికి మూడింట రెండు ఓట్ల మెజారిటీ వస్తేనేగాని తీర్మానం నెగ్గదు. ఒకొక్కప్పుడు, ఒక సభ్యుడు తీర్మానాన్ని అంశాలవారీగా చర్చించాలని ప్రతిపాదించవచ్చు. ఒకొక్కప్పుడు సమితివ్యవహారకాండలోని వ్యాకరణ దోషాలు పట్టి తీర్మానం నేలను పడిపోవచ్చు. ఏవిధంగా వీగిపోయినా, మళ్ళీ సమావేశంనాటికి ఈతీర్మానాన్ని సభ్యుడు మళ్ళీ హాజరుపెడతాడు. మళ్ళీ తిరంగం అంతా జరుగుతూనే ఉంటుంది.

సమితిసమావేశాలలో అనేక ముఖ్యవిషయాలు ఇల్లా సమావేశంనుంచి సమావేశానికి వాయిదాపడుతూనేవస్తూఉంటాయి. దక్షిణాఫ్రికాలో భారతీయ సమస్య, కాశ్మీరు సమస్య, వలసదేశాల భవిష్యత్తు, గ్రీసు, అణుశక్తి దమనము, ఇత్యాది సమస్యలన్నీ సమితిలో ఎటూ తేలక నిత్యం నడుస్తూండేవే.

కేవలం అగ్రరాజ్యపక్షాలలో ఏ ఒక్కదానికో జేరక ఏ సమస్యకా సమస్యను, నిష్పాక్షికంగా ధర్మబుద్ధితో, చర్చించగల సభ్యదేశాలు, ఇండియా, ఇజ్రేలు, బర్మా, స్వీడెన్, లాంటి ఏ నాలుగైదో తప్ప ఎక్కువ లేకపోవటమే, సమితి బలీయంగా లేకపోవటానికీ, ప్రయోజనకరంగా సమితి వ్యవహరించలేకపోవటానికీ నేటిదాకా కారణాలవుతున్నాయి. తక్కిన సభ్యరాజ్యాలన్నీ దాదాపు ముఠాలను సృష్టించుకొన్నాయి. తూర్పు పడమరలనే పెద్ద చీలికతర్వాత, ఇంకొంచెం తక్కువ శ్రేణిలో, ఉత్తర అట్లాంటిక్ ముఠా, సోవియట్ ముఠా, అరబ్ ముఠా, దక్షిణఅమెరికన్ ముఠా, అన్నట్లు ముఠాలు కట్టి, పెద్ద ఫాయిదాలో లెఖ్ఖకు వచ్చేటప్పటికి అమెరికాపక్షమా, రష్యాపక్షమా అన్న బండ లెఖ్ఖలోకి వస్తాయి, ఈసమితిలో పక్షాలు.

నేటి సోవియట్ సాహిత్యం

అలెగ్జాండర్ వెర్త్

గత ఆరునెలలుగా రష్యాలో రచితమౌతున్న-కాదు, కాదు, ప్రచురితమవుతున్న-నవలాసాహిత్యం గాని, కవిత్వంగాని, సాహిత్యతదితర వ్యాసాలు గాని, చివరికి, వార్తావిలేఖనంగాని, చదువుకొని చూస్తుంటే, అంతకంతకూ, శైలి, రచన, కథాక్రమం, ఊహాపోహలు భావనావిధానము, అన్నీకూడా, ఒకే మూసలో, కమ్మెచ్చులు పోసితీసినట్లు, ఒకేమాదిరికి కట్టుబాటుకు, గణబద్ధమయిపోయి, మరింత సులభసాధ్యమయి పోయి బైటపడుతూన్నట్లు గోచరిస్తాయి, "రచితమౌతున్నవి," "ప్రచురితమౌతున్నవి," అన్న విభేదం ఎందుకు చెప్పానంటే, చాలామంది రష్యన్ రచయితలు, ముఖ్యంగా వెనకటితరంవారు, తమ ఆత్మసంతృప్తికోసం రచనలు సాగించుకొంటూ-ఎప్పటికైనా కాలం మారక పోతుందా - అని ఎదురు చూస్తూ ఉండి ఉంటారనే నా నమ్మకం. ఈనాడు అక్కడ ప్రచురితం కాలేని నవలలు, కవిత్వం, కొన్ని సునిశితమైన, సున్నితమైన పదాలూ, పద్యాలూ, వాళ్ళు వ్రాసుకొంటూ ఉన్నారనే, నేను నమ్ముతాను. ఈ నాడు ప్రచురణకోసం రచింపబడ్డ వాట్లల్లో, ఎంతటి ముక్కాకలుదేరినపార్టీ శత్రువూగూడా వేలెట్టి చూపదగిన, అపభ్రంశాలుగాని (కమ్యూనిస్టుతత్వదృష్ట్యా) ఉండగూడదన్న జాగరూకత విధిగా గోచరిస్తుంది కొన్ని రచనలో రుచీపచీలేనపడు.

ఈ నాడు రష్యన్ ప్రచురణకు గీటురాయి "ఇది మీకు (చదువరులకు) మంచిదా, కాదా", అని

ఈ సాధికార దృష్టికి ప్రామాణికమైన ఉదాహరణము "నోవీమిర్" అన్న సాహిత్య పత్రికలో ఆగాపోవ్ అనే విమర్శకుడు వ్రాసిన వ్యాసం. "ప్రచురణకర్తలు సంపాదకులు "చక్కగా వ్రాయండి, చాలు, మేం ప్రచురిస్తాం" అన్న వర్తక సరళిలోనే ఇంకా ప్రచురణలు సాగిస్తున్నారు." అంటూ వారిని తూర్పారబట్టాడు. స్టాలిన్ ప్రైజ్ అందుకొన్న "ఒక పారిశ్రామిక మహావార్తా విశేషనాన్ని" చాలా "పసి పసిగా, కచ్చాపచ్చాగా, అతిసులభమై పరిపాటి ఐపోయినవ్యక్తీకరణాలతో, చదువర్లకు విసుగు కల్పిస్తుంది." అని ఉమన్స్కీ అనే ఒక రచయిత చేసిన విమర్శనకు అభాగ్యుడైన ఉమన్స్కీపై నిప్పులు చెరిగి, ఒరే దేశభక్తి వ్యతిరేకీ, విశ్వసంకరా! (Cosmopolitan)" అంటూ దుమ్మెత్తిపోస్తాడు ఆగాపోవ్.

కాని ఎంత దేశభక్తుడు, విశ్వసమ్మేళనా తత్వ వ్యతిరేకీ అయిన రష్యన్ చదువరి లోనూ కూడా ఈనాడు సోవియట్ సాహిత్యపత్రికలలో అగ్రస్థానం అలంకరిస్తూన్న రచనలు విసుగు జనింప చేయకుండా ఎల్లా ఉంటాయో ఊహించటం దుర్గ్రాహ్యంగా ఉంది. "నోవీమిర్" పత్రిక గత అక్టోబరు సంచికలో "పాంటిలేయేవ్" అనే నూతన రచయిత రచించిన పూర్తి నవల ప్రచురితమయింది. నవలలో కథావస్తువు ఒక ఫ్యాక్టరీలో ఒక పారిశ్రామిక విధానంలో తమ ఫ్యాక్టరీ ఉత్పత్తిని, పనితనాన్ని, పెంచటం ఎల్లా అన్న ప్రశ్నమీద ఫ్యాక్టరీలో పనిచేస్తున్న "స్టాఖోనవైట్స్" (ఎంతపనికి అంత ఎక్కువలాభం అనే తత్వపు) జనులమధ్య జరిగే సాంకేతికచర్చ. సామాన్య చదువరి కిందులోని సాంకేతిక శాస్త్ర విషయాలు బోధపడవు. కథ సుఖాంతమే. పనివాళ్ళలో ఉత్తమ "స్టాఖోనైట్" కార్మికుడు 'ఉత్తమ స్టాఖోనైట్' కార్మికురాలిని వివాహమాడుతాడు, ఈ సుఖాంతం కూడా కథకు, "జవ" గాని, చదివించే గుణంగాని కల్పించదు.

కొత్త సోవియట్ ప్రచురణలు, తరగమకుంటూ పోతే, ఉన్న మూడునాలుగు, ముగ్గులూ, తెలుసుకోటానికి ఎంతోసేపు పట్టదు. ఈముగ్గుల్లో ముఖ్య లక్షణాలు ఇట్టే గోచరిస్తాయి. అన్నిటికన్నా ప్రముఖంగా పట్టవలసిన లక్షణం "సర్వమూ శ్రేయోదాయకమే"నన్న విశ్వాసం. రష్యా అహర్నిశలూ, సూర్య రశ్మిలోనో, లేదా, క్రెమ్లిన్ లోని కెంపు నక్షత్రాల కాంతిలోనో వెలుగుతూండే దేశం. రష్యా శీతువు సంగతి ఎత్తరాదు. ఒక్క రష్యాలోనే జీవితంలో నిజమైన సౌఖ్యమూ, ఆనందమూ ఉన్నాయి. అక్కడి సర్వకార్య కలాపాలూ, సర్వశక్తివినియమనాలూ, శాంతి సౌభాగ్య నిర్మాణం కొరకే. కేపటలిస్టు తోడేళ్ళు, రష్యాచుట్టూ కోరలు తెరుచుకొని కస్సు బుస్సు లాడుతున్నా, అంతకంతకూ అవి మూరాలకు తరిమివేయబడుతున్నాయి. ప్రపంచ ప్రజాస్వామ్య ప్రజలందరూ, తమ్మతాను విముక్తం చేసుకొంటూ, తరణోపాయం కోసం, మోక్షం పొందటం కోసం, మాస్కోవంక చూస్తున్నారు.

కొత్తగా వస్తున్న రష్యన్ కవిత్వం కూడా చాలామటుకు తేలికగా ప్రచారంగా ఉన్న సంగీతానికి సరిపోయేనట్లు వ్రాసినదా అనిపిస్తుంది. "ఓక్టియబర్" అనే సాహిత్యపత్రిక ఒక సంచికలో ఇల్లాంటిపాటలు కొన్ని సేకరించారు. అందులో మొదటిపాట "గ్లోరీ టు స్టాలిన్" (స్టాలిన్ కీర్తిగీతం) అనేది.

"ప్రియ కామ్రేడ్ స్టాలిన్! ధన్యవాదాలు నీకు!
నీవూ, లెనినూ,
అనంత కాంతిమయ విస్తృతపథాలను,
మా కనుల ముందర చూపి
ఆశా, సంతోషాలతో
మమ్మునింపారు.
లెనిన్ అడుగు జాడల్లో నడుస్తూ,
నీ చేతలలోనె మా పోరాలు నేర్చి,
మా కానందం సమకూర్చే ఒక రాజ్యాన్ని
శత్రుహృదయాల భీతిరగిల్చే
ఒక మహాసామ్రాజ్యాన్ని
మేము నిర్మించుకొన్నాం."

"శక్తిమయ స్వాతంత్ర్యచైనా" (Mighty Independant China) గూర్చి, యస్. షైరోక్, గీతం ఇంకోటి.

"చైనాలో నదులూ పర్వతాలు,
యాంగ్ట్సీనది తరంగాలు,
తము, విముక్త మయ్యామని, ఎరుగును

కోటానుకోట్లుగా మనసైన్యం,
హుటాహుటి శత్రువును రూపుమాపుతూ,
ముందుకు నడచిన సైనం
అవిఎరుగును.
నా రందరికి ఆదర్శప్రాయులు కమ్యూనిస్టులు.
సత్య, ధర్మ విశుద్ధజ్వాలాపథంలో,
ఆ పక్షనాయకుడు మావ్ సే టుంగ్,
మున్ముందుకు ముందుకు నడిపించాడు,
స్వతంత్రచైనా సైన్య అక్షౌహిణులను.
వారికేతనాల స్వర్ణ ఋక్షరాసులలో
క్రెమ్లిన్ నక్షత్రాలు ప్రతిబింబించాయి."

ఈ "ప్రపంచ కమ్యూనిజాభ్యుదయ" వైతాళికు లంతా, తమ గీతాలాపం ఎక్కువభాగం ఆసియా, చైనా, వీట్నాం మొదలైనవాటిని గురించే చేయటం గమనించదగ్గ విషయం. తూర్పుయూరప్‌లోని "పీపిల్సు డెమోక్రసీ" ల ప్రసక్తి ఒక్క పద్యంలోనూ కనరాదు. వాట్ల నెందుకు 'ముదుపు' కట్టి ఉంచారో! అక్కడి కమ్యూనిజాన్ని గురించి గానం చేయదగ్గంత ప్రాశస్త్యం లేదని వాళ్ళ మనస్సులకు తెలుసునా!

కాని రష్యావిషయం చెప్పుకొనేటప్పుడు మళ్లీ అరమరిక లేవీ లేవు. "థాట్సు ఆన్ ఎ రేడియో సెట్" "రేడియో సెట్‌పై భావాలు" అన్న గీతంలో సిమియోన్ గాడ్జెన్కో ఇల్లా ప్రకటించుకొంటాడు.

"అనేక రకాల దృశ్యాలు,
రాత్రివేళనా కగుపిస్తాయి.
అంతరిక్షము విద్యుదుజ్వలమై
వికృత కుహనా ప్రపంచ కలకల కీచురావం
నా గదిలో ప్రవేశిస్తుంది.
సముద్రాంతర సూరతీరాలనుంచి
యుద్ధవాయు విషవీచిక ఒక్కటి
నరక కుచ్ఛితపు దుర్గంధంతో
నావద్దకు వస్తుంది—
రష్యన్ కేంద్రానికి రేడియో స్విచ్ చేస్తాను—
శాంత వినయ సంపన్న ప్రజలము మేము
నిత్యకృషిలో నిమగ్నులం మేము
మా యిరుగూ పొరుగూ స్నేహకోటికి
మా కల్యాణ గృహాన నిత్యస్వాగతము."

ఇంతకన్నా హేత్వాభాసమైన కవిత్వం కావాలంటే ఛిలీలోని నెరూడాపాబ్లోవంటి విదేశీ కమ్యూనిస్టులలో మాత్రమే లభ్యమాతుంది.

సోవియట్ దేశంలో "కవి" అవటం ఎంత తేలికో! కొన్ని సంచికట్టు సమాసాలు, పరిపాటైన అలంకారాలు, ఉపోచిత్రణలు, కొంచెం గణబద్ధమైన కూర్పు, ఇవి చాలు; కవిగా పేరులోకి రావటానికి. కమ్యూనిజమే మతమయితే, దాని కవిత్వానికి, ఈ ఫ్యాక్టరీఉత్పత్తి గీతావళి కన్నా, నైశిత్యంగాని, నైగనిగ్యం గాని అవసరం లేదు.

ఈ ఫక్కీ ఏర్పాటు, పద్యానికే కాదు. వచనానిక్కూడా తయారయింది. ఇది, సోవియట్ రష్యాలో శ్రేష్ఠమైన సాహితీపరులు లేనేలేరు అనటం కాదు. ఉన్నారు. వాలెంటీన్ కాట్యావ్ మునుపు చాలా నవలలు, సునిశిత వ్యంగ్యంతో, ఆనందం కల్పించేవి, వ్రాశాడు. చక్కని బాల సాహిత్యం సృష్టించాడు. ఈమధ్యనే ఒక నవల వ్రాశాడు. ఒడిస్సాలో జర్మన్ ఆక్రమణకాలంలో, సమాధిగర్భాలలో దాగిఉండి పనిచేసిన రష్యన్ వీరులనుగురించినది ఆ నవల. చాలా చక్కగా ఆమూలాగ్రం చదవందే విడిచిపెట్టలేనంత బాగా ఆ నవల, వ్రాశాడు. పత్రికలు నవలను అభినందించాయి. కాని, నవలలోని వ్యక్తుల సంభాషణలు ఒడిస్సా సహజమాండలికభాషలో నడిపినందుకు కాటయావ్‌ని విమర్శించాయి. ఆత్మగౌరవం ఉన్నవ్యక్తి ఎవడూ ఆ మాండలికం వాడకూడదట—అక్కడి జనం వాడ్తారు—కాని వాడినట్లు తెలియకూడదు—ప్రతివాళ్లూ ప్రవ్దా సంపాదకీయభాషలో నేమాట్లాడుతారని ప్రవచించాలి.

అయితే కొటయావ్ నవల ఇప్పటి రకానికి మినహాయింపుగానే చెప్పుకోవాలి. ఇప్పటి యువ సాహితీపరుల నవలలన్నీ సైనికుడు యుద్ధంనుంచి ఇంటికి మరలి రావటంతో ప్రారంభిస్తాయి. ఫ్యాక్టరీలు కలెక్టివ్ ఫారమ్స్, వీట్ల సోషలిస్టు పునర్నిర్మాణంతో కథ సాగుతుంది.

ఎక్కడో ఒక్కొక్కచోట రచయితలలో కొద్ది మాత్రపు "ఎస్కేపిజమ్"ను సహిస్తారు.

పుష్కిన్ వార్షికోత్సవసందర్భంలో ౧౯వ శతాబ్ద ప్రారంభకాలం ఆధారంగా రచన సాగించటానికి రచయితలకు కొద్దిపాటి అవకాశం చిక్కింది. సమర్థ రచయిత కొన్‌స్టాంటిన్ పాస్తోవ్స్కీ పుష్కిన్‌నుగూర్చి ఒక చక్కని చిన్న నాటిక వ్రాశాడు. అయితే "మన సమకాలికుడు" (Our Contemporary) అని నాటిక పేరు. ఆ నాటికలో, పుష్కిన్‌కు, కౌంటెస్ వొరొంట్సొవ్ అంటే ఉన్న అభిమానం, కామ్రేడ్ స్టాలిన్‌మీద ఉన్నట్లు కనపడదు.

ఇక బైటి ప్రపంచాన్ని గురించి వ్రాసే వ్యాసాల విషయం చెప్పనే అక్కర్లేదు. పశ్చిమలోకం, అమెరికా, ఎల్లా కుళ్ళి చితికిపోతోందో, అమెరికా జనాభా అనుభవిస్తున్న దుర్భర దారిద్ర్యం, ఇవీ వ్యాసవిషయాలు. స్టీన్‌బెక్ "గ్రేప్స్ ఆఫ్ వ్రాత్" నవల అమెరికా వ్యావసాయక విధానాన్ని అర్థం చేసికోటానికి పూర్తిఆధారం వాళ్ళకు. దాన్నించి వాళ్ళు నేర్చిన పాఠం, అమెరికన్ రైతులు, ఇలా దీర్ఘవ్యాధి పాలయి కృంగిపోవటమో, లేదా కాపిటలిస్టు బానిసత్వంనుంచి బైలు పడేందుకు సక్రమ విప్లవం లేవదియ్యటమోతప్ప గత్యంతరం లేదు.

రష్యాలో మాత్రం జీవితం వ్యక్తి సామాంకారపు సంకెళ్ళలో బంధితంకాకుండా స్వేచ్ఛగాఉంటుంది!

సోవియట్ పూర్వరష్యన్ సాహిత్యం సుఖ జీవితప్రతిబింబకంగా హాస్యపూరితమయి హాయినీ, సంతోషాన్ని, నవ్వును కల్పించేదిగా సునిశిత వ్యంగ్యంతో, హాస్యంతో, చమత్కృతితో, పూరితమై ఉండేది. కాని నేడు రష్యా అంత మరీ హాస్యరహితమయి సదాచారనిష్ఠతో మోడువారిఎండిపోయిందా? నిత్య జీవితం ఏనాడూ అల్లాకాదు. కాని గ్రంథాలూ కళలూ మాత్రం అల్లా తయారయిపోతున్నాయి. ఈనాడు గిలిగింతలు కల్పించే ప్రచురణలు లేవన్న విషయం సోవియట్ సాహిత్య అధినేతల నేమీ కల వరపెట్టుతున్నట్టు లేదు.

ఈ మధ్య "నోవీమీర్" పత్రిక సంచికలో గోర్బటోఫ్, సోవియట్ హాస్యాన్నిగురించి ఒక శాస్త్రీయమైన వ్యాసం వ్రాశాడు. కేవలం నవ్వించటానికే హాస్యరచనలు సాగించటాన్ని తీవ్రంగా ఖండించాడు. జోష్చెంకో మొట్టమొదట సోవియట్ హాస్యరచయితలలో ప్రసిద్ధుడుగా పేరుగన్నాడు. కాని జోష్చెంకోను తర్వాత ప్రభుత్వం ఖండించింది. ఛెకోవ్ లాగ సునిశితహాస్యం రచించినవాడు జోష్చెంకో. ఈనాడు అతనిమాదిరిగా ఎవరైనా వ్రాస్తారంటే గోర్బటోఫ్‌కు తేళ్ళూ జెఱ్ఱులూ పాకినట్లవుతుంది.

ఒక్కమాటలో— సోవియట్ ప్రభుత్వం, కేపిటలిజమ్ మీద, యుద్ధ ప్రేరేపకులమీద ఇల్లాంటి విషయాలమీద హాస్యాన్ని సహించగలదు గాని సోవియట్ నిత్యజీవితంలోని హాస్యాన్ని, ప్రభుత్వపరమైన హాస్యాన్ని, వ్యంగ్యంగా గాని వేళాకోళంగా గాని బైటపెట్టడం సహించదు. ఏ జీవితంలోనూ, హాస్యం ఎప్పుడూ చావదు. కాని సోవియట్ భూమిలో పూర్వపు హాస్యరచయితలు గ్రంథాలు ఈనాడు ప్రచురణ అవటంగూడా అపరాధమే అయే స్థితి వచ్చింది. పిల్లలు అల్లాంటివి చూసి భ్రమపడి చెడిపోతారని వారివాదం. ఇరవై ఏళ్ళకు పూర్వపు సోవియట్ గ్రంథాలు తెరిస్తే తప్ప హాయిగా నవ్వు పుట్టించే హాస్యం కనబడదు. ఈనాడు సోవియట్ పౌరునికి గ్రంథాల్లో హాస్యం లలభించదు. జారుచక్రవర్తులనాటి మాత్రపు స్వేచ్ఛకూడా సోవియట్ సాహిత్యంలో కనబడటం లేదు. అందుచేత నేటి సోవియట్ సాహిత్యం చాలావరకు రుచీ పచీ లేకుండా పోతోంది.

('నేషన్' పత్రికనుండి).

నాసిక్ కాంగ్రెస్ సమావేశం

నాసిక్ కాంగ్రెస్ అధ్యక్షుని ఎన్నిక సమయానికి పూర్వమే కుసుపెప్పటికన్నా ఈసారి కాంగ్రెస్‌లో చీలిక తెక్కువౌతాయా అన్న అనుమానాలు ప్రబలాయి. కాంగ్రెస్ సభ్యత్వాన్ని దాదాపు నిర్నిబంధంగా ప్రయోజన సభ్యత్వంతో సరిసమానం చేయటంతో, కాంగ్రెస్ పక్షపు నైతిక బాధ్యతలు లేకుండా స్వార్థప్రయోజనాలకోసం కాంగ్రెస్‌లో చేరేవారి సంఖ్య, చేర్పించుకొనే ఛోటా నాయకుల సంఖ్య ఎక్కువై పోయిందంటూ ప్రతిరాష్ట్రంలోనూ కల్లోలమూ; కాంగ్రెస్ ఎన్నికలు చాలా అపసవ్యంగా జరుగుతున్నాయని ప్రతిరాష్ట్రంలోనూ నిర్వాదులూ, అలజడులూ, కోర్టుకెక్కటాలూ, ఎక్కువైపోయినాయి. స్థానికనాయకులు తమ వ్యక్తుల అభిమానాలను పురస్కరించుకొని, ప్రతిరాష్ట్రంలోనూ, మంత్రివర్గపక్షాలూ, మంత్రివర్గ వ్యతిరేకపక్షాలూ అంటూ రెండు గుంపులు బైలుదేరి, ఎంతటి గ్రంధం జరిపే అవకాశం ఉందో అంతవరకూ సాంతంగా జరిపి విడిచాయి. ఆంధ్రలో ఎన్నికలే రద్దయిపోయినాయి. యు. పి., బెంగాలులాంటి ఒక్కొక్క రాష్ట్రాలలో ఈ గందరగోళం తప్పింది కాని కళ్ళల మోసాలు కనుమరుగు పోలేదు.

టాండన్ ఎన్నికతో పండిట్ నెహ్రూయే, కాంగ్రెస్ విషయంలో అలజడి ప్రకటించాడు. టాండన్ ఎన్నికకు మతప్రసక్తమైన ప్రతీప శక్తుల ప్రాతినిధ్యపత్రికలూ, సంస్థలూ అపరిమితానందం ప్రకటించటమే తన అలజడికి కారణమంటూ పండిట్ నెహ్రూ ప్రకటించాడు. తన ప్రభుత్వవిధానానికి కాంగ్రెస్ చేదోడువాదోడుగా ఉంటుందో లేదో సమావేశానికి ముందే తేల్చివేసుకోవాలని ఆత్రపడ్డాడు. ఆ మాత్రం నెహ్రూ, పటేల్‌లకు విభేదాలున్నాయని వాదించేవారికి మరింత బలం చేకూర్చింది. కాంగ్రెస్ పూర్తిఅయి కొంత సావకాశ పరిస్థితులు చిక్కేనాటికి, నెహ్రూ, పటేల్ ప్రభృతులిద్దరూ కూడా తమ మధ్య ఏ విధమైన విభేదాలూ లేవనీ, ఏ విషయంలోనైనా, పండితులకున్నట్లు కొంత దృష్టి భేదాలేర్పడినా, కార్యగంగంలో ఏకీభావమే తప్ప వేరుగా ఉండదనీ, దేశశ్రేయస్సు కోరే ఆదర్శంతో సహకార సౌమనస్యాలతో పరస్పరగౌరవంతో, ఏకటాకీనే నడపగలమనీ, ప్రకటితంగా ఇద్దరూ సుస్పష్టం చేశారు. ఇద్దరిమధ్యా చీలికల నాశించినవారి ఆశలు అడుగంటాయి. కాని ఈ సౌహార్ద్రాన్ని విస్పష్టంగా విప్పి చెప్పకోవలసిన నీరసపరిస్థితులు కలగటమే శోచనీయమేమో!

నెహ్రూ ప్రభుత్వ మవలంబిస్తున్న విదేశీయ, స్వదేశీయ, రాజకీయ, ఆర్థిక విధానాల నన్నిటినీ ఆమోదించింది కాంగ్రెస్. తద్వారా పండిట్ నెహ్రూ ప్రభుత్వసారథ్యంలో కాంగ్రెస్ సంపూర్ణ విశ్వాసం ప్రకటించింది.

ప్రజాస్వామ్యంలో, దేశంలో ప్రబల ప్రజాదరణ మున్న పక్షం ప్రభుత్వ మాక్రమించుకోటం రాజనీతి. ప్రభుత్వనైనందిన నిర్వహణాలలో తప్ప తక్కిన ముఖ్య విషయాలన్నింటిలోనూ, ఆ రాజకీయపక్షము, ముందు దృక్పథం విశదీకరించుకొంటూ తీర్మానాలు చేసుకోవటమూ, ఆ పక్షప్రభుత్వము ఆ తీర్మానాన్ని ప్రభుత్వ ఆచరణవిధానాల కనుకూలంగా, జీవం చెడకుండా అనుసరించడమూ, ప్రజాస్వామ్యంలో జరుగవలసిన విషయాలుగా ఆశిస్తాము.

కాని ప్రభుత్వానికి మూలమైన రాజకీయ పక్షము, ప్రభుత్వం విధానాలు అవలంబించిన తర్వాత వాటినన్నిటినీ ఆమోదిస్తూ తీర్మానాలు చేయటమూ, చేయవలసిరావటమూకూడా, పక్షమూ, పక్షప్రభుత్వమూ, వీటి స్థానాలు తారుమారైనట్లే నిరూపిస్తాయి.

కాంగ్రెస్‌పక్షం ప్రభుత్వంలోకి వచ్చి కాంగ్రెస్ సంస్థలో ప్రబల ప్రతిష్ఠగల ముఖ్య నాయకులు ప్రభుత్వంలో లీనమువవలసి వచ్చేటప్పటికి, వ్యక్తులకన్న సంస్థ ఉన్నతమన్న ప్రజాస్వామ్య ఆదర్శముతో కాంగ్రెస్ వ్యవహరించ గలగటం కొంత అసాధ్యమయింది. ప్రపంచంలో నిత్యం జరిగే చారిత్రక సత్యమే కావచ్చును. కాని కాంగ్రెస్ విషయంలోకూడ ఇది సత్యమై పరిణమించవలసి వచ్చింది.

దేశంలో కాంగ్రెస్‌ను మిగ్లించిన అతీతనాయకుడు, సర్వ ఆదర్శాలకు ఆదర్శమైన మహాత్ముడు, బ్రతికున్నన్నాళ్లు, ప్రభుత్వానికికూడా ఆయనమాట ఆదర్శంకావటంతో అంత చిక్కు కనబడలేదు. కాని

ఆనాటికే దేశవిధానాలు తీర్చి దిద్దే గౌరవస్థానము ప్రప్రథమంగా గాంధీజీకి, తరువాత ఆయన ప్రశిష్యులై ప్రభుత్వంలో ఉన్న నెహ్రూ, పటేళ్ళకు, అంతకన్నా చివరిస్థానము, కాంగ్రెస్ అధ్యక్షునకు, కాంగ్రెస్ కార్యవర్గానికి (ప్రభుత్వంలో లేని ఇతర కార్యవర్గసభ్యుల విషయకంగా) చేకూరింది

ఆ అంతిమస్థానం భరించలేక కాంగ్రెస్ అధ్యక్షుడు కృపాలనీ రాజీనామా నిచ్చారు. గాంధీజీ మృతితో, ఆయన మినహా, ఆ, అంతరం అట్లాగే మిగిలిపోయింది. నెహ్రూ పటేల్ లకన్నా, ప్రజకు గౌరవపాత్రులూ, అభిమానపాత్రులూ అయిన వ్యక్తులు, దేశంలో లేకపోవటంవల్ల, కాంగ్రెస్ అధ్యక్షుడు, వర్కింగ్ కమిటీ, ఎవరైనాకూడా, ప్రభుత్వ ఆధ్వర్యాన కాంగ్రెస్ సంస్థ నడుస్తూంది తప్ప, కాంగ్రెస్ ఆధ్వర్యాన ప్రభుత్వం నడుస్తూందన్న అభిప్రాయం ప్రజలకు కలగటం లేదు.

కాంగ్రెస్ విషయంలో మహాత్ముని వలెనే, వీరిద్దరూ కూడా ప్రభుత్వం విషయంలో సలుపల, కాంగ్రెస్ లోనే నిలిచి, ప్రభుత్వం ఇతరులచేత నడిపించటానికి, ఆస్థాయిలో నున్న వ్యక్తులెవరూ విశ్వసనీయంగా వారికి లభించకపోవటం మూలాననేమో, కాంగ్రెస్ సంస్థకు కాంగ్రెస్ ప్రభుత్వానికన్నా తక్కువస్థానమే లభిస్తూంది.

అట్లా అని కాంగ్రెస్, ప్రభుత్వానికి అంటేగా, అధికారరీత్యా ప్రజాస్వామ్యప్రభుత్వం సమకూర్చటం "నిరంకుశత్వం" అనిపించే ప్రజాశ్రేయస్కర కార్యాలను, ఆలంబనంగా చేసుకొని, కేవలం ప్రజాసేవాతంత్రమైన అనధికారసంస్థగానూ మారలేకపోయింది. అట్లా అయిఉంటే మహాత్ముడు స్వాతంత్ర్యలబ్ధి అనంతరం, కాంగ్రెస్ కు ఏరూపు దిద్దదలచుకొన్నాడో, ఆ లోకసేవాసంస్థ తయారయి ఉండేది. ఇది కాంగ్రెస్ ఆదర్శమే కావచ్చును. కాని నేటి ప్రపంచరాజకీయవిధానాల్లో, ఒక రాజకీయపక్షం, ప్రభుత్వంలో పారంపర్యం నిలుపుకొంటూరావాలంటే, ఎంత ఉత్తమప్రకృతులైన వ్యక్తులకన్నా కూడా ఉత్తమ గౌరవస్థానంలో, ఉండే ప్రజాస్వామ్యసంస్థగా బలీయమైన రాజకీయ చైతన్యమున్న సంస్థగా అది నిలిస్తేతప్ప, ఆ సంస్థ సమకూర్చగల భవిష్యత్తులో ప్రజకు విశ్వాస ముండదు.


ప్రభుత్వానికి మూలమైన సంస్థ, ఆశయనియామకాలలో, ప్రభుత్వాధిపతులకు ద్వితీయ స్థానంలో ఉండటమే, కాంగ్రెస్ సంస్థ నేనాటి ముఖ్యలోపమని, నెహ్రూ పటేల్ లు, స్వానుమానాల జయించి గ్రహించవలసి ఉంటుంది. ఇది కాంగ్రెస్ అంతరాంతరంలోని నీరసము. ఇక సభ్యత్వవిస్తృతంవల్ల బహిరంగంగా కనపడే అవినీతి ఇత్యాదులు, నెహ్రూ, కాంగ్రెస్ సమావేశానికి ముందు సూచించిన విధానంవల్ల, అధికార స్వలాభసంపాదనలకు కాంగ్రెస్ సభ్యత్వం గాని, ప్రాతినిధ్యం గాని, సోపానంగా ఉండకుండా తీసివేయటంవల్ల, కొంతవరకూ తమంతట తమే తగ్గిపోవచ్చును. కార్యవర్గం నిర్ణయంకాగానే ఈ సమస్య కూడా తేలిపోతుంది.

కాంగ్రెస్ లో మతవిషయకమైన చీలికలుగాని ప్రభుత్వవిధానాలపై అభిప్రాయభేదాలున్న చీలికలుగాని లేవని నాసిక్ కాంగ్రెస్ స్పష్టపరిచింది.

ఒక్క కంట్రోళ్ళ విషయంలో, కంట్రోళ్ళ ఆదర్శంపై గాక కంట్రోళ్ళ ఆచరణలో, దేశంలో ఉన్న అసంతృప్తినిగాని, సంతృప్తినిగాని, సమగ్రనీయంగా వ్యల్లడించటానికి కాంగ్రెస్ ప్రతినిధులు జంకిపోయారనే అనవలసివస్తుంది.

ప్రజలకు ఇంతప్రముఖమైన విషయపు తీర్మానానికి ౧౫౦౦ మంది ప్రతినిధులు గైర్హాజరు కావటం, ప్రతినిధులకు ప్రజలపట్లా, కాంగ్రెస్ పట్లా తమ కుండవలసిన గౌరవాన్నిగాని, బాధ్యతనుగాని, వ్యల్లడించలేకపోతున్నాయి.

౧౯౦ మంది అనుకూల్యతగాని, ౧౧౭ మంది ప్రాతికూల్యతగాని, ౧౯౦౦ మంది ప్రతినిధులు తేల్చవలసిన విషయంలో పాటింపుకు రావలసినవి కావు. కాని ఈ ఓటింగు ఒక చీలికను తప్పించి ప్రభుత్వం మెళుకువతో వర్తించటానికి కంట్రోళ్ళను సమగ్రనీయంగా అమలుపరచాలన్న జాగ్రత్తను, ప్రభుత్వంలో మరింతగా తెప్పించటానికి ఉపకరించినవనే, కేంద్ర మంత్రుల ఉపన్యాసాలవల్ల భావించవచ్చును.



విమర్శనము

"సాంఖ్యదర్శన"

శ్రీ శైలేశ్వరసేన్, శ్రీ కొల్లూరి సోమశేఖరశాస్త్రి, గ్రంథకర్తలు: కవిరాజపబ్లిషర్సు, తెనాలి- వెల 2-8-0.

ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్వాంసులు బ్రహ్మశ్రీ కొల్లూరు సోమశేఖరశాస్త్రులవారు, డాక్టర్ శైలేశ్వరసేన్ మహాశయులును రచించిన గ్రంథము. సేన్ మహోదయులు, గీర్వాణ, వంగ, ఆంగ్ల, జర్మన్ ప్రముఖ భాషలలోని దర్శన గ్రంథ విమర్శలను పరిశీలించి, సేకరించిన విషయములు ముఖబంధ, టిప్పణీ పరిశిష్ట రూపములు పొందినవి. ఉభయులు అన్ని విషయములను సవిమర్శముగ సంప్రతించినారు. సోమశేఖరశాస్త్రులవారు గ్రంథమంతయు ఆంధ్రీకరించినారు.

నైయ్యాయికులను శాస్త్రులవారు ఈశ్వర కృష్ణుని కారికలను, వాచస్పతిమిశ్రుని వ్యాఖ్య, సాంఖ్యతత్త్వకౌముదిని జాగరూకతతో అనువదించినారు. ముఖబంధములో ప్రథమఘట్టమున సాంఖ్య కారికను, తద్వ్యాఖ్యానములను, సాంఖ్య సూత్ర తద్వ్యాఖ్యలను గూర్చి, కొంత చర్చించినారు. ద్వితీయఘట్టమున సాంఖ్యతత్త్వమును ఉపనిషత్తుల నుండియు, మహాభారతమునుండియు సూచించి, కారికాకౌముదులలోని సాంఖ్యమునకును, మహాభారత సాంఖ్యములకును గల భేదములను చూపినారు. తృతీయఘట్టమున ఇతర దర్శనములతో సాంఖ్యమునకు గల సామ్యవైషమ్యములను స్పష్టీకరించినారు.

టిప్పణములోని విషయచర్చలు వైదుష్యసూచకములు. ౨,౪,౫,౧౧,౧౮,౨౨,౩౧,౫౮,౬౧ఇత్యాది కారికాటిప్పణములలో ఎన్నో విశేషములు కలవు. పరిశిష్టమున సాంఖ్యాచార్యులను పంచశిఖ, ఆసురి వార్షగణ్య, జైగీషవ్య, వింధ్యవాస, సనందనాచార్యుల వాక్కులను వివరించినారు. ముఖబంధ టిప్పణములను రచించుట కాధారభూతములను పుస్తకముల పట్టికను గ్రంథాంతమునం దిచ్చినారు.

ఈ పుస్తకమును సాంఖ్యదర్శన మనుటకన్న సాంఖ్యతత్త్వకౌముదియే యనుట సమంజసము. ఆంధ్రీకృత అను పదముతో పనిలేదు. కారికాకారుడగు ఈశ్వరకృష్ణుని నామముగాని, కౌముదీకర్త యగువాచస్పతి మిశ్రుని నామముగాని ముఖపత్రముమీద కానరాదు. ఆధారగ్రంథములలో మహామహోపాధ్యాయ డాక్టర్ గంగానాథ ఝా మహోదయుల సుప్రసిద్ధ—ఆంగ్లానువాదము మాట లేదు. పుస్తకము చిన్నదయినను నాలుగు పుటల తప్పొప్పులపట్టికను మించిన ముద్రణస్ఖాలిత్యము లెన్నో యున్నవి.

ఈ యనువాదమున మఱియు, యొక్క, అగుచున్నది, కర్మణి ప్రయోగములు విరివిగా కానవచ్చుచున్నవి. మనయే, ప్రవ్యక్తే, ఇత్యాదులలో ఏత్వము మానుట ప్రాతపద్ధతి.

సాంఖ్యతత్త్వ కౌముదీ విషయములను గ్రహించుటకీ పుస్తకము మిగుల నుపయోగకారి.

శివశంకరస్వామి.

ఉమ రాలీషా కవి ఖండ కావ్యములు

వెల : 4-8-0

ఇది ఉమరాలీషా గ్రంథప్రచురణ సంఘము, ఏలూరు వారిచే ప్రచురింపబడిన ఖండకావ్యసంపుటి. ఇందులో ఉమ రాలీషా కవి ౧౯౧౪ మొదలుకొని, చివరిదాకా రచించిన ఖండకావ్యా లన్నీ సేకరించి, చక్కని పుస్తకాకారంలో పాఠకులోకాని కందిచ్చారు.

ఈకవిది పండిత వంశము. వీరి జనకులు అరబ్బీ, సంస్కృతము, తెలుగు మొదలయిన భాషలలో పండితులు. ఉమ్మరాలీషా కూడా ఆయా భాషలలో సముచిత పాండిత్యం సంపాదించినవారే.

అందుచేతనే ఈ కవి కావ్య భావలలో పోల్లుపోని సంప్రదాయము, స్వచ్ఛమైన తెలుగు నుడి

కారణు కనిపిస్తాయి. ఈయన ప్రకృతి, ప్రేమ, పల్లీ పరిసరాలు, మొదలైన వివిధ విషయాలపై ఖండ కావ్యాలు రచించారు.

ఇంతేకాక వీరు హాలీ, ఇక్బల్ మొదలయిన కొందరు ఉర్దూకవుల రచనలు, కొన్ని హాఫీజ్ రచనలు కూడా తెలుగుపద్యాల్లోకి అనువదించారు.

వీరి రచనలలో ఆధునిక కవుల కవితాచ్ఛాయలు కొన్ని కనిపిస్తున్నాయి. సంశయములోని—

'ఈ యేరు గాలిలో
ఈ యడవి శిఖల్లో
ఈ యాకు పొదలలో
నే నొంటిగా నిల్చి పోనా !
నే రాయినై కలిసి పోనా! '

అనే భాగం 'ఆకులో నాకునై పూవులో పూవునై' అనే కృష్ణశాస్త్రి గారి పాటను తలపింప జేస్తున్నది.

'పారాణి' అనే ఖండకావ్యం వీరి ఆధునిక రచనా ఫణితికి ఉదాహరణంగా ఇవ్వవచ్చును.

'గుసుగు దీయవు రావు నా ముందు కబల
ఏల యడియాస పెట్టెదీ లీల బాల!
నే నొనర్చిన యపరాధ మేమొ చెపుము!
హృదయమును జంపి పెట్టెద! నిదిగొ కొనుము!
వేడి క్రొన్నెత్తురి దిగొ! నీ ప్రేమగీతి
మును బఠించుచు బుసబుస పొంగిపొరలి,
పోవుచున్నది నీపాదములను దాక
వేరె పారాణి నీ వికఁ బెట్టుకొనకు.'

అనువాద మార్గంలో కూడా వీరిరచన సాఫీగా సాగింది. హాఫిజ్ అనువాదంలోని ఈ క్రింది పద్యాన్ని బట్టి వీరి అనువాదసరణి ఊహింపవచ్చును.

"బంతెను నెక్కి పావు నిత [illegible]ంపు నుష
స్సున చల్లగాలి వగ
వంటు గుబాయి కుచ్చు కడు విహ్వలలీలను
విప్పి విప్పి త
న్నంటిన ప్రేమవీథ మృగనాభి సువాసనల
వెలార్చు నాం
[illegible]ంటి విలాస జూటములనుండి ప్రియా
హృదయాలు త్రుంపగన్."

వీరు రచించిన స్వీయకృతు లన్నింటి లోను రెండవభాగంలో ప్రకటితమైన వృత్తాలలో కొన్నింట స్వాదుపైన కవితావిస్ఫురణం కనిపిస్తు న్నది. ఈ రెండవ భాగమే వీరి ఖండకృతు లన్నిటి లోను ప్రశస్తమైనదని చెప్పవచ్చును. ఉదాహరణ కొకపద్యము:

"ప్రకృతి విశాల విశ్వమున పాటలు
పాడుచు నున్న దీ
వికసిత సాంధ్యరాగముల విశ్రుతి మైన
నిశావధూటి త
న్నకలుషిత ప్రభాతముల నాకర
మైన పలుంగు మాన్పునం
జోక లవస్థమైన సేర వదిగో భవితవ్యము
తోచ దేరికిన్"

ఇలాగే ఈభాగంలో మరికొన్ని వృత్తాలు ఉదాహరించవచ్చును. ఈవృత్తా లన్నీ ఖండ కృతులే. అయితే వీటిలో పారసీక కవితాసంప్ర దాయా లయిన మసునవీనాది చిత్రణాలు బాగా దొర్లుతూంటాయి. ఈ సంప్రదాయాలు సజీవంగా లేని కొన్ని పట్టులలో పాఠకులకు వీటివల్ల విసుగు పుడుతూంటుంది.

ఉమర్ఖాలీసా కవి అధునాతనాంధ్రకవుల ఉత్తమ కవుల్లో చేరకపోవచ్చును. కాని నేటికాలపు ఖండ కవితారచనలతో ఒక విస్తృతమైన ఖండకావ్య సంకలనం చేసినప్పుడు మాత్రం వీరి ఖండకావ్యాలు కొన్ని అటువంటి సంకలనంలో చేర్చడానికి తగి ఉన్నాయి.

ఈ కవి ఖండకావ్యాలన్నీ జాగ్రత్తగా సేక రించి ప్రకటించిన ప్రచురణసంఘంవా రభినంద నీయులు.

'శాస్త్రి'

ఆంధ్ర వీరాంగనలు

శ్రీ మాగంటి బాపినీడు: వెల: మూడు రూపా యలు. జాతీయ విజ్ఞానమందిరం ౨౬—ఎ, ఎవార్జేన్ రోడ్, రాయపేట, మదరాసు. వెల: 3-0-0.

దీనిమీద 'ఆంధ్ర వీరాంగన'లనే పేరు కనబడు తున్నది. కాని లోపల భారత వీరస్త్రీల సంగ్రహ చరిత్రలు, బొమ్మలు కొన్ని కనిపిస్తున్నాయి. పుస్తక శీర్షికనుబట్టి ఇవి అన్నీ అనవసరమే. ఉన్న చరిత్ర లైనాచాలా అసమగ్రంగా ఉన్నాయి.

ఇక మిగిలిన ఆంధ్ర వీరాంగనల సంగతి. వీరిలో ప్రాచీనాంధ్ర మహిళలయిన రుద్రమ్మ, చానమ్మ మొదలయినవారి వృత్తాంతాలు ఉన్నాయి. కాని ఇవీ సంక్షేపంగానే కనిపిస్తున్నాయి. ఈస్త్రీల వృత్తాంతాల మధ్య డాక్టర్ అనిబిసెంట్ ఛాయా చిత్రంకూడా వేశారు. ఇది ఎందుకు చేర్చారో తెలియలేదు.

ఆంధ్ర వీరాంగనల వృత్తాంతాలు సంగ్రహించ డానికి ప్రయత్నిస్తే దీనికి చాలామంది సహకరించ లేదనీ, అందువల్ల కొంత నిరుత్సాహం కలిగినదనీ, అయినా కొందరు మిత్రుల సలహాపై తామీ గ్రంథం ప్రచురిస్తున్నామనీ శ్రీ బాపినీడుగారు పీఠికలో వ్రాస్తున్నారు. పోనీ ఈ వచ్చినవృత్తాంతాలేమైనా సమగ్రంగా ఉన్నాయా అంటే, ఇవీ కొన్ని వివరా లతో కూడిన చిన్న చిన్న చిరునామాల జాబితాలే. ఈ పుస్తకంలోనే మొదట ఒక నమూనాపత్రం ప్రక టించి ఇంకా మిగిలిపోయిన ఆయా వీరాంగనలు తమ వృత్తాంతాలు తెలియజెయ్యవలసిందని బాపినీడు గారు కోరుతున్నారు.

ఈ పుస్తకం ప్రకటించవలసిందని బాపినీడు గారిని ప్రోత్సహించిన మిత్రులెవరో తొందరపడ్డా రని తోస్తుంది. ఒకవేళ ఆ మిత్రులు తొందరపాటు చేసినా, బాపినీడుగారు తొందరపడక ఇంకా కొంత కాలంపాటు ఆగి నేటికాలంలో సత్యాగ్రహోద్య మంలో పాల్గొన్న వీరాంగనల చరిత్రలైనా సమ గ్రంగా ప్రకటిస్తే ఈ గ్రంథనామం సార్థకంగా ఉండేది; బాపినీడుగారి కోరికా నెరవేరేది; కాని తొందరపడడంవల్ల కాబోలు ఈ రెండూ జరగలేదు!

'శాస్త్రి'

గోపికా రహస్యము

వై. యస్. కృష్ణమూర్తి సూపరింటెండెంటు, ఇరిగేషన్ డిపార్టుమెంటు. పి. డబ్లియు, డి. హైదరా బాద్, దక్కను. వెల: 1-4-0.

ఇది తాత్పర్య వివరాలతో సహా ప్రకటింపబడిన ఒకే ఆశ్వాసంగల ఖండకావ్యము. దీనికి గ్రంథ కర్తగారొక విపులమైన పీఠికకూడా రచించారు. ఈ

పీఠికలోను, చివర గ్రంథాంతంలో చేర్చిన వివరణాల లోను, గోపికా ప్రేమరహస్యం వివరింపబడినది.

గోపికల ప్రేమ సామాన్యంగా అందరు అనుకొనే విధంగా కామలాలసాయుతమైన ప్రేమకాదనీ, ఇది అతీంద్రియమనీ మనోభూమికను కూడా అతిక్రమించిన పరిశుద్ధమైన ప్రేమ అనీ గ్రంథకర్తగారీ పీఠికాదులలో వివరించారు.

ఆధునిక మనశ్శాస్త్రజ్ఞులు కొందరు కామప్రవృత్తే ప్రధానమైనదనీ దీనిని ఉన్నత పథగామిగా చెయ్యడంవల్ల (Sublimation) కళాది ప్రవృత్తులు సాధ్యమవుతున్నాయనీ వివరించారు. గోపికా రహస్యంలో వివరించబడిన సిద్ధాంతం నేటి మనశ్శాస్త్ర సిద్ధాంతాలు అంగీకరిస్తాయని తోచదు.

అయితే భారతీయ తత్త్వవేత్తలు, శుద్ధప్రేమ సాధ్యమౌతుందని అంగీకరించారు. మన భక్తి సాధనలలో మధుర భావ మని ఒక మార్గం ప్రతిపాదింపబడినది. శ్రీరామకృష్ణపరమహంస చరిత్రలో ఈ మధుర భావ సాధన కనిపిస్తున్నది. దీనిలో సాధకుడు స్త్రీత్వ భావనఅవలంబించి, ఈశ్వరని తన ప్రియునిగా భావించవలసి ఉన్నది. స్త్రీలైతే దీనికి వ్యతిరేకమైన పంథా అవలంబించాలి. ఇంకా మన పురాణ గాథలలోను, చండీదాసాదుల చరిత్రలలోను, ఈవిధమైన మధురప్రేమకు ఉదాహరణాలు చూపించవచ్చును.

నేటికాలపు మనశ్శాస్త్రం అంగీకరించినా, అంగీకరించపోయినా, భాగవతాదులలో వర్ణితమైన గోపికాప్రేమ ఈ మధురభావమే గాని మరొక్కటి కాదు. భాగవతంలోని వర్ణనలనుబట్టి కూడా ఈ విషయం స్పష్టపడుతూనే ఉన్నది.

రాముడు దండకారణ్యంలో సంచరిస్తూండగా మును లాయన సౌందర్యం చూచి, విమోహితులై కౌగిలింపబోతారు. అప్పుడు రాముడు. 'మీ కోరికలన్నీ ముందు జన్మలో నేను కృష్ణావతారం ఎత్తినప్పుడు నెరవేర్చగల,' నని వాగ్దానం చేస్తాడు. ఆ తరవాత ఆ వాగ్దానం ప్రకారం వ్రేపల్లెలో శ్రీకృష్ణుడై, గోపికారూపంలో అవతరించిన మునుల మనోరథాలు నెరవేరుస్తాడు. ఇదీ ఈపద్యకావ్యంలోని కథాంశము.

ఈ క్రింది పద్యాన్ని బట్టి ఈ గ్రంథకర్తరచనా మార్గం గ్రహింపవచ్చును.

"రమణన్ గోపకుమారకుల్ సెలగి
బాల్య క్రీడలం దేలుచో
యమునా నారణ్యమునన్ బలానుజుడు
సోహం భావమున్ బూని యే
మమకారంబుల బోక దీక్ష నెరయన్
మానంబు వాటించి యో
గము ప్రారంభము జేసె వేడ్క నెయి
గర్గప్రోక్త మార్గంబునన్"

ఇక్కడ ఆధ్యాత్మికార్థం సామాన్యంగా పద్యం చదవగానే స్ఫురిస్తుంది. కాని బాహిరమైన పౌరాణికార్థమే కొంత క్లిష్టంగా చెప్పవలసి వస్తున్నది. ఇల్లాగే ఈ ఏకాశ్వాసకావ్యంలోని పద్యాలన్నిటికీ విశేషార్థాలు, సామాన్యార్థాలు చెప్పుకోవాలి. క్లిష్టమార్గంలోనే ఈ రెండర్థాలు స్ఫురిస్తాయి. సరళమార్గంలో ఇవి స్ఫురించడం కష్టము.

గోపికారహస్యం తెలుసుకోగోరినవారి కిది అవశ్య పఠనీయమైన గ్రంథము.

'శాస్త్రి.'

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.